# మధుర భాషణములు

సద్గురు శ్రీ నాన్నగారు



# ముందుమాట

శంకరుల మేధస్సు, వాసుదేవుల సౌందర్యం, క్రీస్తులో ఉన్న కరుణ, రాముడి వినయం, భగవాన్ ఆత్మనిష్ఠ, బుద్ధుడి వైరాగ్యం, రామకృష్ణుల నిష్కపటత్వం, ఇవన్నీ కలగలిసి ఒక శరీరంగా వ్యక్తమైన రూపమే నాన్నగారు. నాణానికి ఇరువైపులా బొమ్మ - బొరుసు ఎలా ఉంటాయో! అలా అపారమైన ప్రేమ ఒకవైపు, ఆత్మజ్ఞానంతో తడిసిన బోధమరొకవైపు, నాన్నగారిని లోకానికి పరిచయం చేసాయి.

1934 వ సం॥లో సెప్టెంబర్ 23వ తేదీ ఆదివారం పౌర్ణమి రోజున రాజాయమ్మ, సూర్యనారాయణ రాజు అనే పవిత్ర దంపతులకు మొదటి సంతానంగా నాన్నగారు ఈ భూమి మీదకు రావడం జరిగింది. నాన్నగారి తాతగారు రంగరాజుగారు, నాయనమ్మ పాపాయమ్మగారి గురించి కొంత పూర్వరంగం తెలుసుకొందాం.

రంగరాజు గారు, పాపాయమ్మగారు చాలా ధర్మాత్ములు. వీరికి చాలాకాలం వరకూ సంతానం కలుగలేదు. వీరిరువురికి పెద్ద వయస్సు రాసాగింది. పాపాయమ్మ గారికి దైవభక్తి మెండు. ఆమె తీరికవేళలో భాగవతం, రామాయణం, భారతం, చదువుతూ గడిపేవారు. ఒకసారి జిన్నూరులో ఒకరు యజ్ఞం చేసుకుంటున్నారనే వార్త తెలిసి, పాపాయమ్మ గారు ఒక అబ్బాయిని పిలిచి యజ్ఞం పూర్తయ్యాక యజ్ఞ ప్రసాదం కొంచెం తెచ్చిపెట్టమని అడిగారు. ఆ యజ్ఞప్రసాదమే నాన్నగారి తండ్రియైన శ్రీ సూర్యనారాయణ రాజు గారు. చాలాకాలానికి లేక లేక కలిగిన ఏకైక సంతానం ఆయన. కొంతకాలానికి నాన్నగారి తాతగారైన రంగరాజు గారు కాలం చేశారు. పాపాయమ్మగారు తన పుత్రుడికి కొమ్మర గ్రామస్థులైన సీతమ్మగారి పుత్రిక అయినటువంటి రాజాయమ్మగారికి ఇచ్చి వివాహం జరిపించారు. వారికి మొదటి సంతానంగా నాన్నగారు(భూపతిరాజు వెంకట లక్ష్మీ నరసింహరాజు) జన్మించారు. నాన్నగారి పసిప్రాయంలోనే తండ్రి శరీరం విడిచిపెట్టారు. అప్పటికే రాజాయమ్మగారికి రెండవ సంతానం కలిగి, మూడవసారి గర్భంతో ఉన్నారు. కొమ్మర నుండి రాజాయమ్మగారి తల్లిదండ్రులు వచ్చి, కొద్దికాలం పుట్టింట్లో గడిపితే ఈ కష్టం నుండి తేరుకొని నెమ్మదిగా కుదుటపడతారని కుమార్తెను, మనవలను పుట్టింటికి తీసుకువెళ్ళారు. ఆ ఇంటిలో పాపాయమ్మగారు ఒంటరిగా మిగిలిపోయారు. ఆమెకి నాన్నగారంటే ఎనలేని ప్రేమ. ఆయనను విడిచిపెట్టి ఉండలేక పోయినప్పటికీ,

అతి పెద్ద కష్టంలో ఉన్న కోడలితో మనవడిని నావద్ద వదిలిపెట్టు అని అడగలేక పోయారు. ఆమెకు వచ్చే ప్రతి కష్టానికి, బాధకి తోడుగా ఆఇంటి పెరట్లో ఉన్న తులసమ్మ. ఆ తులసి కోట దగ్గరే ఆమె ఎక్కువ సమయం గడిపేవారు. అదే ఆమె జీవితం. పూర్వీకులు, వారి కుటుంబంలో ఎవరికైనా కష్టం వస్తే! వారిని అక్కున చేర్చుకునే సహృదయం కలిగి ఉండేవారు.

పాపాయమ్మ గారి పుట్టిల్లు పెద్దమడి. అక్కడ నుండి వారి అన్నదమ్ములు వచ్చి, నీకు పెద్ద వయసు వచ్చింది, ఇక్కడ ఒంటరిగా ఉండవద్దు. నీ కోడలు, మనవలు వచ్చిన తరువాత తిరిగి ఇక్కడికి వద్దువుగాని అని చెప్పి, ఆమెను పుట్టింటికి బండి ఏర్పాటు చేసి తీసుకువెళ్ళారు. ఆ సమయంలో పాపాయమ్మ గారి దుఃఖం వర్ణనాతీతం. ఆఖరిసారి తులసమ్మని పట్టుకొని దుఃఖించి, వీధి గడపకి నమస్కారం చేసుకొని ఈ గృహంలో ఇప్పుడు ఒక్క మనిషి తోడు లేక ఒంటరినై నేను పుట్టింటికి వెళ్ళవలసి వస్తోంది. మరలా ఇటువంటి పరిస్థితి ఈ గృహానికి ఎప్పుడు రాకూడదు. ఈ గృహాన్ని ఎప్పుడు నిండుగా మనుష్యులతో కళకళలాడేటట్లు ఆశీర్వదించు అని కోరుకుంటూ కన్నీటితో పుట్టింటికి పయనమయ్యారు. పెద్దమడి వెళ్ళిన తరువాత కూడా ఆమె ఎక్కువ సమయం తులసమ్మ దగ్గరే గడిపేవారు. ఎవరు వచ్చినా నా మనవలను చూశారా? ఎలా ఉన్నారని అడిగి, వారు దిక్కులేనివారు అయిపోయారని బాధపడేవారు.

తరువాత 2, 3 సంవత్సరాలకే ఆవిడ శరీరం విడిచిపెట్టేసారు. పాపాయమ్మ గారి స్నేహితురాలు ఒకరు ఉండేవారు. నాన్నగారు జ్ఞానముపొంది, ప్రవచనముల ద్వారా పేరు ప్రఖ్యాతులు పొందిన తరువాత - ఆ స్నేహితురాలు నాన్నగారి ప్రవచనానికి వచ్చారు. ఆమె నాన్నగారితో, నేను మీ నాయనమ్మ స్నేహితురాలిని అని పరిచయం చేసుకున్నారు. ఆ మాట వినగానే, నాన్నగారు ఒక్కసారే కుర్చీలో నుండి లేచి, ఆమె చెంతకు వచ్చి మీరు మా నానమ్మగారి స్నేహితురాలా అని, ఆమె చేతులని అత్యంత ప్రేమతో ఆయన శిరస్సు మీద పెట్టుకుని నేను మా నాయనమ్మ గారిని చూడలేకపోయాను. కానీ మా నాయనమ్మ గారిని చూసిన కళ్ళని నేను చూస్తున్నాను. మా నాయనమ్మ గారు ఏమేమి మాట్లాడేవారో! మా గురించి ఏమనేవారు మాకు చెప్పండి అని అడిగారు. మీ నాయనమ్మ హృదయం

మీ గురించి తల్లడిల్లిపోయేది. నా మనవలకు ఎవ్వరూ దిక్కు లేరు అనేది. 'ఈరోజు పాపాయమ్మ జీవించి ఉండి, మిమ్మల్ని చూస్తే తన మనవడే ఎందరికో దిక్కు అయ్యాడని తెలుసుకుని పొంగిపోయేది అన్నారు'. అప్పుడు నాన్నగారు 'మా నాయనమ్మ గారైన పాపాయమ్మగారి రక్తం మాలో ప్రవహించడం వల్లనే మేము ఈ రోజున నాలుగు మంచి మాటలు ఈ భక్తులకి చెప్పగలుగుతున్నాము అన్నారు'.

ఈ భూమ్మీద ఏ మహాత్ముడు, ఏ జ్ఞాని మనము అనుకునే ప్రకృతి సుఖాలు పొందిన దాఖలాలు లేవు. God has created some souls to live for others only. ఏ మహాత్ముడయినా ఈ భూమ్మీదకి giver గానే వస్తాడు. జీవకోటి అందరికీ శాంతిని, కాంతిని అందించడానికి వస్తాడు. అంతేకానీ taker గా కాదు. ఈ భూమికి సంబంధించినవి తీసుకోవడానికి కాదు.మంచివారిని ఈలోకం సుఖపడనివ్వదు.

శరీరానికి సంబంధించినవి - బంధుత్వాలు, మనస్సుకి సంబంధించినవి - స్నేహాలు, హృదయానికి సంబంధించిన వాడు గురువు. ఆయనతో అనుబంధం తెగిపోయేది కాదు. అతి సాధారణ జీవితం గడుపుతున్న నాన్నగారికి ఆయన 16 సం॥లు వయసులో ఆయన అమ్మమ్మగారైన సీతమ్మ గారితో కలిసి ఉత్తర భారతదేశ యాత్రలకు వెళ్ళారు. మొట్ట మొదటిసారి ఒక మహాత్ముడు దర్శనం రిషికేశ్ లో స్వామి శివానందగారి సమక్షంలో లభించింది. స్వామి, నాన్నగారి భుజంతట్టి "be good and do good" అని bless చేశారు. అది ఒక జ్ఞాని నోటివెంట ఆయన పొందిన మొదటి blessings. స్వామి శివానంద అలా చెప్పటం కాదు, నాన్నగారిని అలా ఉండేటట్లు అనుగ్రహించారు.

కష్టసుఖాలనే కెరటాల మధ్యలో పెరిగిన నాన్నగారికి సమాజంలో ప్రజల కన్నీటిని తుడవడానికి వారికి నా వంతు నేను ఏమి చేయగలను అనే సహృదయం ఉండేది. గ్రామంలో ఎవరికి ఏ సహాయం అవసరమైనా అది చెయ్యటానికి ముందుండేవారు. దైవీ గుణాలు ఆయనకీ పుట్టుకతోనే వచ్చినవి.

నాన్నగారికి 18 వ సం॥లో దగ్గర బంధువులైన అప్పలనరసమ్మ గారితో వివాహం జరిపించారు. అప్పలనరసమ్మ గారు పూర్తిగా సంప్రదాయాలని, సంస్కృతిని, ఆచార-వ్యవహారాలని గౌరవించే స్త్రీమూర్తి. ఆమె ఆగృహానికి వెన్నెముక అని చెప్పవచ్చు. నాన్నగారు కాలములో నలుగురు పిల్లలకి తండ్రి అయ్యారు.

కొద్దికాలానికి నాన్నగారికి 23 వ సం॥ వయస్సులో 1957లో భగవాన్ రమణ మహర్షి ఆయనకు స్వప్న దర్శనమిచ్చి ఆయన బుగ్గ మీద ముద్దుపెట్టి ఆయన జీవితాన్ని తన fold లోకి లాగేసుకున్నారు. ఈ సంఘటన జరిగిన రోజు నుండి ఆయన శరీరం విడిచి పెట్టే ఆఖరి నిమిషం వరకు నాన్నగారి జీవితం completely surrendered to the will of his Guru Ramana. ఆయన మాట, ఆయన చూపు, ఆయన జీవనం, ఆయన పని, ఆయన శ్వాస, సర్వంగురువనుగ్రహమే లక్ష్యముగాసాగాయి. గురువు అనుగ్రహంతో ఆయన పొందిన శాంతిని జీవకోటికి పంచిపెట్టడానికే చూసారు.

ఎందరో మహాత్ములు వారు పొందవలసిన వస్తువుని పొందిన తరువాత వారు అప్పటి వరకు ఉన్న కుటుంబాన్ని విడిచిపెట్టి బయటకు వచ్చేశారు. కానీ నాన్నగారు ఆ విధంగా చెయ్యలేదు. "చేతులు కుటుంబానికివ్వు, నీ హృదయాన్ని భగవంతుడికి, గురువుకి అర్పించు. కొంతకాలానికి భగవంతుడు నీకు ఇచ్చిన duty పూర్తయిపోతుంది. అప్పుడు ఆ చేతిని కూడా గురువుకి అర్పించెయ్యి అంటారు. నాన్నగారు చెప్పే ప్రతి వాక్యము ఆయన అనుభవసారం. ఒకవైపు కుటుంబాన్ని - మరోవైపు భక్తులని సమతుల్యం చేసుకుంటూ, జ్ఞానం పొందటానికి కుటుంబం, కష్టసుఖాలు, పరిస్థితులు ఇవేవి అడ్డుకాదుఅనిరుజువు చేసారు. మనము పొందవలసిన వస్తువు మన హృదయం లోనే ఉంది. Look within అని అక్కడకి మనము మేల్కొనేలా చేసారు.

Aim high and aim at the highest. మనము ఈ భూమ్మీదకి వచ్చిన పని "నీవు ఎవరో నీవు తెలుసుకోవటం" కోసమే. అది తప్ప ఏది సాధించినా మన జీవితం ఒకటి లేని సున్న. మన జీవిత గమ్యాన్ని మనకి చూపిస్తూ, అక్కడికి మనము చేరటానికి మన జీవిత విధానం ఎలా ఉండాలో తెలియజేస్తూ, మన యోగక్షేమాలు కాంక్షిస్తూ, పరిమితులు లేని అనుగ్రహ ప్రవాహమే నాన్నగారు.

సహజంగా సంసారంలో ప్రతీ స్త్రీ తన భర్త ప్రేమ, services.. తనకి, తన పిల్లలకి మాత్రమే పరిమితమై ఉండాలని కోరుకుంటుంది. అయితే, నాన్నగారి ప్రేమ సంసార పరిధిని దాటి, విశ్వవ్యాప్తమైనప్పుడు మొదట్లో కొద్దిగా అప్పలనరసమ్మ గారు(నాన్నగారి ధర్మపత్ని) ఇబ్బంది పడినప్పటికీ, ఆయన ప్రేమలో ఉన్న విశాలత్వాన్ని

నెమ్మదిగా అర్థం చేసుకొని, ఆయన వద్దకి వచ్చే భక్తులని ఆవిడ కూడా ప్రేమించి, భక్తులందరిచే "కన్నమ్మగారు" అని పిలిపించుకున్నారు. సంప్రదాయాల పట్ల, కర్తవ్య నిర్వహణ పట్ల, ధర్మ ఆచరణ పట్ల అత్యంత శ్రద్ధ కలిగి ఉండే స్త్రీమూర్తి కన్నమ్మ గారు. భక్తులందరినీ ప్రేమించి, వారిని ఆదరించి, వారి అవసరాలని కూడా ఆదరణగా చూసేవారు. గృహప్రవేశాలని, వివాహాలని, సంతానం కలిగిందని ఎవరు వచ్చినా, కన్నమ్మగారు వారి క్షేమం కోరుతూ, ఆమె స్వహస్తాలతో ఏదో ఒకటి వారికి అందజేసి, వారికి తగిన సలహాలు, సూచనలు ఇచ్చేవారు. ఏ వస్తువైనా, ఏ పదార్థమైనా వృథా కానిచ్చేవారు కాదు. ఎవరికి ఏది, ఎప్పుడు అవసరమో అది చూస్తుండేవారు. భక్తులందరూ, నాన్నగారిని ఎంత ప్రేమించేవారో! కన్నమ్మ గారిని కూడా అలాగే ప్రేమించేవారు. కన్నమ్మగారు, ఆ ఇంటి గడప దాటి బయటకి రావటం అనేది ఎప్పుడూ ఎవరూ చూడలేదు. నాన్నగారి కోసం, భక్తులు ఏ సమయానికి వచ్చి కూర్చున్నా వారందరినీ ఆదరించేవారు. నాన్నగారి ఋణం మనమందరం ఎలా తీర్చుకోలేమో! అలా కన్నమ్మ గారి ఋణం కూడా తీరేది కాదు.

కన్నమ్మ గారికి, శ్రీరాముడు ఇష్టదైవం. ఒకసారి భద్రాచలం వెళ్ళినప్పుడు, నాన్నగారికి దేవాలయంలో రాముడి కండువా కప్పి రాముడి చిత్రపటం, కళ్యాణ అక్షింతలు తీసుకువచ్చి ఇచ్చారు. మీ కన్నమ్మ గారికి వీటిని అందచేద్దాము అని అక్కడున్న భక్తులతో చెప్పి, వాటిని చాలా అపురూపంగా కన్నమ్మగారి కోసం భద్రపరిచి, జిన్నూరు తీసుకెళ్ళి ఇచ్చారు. నాన్నగారిది పరిమితులు లేని దయతో కూడిన జీవితం అయితే! కన్నమ్మ గారిది క్రమశిక్షణతో కూడిన జీవితం. క్రమశిక్షణ లేకుండా, భౌతికంగాను ఆధ్యాత్మికంగాను అభివృద్ధిలోకి రాలేమని నాన్నగారు అనేవారు. ఒక జ్ఞాని సంసారంలో ఇమిడి ఉండటం చాలా కష్టం. అయితే, నాన్నగారు అలా ఇమిడి ఉండేటట్లుగా కన్నమ్మగారు కూడా సమన్వయం చేసుకొని నాన్నగారి ప్రేమ మనందరంకూడా పొందటానికి, ఆయన సమక్షం మనము అనుభవించటానికి, ఆ గృహం, కుటుంబ సభ్యులే కారణం. భక్తులు కూడా ఎంతో స్వతంత్రంగా ఉండేలా కన్నమ్మగారు చూసుకునేవారు. భక్తుల హృదయంలో కన్నమ్మ గారి స్థానం ఎప్పటికీ చెదరని స్థానం.

నాన్నగారి, నానమ్మగారైన పాపాయమ్మ గారి నుండి వారసత్వంగా వచ్చిన తులసి కోటని చాలాశ్రద్ధగా, పవిత్రంగా పూజిస్తారు కన్నమ్మగారు. సంప్రదాయబద్ధమైన కుటుంబ వ్యవస్థని గౌరవిస్తూ, కష్ట సుఖాలను సమన్వయం చేసుకుంటూ, నిరాడంబరమైన జీవితం కలిగి ఉండి భక్తుల హృదయంలో చెదరని మాతృ స్థానం కన్నమ్మ గారిది.

నాన్నగారు స్త్రీలపట్ల, చిన్నపిల్లల పట్ల, ప్రత్యేక శ్రద్దని చూపించేవారు, ఎందుకంటె వారు మంచి నడవడిని, జ్ఞానమును తరువాతి తరములుకి అందించే శక్తి కలిగి ఉంటారు. నాన్నగారి జీవితము ఆద్యంతము ఇహ పర సమన్వయముగా సాగింది. నాన్నగారు భక్తులు అందరు భౌతికమైన సుఖశాంతులు మాత్రమే కాదు మోక్ష స్థితిని గమ్యముగా పెట్టుకొని జివించేటట్లుగా వారి అందరి జీవితములు సమన్వయ జ్ఞానముతో సమగ్రపరచాలని బోధచేశారు. నాన్నగారి బోధను జీవిత సమన్వయమును మనము సంక్షిప్తముగా తరువాయి పేజీలలో పరిశీలిందాము.

# మర్యాద పురుషోత్తమ శ్రీరామ

నారాయణం పరబ్రహ్మం సర్వకారణకారణం, ఈ వాక్యము శ్రీరాముడు వనవాసానికి బయలుదేరుతూ తల్లి కౌసల్య అనుమతి కోసమై వచ్చినప్పుడు, రాముడిని చూసి తల్లి దుఃఖపడుతూ ఉంటే తల్లిని ఓదారుస్తూ, తన తల్లి కౌసల్యకి బోధించిన వాక్యము "నారాయణం పరబ్రహ్మం సర్వకారణకారణం". ఈ వాక్యము మహా మంత్రముతో సమానము. ఎప్పుడూ మరువతగని వాక్యము.నారములు అంటె జీవులు. జీవులకి ఆయణముగా ఆధారముగా ఉండేవాడు నారాయణుడు. జీవుల హృదయములో ఆత్మ రూపములో ఉన్నవాడు నారాయణుడు, ఆయనే ఈ సృష్టి అంతా వ్యాపించి ఉన్నాడు. నీలో నాలోనే కాదు ఈ సృష్టి అంతా, పంచ భూతములలో అన్నింటా ఆయన వ్యాపించి ఉన్నాడు. ఆయనలోనే ఈ సమస్త లోకాలు బిందు మాత్రముగ ఇమిడి ఉన్నాయి. అదే పరబ్రహ్మము. అమ్మా! ఈ సృష్టిలో ఏది జరిగినా ఆఖరికి ఒక చెట్టుకి ఉన్న ఆకు క్రిందకు రాలినా ఆయన సంకల్పము లేకుండా జరిగే అవకాశము లేదు. ఆయన సర్వకారణకారణం, అందుకే మన జీవితములో ఏది జరిగినా ఇతరులని కారణముగా చూడకూడదు. ఇప్పుడు నా విషయములో కైకేయ కారణముగా వనవాసానికి వెళుతున్నాని అనుకోవద్దు. నా దేహ ప్రారబ్దములో ఇప్పుడు అయోధ్యలో ఉండే యోగము లేదు. అడవులకి వెళ్ళవలిసి ఉంది. అయితే సర్వకారణకారణుడు అయిన ఈశ్వరుఉడు బయటకు కనిపించడు. పెద్ద దొంగ. కైకేయకి చెప్పుడు మాటలు వినే అలవాటు ఉన్నందున తన నోటిని ఉపయోగించుకున్నాడు. అమ్మా! మన వాసనలు, అలవాట్లు మనల్ని బలి కోరతాయి.అయితే జరుగుతున్న ఈ సంఘటనలో మనము ఎవ్వరినీ కారణముగా చూడకూడదు. వ్యక్తులని కారణముగా చూస్తే మనకి ద్వేషము వస్తుంది. హృదయములో ఉన్న పరమాత్మకు దూరము అయిపోతాము. జరుగుతున్నది ఈశ్వర సంకల్పము. విధి నిర్ణయము. విధి చాలా బలీయమైనది. విధి నిర్ణయము మనము ఆపాలని అనుకోవడము ఎటువంటిదంటే రథం కింద తల పెట్టి నేను క్షేమం అనుకోవటంవంటిదే. విధిని అంగీకరించి మనసులో ఎటువంటి వ్యాకులత లేకుండా జీవించేవాడే వివేకవంతుడు. అమ్మా! పూర్వపు జన్మలో మనము ప్రేమగా ఉండే తల్లీపిల్లల్ని తెలిసో తెలియకో వేరు చేసాం ఏమో, అమ్మా! ఇప్పుడు మనిద్దరికీ కలిసి ఉండాలని ఉంది, కానీ విధి మనల్ని వేరు చేస్తుంది. మరణం తల్లీపిల్లల్ని వేరు

చేస్తుంది. అయితే విధి మనము జీవించి ఉండగానే వేరు చేస్తుంది. దీనికి కారణముగా ఎవ్వరినీ చూడకు, ఇప్పుడు కైకమ్మ రాజమాత, మరింత గౌరవంగా, ఆదరణగా చూడు అమ్మా, అని రాముడు తల్లికి చెబుతాడు. రాముడు గొప్ప కొడుకు, అంతే కాదు కౌసల్య గొప్ప తల్లి. కౌసల్య అంటుంది రామా నువ్వు గొప్ప ధర్మమూర్తివి, నీకు రాజ్యం, పరివారం, భోగాలు ఇవన్నీ దూరమైనా దుఃఖం రాదు. ధర్మహాని జరిగితే  దుఃఖపడతావు. ఇప్పుడు నువ్వు వెళ్ళేది వనవాసానికి, మనిషిని ముందు బాధలు వివశుడ్ని చేస్తాయి. ఆకలిదప్పికలు బాధ, రోగం బాధ. రామా! ఇప్పటివరకు నువ్వు ఈ మూడు బాధలు చూడలేదు. వనవాసములో ఇవి మూడూ సహజము, ఈ మూడింటి మధ్యలో ఉండి కూడా ఎప్పుడూ ధర్మంనుంచి జారకు. జారిన మరుక్షణం దుఃఖంలోకి, పతనములోకి జారిపోతాము.రామా! ధర్మమే దైవము, ధర్మాన్ని మించిన దైవము భూమి మీద లేదు, అంటుంది గొప్ప తల్లి కౌసల్య.ఈ ఒక్క వాక్యము అర్థము అయితే జీవితములో ఏది జరిగినా మనకి రియాక్షన్ ఉండదు. రియాక్షన్ తగ్గి పోయే కొలదీ మనస్సు నిర్మలమై, నిశ్చలమై, హృదయ గంగలో మునిగి తదాకారము చెందుతుంది. నాన్నగారు ఈ వాక్యము చెబుతూ, పరమాత్మకి జీవకోటి పట్ల ఉన్న అపారమైన దయతో ఈ మహా మంత్రాన్ని, తల్లిని ఒంపుగా పెట్టుకొని మనకి ప్రసాదించారు. జీవితములో ఎట్టి పరిస్థితులు, ఎట్టి అవమానాలు ఎదురైనా, ఈ వాక్యాన్ని స్మరించుకొంటుంటే మన లోపలి దుఃఖాన్ని, అంతటిని పీల్చేసుకుని బండెడు దుఃఖాన్ని, బండెడు సుఖఃముగా మార్చి మనల్ని అనుగ్రహిస్తుంది. వాక్యము దేవుడయి ఉన్నది. రాముడు వేరు, రాముడునించి వచ్చిన వాక్యము వేరు కాదు.

మీ త్రికరణాలు అయిన మాట, చేత, తలంపు ఇవి మూడు భగవంతుడి వైపు గురిపెట్టి జీవించండి. మీ జీవిత విధానంలోనే అపూర్వం పుడుతుంది. ఆ అపూర్వమే ఆత్మజ్ఞానం.

చింతలో నుండి బయటకు రావాలంటే, గురువు యొక్క రూపం మనసులో ఉండాలి, నామం నోటిలో ఉండాలి. వాల్మీకి ఏమంటారంటే, జీవితంలో ఏముందని పొంగిపోతున్నారు? life ends by death. జీవితంలో దేన్ని చూసి పొంగిపోకు. దేన్ని చూసి గర్వము,అహంకారము తెచ్చుకోకు అన్నారు. రామ నామాన్ని మించిన నామం ఈ సృష్టిలో ఇంకొకటి లేదు.

రామనామం బుద్ధిని balance చేస్తుంది. రామాయణ సారం ఏంటంటే, practice purity, practice charity, practice selfless service. ఈ విధంగా ఎవరైతే జీవించగలుగుతున్నారో వారు దుఃఖసముద్రంలో నుండి రక్షింపబడతారు. రాముడు కర్మశూన్యుడు కాడు. తన కర్తవ్యాన్ని నిండుమనస్సుతో చేసుకువెళ్ళాడు. ఈ లోకంలో ఉన్న ఏ ఆకర్షణలకి, ఏ భోగాలకి బంధింపబడలేదు. పాముని చూడగానే అది కరుస్తుందా లేదా అని ఆలోచించకుండానే దూరంగా పారిపోతాము. అలాగే సాధకుడు భోగ ప్రవృత్తితో ఉన్న వ్యక్తులకి, తరచు అబద్ధాలు చెప్పే మనుషులకి దూరంగా పారిపోమని శాస్త్రం చెబుతోంది. వైష్ణవ సాంప్రదాయంలో భక్తుడికి భగవంతుడి పట్ల నిజమైన భక్తి ఉంటే, ఆ భక్తుడిలో ఉన్న రాగద్వేషాలని, కామక్రోధాలని ఆవు తన దూడ మీద ఉన్న మాయని ఎలా నాకేస్తుందో! అలా పరమాత్మ - భక్తుడిలో ఉన్న దోషాలని నాకేసి వారిని పవిత్రం చేస్తారు. life without love is of no use. భగవంతుడి పట్ల మన ప్రేమ - పనిగా మారాలి, భగవంతుడి పట్ల మన ఆరాధన - జీవకోటిపట్ల వాత్సల్యంగా మారాలి. గురువుపట్ల నీకున్న ప్రేమ మాటలో, పనిలో, ఆలోచనలో కనిపించాలి.

రాముడు అరణ్యవాసంలో మొదటిరోజు సీతమ్మవారి ముఖంలో బెంగనీ, బాధని చూసి ఇలా చెప్పారు. సీతమ్మా! 14 సంవత్సరాలు వనవాసం అని బెంగపెట్టుకున్నావా, ఇది మనకి భాగ్యం. ఎందుకంటే!ఇదంతా మహాత్ములు, మహర్షులు, యోగులు, ఉత్తమోత్తములు తిరుగాడు స్థానము సీతమ్మా. అయోధ్యలో ఉంటే, మనము వారితో ఎక్కువగా గడిపే అవకాశం ఉండదు. పరమ పవిత్రులని దర్శనం చేసుకొని వారితో కొంతకాలం గడిపే భాగ్యాన్ని ఈ వనవాసం మనకి కలిగించింది, మనము చాలా అదృష్టవంతులము సీతమ్మా అన్నారట. సీతమ్మ దుఃఖాన్ని సంతోషంగా మార్చేసాడు రాముడు. negativeగా చూస్తున్న సీతమ్మ మనస్సుని positiveవైపు తిప్పాడు. గురువు ప్రారబ్ధాన్ని మార్చడు, చూసే దృక్పథాన్ని, దృష్టిని మారుస్తాడు. సత్పురుషుల యొక్క సాంగత్యం కోసం భూమి యొక్క చివరి అంచుల వరకు ప్రయాణించినా నష్టం లేదని శాస్త్రం చెప్తోంది అన్నారు. ఎంతోమంది మహాత్ములని రాముడు స్వయంగా వెతుక్కుంటూ వెళ్ళి దర్శనం చేసుకునేవాడు. ఆ మహర్షులని చూడగానే కఱ్ఱ వదిలి వేస్తే ఎలా నేల మీదకు పడిపోతుందో అలా వారి పాదాలకి నమస్కరించి, మహాత్మా! ఈ చెవిన రెండు మంచి మాటలు చెప్పండి

అని వినయంగా అడిగేవాడు రాముడు. రాముడి నోటిలోంచి వచ్చిన ఆ మాటకి ఋషులు పొంగిపోయి, ఓ రామా! జీవకోటికి మంచి చేయాలనే ప్రేరణ ఏ హృదయంలో నుండి వస్తోందో ఆ హృదయమే రెండు మంచి మాటలు వినాలని కోరుతోందా! అని రాముడిని కౌగిలించుకుని మంచి మాటలను పంచుకునేవారట. మంచిని వినకుండా, మంచివారితో సహవాసం చెయ్యకుండా మంచి చెయ్యాలనే ప్రేరణ మనకి రాదు. holy company వల్ల ప్రాపంచిక విషయాలలో నుండి బయటికి రావటమే కాదు మన స్వభావం పలుచబడుతుంది. లోపల ఉన్న వాసనలు బలహీనపడతాయి.

మన ప్రేమ భగవంతుడి పట్ల ఎలావుండాలంటే, రాముడు లక్ష్మణుడితో నీవు నాతో వనవాసానికి రావద్దు. నిన్ను వెళ్ళమని ఎవరూ అనలేదు. నువ్వు అయోధ్యలోనే ఉండి తల్లిదండ్రులను చూసుకో అని చాలా చెప్పి చూశారు. లక్ష్మణుడు ఏమంటారంటే, రామా! నీటిలో నుండి చేపని బయటికి తీస్తే, చేప ఎలా విలవిలలాడి శరీరం విడుస్తుందో, నీకు దూరంగా నిన్ను విడిచి ఉంటే నా పరిస్థితి అంతే. నీ సమక్షం ముందు స్వర్గ-సుఖాలు కూడా చాలా అల్పమైనవి రామా అంటారు. అది భగవంతుడి పట్ల అవిభాజ్యమైన అబేధ ప్రేమ. మనకి కూడా గురువు పట్ల అటువంటి ప్రేమ హృదయంలో జనిస్తే ఆ ప్రేమే భక్తిగా మారుతుంది. భక్తి లోనుండి ఒక అపూర్వము పుడుతుంది. ఆ అపూర్వమే ఆత్మజ్ఞానం. భక్తి జ్ఞానానికి మాత.

పంచవటిలో ఒకరోజు, సీతారామ,లక్ష్మణులు ముగ్గురూ కూర్చుని మాట్లాడుకుంటున్నారు. లక్ష్మణుడు అంటాడు, భరతుడికి తల్లి గుణాలు రాలేదని అంటూ, కైక గురించి ఏదో అనబోతుంటే, వెంటనే రాముడు, ఆగు లక్ష్మణా! అని, మనము శత్రువు గురించి మాట్లాడకున్నా, ఆ శత్రువులో ఉన్న మంచి గురించే మాట్లాడుకుంటే, మనకి మానసిక-ఆరోగ్యం బావుంటుంది అన్నారు.

రాముడిది ధర్మావతారం. కృష్ణుడిది ప్రేమావతారం. కృష్ణుడు ఆయన శరీరంలో ఉన్నంతకాలము చేతినిండా సత్కర్మ, హృదయం నిండా ప్రేమ, నోటి నిండా మాధుర్యంతో జీవించారు. అలా మనము జీవించగలిగితే ఆయన అనుగ్రహానికి పాత్రులమవుతాము

ఉదాహరణ : రాముడి కూడా వనవాసానికి వద్దన్నా వినకుండా లక్ష్మణుడు వెళ్తాడు. భౌతికమైన, లౌకికమైన ప్రయోజనం లక్ష్మణుడికి లేదు. రామా! నిన్ను విడిచి ఉండలేను కాబట్టి నీ కూడా వస్తున్నాను, నీటిలోంచి చేపని బయటకు తీస్తే చేప ఎలా ఉండలేదో! నీకు దూరంగా నేను అలా ఉండలేను. రామా అందుకు నీ కూడా వస్తున్నాను అన్నాడు లక్ష్మణుడు. expectation ఉంటేనే disappointment. అది లేకపోతే ఇది లేదు.

జనకమహారాజు మహాజ్ఞాని. ఋషుల కంటే గొప్పవాడు. మహారాజు అయి ఉండి ఆ రాజ్య పాలనను నిర్వహిస్తూ కూడా జ్ఞానము నుండి చ్యుతుడు కాలేదు. చ్యుతుడు కానివాడు అచ్యుతుడు. ఎంతపని ఉన్నా తన స్వరూపం నుండి పతనం కాలేదు, వాడు జనకుడు. విష్ణువుకి మరోపేరే అచ్యుతుడు. ఏవస్తువు తానుగా చెడు చెయ్యదు, మంచి చెయ్యదు. ఇది నాది అనుకోవటం వలన మనము పతనమవుతాము. జనకుడికి రాజ్యము ఉన్నా దానితో బంధం లేదు, అందుకే ఆయన ఋషి అయ్యారు.

యజ్ఞవల్క్యుడు, జనక మహారాజు వద్దకు వస్తాడు. జనకుడికి ఆత్మ-విద్యని శ్రవణం చెయ్యడమంటే చాలా ఇష్టం. యజ్ఞవల్క్యుడు ఆత్మ-విద్యని బోధిస్తుంటే, జనకుడు శ్రవణం చేస్తున్నాడు. శ్రవణంలో ఆనందం వచ్చేస్తోంది జనకుడికి. నేను ఈయనకి ఏమి ఇవ్వగలను, ఇటువంటి ఉత్కృష్టమైన ఆనందాన్ని పొందుతున్నాను అని, స్వామి! ఈరోజు 1000 ఆవులను ఇస్తున్నానని, మరుసటిరోజు వజ్ర-వైఢూర్యాలు, ఆ తరువాత రోజు సగం-రాజ్యం ఇస్తానన్నాడు. యజ్ఞవల్క్యుడు ఇవన్నీ విని, ఓ జనక మహారాజా! నేను ఇస్తున్నాననే బుద్ధితో ఇస్తే, ఆవుపాలు అయినా నాకు అరుగుతాయా? అదికాదు, ఎవడైతే నీ లోపల ఇస్తున్నాను అంటున్నాడో! వాడిని ఇచ్చెయ్యి. అప్పుడు నేను సంతోషిస్తాను అంటాడు, అదే భగవాన్ బోధనాసారం.

# కరుణాచలం - శ్రీ రమణ మహర్షి

"అరుణాచల శివ, అరుణాచల శివ, అరుణాచల శివ, అరుణాచలా"!

"అరుణాచలాన్ని స్మరిస్తే ముక్తి - కాశీలో మరణిస్తే ముక్తి"

ఈగిరి చంపక చంపెడు మందు. ఇది దేహాన్ని చంపదు, దేహంలో ఉన్న జీవుడే ఈ గిరికి ఆహారం. అరుణాచలం అనే స్మరణ మాత్రం చేత, ఆ జీవుడుని దహించి, పునర్జన్మలు అనే ప్రమాదంలో నుంచి తప్పించి మోక్ష సుఖాన్ని అనుగ్రహిస్తుంది.

అరుణ గిరి తోటి, భగవాన్ తోటి మనము మానసిక అనుబంధం పెట్టుకోవాలి. నిజమైన అరుణాచలం మన హృదయంలోనే ఉంది. బ్యాటరీకి ఛార్జింగ్ ఏవిదంగా అవసరమో! అలా అరుణాచల యాత్ర  మన సాధనకి ఛార్జింగ్ లా ఉపయోగపడుతుంది.

అరుణగిరి స్థిరం; గురువు చరం మనల్ని ఈశ్వరుడు, ఆయన హృదయంలోకి లాక్కోవడానికి, మనకి బోధ చెయ్యడానికి ఈశ్వరుడిలో ఉన్న జ్ఞాననేత్రమే అరుణ-గిరిగా రూపం దాల్చి వచ్చింది. పాండిత్యమే ఆత్మజ్ఞానమనే భావనలో ఉన్న కలియుగ జీవకోటికి, దాన్ని ఖండించి ఆత్మజ్ఞానం వైపు రోడ్డు ఓపెన్ చెయ్యడానికి వచ్చిన జ్ఞానావతారమే  గురురమణుడు.

అరుణాచలమనే పేరు సంస్కృతం పేరు. స్కాంద పురాణం, శివ పురాణంలో ఉంది. అన్నామలై అంటే, అందని కొండ అని అర్థం. అరుణాచలంలో అరుణ అంటే పార్వతీదేవి, అచలం అంటే, కదలని కొండ అంటే, పార్వతీ దేవి కదలని ఈ కొండలో ఐక్యమయ్యింది. పార్వతీ పరమేశ్వరులు ఐక్యమైన కొండ కాబట్టి అరుణాచలమనే పేరు వచ్చింది. పెద్దగుడి నుండి, ఆది-అన్నామలై వరకు శివుడి భాగం. ఆది-అన్నామలై నుండి పెద్దగుడి వరకు పార్వతీదేవి. నిప్పులోంచి వేడిని ఎలా విడదీయలేమో, శబ్దం నుంచి అర్థాన్ని ఎలా విడదీయలేమో అలా ఈశ్వరుడు లోంచి అమ్మని విడదీయలేము.

ఆరడుగుల ఈ దేహంలో గుండె ఏ భాగంలో ఉందో, ఈ సృష్టిలో అరుణగిరి కొండ ఆ భాగంలో ఉంది అనేవారు భగవాన్.

రమణ సందేశం రెండు మాటల్లో చెప్పాలంటే, "అహంభావనలో నుండి బయటపడాలి , ఆత్మ భావన స్థిరంగా కలిగి ఉండాలి". అజ్ఞానం బంధం. జ్ఞానం మోక్షం. అహంభావన, అవిద్య, అనే మహావృక్షాన్ని జ్ఞాన వైరాగ్యం అనే ఖడ్గంతో నరకాలి.

గురువుని విడిచిపెట్టకూడదు. ఆ చైతన్యానుభవంపొందిన దేహం మన టీచింగ్ కి ఉపయోగపడింది కాబట్టి కృతజ్ఞత విడిచిపెట్టకూడదు.

మాకు ఏది మంచిదో మా కంటే భగవంతుడికే బాగా తెలుసని, భగవంతుని పట్ల సజీవమైన విశ్వాసం కలిగి ఉండి, నాకు మంచిది కానిది నేను కోరినా, ఇవ్వవద్దని ప్రార్థించాలి. మీకోసం suffering లేకుండా జ్ఞానాన్ని అనుగ్రహించడానికి వచ్చిన అవతారమే భగవాన్.

భగవాన్ అంటారు misery is only an unwanted thought. "unless we forget everything we Can't be established in truth. భగవాన్ ఈ వాక్యం చదివి, ఈ వాక్యమే ఒక్క ఉపనిషత్ అన్నారు. మనము పాప-పుణ్యాలన్ని మరిచిపోవాలి, మరిచిపోకుండా సత్యంలో స్థిరపడలేము.

భగవాన్ చెప్పిన సూత్రం : దేహం చనిపోక ముందే, దేహ భావన చనిపోవాలి. ఉత్తమ చదువు వేరు, ఉత్తమ జీవనం వేరు అంటారు భగవాన్.

వ్యవహారిక సత్యం- కేవల సత్యం. ఇవి రెండు సత్యాలే. భగవాన్ వ్యవహారిక సత్యాన్ని చూడలేదు. కేవల సత్యమంటే, ఏది శాశ్వతమో దాన్ని మాత్రమే చూశారు భగవాన్.

మాటల్లో క్లారిటీ రావాలంటే, నీ మెదడులో స్పష్టత ఉండాలి. భగవాన్ చెప్పే సబ్జెక్ట్ లో ఉండే clarity ఉపనిషత్తుల్లో లేదు.

భగవాన్ తల్లికి ఆయన మొదటి బోధ: ఈశ్వరుడు, జీవులని వారి ప్రారబ్దాన్ని అనుసరించి ఆడిస్తున్నాడు. "జరుగవలసినది జరిగియే తీరును, జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నించినను జరుగునే జరుగదు ఇది నిశ్చయము". ఇది తెలుసుకోవటమే జ్ఞానం.

తిరుపతిలో ఉన్న గోవిందుడిని, కాశీలో ఉన్న విశ్వనాథుడిని, పూరిలోఉన్న జగన్నాథుడిని నమ్ముతాము. ఆ నమ్మే వంతులో కనీసం 10 వ వంతు నమ్మకం కూడా నీలో ఉన్న భగవంతుడి మీద నీకు లేదు. నీలో ఉన్న భగవంతుడిని నీతో దర్శింపచేయడానికి వచ్చిన అవతారమే శ్రీరమణావతారం. వారందరికీ చరిత్ర ఉంది. నీ హృదయంలో ఉన్న బ్రహ్మమునకి చరిత్ర లేదు. ఎందుకంటే, వాడు చరిత్రకు అందడు, సనాతనుడు. మూలతలంపు బయట ఉన్న దేవుళ్ళని దర్శిస్తుంది. ఎందుకంటే, వారిని దర్శించటం వల్ల దానికి మరణం రాదు. మూల తలంపు బ్రహ్మముని దర్శిస్తే దానికి మరణం వస్తుంది. దాన్ని అది చంపుకోవటానికి ఇష్టపడదు కాబట్టి ఎక్కడికైనా వెళదాము అంటుంది కానీ, హృదయంలోకి మాత్రం వెళ్ళలేదు అదే మాయ.

పుస్తకాలు చదవడం కోసమో, ప్రశ్నలు వేయటం కోసమో, తర్కించటానికో ఈ భూమి మీదకు రాలేదు. ఈ మహర్షి సన్నిధిలో, ఆత్మ లాభాన్ని పొందటానికి వచ్చాను అన్నాడు బౌద్ధ భక్తుడు తనకూడా ఉన్న భారతదేశపు భక్తునితో భగవాన్ వద్దకు వచ్చి. జరిగిపోయిన గొడవలు, జ్ఞాపకాలు అనే కషాయం తాగకండి అంటారు భగవాన్. సాధకుడు మున్ముందుగా ఇప్పటివరకు జరిగిన విషయాలన్నీ విడిచిపెట్టాలి. భవిష్యత్ గురించి ఊహించుకోవద్దు. ప్రస్తుతం నీ చేతిలో ఉన్న కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వర్తమాన కాలాన్ని చేజార్చుకోకూడదు.

భగవాన్ తో, ఒక భక్తుడు నన్ను సాధన ఏమి చెయ్యమంటారని అడిగాడు. "every thought, every word, every action must be directed towards Self or God" అన్నారు భగవాన్. ఇంకొక భక్తుడితో ‘‘చచ్చిన వాడి వలే పడిఉండు’’ అన్నారు. One man's diet is another man's poison. మన జన్మాంతర సంస్కారాన్ని బట్టి భగవాన్ చెప్పేవారు. ఇతరులని అనుకరించకూడదు, భక్తుల వద్దకి, జ్ఞానుల వద్దకి మనము ఏ పని మీద వెళ్ళామో! ఆ పని చూసుకుని వచ్చేయాలి. ఇతర గొడవల్లోకి వెళ్ళకూడదు, అలా వెళ్తే గమ్యం తప్పిన బాటసారిలా అవుతాము.

భగవాన్‌తో, ఒక భక్తుడు నేను నా తెలివితేటల వలన ఇక్కడికి రాగలిగానా? జన్మాంతర అనుబంధం వల్ల వచ్చానా? అని అడిగాడు. అప్పుడు భగవాన్, నీ తెలివితేటల వలన ఇక్కడికి రాలేదు జన్మంతర అనుబంధం వలనే వచ్చావు అని,

ఇక్కడికి వచ్చినవారు తరించి తీరతారు. ఈ ప్రాంగణంలోకి ఎవరైతే అడుగుపెడతారో! వారు నాస్తికుడైతే, ఆస్తికుడు అవుతాడు, ఆస్తికుడైతే భక్తుడు అవుతాడు, భక్తుడు జ్ఞాని అవుతాడు. రిక్త హస్తాలతో వెనక్కి పంపటం అనేది జరగదు. ఈ గేట్ లోకి వచ్చిన వారు, ఈ గేటు ద్వారానే తరిస్తారు అన్నారు.

భగవాన్ని ఒక భక్తుడు where can I stay? అని అడుగుతాడు. భగవాన్ అంటారు, ఇంట్లో మనుషులతో పడలేక సన్యాసం పుచ్చుకుంటారు. వారు ఆశ్రమానికి సిద్ధమవుతారు. అది కాదు, you can stay, where the 'I' feeling arises, that is yourself. నేను అనే తలంపు ఎక్కడ నుండి ఉదయిస్తుందో, అక్కడికి వెళ్ళు. you can get into your own heart అక్కడికి వెళితే గానీ, నిన్ను రాక-పోకలు విడిచిపెట్టవు. అక్కడికి వెళ్ళి ఉండిపో. నాయనా! అక్కడ నీ భర్త, నీ కంట్రోలర్ ఉన్నాడు. అక్కడకి వెళ్ళటము చేతకాక, మనము కాశీ అని, రామేశ్వరమని తిరుగుతున్నాము. హృదయంలోకి చేరాలంటే, వైరాగ్యం ఉండాలి. ఆ వస్తువు పట్ల ఏకాగ్రత ఉన్నవాడికి వైరాగ్యం వస్తుంది.

1879 వ సంవత్సరం, డిసెంబర్ 29 రాత్రి ఒంటిగంటకు రమణుల శరీరం భూమ్మీదకు వచ్చింది. రమణుల ముత్తాత కాలంలో భిక్షకు వచ్చిన ఒక యోగిని, పరుషవాక్యాలతో మాట్లాడటం వలన, ఆయన నీ ఇంటిలో తరానికి ఒకరు చొప్పున మూడు తరాల వరకు సన్యాసులవుతారు అని శపిస్తారు, ఆ శాపమే నేటి మానవాళికి వరమయ్యింది.

అరుణాచలమనే పేరు ఒక బంధువు ద్వారా భగవాన్ విన్నారు. మీరు ఎక్కడ నుండి వస్తున్నారని, వారిని అడిగితే అరుణాచలం అన్నారు. ఆ మాట వినగానే, భగవాన్ కి ఆయన దేవుడనే స్ఫురణ వచ్చింది. భగవంతుడి వద్ద నుండి మనిషి వస్తాడా! అని అంటే, అరుణాచలమనేది, ఊరి పేరు అంటారు భగవాన్ బంధువు. అది భగవాన్ కి అరుణాచలానికి ఉన్న జన్మాంతర అనుబంధం.

భగవాన్ కి మరణానుభవంతో ఆయనలో భక్తి జలం ఆవిర్భవించి సహస్రారాన్ని ముంచేసింది. లోపల జ్ఞానాగ్ని అనే మంట ప్రారంభమైంది. అందువలన తీవ్రమైన తపనగా ఉండేది. మధుర మీనాక్షి - సుందరేశ్వరుడు సన్నిధికి పరిగెత్తి,

కన్నీటితో అనుగ్రహించమని వేడుకునేవారు. అంతకుముందు ఆయనకి అవి శిలావిగ్రహాలు, కానీ ఎప్పుడైతే జ్ఞానాగ్ని మొదలయ్యిందో, అప్పటి నుండి వారు సజీవ మూర్తులు.

భగవాన్ అరుణాచలం వచ్చి కొత్తగా పొందింది ఏమీ లేదు. మరణానుభవం ద్వారా, మరణం శరీరానికి మాత్రమే, మరణం లేని వాడిని నేను అనే అనుభవము కలిగింది. ఆయన శరీరము టీచింగ్ కోసం అరుణాచలం రప్పించబడింది. రెండు సంవత్సరాలు మౌనంగా ఉండి, ఆయన పొందిన అనుభవమంతా స్థిరపడిపోయేలా చేసింది.

1896 సెప్టెంబర్ ఒకటవ తేదీన అరుణాచలం వచ్చి, వెయికాళ్ళ మండపం వద్ద పచార్లు చేస్తుంటే, సుబ్రమణ్య స్వామి గుడిలో ఉండే మౌన స్వామి, భగవాన్ దగ్గరగా వచ్చి, పరీక్షగా చూసి బాగా అలిసిపోయి ఉన్నాడు బిడ్డ అని, వెళ్ళి కొంచెం ఆహారం తీసుకురమ్మని ప్రక్కనే ఉన్న వారిని మౌనంగానే ఆదేశించారు. వారు తగరపు గొట్టంతో ఉప్పుడు బియ్యపు అన్నము, పైన పప్పు, అడుగున పుల్ల నీళ్ళు ఊరగాయ బద్ద వేసి తీసుకొచ్చారు. అదే భగవాన్ కి అరుణాచలేశ్వరుడు పెట్టిన మొదటి భిక్ష.

1898 క్రిస్మస్ సెలవుల్లో భగవాన్ అన్నగారైన నాగస్వామి, తల్లి ఇద్దరూ కలిసి భగవాన్ పవళకుంద్రంలో ఉండగా వస్తారు. అప్పుడు భగవాన్ తల్లికి ఒక ఉపదేశం ఇస్తారు. "ఈశ్వరుడు జీవులను వారి వారి ప్రారబ్ధాన్ని అనుసరించి ఆడిస్తున్నాడు. జరుగవలసింది జరిగియే తీరును జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నించినా జరుగనే జరుగదు ఇది నిశ్చయము" అదే భగవాన్ ఇచ్చిన మొట్టమొదటి సందేశం, ఈ భూమిని తాకింది.

భగవాన్ స్కందాశ్రమంలో ఉండగా ఒకరు భగవాన్ వద్దకి గంప-నిండా జంతికలు తెచ్చారు. భగవాన్ ఒకటి తింటూ, అమ్మా! నువ్వు కూడా తిను అన్నారు. తల్లి వెటకారంగా, నువ్వు తింటున్నావు కదా, మైలుపడిన భోజనం అన్నారు. భగవాన్ తల్లితో కఠినంగా 'సమత్వం యోగ వృచ్చతే'. సమత్వం వైపుగా మన మనస్సుని మరల్చుకోకపోతే మనము ఇక్కడ ఉండనక్కరలేదు, ఇంటికి వెళ్ళవచ్చు అన్నారు.

ఆ మాటతో తల్లిలో ఉన్న ఆ వాసన పోయింది. మనము ఆధ్యాత్మికంగా uplift అవ్వాలి, అంటే సమానబుద్ధిని ప్రాక్టీస్ చేయ్యాలి.

భగవాన్ సిద్ధాంతం ఏమిటంటే, there is no world apart from brahmam. పంచదార చిలుక పంచదారగా నిజం కానీ, చిలుకగా నిజముకాదు. చిలుకలో పంచదార తీసేస్తే చిలుక లేదు. అలాగే భిన్నత్వంలో ఏకత్వాన్ని చూడటానికి ప్రయత్నించండి. అదే నిజమైనదృష్టి. మనకన్నా భిన్నంగా ఏదైనా కనిపించినప్పుడు, అది మనకి కావాలనిపిస్తుంది. అక్కడ నుండి పాపం ప్రారంభమవుతుంది.

భగవాన్ చెప్పిన విచారణ అంతరంగ సాధన. భక్తిమార్గంలో పూజ, జపం, ధ్యానం బహిరంగ సాధన. ఏ రకంగా సాధనలు చేసినా ముందు we have to kill this I. ఈ నేనుని (దేహాగతమైన నేను) చంపు. నరకానికి తీసుకువెళ్ళేది, కామక్రోధాల్ని పెంచేది , విరోధుల్ని సృష్టించేది ఈ దొంగ నేనే. అది బ్రహ్మంలో ఐక్యమవ్వనివ్వదు. సపరేట్ గా ఉండాలనుకుంటుంది. విషయచింతన చేసే కొలది అది మరింత బలపడిపోతుంది.

భగవాన్ చెప్పే టెక్నిక్ ఏంటంటే, ఏ నేను, విషయాన్ని చింతిస్తోందో దానిని ముందు పట్టుకో, దాన్ని పట్టుకుని నన్ను చింతించేటట్లు చెయ్యి. లోకం వైపుగా ఉన్న దాని దృష్టిని నా వైపు తిప్పు, భౌతికభోగాలు అనుభవించే ఈ నేనుకి మంచి పనులు చెయ్యటము - అలా జీవించే వారితో సహవాసం చెయ్యటం అలవాటు చెయ్యి.

ప్రాణం లేని శరీరం ఎటువంటిదో! మంచి గ్రంథాలు లేని ఇల్లు కూడా అటువంటిదే. పశువులని యజమాని ఇంటికి ఎలా తీసుకువెళ్ళతాడో! అలా నిరంతరం ఎవరైతే భగవంతుడిని స్మరిస్తున్నారో వారిని భగవంతుడు తన శాశ్వతస్థానమైన హృదయ గుహలోకి తీసుకువెళతాడు.

చిత్తశుద్ధి లేని వాడు భగవంతుడిని స్మరించలేడు. సత్కర్మ చెయ్యగా చెయ్యగా చిత్తశుద్ధి వస్తుంది, అంతర్-దృష్టి కలుగుతుంది. అలా జీవించే వారు ఈ భూమి మీద ఉత్తములు. మనము ప్రపంచంలో నివసించటముకాదు, పరమాత్మలో నివసించటము ప్రాక్టీస్ చెయ్యాలి.

భగవాన్ ఒక రహస్యం చెప్పారు, కర్మని మనము చేస్తాము. ఏదో జన్మలో చేసినది, మరో జన్మలో అనుభవిస్తే పోతుంది. అయితే!అది పోయేటప్పుడు మన లోపల విత్తనాలు విడిచి వెళుతుంది. అవి మళ్ళీ మొలకెత్తుతాయి. అదే కర్మని మనకి మరలా చెయ్యాలనిపించేలా చేస్తుంది. ఈలోపు మనము భగవంతుడి అనుగ్రహం సంపాదించగలిగితే, ఈశ్వరుడు సూక్ష్మ రూపంలో, ఒక సంవత్సరం అనుభవించవలసినది కొద్ది క్షణాల్లో అనుభవింపచేసి తొలగిస్తాడు. seedless చేసి, మనకి realization ని అనుగ్రహిస్తాడు. మనము సుఖపడాలంటే, కర్తలేని కర్మలు చెయ్యాలి. పని జరుగుతూ ఉండాలి, చేసేవాడు కనపడకూడదు. అప్పుడు పని నుంచి వచ్చే పాపపుణ్యాలు మనలని అంటవు. పనిచేసే వాడిని, ఫలితాన్ని భగవంతుడు తినేస్తాడు. అప్పుడు మనముమనముగా మిగులుతాము.

భగవాన్ కళ్ళల్లో డివినిటీ ఉంటుంది. మనకి ఇష్టం లేకపోయినా ఆ డివినిటీని కాదనలేము.

భగవాన్ చెప్పింది అల్టిమేట్. ఆయనకి ఈశ్వరుడి పట్ల గౌరవం ఉంది, అందుకే ఈశ్వరుడి పేరు తలపెట్టారు. ఈశ్వరుడు జీవులను వారి వారి ప్రారబ్ధాన్ని అనుసరించి ఆడిస్తున్నాడు. జరుగవలసింది జరిగియే తీరును, జరుగరానిది జరుగనే జరుగదు. ఇది నిశ్చయము.

దేహము నేను అనే తలంపే, అన్ని తలంపులకి మూలం. ఆ మూల తలంపు ఉంటేనే ఇతర తలంపులు వస్తాయి.

భగవాన్ వద్దకి వచ్చేటప్పుడు, భక్తులు ఎవరైనా మీకు ఏమీ తేలేక పోయామంటే, నేనుని తెచ్చారు కదా అనేవారు.

ఏ నేనుని పోగొట్టుకోవాలి అనుకుంటున్నావో, ఆ నేనుని అరుణాచలేశ్వరుడు ఆహారంగా తీసుకుంటే శాంతి కలుగుతుంది. దానినే హిందువులు బ్రహ్మ నిర్వాణం అంటారు. అది పొందితే పునర్జన్మ ఉండదు.

ఉన్నది నలుబది సద్విద్యలో భగవాన్ ఏమంటారంటే, జీవుడు రూపమును పట్టుకొని పుట్టును. రూపమును పట్టుకొని పెరుగును. ఇంకొక రూపాన్ని స్మరిస్తూ

విడిచిపెట్టును. జీవుడు రూపాలు మారుస్తూ ఉంటాడు. జీవుడు రూప-చింతన, నామ-చింతన లేకుండా ఉండలేకపోతున్నాడు కాబట్టి ఉపాసన అవసరం. భగవంతుడి చింతన వల్ల మనము రూప-నామాలకి దూరమవుతాము. ఉప అంటే సమీపం, ఆసనం అంటే కూర్చోవటము. అంటే భగవంతుడి సమీపంలోకి తీసుకువెళ్ళేదే ఉపాసన.

భగవాన్ అంటారు, మనము ఈ లోకానికి ఏదైనా మంచి చెయ్యాలంటే! ముందు మనము పవిత్రులమై, ఆత్మజ్ఞానం పొందాలి. అప్పుడు మన ద్వారా అనేకమంది ప్రభావితమవుతారు. కళ్ళ ద్వారా శాంతి, మాట ద్వారా జ్ఞానం, మన సమక్షం వల్ల సుఖం ప్రవహించి ప్రకృతిని తడిపేస్తుంది.

సహజంగా మనిషి, శరీరానికి ఉన్న అనారోగ్యం గురించి మనస్సులో ఉన్న బెంగల గురించి ఆలోచిస్తాడే తప్ప హృదయంలో ఉన్న అంతర్యామి గురించి తపించడు. ఒక భక్తుడు భగవాన్ తో, ఉద్యోగం వదిలి, మీ సమక్షంలో గడపాలని ఉంది అంటాడు. భగవాన్ అంటారు: గురువు యొక్క నామం, గురువు యొక్క రూపం, గురువు యొక్క వాక్యం పట్ల, శ్రద్ధ- గౌరవం కలిగి ఉంటే ఎక్కడ ఉన్నా గురు సమక్షంలో ఉన్నట్టే అంటారు.

శరీరాలు దగ్గరగా ఉండి, మనస్సు దూరంగా ఉండే కంటే - మనస్సులు దగ్గరగా ఉండి దేహాలు దూరంగా ఉండటం మంచిది. గురువు, ఈశ్వరుడు, ఆత్మ ఇవి మూడు ఒక్కటే.

గాంధీని హత్య చేశారని భగవాన్ కి తెలిసింది. ఆ శరీరం వచ్చిన పని పూర్తి అయిపోయింది. ఆ శరీరాన్ని తీసుకుపోవటానికి గాడ్సే వచ్చారు. ఆ సమయంలో రేడియోలో వైష్ణవ జనతో అనే పాట వస్తోంది. భగవాన్ మహా మౌనంలోకి వెళతారు, భగవాన్ కంటి వెంట కన్నీరు కారింది.

బాపు రాజేంద్రప్రసాద్, భగవాన్ వద్దకు వచ్చి పది రోజులు ఉన్నారు కానీ, వారి ఇరువురి మధ్య మౌనమే కొనసాగింది. వెళ్ళేటప్పుడు భగవాన్ వద్దకు వచ్చి, నా అంతట నేను రాలేదు. బాపూజీ పంపితే వచ్చాను. ఆయనకు ఏమైనా సందేశం అందజెయ్యమంటారా అని అడుగుతారు. అప్పుడు భగవాన్, హృదయం హృదయంతో మాట్లాడేటప్పుడు, మాటలతో పని ఏముందని అంటారు.

భగవాన్ మూల-తలంపు దాని మూలాన్ని అది దర్శిస్తే, నశిస్తుందన్నారు. అయితే, దాని మూలాన్ని అది దర్శించాలంటే, మనకి ఆధ్యాత్మిక-బలం ఉండాలి, లేకపోతే అది ప్రపంచంలోకి వచ్చేస్తుంది.

"నాది" ని విడిచి పెడితే చిత్తశుద్ధి కలుగుతుంది, "నేను" ని విడిచిపెడితే జ్ఞానం కలుగుతుంది అన్నారు భగవాన్.

రమణుల హెచ్చరిక ఏమిటంటే, సాధన పేరుమీద ఆ మిథ్యానేనుని అలంకరించకండి. అది ఒక great lie అదే మూల తలంపు. ట్రైన్ ఇంజన్ కదిలితే, పెట్టలన్నీ ఎవ్వరూ కదలమని చెప్పకుండానే కదిలిపోతాయి. ఆలాగే మనము చేసే సాధన మూల తలంపు మీద గురిపెట్టి జరగాలి. దేహన్ని పట్టుకునేది అదే, దేహన్ని నిర్ధాక్షణ్యంగా విడిచిపెట్టేది అదే. దేహం భూమ్మీద తిరుగాడుతుండగానే, kill that I. చావకుండా శరీరం పోతే your loss is great. అంటే, మనము ఈ భూమ్మీదకి వచ్చి, వెళ్ళినందుకు ప్రయోజనమేమీ ఉండదు. తిరిగి ఈ శరీరాలనే ప్రమాదంలోకి జీవుడు నెట్టబడతాడు.

God cannot be deceived by physical exercises. భగవంతుడు మన మాటలకి, బాహ్య నటనకి మోసపోడు. ఒక స్త్రీ భగవాన్ వద్దకి వచ్చి, స్వామి! మీ దర్శనం చేసుకోవాలని ఎంతో ఆశగా ఉంది. ఇప్పటికి అది సిద్ధించింది, నాకు ఏమీ వద్దు మోక్షం ఇస్తే చాలని నమస్కారం చేసి వెళ్ళిపోయింది. భగవాన్ సోఫా అంతా కదిలిపోయేలా, నవ్వు ప్రదర్శిస్తూ... ఆమెకి మోక్షం ఇస్తే చాలునట, ఏమీ వద్దట అన్నారు. ప్రక్కన ఉన్న వాళ్ళు మేము కూడా అందుకే వచ్చాము కదా! మీ దగ్గరికి అన్నారు. అప్పుడు భగవాన్ నవ్వుతూ, మోక్షమనేది ఇవ్వటానికి-పుచ్చుకోవటానికి మూట కాదు. దాన్ని నేను నా వద్ద దాచుకుని కూర్చున్నానా అన్నారు. "మాకు ఏమీ వద్దని సర్వము వదిలేస్తే... మిగిలేది మోక్షమే". 'సర్వ త్యాగమే మోక్షము'. వేరుగా ఇచ్చేది ఏమీ ఉండదన్నారు భగవాన్.

ఒకరోజు భగవాన్ కొండ దిగి వస్తున్నారు. అక్కడ పరిసరాలను శుభ్రపరిచే ఒక వ్యక్తి, భగవాన్ని చూసి, గౌరవంగా నమస్కరిస్తున్నాడు. భగవాన్, అతనితో ఈ గౌరవాలు నమస్కారాలు కాదు, ఎవరి పనులు వారు శ్రద్ధగా చేయటమే నిజమైన నమస్కారం అన్నారు.

ఒక భక్తుడు భగవాన్ వద్దకు వచ్చి, సంసారం నన్ను వదలటం లేదంటాడు. భగవాన్, ఆ భక్తుడితో నువ్వు సంసారం విడిచిపెట్టడం లేదా? అన్నారు. సంసారమే నన్ను విడిచి పెట్టడం లేదు అన్నాడు ఆ భక్తుడు. భగవాన్ మరునాడు, స్కందాశ్రమం వెళుతూ ఒక చెట్టుని కౌగిలించుకున్నారు. ప్రక్కనే ఉన్న ఈ భక్తుడితో, ఓ అబ్బాయి! నన్ను ఈ చెట్టు విడిచిపెట్టడం లేదు అని, నేనే ఈ చెట్టును పట్టుకొని, చెట్టు నన్ను విడిచి పెట్టడం లేదని ఏ విధంగా అంటున్నానో! నువ్వు కూడా నువ్వే సంసారాన్ని పట్టుకొని, సంసారం నన్ను విడిచి పెట్టడం లేదు అంటున్నావు. నువ్వు సంసారాన్ని పట్టుకున్నావు కానీ, సంసారం నిన్ను పట్టుకోలేదు అన్నారు. పాముని తాడు అనుకొని మెడలో వేసుకుని తిరగకు. ఎవరినీ శోధించకుండా స్నేహాలు చెయ్యకు.

భగవాన్ తో ఒకరు, నేను పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించు కోవాలనుకుంటున్నాను అన్నారు. అప్పుడు భగవాన్, నువ్వు మళ్ళీ పుట్టకుండా ఆపరేషన్ చేయించుకో అని నవ్వారు.

గురువుని ఎలా ఎంచుకోవాలని కొంతమంది భక్తులు భగవాన్ ని అడుగుతున్నారు. భగవాన్, లోకంలో ఎంతో మంది మహాత్ములు, మహర్షులు యోగులు ఉన్నారు. ఎవరి హృదయంతో, నీ మనస్సు శృతి కలుపుతుందో, ఎవరి దర్శనం మాత్రం చేత నీ మనస్సు శాంతితో, కాంతితో, చల్లదనంతో నిండిపోతుందో వారే నీ గురువు.

భగవానుడు కొండ మీద ఉన్న సమయంలో జఠరా స్వామి అనే ఒక స్వామి కూడా కొండ మీద ఉండేవారు. ఆయనచాలా గొప్పవారు. ఆయనకి విద్య కూడా ఉంది. అయితే, ఆయన వద్ద కంటే భగవాన్ వద్దకే ఎక్కువ మంది భక్తులు వచ్చేవారు. అందువలన ఆయనకు అసూయ వచ్చి, భగవాన్ ని చంపబోయే ప్రయత్నం చేశారు. అసూయ పిలవని పేరటం. ఒడ్డుకు వచ్చేవరకు, తరించేవరకు నమ్మటానికి లేదు. ఎప్పుడైనా జారిపోవచ్చు.

భగవాన్ టీచింగ్ లో, చూసేవాడు ఎంత నిజమో, చూడబడేది కూడా అంతే నిజం. nothing ever happens. ఎక్కడా ఏమీ జరగటం లేదు. మనస్సుకి జరుగుతున్నట్లుగా కనిపిస్తోంది. ఆ మనస్సు ఎంత నిజమో, జరిగేది కూడా అంతే నిజం.

దుఃఖాన్ని చూసేది ఎవరు? మనస్సే. ఆ మనస్సు ఎంతవరకు నిజము. చూసే మనసే నిజము కానప్పుడు దుఃఖం కూడా నిజము కాదు. అది భగవాన్ teaching technique.

భగవాన్ ఒకరిని, ఒక సందర్భములో పాలు తెచ్చావా అని అడిగారు. తీసుకురాలేదండి అని చెప్పారు. తేవడానికి అసలు ప్రయత్నం చేశావా? అన్నారు భగవాన్. వాడు చేయలేదండి అన్నాడు. ప్రయత్నము చేసి ఫెయిల్ అవ్వడమనేది వేరే విషయం. ప్రయత్నమే లేకపోతే ఇంకేముంది. హృదయంలో ఉన్న శాంతిని పొందటానికి ప్రయత్నం చేశామా? చేసి ఫెయిల్ అయితే, అది వేరే విషయం, ప్రయత్నమే లేకపోతే ఎలా? మన ప్రయత్నం సిన్సియర్ గా చేయగా చేయగా మన ప్రయత్నమే grace గా మారి ఫలిస్తుంది. ప్రయత్నమే లేకపోతే మనల్ని ఎవరు బాగు చేస్తారు.

భగవాన్ వద్దకి ఒక భక్తుడు వచ్చి, మీ వద్దకు ఒక అమ్మాయి వస్తూ ఉంటుంది. ఆ అమ్మాయిని వివాహం చేసుకోవాలని ఉంది అన్నారు. నువ్వు పురుషుడిని అని అనుకుంటే, ఆ అమ్మాయి స్త్రీగా కనిపిస్తుంది. అప్పుడు మోహము వస్తుంది. ఆ మోహంలో నుండే కోరిక వస్తుంది. ఆత్మకి సెక్స్ లేదన్నారు భగవాన్.

భగవాన్ స్కంధ ఆశ్రమంలో ఉండగా ఒక భక్తుడు వచ్చి, నాకు వెయ్యి జన్మల తరువాత జ్ఞానాన్ని అనుగ్రహించినా పరవాలేదు. మిమ్మల్ని నాకు ఇప్పుడే అనుగ్రహించండని ఇబ్బంది పెట్టను, కానీ ఎప్పటికీ మీరే నాకు గురువుగా ఉండాలి అన్నాడు. అప్పుడు భగవాన్, అది అడగనవసరం లేదు. నువ్వు ఏ దేహం ధరించినా, ఒక్కసారి గేటులోకి వచ్చిన తరువాత, మరలా ఈ గేటు ద్వారానే తరించాలన్నారు భగవాన్.వాడి విశ్వాసానికి, వాడి భక్తికి ఆశ్చర్యం కలిగింది; ఆ విశ్వాసం కొండల్ని కూడా పిండి చెయ్యగలదు. faith can move mountains. అన్ని సాధనల్లోకి విశ్వాసం గొప్పది. మన దేహము సహకారంతో సత్యాన్ని పొందలేము. మనము భూమ్మీదకి వచ్చిన పని మర్చిపోకూడదు. దాన్నే గమ్యంగా పెట్టుకుని జీవించమంటారు భగవాన్.

ఇద్దరు భక్తులు ఒకరోజు భగవాన్ వద్దకు వచ్చారు. అందులో ఒకరు, పక్క వాడి గురించి భగవాన్ తో, వీడు ఒక గురువు వద్దకు వెళుతున్నాడు. ఆ గురువు

గొప్ప స్థితిలో ఉన్నవాడేమీ కాదు, అసలు ఆత్మసాక్షాత్కారం పొందిన వారు ఎలా ఉంటారో చూపించి, ఇతన్నిఅవివేకం నుంచి తప్పించటానికి మీ వద్దకు తీసుకు వచ్చాను అన్నారు. భగవాన్ అంటారు, అతను ఎన్నుకున్న గురువు సరైన వాడు కాదని నీకెలా తెలుసు.. దాన్ని కనిపెట్టగల సామర్థ్యం నీకు ఉందా. "అసలు గురువు యోగ్యత ముఖ్యం కాదు, శిష్యుడు భక్తి ముఖ్యం". అనన్య భక్తితో సేవిస్తే రాయి కూడా ఈశ్వరుడే అవుతాడు అన్నారు. భగవాన్ ఇతర గురువుల్ని, ఆశ్రమాల్ని తర్కించటము, విమర్శించటం ఇష్టపడేవారు కాదు. మనసుని తగ్గించుకోవాలి కానీ పెంచుకోవడం కాదని, రెండవ వ్యక్తి గొడవల్లోకి వెళ్ళటం ఇష్టం ఉండేది కాదుఆయనికి.

వేసవిలో రమణ తీర్థం బావి దగ్గర, భగవాన్ కూర్చొని ఉన్నారు. అక్కడికి ఒకరు వచ్చి, బిగ్గరగా దుఃఖించడం మొదలుపెట్టారు. భగవాన్! నేను మహాపాపిని, ఎంతో కాలం నుండి మీ వద్దకి వస్తున్నాను, కానీ నాలో మార్పు రాలేదు. నేను ఇక్కడ ఉన్నంతకాలం యోగ్యుడిగా ఉంటున్నాను, బయటికి వెళ్తే మనిషినే కాను మహాపాపిని అని ఏడుస్తున్నాడు. భగవాన్ అంటారు, నువ్వు ఎవడివైతే నాకేంటి? నాకేమీ సంబంధం అని కసిరారు. వాడు గట్టిగా గుండె పగలేలా ఏడ్చి, మీరే నా గురువు... మీరు అలా అంటే నాకు ఎవరు దిక్కు, నా గతేంటి? మీరు తప్ప లోకంలో వేరే దిక్కులేదు. నా గురువు నన్ను పావనుడ్ని చేస్తారని బ్రతుకుతున్నాను అన్నాడు. భగవాన్ అంటారు, నేను నీ గురువునని చెప్పలేదు, నీ గురువుని అయితే, నాకు గురుదక్షిణ ఏమీ ఇవ్వలేదు అన్నారు. మీరేమీ తీసుకోరు కదా! భగవాన్ అన్నాడు ఆ భక్తుడు. భగవాన్ అంటారు, నేను ఏమీ తీసుకోనని నీకు ఎలా తెలుసు. ఇప్పుడు గురుదక్షిణ అడుగుతున్నాను ఇవ్వు. నీ పుణ్యం నాకు దారపొయ్యి, 'నా పుణ్యంతో నాకేమీ సంబంధం లేదు, ఆ పుణ్యఫలితం మీకు ఇస్తున్నాను అని మనస్ఫూర్తిగా అను' అన్నారు భగవాన్. ఆ భక్తుడు సరే అన్నాడు. అప్పుడు భగవాన్ మళ్ళీ వాడితో, నువ్వు కొద్దిగానే పుణ్యం చేశావు అది నాకు సరిపోదన్నారు. ఆ భక్తుడు మరి ఏం చేయాలి స్వామి! అని అడిగాడు. నీ పాపం కూడా నాకు ఇచ్చేయ్యి అన్నారు భగవాన్. ఆ మాట వినగానే, వాడి గుండె బద్దలైంది.. స్వామి! నేను ఎన్ని పాపాలు చేశానో, నాకే తెలియదు. నా పాపాలన్నిటిని తీసుకుంటాను అంటున్నారు. నా శరీరం ఘోరమైన బాధలతో ఉడికిపోతుంది. నా పాపాలు కోరకండి అన్నాడు.

భగవాన్ పట్టు వదలకుండా పాపాలు ఇమ్మని అడిగేసరికి, 'నేను చేసిన పాపాలు వాటి ఫలితము నాది కాదు రమణులదే అన్నాడు'. అప్పుడు భగవాన్ అంటారు, ఇప్పుడు నీకు పాపము లేదు పుణ్యము లేదు.. నీవు పరిశుద్ధమైన ఆత్మవి. ఇకనుండి నువ్వు నీలా ఉండిపో అన్నారు. ఆ మాటలతో వాడికి, గొప్ప శాంతి వచ్చింది. అప్పటినుండి అతను ఏమయ్యాడో తెలియదు మరలా ఆశ్రమానికి తిరిగి రాలేదు. బహుశా ఆ భక్తుడికి ఆశ్రమానికి రావలసిన అవసరం రాలేదేమో! పాపపుణ్యాలకి అతీతమైనది బ్రహ్మము. అది వాడి అనుభవంలోకి వచ్చి ఉంటుంది.

భగవాన్ వద్దకి ఒక భక్తుడు వచ్చి, నన్ను ఎక్కడ ఉండమంటారని అడిగాడు.అంటే, కాశీ, రామేశ్వరం వీటి రెండిటిలో ఎక్కడ నివశించమంటారని భక్తుడు ఉద్దేశం. భగవాన్, నేను అనే తలంపు ఎక్కడ నుండి ఉదయించి వస్తుందో! అక్కడికి వెళ్ళి ఉండు అన్నారు. భగవాన్ ఏ మాట మాట్లాడినా జీవుడిని, మూలంలోకి పంపించడానికి సహకరించేదిగానే ఉంటుంది.

భగవాన్ వద్దకి ఒక ప్లీడర్ గారు వచ్చి, నాకు భయం వేస్తోంది. నాకు ప్రపంచం మీద మమత ఉంది, భగవంతుడి మీద మమత లేదు. జీవితంలో ఇప్పటివరకు ప్రపంచం కోసమే బ్రతికాను, భగవంతుడి కోసం బ్రతకలేదు. ఏదో ఒక రోజు చావు గూటిలోకి వెళ్ళిపోతాను ఈ ప్రపంచంలో ఏదీ నా కూడా రాదే అన్నారు. భగవాన్ సోఫాలో ఒకసారి సర్దుకుని కూర్చుని..ఏమిటి చచ్చిపోతావా, చావులేని సత్పదార్థానివి నీవు. దేహం చనిపోతుంది చనిపోయేది నీవు కాదు. నువ్వు న్యాయ శాస్త్రాన్ని ఎలా ప్రాక్టీస్ చేశావో, నీ లోపల ఉన్న చావులేని వస్తువువి నీవే అని, మమకారాన్ని తగ్గించుకుంటూ వదిలించుకోవటానికి చాలా దీర్ఘంగా ప్రయత్నం చెయ్యి. చేతిలో ఉన్న మిఠాయిని కింద పడేసి చేతిని నాకడం ఎటువంటిదో హృదయంలో ఉన్న స్వరూప సుఖాన్ని వదిలేసి ఈ విషయ సుఖాలు నాకటం అట్టిదే. చెరువులో ఉన్న వస్తువు చెరువులో ఈదేవాడికి దొరకదు, ప్రాణాన్ని నియమించుకొని, లోపలకి మునిగిన వాడికి మాత్రమే వస్తువు దొరుకుతుంది.

భగవాన్ తో, ఒక భక్తుడు భగవదనుభవం పొందాలనే ప్రయత్నంలో నేను నాలో ఉన్న దురలవాట్లు, దురభ్యాసాల్ని విడిచిపెట్టాలనుకుంటుంటే, అవి చాలా బలంగా ఉన్నాయి. దానికి నేను ఏమి చెయ్యాలని అడిగాడు. భగవాన్ అంటారు,

భగవదనుభవం పొందటానికి అడ్డు వచ్చే వాసనల్లో నుండి బయటికి రావాలంటే, మూడు ఉండాలి.

1. పురుష ప్రయత్నం: మీ దేహాన్ని, మీ ఇంద్రియాల్ని, మనస్సుని భగవంతుడు వైపు తిప్పుకొని జీవించు.

2. గురువు అనుగ్రహం: నీ ప్రయత్నంలో సిన్సియారిటి ఉంటే, గురువు దయని అది పట్టిస్తుంది. ఆయన వాత్సల్యం, ఆయన ఆప్యాయత, ఆయన సాంగత్యం మారు మనస్సు పొందంటంలోసహకరిస్తాయి.

3. అదృష్టం: జన్మాంతర పుణ్యం అదృష్టంగా కలిసి వస్తుంది. మనము చేసే ప్రయత్నాన్ని సక్సెస్ చేస్తుంది. గురువు యొక్క బోధ మన మైండ్ ని కండిషన్ లో పెడుతుంది. సత్యాన్ని పొందటానికి ఏ సంస్కారాలు అడ్డు వస్తున్నాయో! వాటిని తొలగించే బాధ్యత గురువుదే.

శాస్త్రం ఏమని చెప్తుందంటే,మనము గుర్రం పని చేస్తునట్టు  పనిచేయాలి. జీవించడం సన్యాసిలా జీవించాలి. ధనం సంపాదించడం కంటే దాన్ని సద్వినియోగం చేయటం చాలా కష్టం. మన దేహం భూమ్మీద ఉన్నంతకాలం జీవనం కొనసాగించటానికి ధనం కావాలి. ఇతరుల మీద ధనం కోసం ఆధారపడితే, బానిసత్వం వస్తుంది. దేహం యొక్క అవసరానికి సరిపడా కృషి చేసి సంపాదించుకుని, మిగతా సంపదని సద్వినియోగం చేయాలి. ఈ శరీరాలన్నీ మనవే అయినప్పుడు, సేవ చెయ్యటానికి భిన్నంగా ఏదీ ఉండదు. లోపల అహంభావన, వ్యక్తి భావన పెట్టుకుని సేవ చేస్తే! నూటికి పదివంతులు పుణ్యం వస్తే, 90 వంతులు అహంకారం పెరుగుతుంది. మనము తలకాయతో జీవిస్తున్నంత కాలం ఎదుటి వారికి ఏది చేసినా, చేసాము అంటాము. దానివలన అజ్ఞానం పెరిగిపోతుంది. ‘‘అజ్ఞాని తలకాయతో బ్రతుకుతాడు, జ్ఞాని హృదయంతో బ్రతుకుతాడు. "work is worship పని వల్ల tier అవ్వము. ఈ పని నేను చేస్తున్నాను అనే భావన వల్ల tier అవుతాం. భగవాన్ కూడా ఖాళీగా ఉంటే, ఆశ్రమంలో పనిచేసేవారు.

భగవాన్ అంటారు, మీరు ఎక్కడికైనా వెళ్తుంటే వర్షం కురుస్తోంది అనుకోండి, వర్షాన్ని తిట్టకుండా గొడుగు వేసుకుని వెళ్ళిపోండి. అలాగే మనము చేసుకునే

సాధనకి విరుద్ధంగా ప్రవర్తించే వ్యక్తులు ఉన్నారనుకోండి, వారిని తిట్టకుండా, వారి ప్రవర్తనని మన లోపలకి తీసుకోకుండా! మన సాధన మనము చేసుకోవాలి. వారి ప్రవర్తనని లోపలకి తీసుకోకుండా ఉండటంలోనే, నూటికి 50% సాధన పూర్తయిపోతుంది.

రోగం వచ్చిన తరువాత తగ్గించుకోవడం కంటే, రోగం రాకుండా చూసుకోవటం మంచిది. ఈ ప్రపంచమంతా మాయే. మాయలోపడి పతనమవ్వకముందే నీ దయని అనుగ్రహ రూపంలో మాపై కురిపించి రక్షించు. అరుణాచలా! అంటారు భగవాన్. అనుగ్రహం ఉంటే అంతా ఉన్నట్టే. మనుషుల కోరికలన్నీ నెరవేరిస్తే పాడైపోతారు. మనుషులకి కోరుకోవాలనే బుద్ధిపోవాలి.

body moves according to destiny. జీవితంలో ప్రతిదీ దేహప్రారబ్ధాన్ని బట్టి జరిగిపోతుంది. భగవాన్ మనల్ని ఆత్మ-హంతకులు అంటున్నారు. అంటే, చనిపోయే దేహాన్ని మనము ఆత్మ అని అనుకుంటున్నాము. ఆత్మ హృదయంలోనే ఉన్నా దాని తాలూకు గుర్తింపు లేకపోవడం వల్ల, చనిపోయే దేహాన్ని 'నేను' అనుకొని జన్మ పరంపరలోకి జారిపోతున్నాము.

మన దేహం ఇంట్లో ఎలా ఉంటుందో, అలా మన మనస్సుకి హృదయగుహలో ఉండటం అలవాటు చెయ్యాలి. మనసు శిరస్సులో ఉన్నంతకాలం వాసనలు విజృంబిస్తాయి. హృదయ గుహలో ఉంటే వాసనలు నెమ్మదిగా కరిగిపోతాయి. దేహానికి 58 సంవత్సరాలు వస్తే, రిటైర్ అవుతాము. భగవాన్, శిరస్సులోంచి హృదయగుహలోకి వెళ్ళి రిటైర్ అయిపోమని చెబుతున్నారు.

భగవాన్ లో ఏవస్తువైతో ఉందో, మనలోను అదే ఉంది. అయితే ఆయనకు ఆఎరుక ఉంది మనకి ఆ ఎరుక లేదు. మహాత్ముల దర్శనం వలన హృదయంలో ఉన్న సద్వస్తువుని ఎరుకలోకి తెచ్చుకోవాలనే కాంక్ష కలుగుతుంది. భగవాన్ లో ఉన్నది ఆయనకి తెలుస్తోంది. అందుచేత ఆయన సుఖి. మనలో ఉన్నది మనకి తెలియటంలేదు అందుకు మనముమనలో ఉన్న చైతన్యం మనకి ఎరుకలోకి వచ్చే వరకు దుఃఖితులుగానే ఉన్నాము.

దేహంలో నుంచి ప్రాణవాయువు బయటకు వెళుతుంటే, మన ఆస్తులు, మన గౌరవాలు, మన పిల్లలు మన కూడా రారు. మనల్ని ఇవి రక్షించలేవు. మనల్ని రక్షించేది, మరణానంతరం మన కూడా వచ్చేది మనము చేసిన దానం మాత్రమే. అందువలన భగవాన్ "ఇచ్చిన ప్రతిదీ తిరిగి నీకే వస్తుందని తెలిస్తే! ఇవ్వకుండా ఎలా ఉండగలవు అన్నారు". అదే డివైన్ బ్యాంకులో సొమ్ము.

భగవాన్ ని ఎవరైనా భోజనానికి పిలిస్తే, ఆయన ఏమనేవారంటే, ఆ డబ్బాలో ఉన్న బియ్యం నావే. అవి పంటగా ఉన్నప్పుడే వాటి మీద భగవంతుడు నా పేరు రాశాడు. అందుకే మీకు నన్ను పిలిచి భోజనం పెట్టాలనే బుద్ధి కలిగింది. మీకు ఆ బుద్ధిని ఇచ్చిన వాడు భగవంతుడే అంటారు.

భగవాన్ ధనాన్ని ఒక ఉపద్రవమన్నారు. ధనం వలన ఇంట్లో వాళ్ళకే శత్రుత్వం వచ్చేస్తుంది అంటారు. ధనాన్ని vitamin 'M' అంటారు. అది ఎక్కువైతే మన ప్రవర్తనని మార్చేస్తుంది.

కొందరి హృదయాలు ఎంత దయాపూరితమైనవంటే, ఒక హెడ్ మాస్టారు భగవాన్ వద్దకు వచ్చేవారు. ఆయన తల్లి ఆయనకి ప్రతీరోజు 25 పైసలు ఏమైనా కొనుక్కోమని ఇచ్చేవారు. ఆయన చేపలు పట్టే వారివద్దకు వెళ్ళి, ఆ ధనంతో ఎన్ని చేపలు వస్తే, అన్ని చేపలు కొని నీటిలో వదిలేసేవారు. అట్టి హృదయంలో భగవంతుడే వ్యక్తమవుతాడు. కొందరు వారు ఏమి తింటున్నారో, ఏమి కట్టుకుంటున్నారో, వారికి తెలియకుండానే, రోజులు గడిపేసి జీవకోటి పట్ల దయతో జీవిస్తారు. దయగల హృదయమే భగవంతుడి నిలయం.

నిష్కామ కర్మ మనిషిని పవిత్రం చేస్తుంది. భగవాన్ గిరి ప్రదక్షిణ చేస్తూ, ఒక గుడి అరుగు మీద కూర్చుని ప్రక్కనే ఉన్న ముళ్ళచెట్టు కొమ్మని విరిచి తెచ్చి, దానికున్న కణుపులు, ముళ్ళను నరికి, ముదురు ఆకులతో రుద్ది అందమైన కర్రని సిద్ధం చేశారు. ఈలోపు అక్కడ మేకలు కాసేవాడు, తన కర్ర కనిపించక ఏడుస్తుంటే, భగవాన్ తను తయారుచేసిన కర్రని ఇచ్చేసి, అక్కడున్న భక్తులతో, నువ్వు ఈశ్వరార్పణ బుద్ధితో పనిచేస్తూ, ఈ కర్రకున్న కణుపులు ఎలా నరికామో, అలా పని చేసే క్రమంలో నీ అహంకార-మమకారాలు, నీకున్న రాగద్వేషాలు, నీకున్న వాసనలు,

సంస్కారాలు అనే ముళ్ళని వివేకంతో నరుక్కుంటూ ఆ పనిని భగవదర్పితంగా చేస్తే అది నిష్కామకర్మ. అది నిన్ను పవిత్రం చేస్తుంది. జన్మజన్మల దోషాలను కడిగి జ్ఞానానికి సంబంధించిన యోగ్యతను పట్టిస్తుందని చెప్పారు.

ఎవడైతే నీ లోపల ఇస్తున్నాను అంటున్నాడో! వాడిని ఇచ్చేయ్యి. అప్పుడు నేను సంతోషిస్తాను అంటాడు అదే భగవాన్ బోధనాసారం.

భగవాన్ ని కొందరు వివాహం చేసుకోమంటారా అని అడిగేవారు. భగవాన్ అనేవారు, ' instead of thinking all the time what to do, better to go with marriage' అనేవారు. తల్లి కూడా అలా ఎవర్ని అడగలేదు.

పెరుమాళ్ళు భగవాన్ తో, మీ పట్ల ఎన్నో అపచారాలు చేశాను మీరు మనసులో పెట్టుకోకండి అంటాడు. పెరుమాళ్ళు, ఇక్కడ మనస్సుంటే కదా పెట్టుకోవటానికి, నువ్వు ఎక్కడ ఉన్నా, దానికి ప్రేమించడం తప్పించి, అనుగ్రహించడం తప్పించి ఇంకొకటి తెలియదన్నారు భగవాన్.

మహర్షికి, భక్తుడికి మధ్య సంభాషణ ఈ విధంగా జరిగింది.

భక్తుడు : గురువు అవసరమా?

మహర్షి : అవసరమే.

భక్తుడు : శిష్యునికి ఉండవలసిన అర్హత ఏమిటి?

మహర్షి : ఆత్మ దర్శనానికి తీవ్రమైన జిజ్ఞాస, నిజాయితీ, పవిత్రమైన మనస్సుఉండాలి.

భక్తుడు : గురువుకి ఏమి సమర్పించుకోవాలి?

మహర్షి : దేహాత్మ బుద్ధిని వదులుటయే నిజమైన సమర్పణ.

నేనూ లేను, నువ్వూ లేవు అని భగవాన్ అన్నారు కదా, ఈ సత్కర్మలు, దాన-ధర్మాలు ఈ గొడవంతా ఏమిటని ఒకరు అడిగారు. ఏదైతే భగవాన్ చెప్పారో అది నీకు అనుభవం లేదు. నువ్వున్నాను అనుకుంటున్నావు, ఆ నువ్వు పోయే వరకు ఇవన్నీ ఆచరించవలసినదే. ఆ స్థాయికి నువ్వు చేరిన తరువాత అక్కరలేదు. ఆ స్థాయిలో నీ ప్రమేయం లేకుండానే ఇతరులకు సహాయ సహకారాలు అందుతాయి.

ఒకరోజు బీవీ నరసింహస్వామి భగవాన్ వద్ద కూర్చొని, సమాధి స్థితి గురించి ప్రశ్నలు వేస్తున్నారు. భగవాన్, పేపరు చదువుకుంటూ మధ్యలో నరసింహస్వామి గారి ప్రశ్నలకు సమాధానాలు చెబుతున్నారు. అక్కడికి గోవు లక్ష్మి వచ్చింది. అది నిండు గర్భిణీ, లక్ష్మి హాల్లోకి వచ్చి, భగవాన్ చదువుతున్న పత్రికను నాకుతోంది. అప్పుడు భగవాన్, లక్ష్మీ! కొంచెం ఆగమ్మ, అన్నారు. అయినప్పటకి లక్ష్మి నాకుతూనే ఉంది. భగవాన్ పత్రికను పక్కన పెట్టి, ఆయన చేతిని లక్ష్మి రెండు కొమ్ముల మధ్యలో పెట్టి, ఆయన తలని చేతి మీదకు వంచి... లక్ష్మి నుదుట ఆయన శిరస్సుని తాకించగానే, ఇద్దరిలో కదలికలు ఆగిపోయి అలా ఉండిపోయారు. 20 నిమిషాల తరువాత నెమ్మదిగా తన శిరస్సుని వెనక్కి తీసుకున్నారు. లక్ష్మి నేత్రాల వెంట కన్నీరు కార్చుకుంటూ, భగవాన్ వైపే చూస్తోంది. దానిని నెమ్మదిగా వాత్సల్యపూరితంగా నిమిరారు. ప్రక్కన ఉన్న నరసింహస్వామి ఆశ్చర్యంగా వారిద్దరి అనుబంధాన్ని చూస్తున్నారు. అప్పుడు భగవాన్ నరసింహస్వామితో, లక్ష్మి సమాధి స్థితిలో ఉంది. లక్ష్మిది సహజ సమాధి అన్నారు. తరువాత నెమ్మదిగా లక్ష్మిలో కదలికలు వచ్చి, భగవాన్ పట్ల ఎంతో నమ్రతతో, వినయంతో తోకని చూపకుండా వెనక్కి అడుగులు వేసుకుంటూ, హాల్ నుండి బయటకు వెళ్ళి, చుట్టూ ప్రదక్షిణ చేసి బయట గుమ్మం వద్ద భగవాన్ ని చూస్తూ కొన్ని క్షణాలు ఆగి..తన తలని నేలకు ముట్టించి తన నమస్కారాలు తెలియచేసి, నా బాధ్యత మాత్రమే కాదు నా బిడ్డ బాధ్యత కూడా మీదే అని హృదయంలో భగవాన్ కి సమర్పించుకొని, అక్కడినుండి నెమ్మదిగా వెళ్ళిపోతుంది. దానిది జంతు జన్మే కావచ్చు, కానీ భగవాన్ పట్ల నూటికి నూరు శాతం శరణాగతి. దేహం పోయినా, గురువుతోటి అనుబంధం కొనసాగుతుంది అనటానికి గోలక్ష్మి ఉదాహరణ. పూర్వజన్మలో భగవాన్ వద్ద ఉన్న ఆకుకూరల అవ్వే, గోలక్ష్మిగా వచ్చింది.

ఎచ్చెమ్మాళ్ పెంపుడు కూతురు శెల్లమ్మాళ్ చనిపోయిందని టెలిగ్రామ్ వచ్చింది. అది తీసుకొచ్చి దుఃఖంతో భగవాన్ చేతిలో పెట్టింది. అది చదివి, భగవాన్ ఎచ్చెమ్మాళ్ తల నిమిరి, ఆయన కంట్లోంచి కూడా రెండు కన్నీటి బిందువులు రాలాయి.

భగవాన్ వద్దకి, దేసూరమ్మ అనే భక్తురాలు వచ్చేవారు. ఆమె అసలు పేరు అఖిలాండమ్మాళ్. భగవాన్ వద్దకి, తరచూ దేసూరు నుండి వచ్చేవారు కాబట్టి దేసూరమ్మ అనేవారు. ఆమె అరుణాచలంలో ఉంటే, శేషాద్రి స్వామికి, విఠోబా స్వామికి మరియు భగవాన్ కి తనే స్వయంగా భోజనం వండి పట్టుకెళ్ళేవారు, ఆమె పరమ భక్తురాలు. భగవాన్ మామిడి తోపులో ఉండగా, ఒకరోజు ఆమె పుల్లలు వెలిగించి.. పెద్ద గిన్నెతో నీళ్ళు కాస్తున్నారు. భగవాన్ అది చూసి ఏదో వండుతున్నారు అనుకున్నారు. కానీ ఆ నీళ్ళు వేడయ్యిన తరువాత, భగవాన్ జబ్బ పట్టుకుని తీసుకువెళ్ళి, ఆయన దేహమంతా నూనె రాసి,శికాకాయ రసంతో దేహమంతా శుభ్రంగా రుద్ది, స్నానం చేయించారు. ఆమె ఏది తెచ్చినా! భగవాన్ అందరికి పెట్టి ఆయన కూడా తినేవారు. ఒకసారి, దేసూరమ్మని ఒకసాధువు ఈరోజు భగవాన్ దగ్గర మీరు మంత్రం తీసుకోండి, పౌర్ణమి కాబట్టి చాలా మంచిదన్నారు. భగవాన్ దీక్షలు ఎవరికి ఇచ్చేవారు కాదు. దేసూరమ్మ, భగవాన్ ని మంత్రం ఇవ్వమని అడిగారు. భగవాన్ గంభీరంగా మంత్రం ఇవ్వమంటావా అని, ''వున్నాయ్ విడాధుయిరు'' అన్నారు. దాని అర్థం ఏమిటంటే, ఆత్మని విడవకుండా ఉండు అని. ఆ మంత్రం చెబుతూ, దేసూరమ్మ వైపు తదేక దృష్టితో చూశారు. ఆమె ఎన్నడూ, తన హృదయాన్ని విడవకుండా ఉండేటట్లు ఆ చూపు ద్వారా అనుగ్రహించి, లోదృష్టిని ప్రసాదించారు.

భగవాన్ ఆఖరి రోజులలో, ఆమె భగవాన్ ని చూడటానికి వచ్చారు. ఆమెను అక్కడ ఉన్నవారు లోపలకి రానివ్వలేదు. కుంజుస్వామి ఆమెను చూసి గుర్తుపట్టి, లోపలకి పంపండని పిలిచి, భగవాన్ వద్దకు తీసుకువెళ్ళారు. భగవాన్ ని చూసి ఆమె బోరున దుఃఖించారు. అప్పుడు భగవాన్ ఆమెతో, దేసురమ్మా! ''అశాశ్వతమైన శరీరాన్ని గురించి ఎందుకు బాధపడుతున్నావు, నేను ఎప్పటికీ నీ భగవాన్ నే'' అని, నా స్థానం మీ హృదయమే అని, వేలు పెట్టి ఆమె హృదయం వైపు చూపించారు. నిజమైన గురువు మన హృదయంలోనే ఉన్నారు. మన కళ్ళు ప్రపంచాన్ని చూస్తున్నాయి గాని, లోపల హృదయాన్ని చూడలేకపోతున్నాయి. జ్ఞాన నేత్రం ద్వారా మాత్రమే హృదయంలో ఉన్న గురువుని దర్శించగలము. బయట గురువు మూసుకుపోయిన జ్ఞాననేత్రాన్ని తెరిపిస్తాడు, లోపల గురువు దర్శనాన్ని అనుగ్రహిస్తాడు. అదే కడసారి జన్మ. అది గురువు యొక్క ఉత్తమోత్తమమైన అనుగ్రహం.

సూరి నాగమ్మగారిని వారి అన్నగారు భగవాన్ వద్దకు తీసుకువచ్చారు. భగవానుని చూడగానే నాగమ్మగారు నా జీవితనౌక తీరాన్ని చేరిందనుకున్నారు. మనము సంసార సముద్రంలో కొట్టుకుపోతున్నాము. మన పూర్వ పుణ్యం - నాన్నగారు అనే నావలో కుర్చోబెట్టింది. మనము ఆనావలో కుదురుగా, నిలకడగా ఉంటే చాలు. చెట్టుకు పూసిన పుష్పం పిందెగా మారుతుంది, పిందె కాయగా మారుతుంది, కాయ పక్వానికి వచ్చి పండు అవుతుంది. ఈ క్రమంలో ప్రకృతి సృష్టించే ఎటువంటి పరిస్థితి ఎదురైనా చెట్టుకి అంటిపెట్టుకుని ఉంటేనే అది ఫలిస్తుంది. అలాగే మన ప్రారబ్దంలో ఎటువంటి సంఘటనలు వచ్చి మీద పడ్డా గురువు అనే మహావృక్షాన్ని వదలకుండా అంటిపెట్టుకుని జీవించిన సాధకుడు పరిణామక్రమంలో తరించి తీరతాడు.

నాగమ్మగారికి, భర్త సుఖం ఎలా ఉంటుందో తెలియకుండానే భర్త చనిపోయారు. అంతులేని దుఃఖం హృదయమునిండా నిండిఉండి, ఏదో భారత-రామాయణాలు చదువుకుంటోంది. కలలో ఒక గురువు కనిపించి మౌనంగా ఆశీర్వదించారు. ఆ మరుసటి రోజే, ఆమె అన్నగారు, నాగమ్మ గారితో అరుణాచలం వెళ్ళి అక్కడ భగవాన్ ని చూసి వస్తున్నాను. నువ్వు వెళ్ళి చూసి వస్తానంటే పంపుతాను అన్నారు. భగవాన్ ని దర్శించుకోగానే, నా జీవితాన్ని ఆయన చదివేసారు, నా జీవిత నౌక సముద్రంలో నుండి ఒడ్డుకు చేరింది అనిపించిందట నాగమ్మగారికి. ఒకసారి భగవాన్ చెప్పిన మాటలు ఒక పది వాక్యాలు రాసి భగవాన్ కి చూపించారట. అది చూడగానే భగవాన్, చాలా బాగా రాశావమ్మ అన్నారట. ఆమె తనని, భగవాన్ దగ్గరకి పంపిన అన్నగారి పట్ల కృతజ్ఞతతో, భగవాన్ చెప్పిన మాటలన్నింటిని ఉత్తరంలో రాశారు. అవే భవిష్యత్తులో రమణలేఖలుగా మారాయి. ఆమె Daughter of Bhagawan గా జీవించారు. భగవాన్ ఆమెను అలా ప్రేమించారు. భగవాన్ ఆఖరి రోజులలో క్యాన్సరు వ్యాధి పీడించేసింది. కానీ నాగమ్మ గారికి, భగవాన్ కొద్దిరోజులు ఉంటే బాగుండును అనిపించింది. నాగమ్మగారు భగవాన్ ని చూడటానికి క్యూలో వెళ్ళి, భగవాన్ ని చూడగానే, ఇంత బాధతో ఈ దేహం ఎందుకు ఉండాలి, వెళ్ళిపోతేనే మంచిదనిపించింది. మరణించే వాడు గురువు కాదనిపించింది. ఆమె అలా మనస్సులో అనుకోగానే, భగవాన్ కళ్ళు తెరిచి చిన్న చిరునవ్వు నవ్వారు. అంటే ఇప్పుడు నువ్వు తత్వాన్ని తెలుసుకుంటున్నావని భగవాన్ ఆశీర్వదించినట్టు

అనిపించింది. ఆవిడ భగవాన్ వద్దకు వచ్చిన మొదటి క్షణంలోనే,ఆమెలో అప్పటి వరకు గూడుకట్టుకొని ఉన్న అశాంతిని, దుఃఖాన్ని పీల్చేసుకుని, మౌనంగా, శాంతిని, ఆనందాన్ని నింపారు భగవాన్.

సంపూర్ణమ్మాళ్, ఒకరోజు వంట చేస్తుంటే భగవాన్ వంటింట్లోకి వచ్చి, ఉడుకుతున్న కూరగాయ ముక్కల గిన్నెపై మూత వేసి, మూతవేస్తే దాని సువాసన బయటకు పోదు, అలా మన మనస్సు బయటకు వెళ్ళకుండా వైరాగ్యమనే మూత వేస్తే, అది అణిగిపోయి, హృదయంలో ఉన్న ఆత్మలో కరిగిపోతుందన్నారు.

రమణులు శరీరం విడిచి పెట్టేసేటప్పుడు, కృష్ణ భిక్షువు, మేము హృదయంలో ఉన్న బ్రహ్మమును తెలుసుకునే వరకు, మీరు అన్నిసార్లు శరీరం ధరించి రావాల్సిందే అంటారు. మోక్షకాంక్ష మనలో ఉండి, అది బలీయనమైనప్పుడు ఆకాంక్ష పక్వానికి వచ్చినప్పుడు, లోపలున్న ఆంతర్యామే దేహాన్ని ధరించి వస్తాడు.

భగవాన్ రెండు రోజుల్లో శరీరం విడుస్తారనగా, సన్నిహితంగా ఉండే భక్తులందరూ, ఆఖరి సందేశం చెప్పమని అడిగారు. ఇప్పటివరకు ఏదైతే విన్నారో, ఏదైతే నా సమక్షంలో అనుభవించారో, ఇకముందు అదిగా ఉండటానికి ప్రయత్నించండి అన్నారు.

# శ్రీ రామకృష్ణుల దివ్య ప్రేమ

It is glorious to help even one-man అన్నారు రామకృష్ణులు. రామకృష్ణులు అంటారు, I have never enjoyed the world even in a dream. ఈ భూమి మీద ఒక్క జీవుడికి సహాయం చెయ్యటం కోసం, 20000 జన్మలు కుక్కగా జన్మించటానికైనా సిద్ధంగా ఉన్నాను అని వివేకానందుడు అన్నాడు.

పూర్వము హిమాలయాల్లో హంసలు ఉండేవి. అవి పాలు - నీళ్ళు కలిపిపెడితే పాలను త్రాగి, నీళ్ళను వదిలేసేవి. అలాగే రామకృష్ణుడు ప్రపంచంలో మంచిని తీసుకుని, చెడుని విడిచిపెడతారు అందుకే పరమహంస అయ్యారు.

కొంతమంది వారి పొట్ట కోసమే భిక్ష చేస్తారు. కొందరు తమ తోటివారి కోసం కూడా భిక్ష చేస్తారు. రామకృష్ణులు, నరేంద్రుడితో నరేన్! నా దేహ మరణానంతరము నీ తోటి సన్యాస-భక్తుల కోసం అవసరమైతే, భిక్ష చెయ్యటానికి కూడా సందేహ పడవద్దు. నావద్ద ఉన్న సంపదనంతా మీకిచ్చి కడు-పేదవాడు దేహాన్ని ఎలా విడిచిపెడతాడో, అలా విడిచి పెడుతున్నాను ఈ దేహాన్ని నరేన్, అన్నారు రామకృష్ణులు.

రామకృష్ణులు అంటారు, చెట్టుమీద పక్షులన్నీ, డప్పు కొడితే ఎగిరిపోతాయి. అలా మన తలకాయలో బుసలు కొడుతున్న వాసనలన్ని భగవంతుడు స్మరణలో, గురువు స్మరణలో ఎగిరిపోతాయి. కంసాలి బంగారాన్ని శుద్ధి చెయ్యటానికి కొలిమిలో వేస్తాడు. మనస్సుని శుద్ధి చేసుకోవాలంటే, దాన్ని భక్తిలో వేస్తే అది శుద్ధి అవుతుంది. సహనం పెరిగే కొద్దీ ఆలోచన లోతులు పెరుగుతాయి. ఆలోచన లోతులు పెరిగితే, వికారాల్లో నుండి బయటికి వస్తాము. బంగారాన్ని, వస్తువు రూపంలోకి తీసుకురావటానికి దాన్ని కరిగించి ఎన్నో సుత్తి-దెబ్బలు కొడతాడు. వాటినన్నిటిని తట్టుకుంటే వస్తువుకి సౌందర్యం వస్తుంది. అలాగే సాధకుడు ప్రపంచం కొట్టే దెబ్బలని సహనంతో భరిస్తే, వాడికి ఆత్మజ్ఞానం కలుగుతుంది.

రామకృష్ణుడి బోధ ఎలా ఉంటుందంటే, మందు చేదుగా ఉన్నా, పైన తీపి పెడితే అది మింగటము తేలిక, అలాగే ఆయన గమ్యం అద్వైతమయినా, పైకి చెప్పేదంతా ద్వైతం. లోపల జ్ఞానం, బయటకి శరణాగతి.

జీవితంలో మనము శాంతిగా ఉండాలంటే, మరణానంతరం శాంతి వైపు మన ప్రయాణం కొనసాగాలంటే : 1. కర్మ అనుష్ఠానం 2. భక్తి ఇవి రెండు జీవితం పొడుగునా విడిచిపెట్టకూడదు. మీరు సుఖంగా ఉండాలంటే, భూమ్మీద ఇతరులలో ఉన్న దోషాలను చూడటం మానెయ్యండి అంటారు శారదామాత.

బృందావనంలో ధూళి, పూరి జగన్నాథుడి అన్నప్రసాదం, కాశీలో గంగ భారతదేశంలో అత్యంతపవిత్రమైనవి అంటారు రామకృష్ణుడు.

భౌతికమైన వైభవాలు, అంతస్థులు అన్ని జ్ఞానికి చిన్నవిగా కనిపిస్తాయి. అజ్ఞానికి అవి గొప్పగా కనిపిస్తాయి. రామకృష్ణుడు ఏమన్నారంటే, ఐదంతస్థుల మేడపై నుండి చూస్తే రోడ్డుమీద ఉన్నవారు చిన్నగా ఎలా కనిపిస్తారో! మహాచైతన్యం అనుభవంలోకి వస్తే జ్ఞానికి లోకమంతా అలా కనిపిస్తుందన్నారు.

రామకృష్ణుల వద్దకి మధురబాబు వచ్చేవారు. ఆయన అంటారు, ప్రపంచంలో ఉన్న సంపదనంతా తెచ్చి రామకృష్ణుల ముందు పోసినా, ఆయన వైరాగ్యం కదలదు. ఆయన ఈ మట్టికి సంబంధించినవారు కాదుఅని. రామకృష్ణులు అంటారు, నీలో ఉన్న బలహీనతలన్నీ నాకు తెలుసు.నీ బలహీనతలతో కలిపే నిన్ను ప్రేమిస్తున్నాను. నా ప్రేమలో నీ బలహీనతలు కరిగిపోవాలి మధుర బాబు అని. గురువు మనల్ని అమాయకంగా ప్రేమించడం కాదు నీలో ఉన్న బలహీనతలని తెలిసి ప్రేమిస్తాడు. సమాజం మన బలహీనతలను ఎత్తి చూపిస్తుంది. గురువు అపారమైన ప్రేమని కురిపించి మన బలహీనతలను కడిగి మనల్ని పవిత్రము చెయ్యాలని చూస్తూ ఉంటారు.

రామకృష్ణుడికి వివాహమైన తరువాత, కొద్ది రోజులు భార్య శారదా మాతని పుట్టింటిలోనే ఉంచేసారు. ఒకరోజు శారదామాత, తన తండ్రితో కలిసి రామకృష్ణుడు వద్దకు వస్తారు. శారద మాతని  చూడగానే, రామకృష్ణుడు నన్ను చెడగొట్టడానికి వచ్చావా అంటారు. అప్పుడు శారదామాతలేదు,మీకు సహకరించడానికి వచ్చాను అన్నారు. ఆమె జీవితంలో ఒక్క తొందరపాటు మాట కూడా లేదు.

సబ్జెక్టు, ఆలోచన ఇవి రెండు ఎన్నడూ విడిచిపెట్టకూడదు. ఒకసారి వివేకానందుడంతటి వాడే, కాశీలో మహిమల్లోకి వెళ్ళాడు. కాశీలో అప్పుడే రామకృష్ణుడు స్వప్న దర్శనమిచ్చి, ఇంతకాలం నేను చేసిన బోధ నువ్వు ఇలా

తయారవ్వడానికా? అని అడుగుతాడు. మహిమలు అశుద్ధంతో సమానమని, అవి పట్టుకుని దారి తప్పిపోతున్న నరేంద్రుడిని దారిలో పెడతాడు. మహిమలు చేసేవాడు మనస్సు ఉండి చేస్తాడు. మనసున్నవాడు జ్ఞాని కాలేడు. మనో పరిధిలో నుండి బయటకి రాకుండా జ్ఞానం కలుగదు.

జాలరి వల వేసినప్పుడు తెలివైన చేపలు జాలరి పాదాల వద్దకు వచ్చి, ఎలా వలలో పడకుండా తప్పించుకుంటాయో!భగవంతుడికి శరణాగతి చెందిన జీవుడు సృష్టిలో ఉన్న ఆకర్షణలు అనే వలలో పడకుండా అలా తప్పించుకుంటాడు. శరణాగతి చెందిన జీవుడి యోగక్షేమాలు స్వయంగా భగవంతుడే చూసుకుంటాడు.

మనోదేహములు యుక్తుడు చేతిలోను ఉంటాయి. అయుక్తుడు చేతిలోను ఉంటాయి. ఒకసారి రామకృష్ణులు భక్తుల ఇంటికి వెళ్ళారు. అక్కడ భక్తులు రామకృష్ణులకి, వారి తోటలో పండిన మామిడి పండ్లు కోసి పెట్టారు. రామకృష్ణుడు వాటిని తిని, చాలా తియ్యగా బాగున్నాయి అన్నారు. వారు రామకృష్ణుడు తిరిగి ఇంటికి వెళుతుంటే, ఒక బుట్టలో కొన్ని పళ్ళు మూట కట్టి రామకృష్ణులకి ఇచ్చారు. రామకృష్ణుడు వాటిని తీసుకుని నెమ్మదిగా నడుచుకుంటూ ఇంటికి వెళుతున్నారు. సడన్‌గా మూట బరువు పెరిగిపోతోంది. అడుగు వెయ్యలేకపోతున్నారు రామకృష్ణులు. ఎందుకు ఇలా బరువు పెరిగిపోతోందని, అక్కడే ఆగి అమ్మని ప్రార్థించారు. అమ్మా! ఇంత చిన్న మూట చాలా బరువు పెరిగిపొతుంది, అమ్మా!నేను చేసిన తప్పేమిటి? అని, తను ఆరాధించే జగజ్జననిని ప్రార్థించారు. అప్పుడు అమ్మ, వారు పెట్టారని నువ్వు తిని, బావున్నాయి అన్నావు, అంతవరకు బాగానే ఉంది. వాటిని ఇంటికి తీసుకువెళదాము అనే బుద్ధిని పోగు చేసుకుంటున్నావు దీనికి అంతు ఉండదు అన్నారు అమ్మ. వెంటనే రామకృష్ణులకి తన పొరపాటు అర్థమయ్యింది. అలా యుక్తుడు తన మనోదేహాలను అదుపులో పెట్టుకుంటాడు. వెంటనే రామకృష్ణుడు, రోడ్డు ప్రక్కన చిన్న గొయ్యి తీసి ఆ పళ్ళు అక్కడే పడేసారు. యుక్తుడు చేసిన పొరపాటు గ్రహించి, మళ్ళీ దానిని రిపీట్ అవ్వకుండా చూసుకుంటాడు. అయుక్తుడు చేసిన పొరపాట్లు చేస్తూనే ఉంటాడు.

రామకృష్ణుడు దగ్గర బ్రహ్మానంద ఉండేవారు.ఆయన్ని కలవడానికి ఎవరైనా వస్తే, కొంతమందితో నాకు జ్వరం వచ్చిందని చెప్పండి అని లోపలికి వచ్చేసేవారు.

అలాంటప్పుడు నిజంగానే జ్వరం వచ్చేది. అంటే లౌకికుల విషయంలో తస్మాత్ జాగ్రత్త.

రామకృష్ణుడు, బ్రహ్మానందని నా మానసపుత్రుడు అన్నారు. వాడు mating వలన ఈ భూమ్మీదకి రాలేదు. నేను మనస్సులో సంకల్పించుకోవటం వల్ల ఈ భూమి మీదకు వచ్చాడు అన్నారు. ఆయనే ఫస్ట్ ప్రెసిడెంట్ ఆఫ్ రామకృష్ణమఠం రామకృష్ణుడికి జిలేబి అంటే ఇష్టం. ఎప్పుడైనా జిలేబి అడిగినప్పుడు అది దొరకకపోతే ఆయన మైండ్ డిస్టర్బ్ అయ్యేది కాదు. అంటే వాసన పడలేదు.

మహేంద్రనాథ్ గుప్తా ఒకసారి రామకృష్ణుడు పుట్టిన ఊరు కామార్పకూర్ వెళ్ళి వచ్చాడు. ఓ రామకృష్ణ దేవా! మీరు పుట్టిన ఊరు నుండి పరమపవిత్రమైన మట్టిని తెచ్చానని పొట్లం విప్పి చూపించాడు. అప్పుడు రామకృష్ణుడు ఓ మహేంద్రనాథ్, నువ్వు పవిత్రుడు కాబట్టి అక్కడ పవిత్రతను గుర్తించావు అన్నారు.

మహేంద్రనాథ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా పనిచేసేవారు. అలిసిపోయి ఇంటికి వెళితే, ఇంటిలో అత్త - కోడళ్ళ తగువులు, తోటి కోడళ్ళ గొడవలు, పిల్లల అల్లరి  వీటన్నింటితో అలిసిపోయి మనల్ని సేదతీర్చే మాటలు ఏమీ కనిపించడం లేదు, మరణిస్తే బావుంటుంది అనే బాధలో రామకృష్ణుడిని దర్శించాడు. రామకృష్ణుడిని దర్శించిన తరువాత, ఆ చూపు, పలకరింపు అతని దుఃఖాన్ని ఆర్పేసింది. మన జీవితానికి ఇది చాలు అని ఆయన మనస్సు రామకృష్ణుడు వైపు తిరిగింది. రామకృష్ణుడిలో ఉన్న ప్రేమ, ఆప్యాయత ఆ మాటల్లో ఉన్న అమృతత్వాన్ని పీల్చుకునే స్థితికి, ఆయనకున్న సఫరింగే  పునాదయ్యింది.

రామకృష్ణుడికి, శారదామాతతో జన్మాంతర అనుబంధం ఉంది. రామకృష్ణుడు, వివేకానందుడు కంటే, శారద మాతకే ఎక్కువ పేరు వచ్చింది. దానికి కారణం శారదామాత Most balanced.

రామకృష్ణులు వద్దకి, గిరీష్ అనే ఒక భక్తుడు వచ్చేవాడు. వాడు నరేంద్రుడు గురించి బయట చెడ్డగా ప్రచారం చేస్తున్నాడు. ఒకరోజు రామకృష్ణుడితో కూడా, నరేంద్రుడు గురించి చెడ్డగా చెప్పటం మొదలుపెట్టాడు. రామకృష్ణుడు, గిరీష్ తో.. నరేంద్రుడిలో ఉన్న మంచితనం నీకు అర్థం కావటం లేదు. ఆ మంచితనాన్ని

చెడ్డగా చూపిస్తూ, ప్రచారం చేస్తున్నావు. నీది negative Mind. నీకు proper understanding లేదు. నరేంద్రుడు సముద్రుడు. సముద్రంలో ఎన్ని కలిసినా సముద్రానికేమీ పట్టదు. నువ్వు చిన్న చెరువువి. నరేంద్రుడికి, ఉన్న జ్ఞానము ముందు నీవు ఒక గడ్డిపరకవి. నీకున్న జ్ఞానంలో కాళ్ళు కూడా తడవవు. వాడిలో ఉన్న వైభవాన్ని చూడటం మానేసి, ఈ తింగర ప్రచారాలేమిటి? నీలో ఉన్న అసూయ, వాడిలో ఉన్న వైభవాన్ని చూడకుండా అడ్డుపడుతోంది, అందులోంచి బయటపడు. నీ అసూయ వాడిని ఏమీ చెయ్యలేదు కానీ, నిన్ను మాత్రం దహించి వేస్తుందంటారు రామకృష్ణులు.

వివేకానందుడితో, ఆయన తల్లి నువ్వు ఉద్యోగం చేసి, కుటుంబ బాధ్యత మొయ్యాలని చెబుతుంది. ఒకరోజు రామకృష్ణుడు వద్ద కూర్చుని నరేన్ భగవంతుడి పాట పాడుతాడు. కానీ ఆయన లోపల, ఉద్యోగం చెయ్యాలి, కుటుంబాన్ని పోషించాలనే తలంపు ఉంటుంది. రామకృష్ణుడు లేచి బయటకు వెళ్ళిపోతాడు. వివేకానందుడు, అలా లేచి వెళ్ళిపోయారేంటి స్వామి అని అడుగుతారు. నువ్వు భగవంతుడి పాటలే పాడుతున్నావు, కానీ నీ మనసు ఉద్యోగం చెయ్యాలనే తలంపు మీద ఉంది. నోటితో చేసేది దేవుడి జపం, మనసేమో బయట గొడవలు మీద ఉంది అది నేను భరించలేకపోయాను అన్నారు. అంటే గురువు మనము ఎలా ఉన్నామో మనకి చూపిస్తూ ఉంటాడు.నీ నోటికి, నీ మనస్సుకి ఉన్న దూరాన్ని భరించలేక లేచి వెళ్ళిపోయాను, నరేన్ అంటాడు.

రామకృష్ణ మఠం పెట్టినప్పుడు, వివేకానందుడితో మిగతా శిష్యులు విభేదించారు. మనము సన్యాసులం, జపధ్యానాదులు చేసుకోవాలి అన్నారు. వివేకానంద వారితో, మీరు 24 గంటలు జపధ్యానాదులు చేస్తే మఠం స్థాపించటము మానేద్దాము. స్వార్థం లేకుండా పని చేస్తే! జపధ్యానాల వల్ల ఏ ఫలితం వస్తుందో, ఈ సేవ వల్ల కూడా అదే ఫలితం వస్తుంది. పదిమందికి భౌతికంగ ఉపయోగపడుతుంది. ఆధ్యాత్మికంగా మనకి సహకరిస్తుంది. ఒకే సమయంలో లోకానికి మన గుంపు సహకరిస్తుంది, లోకానికి ఉపయోగపడుతుంది, మన జ్ఞాన సమపార్జనకి సహకరిస్తుందని చెప్పి మఠం పెట్టారు.

మనము జీవితంలో ఎవరిని అనుకరించకూడదు. ఆత్మవిశ్వాసం లేనివారు, సొంతబుద్ధి లేని వారే ఇతరులని అనుకరిస్తారు. మనమీద మనకి ఆత్మవిశ్వాసం ఉండాలి. this soil of India is my highest heaven అనేవారు వివేకానందులు. అయన మరో రెండు నెలల్లో దేహం విడిచి పెడతారనగా, France నుండి భారతదేశం వచ్చేసారు. వచ్చేముందు నేను భారతదేశం వెళ్ళిపోతున్నాను, France రాను, నేను చనిపోవడానికి వెళ్ళిపోతున్నాను అన్నారు. భారతదేశం వచ్చిన తరువాత కాశీ వెళ్ళి 4,5 రోజులు ఉండిపోయారు. స్వామీజి అక్కడ ఉండగా ఒక భక్తుడు వచ్చి, స్వామి మిమ్మల్ని కొందరు మంచి వారంటున్నారు, కొందరు చెడ్డవారంటున్నారు అని చెప్పాడు. అప్పుడు స్వామీజీ, ఆ వచ్చిన భక్తునితో ఎందుకయ్యా! ఈ బుడబుక్కల మాటలు, బ్రహ్మదేవుడు నా ముఖంలో ఒక రాత రాశాడు, నువ్వు చదవగలిగితే దాన్ని చదువు. ఆ రాత అయిపోయిన తరువాత నా జీవితం ముగిసిపోతుంది. దాన్ని చదివే శక్తి ఉంటే చదువు అన్నారు స్వామీజీ. మనలో పవిత్రత లేకుండా, ఇతరులలో ఉన్న పవిత్రతను ఎలా చూడగలము. వివేకానందులు గొప్పవారు, నాన్నగారు గొప్పవారు, భగవాన్ గొప్పవారని అనుకోవటం కాదు. మనము ఎంతవరకు బాగుపడుతున్నామో చూసుకోవాలి.

Arise, awake, and stop not till the goal is reached. ఇది వివేకానందుడికి ఇష్టమైన వాక్యం. మేలుకో! పని చెయ్యి, జ్ఞానం పొందేవరకు ప్రయత్నం విడిచిపెట్టకు. ఒకరోజు వివేకానందుడు గంగానదిలో స్నానం చేసి, మఠానికి నడిచి వెళుతున్నారు. ఆయన వెనుక 30 కోతులు పడ్డాయి. వివేకానందుడు అవి కరుస్తాయని భయపడి, పరుగుపెట్టారు. కానీ,అవి మరింత వేగంగా స్వామీజీ వెనకాలపడ్డాయి. ఒక సాధువు ఎదురు వచ్చి, వివేకానందుడుని చెయ్యిపట్టి ఆపి, ఆ కోతులు వస్తున్నాయని ఎంతసేపు పరుగు పెడతావు, తిరిగి వాటి వైపు నిర్భయంగా చూడు అన్నారు. అప్పుడు వివేకానందుడు, పరుగు ఆపి వెనక్కి తిరిగి వాటివైపు నిర్భయంగా చూశారు. అలా చూసిన వెంటనే, అవి నెమ్మదిగా ఆగిపోయి, వచ్చిన దారినే వెళ్ళిపోయాయి. మన జీవితంలో కూడా వ్యక్తులకి, పరిస్థితులకి భయపడే కొలది అవి మనల్ని భయపెడతాయి. మనము వాటిని ధైర్యంగా ఫేస్ చెయ్యాలి. పారిపోకూడదు.

If we face the problems completely and they would end, then and there itself.

Face it and end it.

ఉత్సాహం సాహసం ధైర్యం బుద్ధి: శక్తిః, పరాక్రమః
షడేతే యత్ర తిష్ఠంతి తత్ర దేవోపి తిష్ఠతి

ఉత్సాహం, సాహసం, ధైర్యం, సద్బుద్ధి, శక్తి, పరాక్రమం ఈ ఆరు గుణాలు ఉన్న చోట భగవంతుడు కాపురముంటాడు. ఈ శ్లోకం వివేకానందుడికి నచ్చిన శ్లోకం. దీన్నే ఆయన ఆచరించి తరించారు. అజ్ఞానమనే నిద్రనుండి, అవిద్య అనే నిద్రనుండి సంసారమనే నిద్రనుండి లెమ్ము.

వివేకానందులు రెండు రోజులలో దేహం విడిచిపెడ్తారనగా, బయట గార్డెన్ లో తోటి భక్తులతో వాకింగ్ చేస్తున్నారు. ఈ వివేకానందుడు భూమ్మీద ఏమి చేశాడన్నది తెలియాలంటే మరలా ఇంకో వివేకానందుడు రావాల్సిందే. నేను ఈ దేహాన్ని విడిచి పెడుతున్నాను, ఎలా విడిచి పెడుతున్నానంటే, మనము రోడ్డు పక్కన ఉమ్మి వేస్తాము. వేసిన ఉమ్మిని, అది ఏమయిందని తిరిగి దాని వైపు చూడము,అలా ఈ శరీరాన్ని విడిచి పెడుతున్నాను అన్నారు. అది జ్ఞాని స్థితి.

వివేకానందుడిని, ఒకరు మీకు ఎప్పుడూ దుఃఖం రాదా అని అడిగారు. దానికి వివేకానందుడు, నాకు వచ్చే దుఃఖము దున్నపోతు మీద వర్షంలా ఉంటుంది అన్నారు. అంటే, దున్నపోతు మీద వర్షం కురిసినా, ఎండ వచ్చినా దానికేమీ అనిపించదు. అలాగే నాకు వచ్చే దుఃఖం నన్ను ఇబ్బంది పెట్టడం లేదన్నారు.

వివేకానందుడు ఆఖరి రోజుల్లో, శారదామాతను ప్రార్థిస్తూ "O mother break my chains and make me free" అని అడుగుతారు. ఈ కీర్తి, గౌరవాలు, గొప్పలనే లోకానికి సంబంధించిన సంకెళ్ళతో కట్టుబడి ఉన్నాను. ఈ సంకెళ్ళని తెంపు, వీటన్నింటినీ గంగానదిలో పడేయ్యాలి. అమ్మా! నాకు ఆత్మజ్ఞానాన్ని, బ్రహ్మజ్ఞానాన్ని అనుగ్రహించు అంటారు.

భ్రాంతిలోంచి బయటికి రావటము చాలా కష్టం. వివేకానందుడు తండ్రి జీవించి ఉండగా, ఇంటికి వచ్చే బంధువుల్ని చూసి, మనకి చాలా మంది ఆప్తులు ఉన్నారనుకునేవారు. తండ్రి చనిపోయిన తరువాత అందరూ రావటం మానేశారు. ఎప్పుడైనా ఎవరైనా ఎదురైతే, వీరి కష్టాలు చెప్పి సహాయం అడుగుతారేమో అని, చూసినా చూడనట్లు తప్పుకొని వెళ్ళిపోయేవారు. అటువంటి పరిస్థితులే మనల్ని భ్రాంతిలో నుండి బయటకి తీసుకువచ్చేస్తాయి.

వివేకానందుడు ఏమంటాడంటే, శంకరులమేధస్సు, గౌతమ బుద్ధుని హృదయం సంపాదించుకోవాలి. అప్పుడు జ్ఞాన వైభవం తెలుస్తుంది. మనము జ్ఞానాన్ని లక్ష్యంగా పెట్టుకుని జీవించాలి.

కొంతమందికి వినయం నేర్చుకుంటే వచ్చినది కాదు. వారికి జన్మతః వచ్చేస్తుంది. రామకృష్ణులు శరీరత్యాగం చేసిన తరువాత, శారదామాత పుట్టింటికి (జయరాంబాటి) వెళ్ళిపోయారు. రామకృష్ణ మఠం పునాది పడిన తరువాత శారదానంద వెళ్ళి, అమ్మా! మీరు మా వద్దకి వచ్చేయండి అని అడిగారు. శారదామాత అందుకు అంగీకరించి, ప్రయాణానికి సిద్ధమయ్యి బండి వద్దకు వచ్చిన తరువాత, ఆ గ్రామానికి నమస్కరిస్తూ, గ్రామదేవతని స్మరించి, అమ్మా! నువ్వు నాకు శరీరాన్ని ఇచ్చావు, బహుశా ఈ శరీరంలో ఉండగా మళ్ళీ నిన్ను చూడలేనని ఆ మట్టికి నమస్కరించి బండి ఎక్కారు. అది వినయం.

ఒక రోజు నాన్నగారు రాజమండ్రి రామకృష్ణ మఠానికి వెళ్ళటానికి బయలుదేరారు. అదే సమయంలో నాన్న గారిని దర్శనం చేసుకోవాలని ఒక డాక్టర్ గారు వచ్చారు. నాన్నగారు - డాక్టర్ గారితో మేము రామకృష్ణ మఠానికి వెళ్తున్నాము మీరు కూడా రండి అని ఆయనను కూడా తీసుకువెళ్ళారు. డాక్టర్ గారికి రామకృష్ణ మఠంతో పెద్ద టచ్ లేదు. నాన్నగారు రమ్మన్నారని వెళ్ళారు. నాన్నగారు అక్కడ రామకృష్ణుల జీవిత మకరందం కొని, డాక్టర్ గారికి ఇచ్చారు. డాక్టర్ గారు నేను పెద్దగా చదవనండి అన్నారు. అప్పుడు నాన్నగారు, చదవకపోయినా టేబుల్ మీద పెట్టుకోండి అని చెప్పి ఇచ్చారు. నాన్నగారు ఇచ్చారు కదా అని ఆయన తీసుకొని

వెళ్ళి టేబుల్ మీద పెట్టారు. రెండు నెలల తర్వాత టేబుల్ మీద ఉన్న పుస్తకాన్ని చేతిలోకి తీసుకుని ఓపెన్ చేసి చదవడం మొదలుపెట్టారు. ఆ పుస్తకాన్ని ఒంపుగా చేసుకొని రామకృష్ణుడు ఆయన హృదయం లోకి ప్రవేశించి, వర్క్ చెయ్యటం మొదలు పెట్టాడు. అందులో ఒక వాక్యం ఆయన హృదయాన్ని అరెస్టు చేసింది. ఆ వాక్యం ఏమిటంటే, It is glorious even to help one man అప్పటి వరకు తన స్వార్ధానికి, తన కుటుంబానికే పరిమితమైన జీవితం ఇటు తిరిగింది. చదువుకునే శక్తి ఉండి అవకాశాలు లేని వారిని దగ్గర చేసుకొని వారికి సేవ చెయ్యటం మొదలుపెట్టారు డాక్టర్ గారు. work done in true spirit is also meditation. జపద్యానాలు చేసి ఏస్థితిని పొందుతామో! పని ద్వారా కూడా ఆ స్థితిని పొందుతాము. ఆ పని వలన ఇతరులకు కూడా ఎంతో కొంత up liftment ఇవ్వగలమని డాక్టర్ గారు ఆయన జీవితాన్ని రామకృష్ణుడికి అంకితం చేసి జీవించటం మొదలుపెట్టారు. నాన్నగారు ఎక్కడికి వెళ్ళినా, సంచుల నిండా పుస్తకాలు కొనేవారు. వాటిని భక్తులకి పంచేవారు. వాటిలో ఒక్క వాక్యం మన హృదయాన్ని పట్టినా మనపని పూర్తయిపోతుందని.

# మైత్రి కరుణ ముదిత బుద్ధుడు

బుద్ధుడిని The light of Asia అంటారు. జీవితంలో ఉత్కృష్టమైన శాంతిని, ఓర్పుని కలిగి ఉండుటయే, బుద్ధుడికి మనము సమర్పించే వస్త్రాలు. సర్వ ప్రాణుల యెడల ప్రేమ కలిగి, మనకు కలిగినది భగవంతుడు మనకు ఇచ్చినదాన్ని తోటివారికి ఎంతోకొంత పంచుతూ  ఉంటే, అదే బుద్ధుడు యొక్క ఆవాసము. ఆయన చెప్పిన బోధని అవగాహన చేసుకొని అర్థం చేసుకుని అలా మన జీవితాన్ని మార్చుకునే ప్రయత్నం చేయడమే బుద్ధుడి యొక్క సమక్షం, ఆయన ఉపదేశం ఒకవేదిక. తథాగతుడి సాంగత్యాన్ని ఇవి మూడింటిని ఆచరించేవాడు ఎక్కడున్నా పొందుతాడు.

బుద్ధుడు తల్లి అయిన మాయాదేవి ఈశ్వరుడిని దర్శించి, దానధర్మాలను చేసి సంతర్పణ చేసి వచ్చిన రాత్రి నిద్రలో తెల్లవారుజామున కల వస్తుంది. ఆ కలలో ఆమెని దేవతలు హిమాలయాలకు తీసుకువెళ్ళి, అక్కడ సరోవరంలో స్నానం చేయించి, ఆమెను అలంకరించి స్వర్ణ మందిరంలో నిద్రింపచేస్తారు. అక్కడికి ఒక ఐరావతం తెల్లని కాంతులతో ఒక తామర పువ్వును తీసుకుని వచ్చి, సూక్ష్మ రూపాన్ని దాల్చి ఆవిడ గర్భాన్ని చేర్తుంది. ఈ కల రాకముందే ఒక భిక్షువు, కలలో కనిపించి నేను చివరిసారిగా నీగర్భాన జన్మించదలిచాను అంగీకరిస్తావా అంటే, ఆమె ఆనందంతో అంగీకరిస్తుంది. వీటి గురించి శుద్ధోదన మహారాజుకి చెబితే ఆయన పండితులను పిలుస్తారు. వచ్చిన పండితులు నీకు పుత్రుడు పుడతాడు.అతడు మహాయోగి అవుతాడు అని చెబుతారు. తరువాత సిద్ధార్థుడు జన్మించాడని తెలిసి అసితమహర్షి వారిని చూడటానికి వచ్చి కన్నీరు పెట్టుకుని, శుద్ధోదన మహారాజుతో, మీకు పుట్టిన పుత్రుడు, ఈ లోకానికి వెలుగును నింపి, ధర్మోపదేశముచేసే సమయానికి నాకు శరీరం ఉండదు, ఆ వైభవం నేను చూడలేను, నాకు ఆ భాగ్యం లేదని కన్నీరు పెట్టాడు. మహాత్ములతో సమకాలికులుగా పుట్టటం భాగ్యం.

సిద్ధార్థుడు అంటే, తను ఏ పని నిమిత్తం ఈ భూమి మీదకు వచ్చాడో ఆ పని నెరవేర్చుకున్న వాడే సిద్ధార్థుడని అర్థం.

సర్వోత్కృ ష్టమైన శాంతము, ఓర్పు తథాగతుని వస్త్రములు. సర్వ ప్రాణుల యందు ప్రేమ-దానము తథాగతుని ఆవాసములు. బోధించిన ధర్మ సూత్రములు, పూర్తిగా అవగాహన చేసుకునటయే తదాగతుని ఉపదేశ వేదిక.

జన్మస్థానమైన లుంబినీవనము, జ్ఞానోదయము పొందిన బుద్ధగయ, మొదట ప్రవచనం మొదలుపెట్టిన సారనాథ్, దేహాన్ని విడిచిపెట్టిన కుషినగర్ ఈ నాలుగు క్షేత్రములు సాధకులకు లోపల పశ్చాత్తాపాన్ని తీసుకువచ్చి, మారుమనస్సుని తీసుకువచ్చి నిర్వాణస్థితినే పరమ-గమ్యంగా పెట్టుకుని జీవించే సంకల్పం, తపన వాటి యొక్క దర్శనము ద్వారా ప్రేరణ కలుగుతుందని బుద్ధుడే స్వయంగా తన భిక్షువులతో చెప్పారు.

దుఃఖ నివృత్తి మార్గాన్ని అన్వేషించాలని గృహ పరిత్యాగం చేసి, ఆరు సంవత్సరాలు కఠోర దీక్షతో పొందవలసిన వస్తువుని పొంది, మధ్యేమార్గం శ్రేయస్కరమని బుద్ధుడు, జీవకోటికి బోధించడానికి మొట్టమొదట మొదలుపెట్టిన స్థానం సారనాథ్. గురు-పౌర్ణమి రోజు ఐదుగురు శిష్యులతో మొదలుపెట్టారు, అదే సారనాథ్.

బుద్ధుడు అంటారు, నన్ను గురువని, మహాత్ముడని అనుకుంటున్నారు, కానీ కాదు, Iam your boat manఅని అజ్ఞానంలో నుండి జ్ఞానంలోకి, అధర్మంలోనుండి ధర్మంలోకి, అశాంతిలో నుండి శాంతిలోకి, అసత్యంలోనుండి సత్యంలోకి తీసుకువెళ్ళటానికి వచ్చిన వాడిని. మీకు నేను చీకటిని కాదు, వెలుగుని చూపించటానికి వచ్చాను. దారిద్ర్యాన్ని కాదు సంపదని పంచిపెట్టటానికి వచ్చాను అన్నారు. ఆయన ఎన్నడూ మీరు మంచివారు, మీరు చెడ్డవారు అని judgements ఇవ్వలేదు. మనల్ని హృదయంలో ఉన్న వెలుగులోనికి మేల్కొలపడానికి చూశారు.

బుద్ధుడు అంటారు, ఎద్దు వెనకాలే బండి చక్రం వచ్చేస్తుంది. అలాగే మనకి wrong speech, wrong thinking, wrong work లోనుండి పీడ (చెడ్డ కర్మ) వచ్చేస్తోంది, దాన్ని అనుభవించవలసిందే. ఒక దేహంలో ఉండగా చేసింది, ఇంకో దేహంలో ఉండగా అనుభవించవలసిందే. వెయ్యిమంది ఆవుల గుంపులో ఒక దూడని విడిచిపెడితే! అది తన తల్లి ఆవుని వెతుక్కుంటూ ఎలా వెళ్ళిపోతుందో! ఈ కోట్లాది జీవకోటిలో మనము చేసిన కర్మ ఫలితం మనల్ని వెతుక్కుంటూ వచ్చి మీద పడిపోతుంది. అందుకే ఆచార్యులవారు కర్మలు చేసి పీడని తెచ్చుకునే బదులు చేసే ముందు జాగ్రత్తపడండని బోధించేవారు. Prevention is better than Cure అని రోగం వచ్చిన తరువాత మందులు వాడే బదులు రోగం రాకుండా జాగ్రత్తపడమని.

బుద్ధుడు నిర్వాణ సుఖం పొందిన తరువాత, 24 గంటలు చెట్టుని రెప్పవాల్చకుండా చూస్తూ నిలబడిపోయాడు. మనము పొందినది ఇతరులతో పంచుకోవాలని, లోపల నుండి ఆయనకు స్ఫురణ కలిగింది. గురు పౌర్ణమి రోజు, ఆరుగురితో సారనాథ్ లో బౌద్ధ సంఘం మొదలుపెట్టారు. బుద్ధునితో ఒకరు, మీరు చెప్పే మాటలు ముగ్గురు శ్రద్ధగా వింటున్నారు. నాలుగవ వాడు అంత శ్రద్ధగా లేరుఏమిటని అడిగితే, పూర్వజన్మలో వాళ్ళు కొంత సాధన చేసి వచ్చారు కాబట్టి సబ్జెక్టు రుచి వారికి దొరికింది. నాలుగవ వారికి ఇంకా దొరకలేదన్నారు.

బుద్ధుడు, జీసస్ ప్రపంచానికే ఆదర్శం. వారికి ఇల్లు లేవు, ఆశ్రమాలు లేవు. ఫలానాచోట చనిపోయారు అనే గుర్తింపులు కూడా వారికి అక్కర్లేదు. మనము కాఫీ గ్లాసులో ఎండ్రిన్ చుక్కల్లా ఉన్నాం. కష్టపడి పని చేసి, గుర్తింపు కోరితే! కాఫీలో ఎండ్రిన్ చుక్క వేయడం లాంటిది. కొందరు అసలు ఏ పని లేకుండా గుర్తింపు కోరతారు. వాళ్లు ఎండ్రిన్ డబ్బాలు వంటి వారు. పొయ్యిలో నిప్పు రాజుకోవడానికి గొట్టం పెట్టి ఊదినట్లు, మన లోపల స్పిరిట్యుయల్ కాన్షియస్నెస్ చల్లారిపోకుండా ఈ ప్రవచనాల ద్వారా, మన లోపల జ్ఞానాగ్ని ఊదుతాడు గురువు.

బుద్ధుడి శిష్యుడు ఒకడుండేవాడు, వాడు భిక్ష చేసుకునేవాడు. ఆయన భిక్షకు వెళ్ళినప్పుడు, ఒక ముసలమ్మ నువ్వు మా ఇంటి వద్ద ఉండిపో అని అడిగేవారు. ఇప్పుడు కాదమ్మ! మరలా వస్తాను అనేవారు. తర్వాత ఆ ముసలమ్మ గారు, మంచం పట్టారు. అప్పుడు ఈ భిక్షువు వారి ఇంటికి వెళ్ళి, ఇప్పుడు మీ వద్ద ఉంటాను అన్నాడు. అప్పుడు, నా అవసరం మీకు లేదు కాబట్టి ఉండలేదు, ఇప్పుడు ఉంది కాబట్టి ఉంటాను అన్నారు. it is true love.

ఒక భక్తుడు వచ్చి, బుద్ధుడిని ప్రభూ! నేను ఏ సాధనలు, యజ్ఞాలు, ఏ పూజలు ఏమీ చేయలేకపోతున్నాను? నేను తరించలేనా అని అడిగారు. అప్పుడు బుద్ధుడు, "నా జ్ఞాపకాలు నీకు సరిపోతాయి. remembrance of me and my words are themselves enough to attain Nirvana.

ఒకరోజు బుద్ధుడి వద్దకి, ఒక సామాన్యుడు దారినపోయే బాటసారి వచ్చాడు. వచ్చి బుద్ధుడి వైపు ఆర్తిగా చూస్తూ, తండ్రీ! నాకు బాగుపడాలని ఉంది, నన్ను నేను

బాగు చేసుకోవాలి, నేను పరిశుద్ధుడినవ్వాలి, పవిత్రతని సంపాదించుకోవాలి. తండ్రీ! నాకు ఏదైనా ఉపదేశమివ్వండి అని అడిగాడు. బుద్ధుడు చాలా దయతో అతని వైపు చూస్తున్నాడు. ఆ వచ్చిన వాడికి, భూమ్మీద ఉండే, సమయము లేదని బుద్ధుడికి అర్థమైంది. కానీ చివరి క్షణాలు వచ్చేస్తున్నాయని అతనికి తెలియదు.అయితే, ఆఖరి సమయంలో తనని తాను భాగు చేసుకోవాలనే బుద్ధి చాల సిన్సియర్ గా కలిగింది. కానీ, మరణము ఆసన్నమయ్యే సమయం దగ్గరకు వచ్చేస్తోంది. కానీ, ఇతనని ఖాళీ చేతులతో ఎలా పంపను అనుకుంటున్నాడు బుద్ధుడు. అతని ప్రాణం శరీరం నుండి వేరుపడే క్షణం వచ్చేస్తోంది. అంతే, ఆ split second లో బుద్ధుడు వాడిని జ్ఞాన దృష్టితో, దయా దృష్టితో చూసాడు. నేను, నాది అనే భావాలని ఏ జీవుడు అంటిపెట్టుకుని మరణానంతరం ప్రయాణిస్తాడో, ఆ జీవుడిలో ఉన్న భావాల్ని దయాపూరితమైన బుద్ధుడి చూపు, తెంపిపడేసి - వాడికి నిర్వాణస్థితిని అనుగ్రహించింది. పూర్వపు జన్మల నుండి వచ్చిన కర్మలు అనేకము ఉండవచ్చు, tendencies అనేకం ఉండవచ్చు, వాడు సిన్సియర్ గా నాకు ధర్మం బోధించండి జన్మలు రాకుండా చేసుకుంటాను తండ్రి అని అడిగాడు. బుద్ధుడు వాడి వైపు చూస్తూ, వాడి సిన్సియారిటిని హృదయంలోనే మెచ్చుకుంటున్నాడు కానీ, వాడికి సమయం లేదు. ఏమి చెయ్యాలి, ప్రతీ మనిషికి రెండు ఫీలింగ్స్ ఉంటాయి. "I ness; my ness" నేను-నాది' ఆ రెండింటికి వెంటనే సర్జరీ చేసి, వాటిని తీసెయ్యాలని అనుకుంటూ, ప్రశాంతంగా వాడివైపు చూస్తూ ఆ చివరి క్షణంలో ఆ రెండు తలంపులని లాగేసాడు.వెంటనే వాడికి ఆనందము వచ్చింది. నదికి వరద వచ్చినట్లు ఆయన నిర్వాణసుఖం పొందాడు.

బుద్ధుడు వాసనా క్షయానికి చాలా ప్రాముఖ్యతను ఇచ్చాడు. అజ్ఞానమంతా నేను-నాదిలోనే ఉందన్నాడు. ప్రపంచంలో ఉన్న మాయ అంతా ఈ రెండు తలంపుల్లోనే ఉంది. ప్రతిదానికి నాది, నాది అంటాము. చనిపోయేటప్పుడు శరీరం నుండి వేరు అయిపోతున్నాము కాబట్టి మన శరీరము మనది కాదు. దేహం పోయిన తరువాత మోక్ష సుఖం పొందటం కాకుండా, దేహం ఉండగానే మనము మోక్షం పొందవచ్చు. We can liberate from the mind and attain salvation while still being in this body.

కొబ్బరికాయ చెట్టుని తయారయ్యి, సడన్ గా పడిపోతుంది. బుద్ధుడు కూడా ఆరు సంవత్సరాలు కూర్చున్నా దారి కనిపించటం లేదనుకున్నాడు. తరువాత పది రోజులలో జ్ఞానం వచ్చి, సడన్‌గా నిర్వాణం పొందాడు. భగవాన్‌కి కూడా మరణానుభవం కొద్ది క్షణాల్లోనే కలిగింది.

బుద్ధుడు ఒకరోజు బయటకు వెళుతుంటే పెద్ద వర్షం కురుస్తుంది. అందుకని ఒక ఇంటి చూరు కింద నిలబడి ఉన్నాడు. ఆ ఇంటి యజమాని భార్య, బయటకు వచ్చి ఓ వర్షమా బాగా కురువు, నా ధాన్యం సర్దేసుకున్నాను నా పని అయిపోయింది అంటుంది. అది విన్న బుద్ధుడు, అవును వర్షమా, కురువు నేను నిర్వాణ సుఖాన్ని పొందాను. శాంతి వచ్చేసింది మిగతావారు ఏమైతే నాకేంటి అంటాడు. అప్పుడు యజమాని అలా అంటున్నారు ఏమిటని అడుగుతాడు. అప్పుడు బుద్ధుడు, ఇప్పుడు నువ్వు చేసే పని ఏమిటి? ఇతరుల పట్ల దయ ఉండాలి కానీ అసూయ ఉండకూడదు. మంచి తలంపు లేనప్పుడు నీకు నిర్వాణ స్థితి ఎలా వస్తుందంటాడు.

గౌతమ బుద్ధుడు అంటారు : బయట దుర్గంధంతో కూడిన వాసన వస్తే, లేచి నిలబడి దూరంగా పారిపోతున్నాము. దుర్గంధంతో కూడిన దుష్ట వాసనలు, దుష్ట కర్మలు, కుళ్ళిపోయిన మనసుతో నిండిన మనుషులు వద్ద నుండి కూడా దూరంగా లేచి వెళ్ళిపోవాలి కానీ, వారికి దగ్గరగా కూర్చోకూడదు. లోపల పవిత్రతనే (భగవంతుడినే) గమ్యంగా పెట్టుకొని మనము జీవించటం లేదు కాబట్టి, అటువంటి వారి దగ్గరకి వెళ్తాము. సాధనకి, శీల సంపద ముఖ్యం. దాన్ని కాపాడుకోవాలనే నిష్ఠ మనకి లేదు.

బుద్ధుడి వద్దకి ఒక భక్తుడు వచ్చి, బోధ చెయ్యమని అడిగాడు. బుద్ధుడు రేపు మీ ఇంటికి భిక్షకి వస్తాను, అప్పుడే బోధిస్తాను అన్నాడు. మర్నాడు బుద్ధుడు, భిక్ష పాత్ర తీసుకుని అక్కడే రోడ్డు మీద దుమ్ముని భిక్షపాత్రలో వేసుకుని ఆ పాత్రలో భిక్ష వెయ్యమని ఆ భక్తుడిని అడిగాడు.పాత్రలో దుమ్ము ఉంది, ఇలాంటి పాత్రలో భిక్ష వెయ్యలేము పాత్రని శుభ్రం చేసుకుని రమ్మంటాడు ఆ భక్తుడు. నీ మనసులో కుట్రలు - కుతంత్రాలు అనేక రకాలైన వాసనలు, సంస్కారాలు నింపుకొని నన్ను ఎలా బోధించమని అడుగుతున్నావు అన్నాడు బుద్ధుడు. పవిత్రత లేనివాడికి బోధ చేసినా అది వాడికి ఇమడదు.

గౌతమ బుద్ధుడు అంటారు, మనిషికి మంచి, చెడు రెండు ఉంటాయి. మనము దేనికి అన్నం పెడుతున్నామంటే, మంచిని చంపే చెడుకి అన్నం పెడుతున్నాము. లోపల చెడుకి అన్నం పెడుతూ రామా! రామా! దేవుడా! దేవుడా! అంటే జ్ఞానం వచ్చేస్తుందా? అది జాగ్రత్తగా చూసుకోవాలి. అదే నిజమైన సాధన. మన హృదయంలో ఏం జరుగుతుందో, చూసుకోకుండా దేవుడా అంటే సరిపోదు. body,mindspeech వల్ల, లోపల ఉన్న చెడుకి food supply అవ్వకూడదు. లోపల watching లో ఉంటే, చైతన్య స్థాయి నెమ్మదిగా పెరుగుతుంది. మన శరీరం ఏదో రోజున చనిపోతుంది, చనిపోయేలోపు ట్రూత్ ని పొందాలి. మనకి జన్మ ఇష్టమే కానీ, చావు ఇష్టం ఉండదు. రోగం అణగడం వేరు, రోగం నశించడం వేరు. అణిగిన రోగం అవకాశం చూసుకుని మళ్ళీ వస్తుంది. నశించిన రోగం మళ్ళీ వచ్చే అవకాశం లేదు. మనము ఏదైనా మంచి వాక్యం వింటే, దాన్ని మనసులో తిప్పుకోవాలి. అప్పుడు లోపల ఉన్న మంచికి ఫుడ్ సప్లై అవుతుంది. మంచిని పెంచుకోకుండా చెడ్డలో నుంచి బయటకి రాలేము. ఇక్కడే బుద్ధుడు, మనము దేనికి అన్నం పెడుతున్నామో చూసుకోమని అంటున్నాడు బుద్ధుడు. మనము కొందరిని ప్రేమిస్తాం, కొందరిని ద్వేషిస్తాం. అంటే, మనలో ఏదో చెడు ఉంది, దోషం ఉంది. సాధన అంటే, లోపల నిన్ను నీవు చూసుకోవాలి. మంచిని ఫీడ్ చేస్తే, చెడు తొలుగుతుంది. చెడుని ఫీడ్ చేస్తే, మంచి తగ్గుతుంది. మనము దేనికి ఫీడ్ చేస్తున్నామో చూసుకోవాలి.

మనకి లోపల శాంతి కుదిరి, వాసనాక్షయమవుతుంటే! జ్ఞానం తాలూకు వలయంలోకి వెళుతూ సృష్టిని ఎంతో కొంత ప్రేమించకుండా ఉండలేము. ఆచార్యులవారు, బుద్ధుడు, వారు పొందిన స్థితి మన చేత పొందింపచేయటానికి కాలినడకన సంచరించారు. ఏదైనా పనిని ఇష్టంగా చెయ్యటం వేరు, కూలి పనికి చెయ్యటం వేరు. పొలం పనులు, తాపీ పనులు చేసేవారు కూలివారు కాదు. ప్రతిఫలం వస్తుందంటే పనిచేసి, ప్రతిఫలం రాదంటే పనిచెయ్యని వారు కూలివారన్నాడు పరమాత్మ.

శవాన్ని చూస్తే ఎలా మనకి మొహం కలగదో, అలా బాహ్య దృశ్యాలని శవ మాత్రంగా దర్శించిన వాడే వైరాగ్యవంతుడు అన్నాడు బుద్ధుడు.

ఆచార - విచార - ప్రచార : ముందు మనకి క్రమశిక్షణ ఉండాలి. అధ్యయనం చేసిన దానిని, శ్రవణం చేసిన దానిని - విచారణ చేసుకుని జీవితంలో దాన్ని ఎంతో కొంత ఇంప్లిమెంట్ చేసుకుని దాని నుండి పొందిన ఆనందాన్ని ప్రచార-రూపంలో తన వద్దకు వచ్చిన వారికి పంచాలి. రమణులు,బుద్ధుడు సత్యాన్వేషణ ఉన్నవారికి, వారు పొందిన ఆనందాన్ని పంచారు. వాసనా-క్షయం అవ్వకుండా ఎవరికీ మోక్షం రాదు. పునర్జన్మ తప్పదు. దేహం విడిచి-పెట్టేటప్పుడు లోపల బలంగా ఉన్న వాసన వచ్చి శిరస్సులో కూర్చుంటుంది. జీవుడు దాన్ని పట్టుకొని, దానిని చుట్టేసుకుని దేహం విడుస్తాడు. దాన్నిబట్టి పునర్జన్మ వాసనలు లోపల ఉన్నంతకాలము శరీరాలు రాకుండా ఆగవు.

నీ మనసు బాహ్యంగా ఏ కారణం వలన వెళుతోందో, ఆ కారణాన్ని eliminate చెయ్యాలి. mind wonderingకి ఏ వాసన కారణమో దాన్ని eliminate చెయ్యాలి. సంసారమంటే అర్థం repeatation.

తాను ఇచ్చిన భిక్ష వల్లే, బుద్ధుడి ఆరోగ్యం క్షీణించిందని తెలుసుకున్న చందుడు దుఃఖిస్తుంటే, బుద్ధుడు ఆనందుడని దగ్గరకు రమ్మని, నేను మరణించిన తరువాత చందునితో చెప్పు, అతను పెట్టిన భోజనం తిన్న తరువాత నేను జన్మరాహిత్యాన్ని పొందుతున్నాను. రాబోయే జన్మలో అతనికి గొప్ప ఫలం లభిస్తుంది". ఈ మాటలు నేను చెప్పానని అతనికి చెప్పు అంటాడు బుద్ధుడు.

బుద్ధుడు కొడుకు సిద్ధార్థుడు. బుద్ధుడు వద్దకు వచ్చి, తండ్రి! మిమ్మల్ని చూసి చాలామంది జ్ఞానం పొందారు కానీ నేను పొందలేకపోతున్నాను. నేను కూడా పొందితే బావుండును అంటాడు. బుద్ధుడు మౌనంగా విని, పక్కనే ఉన్న భిక్షువుని ఒక పళ్ళెంలో నీళ్ళు పోసుకుని రమ్మంటాడు. ఆ పళ్ళెంలో ఆయన రెండు కాళ్ళు పెట్టి తీసేసి, ఈ నీళ్ళు ఎలా ఉన్నాయని అక్కడ ఉన్న సిద్ధార్థుడిని అడిగాడు. నలకలుగా ఉన్నాయి అన్నాడు. అప్పుడు బుద్ధుడు, సిద్ధార్థా! నీ మైండ్ లో కూడా అన్ని నలకలు ఉన్నాయి అవన్నీ పోకుండా జ్ఞానం రాదు. మైండ్ లో నలకలు ఉండగా నీకు జ్ఞానం ఇచ్చాననుకో, నువ్వు పుచ్చుకుంటే అది నిలబడదు. నిర్వాణమనేది ఇచ్చేది -పుచ్చుకునేది కాదు. కిరసనాయిల దీపంలో కిరసనాయిలు అయిపోయిందనుకో, దీపం ఆరిపోతుంది. కిరసనాయిలు లేదు కాబట్టి వెలిగించినా,

అది వెలగదు. అలాగే మనలో వాసనలు శేషం లేకుండా నశిస్తే పునర్జన్మలు రావు. అప్పుడు నిర్వాణ స్థితి పొందుతాము. వాసనాక్షయం అవ్వకుండా జ్ఞానం వచ్చే అవకాశం లేదు. వాసనాక్షయం పొందటానికే అష్టాంగ మార్గమును అనుసరించి, సాధన చేసి నిన్ను నువ్వు పవిత్రం చేసుకుని హృదయాన్ని ఖాళీ చేసుకోమని బుద్ధుడు సిద్ధార్థుడికి బోధిస్తాడు.

ఒకసారి కాశీ వెళ్ళినప్పుడు, నాన్నగారు సారనాథ్ వెళ్ళారు. అక్కడ ఒక చెట్టు కింద కొద్దిసేపు కూర్చుని నెమ్మదిగా, వడివడిగా అక్కడ ఉన్న బుద్ధుడి మందిరంలోకి వెళ్ళి, అక్కడ బుద్ధుడి గురించి ఒక్క మాట ఉందమ్మా! అని, ఆయన ప్రేమని విశ్వమంతటా పంచినా ఇంకా ఆ ప్రేమ ప్రవహిస్తూనే ఉంది. వారి ప్రేమలో స్వార్థం ఉండదు, ప్రకృతి విషయాలుఉండవు. వారి ప్రేమ అలౌకికం, అభౌతికము. అందులో కామ వాసన ఉండదు. మనుషుల ప్రేమలో స్వార్థం, కామవాసన ఉంటుంది. అది ఏదో ఒక రోజు బ్రేక్ అయిపోతుంది. జ్ఞానిప్రేమ మాత్రమే ఆత్మిక ప్రేమ. అది స్మశానంలో మన దేహం కాలిపోయినా, ఆ ప్రేమ మనకు మధ్యలో తెగిపోకుండా నిర్వాణస్థితిని పొందేవరకు కొన సాగుతూనే ఉంటుంది. గృహ పరిత్యాగము చేసే బుద్ధునిలో సంఘర్షణ.

త్యాగికాని వాడు జ్ఞాని కాలేడు. బుద్ధుడు, సత్యాన్వేషణ కోసం భార్యని, బిడ్డని, తల్లిదండ్రుల్ని రాజ్యాన్ని భోగాలన్నింటినీ త్యజించాడు. గృహ పరిత్యాగం చేసి సత్యాన్వేషణ చేస్తూ బయలుదేరాడు. మనము, మన జీవితంలో దేనిని త్యజించలేదు. మన జీవితమంతా బాహ్య - సంపదల కోసం, ఆడంబరాలు కోసం, గౌరవాల కోసం, burn చేస్తున్నాము. సత్యము కోసం మాత్రము ఇసుమంత ప్రయత్నం కూడా లేదు. సత్యాన్వేషణ లేకుండా సత్యం తెలియబడదు.

జీవకోటి వారి జీవిత కాలంలో వ్యక్తులతోటి, వస్తుజాలం తోటి కలవటము -విడిపోవటము జరుగుతుంది. అది ఎటువంటిదంటే, ఆకాశంలో మబ్బులు గాలికి కలిసినట్లే కలిసి, మళ్ళీ ఆ గాలిలోనికి విడిపోవటము వంటిది. కలిసిన కొద్ది కాలం అది ఒక స్వప్నం మాత్రమే. ఇల్లు కాలిపోతుంటే బయటికి పారిపోవడం మానేసి, ఇల్లు చాలా బావుందని మంటలకు ఆహుతి అవుతారా? రోగాన్ని, ముసలితనాన్ని, మరణాన్ని చూశారు వాటి నుండి విడుదల పొందడం మానేసి, జీవితమంతా అజ్ఞానమనే

మంటలకు ఆహుతి చెయ్యమంటారా, అమూల్యమైన జీవితాన్ని, అశాశ్వతమైన వాటి కోసం burn చెయ్యమంటారా, నా తండ్రి, నాకోసం ఏర్పాటు చేసిన ఈ మహాసౌధాలు మంటలతో నిండినట్లు అనిపిస్తుంది. ఇక్కడ భుజించే పంచభక్ష్య పరమాన్నములలో వినాశకరమైన  విషం కలిసినట్లు అనిపిస్తుంది. సంపదంతా ఈ ఆడంబరాలు, ఈ భోగాలన్ని అందమైన సరస్సులో ఉన్న అపురూపమైన పద్మం చుట్టూ లెక్కలేనన్ని కీటకాలు చేరి గోల,గోల చేస్తున్నట్లు ఉంది.ఇవన్నీ అదృష్టంగా కనిపిస్తున్న దురదృష్టకరమైన పరిస్థితులు. మనస్సుని భ్రాంతిలో నుండి బయటకి రానియ్యవు. దుఃఖము, దుఃఖ కారణము లోనుంచి బయటకి రావాలి."

నిర్వాణ స్థితిని పొందటానికి చేసే ప్రయత్నం తప్పించి, వేరే-పని ఈభూమ్మీద లేదు. వైరాగ్యాన్ని అనుసరించి, విషయ వాసనల లోంచి ఎవరైతే బయటపడరో, వారికి లోపల సుఖం తెలియదు. సంపదలు ఉంటే ఉండనివ్వండి, సంపదని యోగానికి ఉపయోగించుకోవాలి. భోగాలు పెంచుకోవడానికి కాదు, భోగాలు రోగాల్ని తెస్తాయి. నిప్పులో కిరోసిన్ పోసి ఆర్పలేము. అలాగే కోరికలు వెనకాల పరుగులు పెడుతూ కోరికల్ని తీర్చుకుంటూ దుఃఖము లోనుండి బయటకురాలేము.

మనకి సత్కర్మ చెయ్యటం ఇష్టం లేకపోయినా, మనస్సుకి దాన్ని హితవు చేసుకుని చెయ్యాలి. అలా చేస్తే ఆ సత్కర్మ మనో-నాశనానికి సహకరిస్తుంది. మనలో లేని గొప్పతనాన్ని ప్రదర్శిస్తే, మనలో ఉన్న నిజమైన గొప్పతనం మరుగున పడుతుంది అంటాడు బుద్ధుడు.

వాసుదేవుడు అంటారు, అందరూ నాకు నమస్కరిస్తున్నారు. నేను కూడా ఈ భూమ్మీద కొందరికి నమస్కరిస్తాను. ఎవరైతే ఇతరుల యొక్క క్షేమం కోరతారో! ఎవరు ఇతరుల సంతోషంకోసం, వారి సుఖసంతోషాలను వదులుకోవడానికి సిద్ధంగా ఉన్నారో అట్టి వారికి నేను నమస్కరిస్తాను అన్నాడు పరమాత్మ.

భగవద్గీతలో గుణసంపద గురించి చెప్పారే తప్ప ఎక్కడా  మహిమలు గురించి ప్రస్తావించలేదు. గుణ సంపద లేనివాడికి ఆత్మ-జ్ఞానం పొందే అవకాశములేదు. భగవద్గీత సమన్వయ గ్రంథము. జీవకోటి అందరి హృదయాల్ని చల్లబరిచి వారి మనస్సుని సమాధానపరిచి ప్రతీ జీవుడు వాడి జీవితంలో తరించటానికి చెప్పిన ఉపాయాలే 700 శ్లోకాలు.

గీతా వాక్యము: "శ్రద్ధావాన్ లభతే జ్ఞానం" ఏ పరిసరాల్లో ఉంటే భగవంతుడి పట్ల శ్రద్ధ కలుగుతుందో, భక్తి కలుగుతుందో ఆ పరిసరాల్లోనే ఉండాలి. ఆధ్యాత్మిక వాతావరణాన్ని అభివృద్ధి చేసుకోవడానికి చూసుకోవాలి. మన బంధువులు, స్నేహితులు నిజమని మురిసిపోకూడదు. ధనం ఉంటేనే బంధువులు. ధనం లేనివాడికి నీరులేని చెఱువుకి బేధంలేదు. నీరు లేకపోతే చెఱువు లేదు, ధనం లేకపోతే బంధువులు లేరు. అలాగే తత్వం తెలిసినవాడికి సంసారం లేదు. దేహభిమానం ఉన్నంతకాలం సంసారం మనల్ని విడిచిపెట్టదన్నారు భగవాన్.

"సర్వభూత హితే రతాః" : మనము ఇతరులకి ఏమి ఇవ్వలేకపోయినప్పటికీ, మనస్సులో దారిద్ర్యం ఉండకూడదు. వారు క్షేమంగా ఉండాలి, సుఖంగా ఉండాలని కోరుకోవడానికి దారిద్ర్యం ఎందుకు? పరమాత్మ చెప్పిన వాక్యం వినాలి - విన్నది జీర్ణమవ్వాలి, జీర్ణమైనది శక్తినిస్తుంది. సముద్రంలో కెరటాలు ఉంటాయి. కెరటానికి కెరటానికి మధ్య స్నానం చేసి వచ్చేయాలి. లోకంలో వంకర్లు ఉంటూనే ఉంటాయి. మనము లోకంలో ఉంటూనే వంకర్లు లేకుండా ఉండగలగాలి. మన హృదయంలో ధనవంతులకి, బంగారు పిచ్చుకలకి స్థానమిస్తాము. కానీ దురదృష్టవంతులకి, దరిద్ర నారాయణులకి, దైవంచేత కొట్టబడినవారికి స్థానమివ్వము. అందరి క్షేమాన్ని కోరుకోవాలి, వారి ప్రారబ్ధాన్నిబట్టి వారు అలా ఉన్నారు. వారిని ప్రేమించడానికి

మనకు కరువు ఎందుకు? అందరినీ మనము ఉద్ధరించేలేకపోవచ్చు. కనీసం ఒక్కరికైనా మనము సహాయ సహకారాలు అందించగలగాలి.

ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి
భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా

ఈశ్వరుడు నీ లోపల హృదయంలో తిష్ట వేసుకుని కూర్చున్నాడు. కక్కుర్తి ఆనందాలకు పొంగిపోకు, చిల్లర విషయానందంలోకి వెళ్ళకు. వెళ్తే హృదయంలో ఉన్న ఆనందాన్ని మిస్ అవుతావు.

కృష్ణుడు కర్మ ఫల కాంక్ష పనికిరాదు అన్నాడు. కర్మఫలాన్ని త్యాగం చేసిన వాడే సన్యాసి. వాడే యోగి.

అనపేక్ష శ్శుచిర్దక్ష ఉదాసీనో గతవ్యథః
సర్వారమ్భపరిత్యాగీ యో మద్భక్తస్స మే ప్రియః

అనపేక్షః : జీవితంలో మనము దేనిని కోరుకోకూడదు, మనకేది మంచిదో మనకంటే భగవంతుడికి బాగా తెలుసు. ఒక్కోసారి మనము మంచి అని కోరుకున్నది, మనకి ఎంతో దుఃఖాన్ని తీసుకువస్తుంది.కోరిక వల్లే దుఃఖం వస్తుంది. కోరి తెచ్చుకున్నది బంధకారణం-దుఃఖకారణం అవుతుంది. కోరుకోకుండా వచ్చినది మనల్ని బంధించదు.

శుచిః : శుభ్రంగా, శుచిగా ప్రకాశవంతంగా ఉండాలి. జీవితంలో ఏదో కోల్పోయినట్టు ముఖంలో అశాంతి ప్రదర్శిస్తూ ఉండకూడదు. కొందరు ఇతరులలో లోపాలనే నిరవధికంగా చూస్తూ ఉంటారు, అందువల్ల కాలం వృధా అయిపోతుంది, మనసు మలినం అవుతుంది. దానివల్ల మనకి మిగిలేది నరకలోకాలే. మనస్సులో, వాక్కులో, పనిలో అశుచి లేకుండా, దోషం లేకుండా చూసుకోవాలి. ఇవి మూడు త్రికరణాలు, ఇవి మూడు ఏకంగా ఉండాలి. వక్రంగా ఉంటే మనకి భక్తి నిలబడదు. శరీరాన్ని, మనము ఉండే ఇంటిని, పరిసరాల్ని, బట్టలని ఎంత శుచిగా ఉంచుకుంటున్నామో మనస్సు, వాక్కు, పని కూడా అంతే శుచిగా ఉండాలి. అవి మూడు మన మనస్సుని బహిర్ముఖపరిచే విధంగా కాకుండా, అంతర్ముఖపరిచే విధంగా ఉండాలి.

దక్షః : పనిలో ఓర్పు-నేర్పు ఉండాలి. పనిలోనే భగవంతుడిని చూడాలి. ఎవరైతే పనిలో భగవంతుడిని చూస్తున్నాడో! వాడు 'దక్షుడు'. పనిని భగవంతుడికి నైవేద్యంగా చెయ్యాలి.పనిలో నేర్పు, skill ఉండాలి, excellency ఉండాలి. జీవితంలో సమర్థత లేకపోతే ఏ రకంగానూ అభివృద్ధిలోకి రాలేము.

ఉధాసీనః : సమభావనని practice చెయ్యాలి. ఎటూ ఒరిగిపోకుండా పక్షపాత రహితంగా జీవించాలి. శరీరానికి పక్షవాతం, మనసుకి పక్షపాతం. బంగారాన్ని ఎంత జాగ్రత్తగా చూస్తారో! అలా మనసు, మన బుద్ధి ఎటు ఒరగకుండా neutral గా ఉండాలి.

గతవ్యధః : జీవితంలో జరిగిపోయిన గొడవలు గురించి బెంగపెట్టుకోవదు, జరగవలసిన దాని గురించి ఊహించవద్దు. గత జ్ఞాపకాలు, భవిష్యత్తు ఊహలు, తలంపుల రూపంలో వచ్చినప్పుడు, మాయ వచ్చేసిందని మనల్ని మనము హెచ్చరించుకోవాలి.

సర్వారంభ పరిత్యాగిః : అన్ని ఆరంభాలు వదిలెయ్యాలి. కొంతమంది వారికి ఉపయోగం ఉంటుందంటేనే మాట్లాడతారు, లేకపోతే మాట్లాడరు. ఏ పని చేసినా స్వార్థం కేంద్రంగా ఉండకూడదు. పెద్ద పెద్ద పనులు పెద్దవారికి వదిలేద్దాము. యజ్ఞాలు, యాగాలు, పెద్ద పెద్ద సాధనలు లాంటివి మనము చెయ్యలేకపోవచ్చు. భగవంతుడికి ఇష్టమైన చిన్న పనైనా, పెద్ద హృదయంతో చెయ్యాలి. పనిని ఏ హృదయంతో చేస్తే, ఆయన దయ కలుగుతుందో! ఆ విధంగా పని చెయ్యాలి.

అంతటా వ్యాపించి ఉన్న వస్తువు మన హృదయంలోనే ఉన్నప్పటికీ, దైవగుణాలు లేకపోవటం వల్ల, మన ప్రవర్తనని, మన స్వభావాన్ని నియమించు కోకపోవడం వల్ల, భగవంతుడిని పొందాలనే కాంక్ష మనకి కలగటం లేదు. ఇతరుల్ని బాధపెట్టడం కాదు, మనల్ని మనము కూడా బాధ పెట్టుకోకూడదు. మనము సమాజాన్ని, ప్రపంచాన్ని మోసం చేయగలం కానీ, హృదయంలో ఉన్న ఈశ్వరుడిని మోసం చెయ్యలేము. భూమ్మీద విలవిల్లాడుతూ కొట్టుకునే చేపని చెరువులో పడేస్తే ఎంత సుఖంగా ఉంటుందో! అలా పరమేశ్వరుడి దయకి పాత్రుడయ్యేలా పనిచేసి, ఆయన అనుగ్రహం అనే చెరువులో జీవుడుపడితే!సంసారంలో కొట్టుకుంటూ

విలవిల్లాడే జీవుడు శాంతిని సుఖాన్ని పొందుతాడు. ఇట్టి విధంగా జీవించే భక్తుడు, పరమాత్మకి సంబంధించిన భక్తిలో, జ్ఞానంలో ఓలలాడతాడు. అట్టివాడే పరమాత్మకు ప్రీతిపాత్రుడు. అట్టివాడికి పరమాత్మ అనుగ్రహం సొంతమయ్యే యోగ్యత, అర్హత కలుగుతుంది.

అభ్యాస-వైరాగ్యాలు విడిచిపెట్టకూడదు. మనస్సు హృదయ స్థానాన్ని విడిచిపెట్టి బాహ్య విషయాల మీదకి వెళ్ళకుండా వైరాగ్యం చేస్తుంది. మనస్సుని హృదయంలో ఉంచి జ్ఞానం వైపుగా అభ్యాసం తీసుకువెళుతుంది.

"ఉద్ధరేదాత్మనాత్మానం ఆత్మానమవసాదయేత్ ।
ఆత్మైవ హ్యాత్మనో బంధుః ఆత్మైవరిపురాత్మనః ॥"

మానవుడు తన మనసు యొక్క సహాయంతో తనను తాను ఉద్ధరించుకోవాలి కానీ, అధోగతి పాలు చేసుకోకూడదు. జీవుడికి తన మనస్సే మిత్రుడు, అలాగే తన మనస్సే శత్రువు. నిన్ను నీవు బాగు చేసుకోవడానికి నీ మనసు నీకు సహకరిస్తే అది మిత్ర-మనసు అవుతుంది. అలా కాకుండా నిన్ను ప్రకృతిలోకి లాగి, నిన్ను పాడు చేస్తే అది నీకు శత్రు-మనసు అవుతుంది. ముందు మన మనస్సుని మనము మచ్చిక చేసుకుని మిత్రుడిగా చేసుకోవాలి.

ధర్మాన్ని దృష్టిలో పెట్టుకుని, ఏ పనైనా కోరిక లేకుండా చేస్తే, శాంతి కలుగుతుంది. సుఖం వైపు దారి కనబడి, మోక్షం సిద్ధిస్తుంది. కర్మని, యోగంగా చేస్తే మోక్షం కలుగుతుంది. మనము ఏ మార్గంలో సాధన చేసినా, దేహంతో ఉన్న తాదాప్యం పోగొట్టుకోవాలి. కర్తృత్వ బుద్ధి నుంచి బయటికి రావాలి. మనము మంచి పనులు చెయ్యకపోయినా, మంచి చేసే వారికి సహకరిస్తే లోపల ఎంతోకొంత కడగబడతాము. మనము మంచి చెయ్యకపోయినా మంచి చేసే వారిని చూసి, సంతోషపడే హృదయం మనకుంటే! భగవంతుడు మనకి కూడా కొన్ని గ్రేస్ మార్కులు వేస్తాడు. మనము ఏదైనా మంచి పనిని తెలిసి చేసినా, తెలియకుండా చేసినా మనకి పవిత్రతని ఇస్తుంది. చేసే పని, ఈశ్వరార్పణ బుద్ధితో చేస్తే పవిత్రతే కాదు, జ్ఞానం కూడా వస్తుంది.

"యదా సంహరతే చాయం కూర్మోంఙ్గానీవ సర్వశః ।
ఇంద్రియాణీంద్రియార్థేభ్యః తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥"

సంహరతే - సంహరతే. అంటే, తాబేలు ఏదైనా ప్రమాదం వస్తే దాని తలా, కాళ్ళు, చేతులు లోపలికి ఎలా లాగేసుకుంటుందో అలా సాధకుడు ఇంద్రియ విషయాల మీదకి వెళుతున్న మనస్సుని లోపలికి లాక్కోవాలి. మనస్సుని withdraw చెయ్యకపోతే ఇంద్రియాలు pollute అయిపోతాయి. వాటిని పవిత్రం చేయడం చాలా కష్టం.

కృష్ణుడు : నాకు కొందరు నమస్కారాలు పెడతారు, నేను కూడా కొందరికి నమస్కారాలు పెడతాను. ఎటువంటి వారికి పెడతానంటే, ఎవరైతే నిరంతరం ఇతరుల యోగక్షేమాలు కోరుకుంటారో అటువంటి వారికి నేను నమస్కరిస్తాను అన్నాడు.

సాధకుడు వివేకాన్ని విడిచిపెట్టకూడదు. ఈ ప్రపంచంలో ఏది మంచిదో దాన్ని విడదీసుకుని, మంచికి దగ్గరగా, చెడుకి దూరంగా జరగాలి.

గీతలో పరమాత్మ: ఎవరైతే వారి దేహాన్ని, విచ్చలవిడిగా వదలకుండా తన ఆధీనంలో ఉంచుకున్నాడో! వాడే యుక్తుడు., మనోదేహములు స్వాధీనం లేకుండా విచ్చలవిడిగా వదిలేసినవాడు అయుక్తుడు అంటాడు. యుక్తుడు, మనోదేహములను భగవంతుడిని పొందటానికి ఉపయోగించుకుంటాడు, అయుక్తుడు, ఇంద్రియాలని లోక విషయాలకి వదిలేసి ఉంచుతాడు. అందువలన, అయుక్తుడికి జ్ఞానం ఎలా వస్తుందంటాడు పరమాత్మ.

కృష్ణాష్టమి రోజున, ఒక కృష్ణ భక్తురాలు నాన్నగారి వద్దకి వచ్చి, ఈ భూమ్మీద ఏ విధంగా జీవిస్తే భగవంతుడు ప్రేమకి ఆప్యాయతకి అనుగ్రహానికి పాత్రులవుతాము అని నాన్నగారిని ప్రశ్నించారు. ఆ ప్రశ్న వినగానే నాన్నగారు చాలా సంతోషించి, ఇప్పటివరకూ అందరూ అనుగ్రహం కావాలని అడిగే వారే కానీ, మేము ఎలా జీవిస్తే అనుగ్రహం పొందుతాము అని అడగలేదమ్మా నీ శిరస్సు మీద అనుగ్రహం ఉంది కాబట్టి నీకు ఇటువంటి ప్రశ్న ఉదయించింది. దీనికి పరమాత్మ డైరెక్టుగా భగవద్గీతలో చెప్పారు.

సుధాముడు దరిద్రంతో బాధపడుతున్నా కృష్ణుడిని సంపద ప్రసాదించమని అడగడు, మూడింటిని అడుగుతాడు:

1. ఈ జనన మరణ చక్రంలో నుండి బయటకి రావాలంటే, నీ మాయదారి ఇవ్వకుండా రాలేను. నీ మాయదారి ఇవ్వాలంటే నీ పట్ల భక్తిని అనుగ్రహించు.

2. నీ పట్ల స్థిరభక్తి ఉన్న వారి సహవాసాన్ని అనుగ్రహించు.

3. నాకు ఏది మంచిదని అనుకుంటున్నానో నేను ఇతరులపట్ల ఆవిధంగా ఉండే బుద్ధిని అనుగ్రహించు అని కోరాడు. అది యోగ్యుడి లక్షణం.

నీలో ఏ విశేషం ఉన్నా అది భగవంతుడి విభూతి అన్నారు గీతలో. విభూతి అంటే, ఐశ్వర్యం. ఐశ్వర్యమంటే సంపద. కానీ అది బాహ్య సంపద కాదు. నీలో ఉన్న సద్గుణాల సంపద. ఆ సద్గుణాలన్నీ భగవంతుడి విభూతే.

రోమన మహర్షి ఆశ్రమంలో ఒక చెట్టుండేది. ఆచెట్టు కాయ తిన్నవారికి ఆకలి ఉండదు. అయితే, ఆ చెట్టు నుండి రాలిన పండుని మాత్రమే తినాలి. చెట్టు నుండి తెంపి తినకూడదు. ఇది తెలియక పాండవులు ఆయన ఆశ్రమానికి వెళ్ళి పండు కోసుకుని తినేశారు. రోమన మహర్షి అది గ్రహించి, కోపంగా శపించటానికి ఆశ్రమము లోపల నుండి చెట్టు వద్ద ఉన్న పాండవుల వైపు వస్తున్నారు. ఈలోపు అక్కడికి పాండవులని రక్షించడానికి కృష్ణపరమాత్ముడు వచ్చేస్తాడు. కృష్ణుడు వచ్చి, మహర్షి మీకూడా నేను వస్తాను అన్నారు. మహర్షి శ్రీకృష్ణుడిని గౌరవించి, రమ్మని చెట్టు వద్దకు తీసుకెళ్ళారు. పాండవుల వద్దకు చేరగానే పరమాత్మ పాండవుల కాళ్ళమీద పడి నమస్కారం చేశారు. అది చూసిన రోమన మహర్షి కి ఏమీ అర్థం కాలేదు. పరమాత్మ అంతటివాడే కాళ్ళమీద పడుతున్నారు. వీరు ఇంకెంత గొప్పవారో! అనుకుని, శపించడానికి వచ్చిన మహర్షి అది మరిచిపోయి - ఆయన కూడా పాండవుల కాళ్ళమీద పడి నమస్కరించారు. అది పరమాత్మ అనుగ్రహమంటే. శరణాగతి చెందిన భక్తుడిని అడుగడుగునా అలా కాపాడుకుంటాడు. పొరపాటు చెయ్యటం మానవ సహజం. అయితే సాధకుడు తను చేసే పొరపాటుని గుర్తించి, గ్రహించి దాన్ని రిపీట్ చెయ్యడు, పశ్చాత్తాపపడతాడు. లౌకికుడు తన పొరపాటును సమర్థించుకుని అదే right అనే భ్రాంతిలో ఉంటాడు.

కృష్ణుడు దేహం విడిచిపెట్టేముందు, ఉద్ధవుడుని పిలిచి ఇకనుండి నువ్వు ద్వారకలో ఉండకు. నేను వెళ్ళిపోయాక, ఇక్కడి పరిస్థితులు - నువ్వు ఆధ్యాత్మికంగా ఎదగడానికి ఉపయోగపడవు - అందుచేత బదరీ వెళ్ళిపో. సత్య వస్తువుతో ఒక్కటిగా ఉండడమే సత్సంగము. నీ చివరి రోజుల్లో సత్పురుషుల సహవాసం విడిచిపెట్టకు. అజ్ఞానికి మంచి-చెడు గా, చెడు-మంచిగా కనిపిస్తుంది. సత్యం-అసత్యంగా అసత్యం-సత్యంగా కనిపిస్తుంది. ఉద్ధవా! గుడ్లగూబకి దృష్టి లోపం ఉంది. దానికి పగలు-రాత్రిగా, రాత్రి- పగలుగా కనిపిస్తుంది. సత్సంగం, సత్పురుషుల సహవాసం వలన మన బుద్ధిశుద్ధి అవుతుంది. మంచి-బుద్ధి, ఆత్మ వైపు, చైతన్యం వైపు మన ప్రయాణం జరగడానికి సహాయం చేస్తుంది. నంది, ఈశ్వరుడి వైపే చూస్తూ ఉంటాడు. వాడి గమ్యం ఈశ్వరుడు, మార్గం కూడా ఈశ్వరుడే. ఎంతమంది గుడికి వెళ్ళినా, వాడికి ఏమి పట్టదు. అలాగే రైట్ మైండ్ మనల్ని హృదయం వైపు డైరెక్ట్ చేస్తూ మనకి దాని పట్ల ఏకాగ్రతని తీసుకుని వస్తుంది.

గోపికలు అక్రూరుడితో నీలాగే మాకు సంసారం ఉంది, బాధ్యతలున్నాయి, కుటుంబ సభ్యులు ఉన్నారు. అయితే వాటన్నిటికంటే మా మనస్సు కృష్ణుడి చుట్టూ తిరుగుతోంది. మాకు భౌతికమైన వాటికంటే కృష్ణుడు సాంగత్యం ఉత్తమమైనది. అటువంటి గోవిందుడు సాంగత్యాన్ని మాకు దూరం చేసి తీసుకువెళ్ళిపోతున్నారు. నువ్వు అక్రూరుడివి కాదు, క్రూరుడివే అంటారు.

గోపికలు కృష్ణుడితో, జీవ లక్షణాలతో బ్రతికే మాకు, మిమ్మల్ని ప్రేమించడం ఎలా సాధ్యమవుతుంది. నువ్వే ప్రేమని మాకిచ్చి, నిన్ను ప్రేమించేలా చేశావు అంటారు.

గోస్వాములు : ఎవరైతే వారి ఇంద్రియాల్ని, మనస్సుని, విషయాలనుండి, ఆకర్షణలనుండి, కోరికలనుండి విడదీసి స్వామికి అర్పించి జీవితకాలము జీవించి శరీరం విడిచిపెడతారో, అటువంటివారిని గోస్వాములు అంటారు.

కోరిక-కోపం ఇవి రెండే భారతం. ధర్మాన్ని గౌరవిస్తే, ధర్మం చేత గౌరవింపబడతాము, ధర్మాన్ని రక్షిస్తే ధర్మం చేత రక్షింపబడతాము. ధర్మబద్ధమైన జీవిత విధానంలో నుండి జ్ఞానం ఉదయిస్తుంది. భారతంలో నీతి ఏమిటంటే, మన

పట్ల ఇతరులు ఎలా ఉండాలి అనుకుంటున్నామో! మనము కూడా ఇతరుల పట్ల అలాగే ఉండాలి. ఇతరులు నీకు ఏది ఇస్తే, నీకు బాగుటుందనుకుంటున్నావో! నీవు కూడా ఇతరులకి అదే పంచాలి.

మహాభారతమంతా రాసిన తరువాత వ్యాసుల వారంటారు, శరీరానికి తీసుకునే అన్నమునే రుచి, శుచి చూసుకుంటాము, అది మాత్రమే ఆహారం కాదు. మనము వినే మాటలు, చూసే దృశ్యాలు, మనము చేసే సహవాసాలు, నాలుక మీద నాట్యం చేసే విమర్శలు, పొగడ్తలు అన్ని జీవుడికి వెళ్ళే ఆహారమే. వీటి వద్ద ఎంతో జాగ్రత్తగా ఉండాలి. వీటి వద్ద జాగ్రత్తగా ఉంటేనే అంతఃకరణ శుద్ధి కలుగుతుంది. ధనం లేని వారు, ఓడ ఎక్కటం ఎలా అసాధ్యమో! అంతఃకరణ శుద్ధి లేనివాడు మోక్షం పొందటం కూడా అసాధ్యమే.

భారతం లోపల భగవద్గీత ఉన్నందువల్ల అది మహాభారతం అయ్యిందని మధ్వాచార్యుల వారు వివరించారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ప్రతి మనిషి శవాలను చూస్తాడు. కానీ లోపల మనకి మాత్రం ఇబ్బంది లేదనుకుంటాడు. ఏదో ఒక రోజు మనము కూడా అలా శవమైపోతామని అనుకోము.

తైత్తిరీయ ఉపనిషత్తు ఏమని చెబుతోందంటే, ధర్మమును ఆచరించడం వల్ల మాత్రమే పాపము నశిస్తుంది. పూర్వపు జన్మలోని వాసనలే పాపము. వాసనాక్షయం కానిదే మోక్షం పొందలేము. ఇంటికి పండుగలు వస్తే చెత్తా-చెదారం తీసేసి ఎలా శుభ్రం చేస్తామో, అలా జీవుడులో ఉన్న వాసనలనే చెత్తని, అవగాహన (subject understanding) అనే నీటితో శుభ్రం చేసుకోవాలి, సదాచారమనే ముగ్గు వెయ్యాలి. సద్గుణాలనే తోరణాలు కట్టుకోవాలి.నీటిలో ఉన్న కలువ పువ్వు సూర్యకిరణాలను తాకి వికసిస్తుంది. నీటిలో నుండి బయటికి తీసేస్తే సూర్యకిరణాలు తాకి మాడిపోతుంది. గురువుపట్ల, శాస్త్రంపట్ల భక్తిశ్రద్ధలు కలిగివుండి స్మరణను విడిచిపెట్టకుండా జీవిస్తే, హృదయం వికాసవంతమై స్వరూప-సుఖం పొందుతాము. భక్తిశ్రద్ధలు లేనప్పుడు పతనమైపోతాము. నిజమైన భక్తి జీవుడు ఉద్ధరింపబడటానికి సహకరిస్తుంది. భక్తి నిజం కాకపోతే జీవుడిలో మార్పు ఉండదు.

సనత్-కుమారుడు అంటారు, ప్రతీ మనిషికి శత్రువు, మిత్రుడు ఇద్దరూ ఉంటారు. ఇద్దరితోని ఒకేలా మాట్లాడినప్పటికీ, లోపల శత్రువుని శత్రువుగానే చూస్తాము. మిత్రుడిని మిత్రుడిగానే చూస్తాము. అయితే, శత్రువుని కూడా లోపల మనము మిత్రుడిగా చూడగలిగితే, లోపల మిత్ర భావనలో ఉంటే దైవానుగ్రహం మన శిరస్సు మీద ప్రవహిస్తోందని గుర్తు. దైవానుగ్రహం లేకుండా మనము ఆవిధంగా చూడలేము.ఆ హృదయం మనకి రాదు. ఇంద్రియాలని పొదుపుగా వాడుకోవాలి సాధకుడు. భౌతిక జీవితంలో ఒబ్బిడిగా ఉంటే వారికి లోటుండదు. అలా ఇంద్రియాలని ఒబ్బిడిగా వాడుకుంటే బ్రహ్మ పదార్ధాన్ని పొందటానికి సహకరిస్తాయి.

దేవుడి పేరు ఏంటంటే, 'I am that I am' 'నేను నేనై' ఉన్నాను. ఆ ఉండటమే దేవుడు, అయితే సపోర్ట్ కోసం, ఏసని, కృష్ణుడని, అల్లాఅని రక-రకాల రూపాలు. ఆ ఉన్న వస్తువే దేహం ధరించి వచ్చింది. చేతి కర్రని వాడేవారు కుర్చీ దగ్గరకి వెళ్ళి, కూర్చున్నాక ప్రక్కన పెడతారు. అలాగే హృదయగుహలోకి మనము ప్రయాణం చేసిన తరువాత, అక్కడికి చేరాక అందులో స్థిరమయ్యాక గురువు, manifested God అందులో కరిగిపోతారు. హృదయ-గుహలో ఉన్న ఈశ్వరుడే గురువుగా రూపం ధరించి వచ్చారని మనము అక్కడకి చేరిన తరువాత తెలుస్తుంది.

జీవుడు హృదయ గంగలో ప్రవేశించటానికి సహాయం చేసే మహాత్ముడిని జైనులు తీర్థకరులు అంటారు. తీర్థం అంటే జలము. హృదయతీర్థంలో స్నానమాచరించినవాడు తీర్థకరుడు. జీవులు వారి హృదయ స్థానంలో ఉన్న, జ్ఞానమనే జలము త్రాగటానికి సహాయం చేసేవాడే గురువు.

## ఆత్మానుభూతి - శ్రీశంకర - ఆచార్యులవారు

“మనష్యత్వం - ముముక్షత్వం - మహాపురుష సంశ్రయః. ఇవి మూడు ఏకకాలంలో సిద్ధించిన జీవుడు భూమ్మీద మిక్కిలి అదృష్టవంతుడు”అన్నారు ఆచార్యులవారు.

ఎన్నో జన్మల పుణ్యబలం ఉంటే కానీ మానవజన్మ రాదు. మళ్ళీ ఎంతో పుణ్యబలం ఉంటేనే కానీ జ్ఞానం పొందాలనే కాంక్ష కలుగదు. ఎంతో పుణ్యబలం ఉంటే కానీ, సత్పురుషుడిని గుర్తించలేరు. సత్పురుషుడు మీ జీవితంలో మీకు దొరికితే, అట్టి జీవితాన్ని వ్యర్థం చేసుకోవద్దు.

సాధకుడుకి ఉండవలసింది : 1. తపస్సు, 2. విద్య.

ఆచార్యుడు అంటే, నాలుగు మాటలు చెప్పేవాడు కాదు. భుక్తి - భక్తి - ముక్తి ప్రదుడు. మన భౌతిక అవసరాలు, మన పొట్ట ఆకలి ఆయనే చూస్తాడు. ఈశ్వరుడిని పొందటానికి సాధన అవసరం, ఆ సాధనే భక్తి. అది మనకి తెలియజేస్తాడు. ఈశ్వరుడిని అనుభవైకవేద్యం చేసుకోవటం ముక్తి, దాన్ని ఆయనే అనుగ్రహిస్తాడు. అంతా గురువే - గురువు అనుగ్రహం ఉంటే అన్నీ ఉన్నట్లే. అది లేకపోతే, భౌతికంగా అన్నీ ఉన్నా ఏమీ లేని వాడితో సమానం.

ఆచార్యుడు అంటే ఎవరు?

1. శాస్త్రం బోధించాలి.
2. ఆయన బోధించింది ఎదుటివారికి అర్థమయ్యే రీతిలో ఉందా? లేదా అనేది చూసుకోవాలి.
3. ఆయన చెప్పింది వినే వారికి అర్థమవ్వకపోతే, అర్థమవ్వకపోవటానికి గల కారణాన్ని కనిపెట్టి, ఏ వాసనలు అడ్డుపడుతున్నాయో చూసి, వాటిని తొలగించుకోవడానికి తగిన ట్రైనింగ్ ఇచ్చి, ఆ శాస్త్రాన్ని అర్థమయ్యేటట్టుగా అనుగ్రహించాలి.
4. వినేవారికి అన్న వస్త్రాలు లేకపోతే అది కూడా సమకూర్చేవాడు ఆచార్యుడు.

ఆచార్యులవారిని ఒక భక్తుడు మోక్షం పొందాలని ఉంది ఎలా? అని అడిగారు. దానికి ఆచార్యులు వారు, అజ్ఞానం నశించడమే మోక్షం. మరణించిన తరువాత

ఏ జీవుడు ప్రయాణం చేస్తాడో! ఆ జీవుడులో ఉన్న జీవలక్షణాలు శేషం లేకుండా నశించడమే మోక్షం.

మోక్షం పొందాలంటే ముందుగా:

1. సత్పురుషులతో సహవాసం చెయ్యి, పామరులతో సహవాసం నిన్ను నరకానికి తీసుకువెళుతుంది. సాధువులతో, సత్పురుషులతో, ఎవరి హృదయమైతే బంగారమయమో వారితో సహవాసం చెయ్యి.

2. మమకారం తగ్గించుకో - మమకారం తగ్గించుకోగలిగితే ఎన్నో సత్కర్మలు ఈ భూమి మీద చేయగలవు.

3. ప్రపంచంలో కష్టసాధ్యమైనది మనోనిగ్రహం. విషయ వాసనలు మీదకి పరుగులు పెట్టే మనసుని వెనక్కిలాగి ఈశ్వరుడు వైపు తిప్పుకో.

4. ప్రపంచంలో Great lies ఏమిటి అంటే నేను - నాది. వాటిలో నుండి నెమ్మదిగా విడుదల పొందు. ఇలా నువ్వు నిజాయితీగా ప్రయత్నం చేస్తుంటే, divine grace interfere అవుతుంది. అప్పుడు నీ పని పూర్తయిపోతుందని అన్నారు ఆచార్యులవారు.

ఆచార్యులవారు ఏమంటారంటే, జీవితం పొడుగునా సొంతబుద్ధి, సత్పురుషుడి సహవాసం ఇవి రెండూ కాపాడుకోవాలి. సత్పురుషులు మన ఊరిలో లభించకపోతే బాధ్యతలు తీరిపోయిన తరువాత కాశీపురంలో శేషజీవితం గడపండి అంటారు. భగవాన్ ఏమంటారంటే, మీరు ఉన్న చోట మీ మనస్సు మీ హృదయంలో ఉన్న అంతర్యామి పట్ల కేంద్రీకృతమై జీవించగలిగితే అది కాశీపురంలో జీవించటముతోటి సమానము అంటారు.

ఆవుదూడలు మట్టి తింటాయని యజమాని వాటి మూతికి బుట్ట కడతాడు. అలాగే గురువు, మనకి లోకానికి సంబంధించిన ఆకర్షణలు, ఆడంబరాలు అనే మట్టిని తినకుండా శ్రవణ-మనన-ధ్యానాదులు అనే బుట్ట కడతాడు. గురు వాక్యాన్ని శ్రవణం చెయ్యగా చెయ్యగా అది మననంగా మారి ధ్యాన స్థితిని తీసుకొస్తుంది. ప్రకృతి విషయాల్లోకి వెళ్ళకుండా అడ్డుపడి జీవుడికి ఇది నిజము కాదు, సత్యము

కాదు అనే నేతి భావనని తీసుకువచ్చి, లోపల మనకి విషయబుద్ధి ఉన్నా! గురు వాక్యాన్ని బుట్టగా కట్టి - దూడకి మట్టి తినాలని ఉన్నా బుట్ట ఎలా తినటానికి లేకుండా అడ్డు పడుతుందో ! అలా గురువు వాక్యం మనల్ని రక్షిస్తుంది. చేతిలో ఉన్న ముద్దని బయటికి వదిలేసి, చేతిని నాకటం ఎటువంటిదో! అంతర్యామిగా హృదయంలో ఉన్న ఈశ్వరుడిని వదిలేసి గుడులు, గోపురాలు తిరగటం అటువంటిదే.

ఆచార్యులవారు ఒకరింటికి భిక్షకు వెళ్తారు. ఆమె దగ్గర ఏమీ లేకపోయినా, ఈయనను చూసి, ఏదో ఒకటి ఇవ్వాలని ఇల్లంతా వెతికితే ఒక ఉసిరికాయ కనిపించింది. అది ఆచార్యులవారికి ఇస్తే, అది చూసి ఆవిడ హృదయాన్ని చూసి అనుగ్రహించాలనుకుని, ఆచార్యులవారు లక్ష్మీదేవి మీద స్తోత్రం చేశారు. లక్ష్మీదేవి ప్రత్యక్షమై, ఆమెను అనుగ్రహించడానికి గత జన్మలో ఏమి చెయ్యలేదంటే, ఈ జన్మలో ఉసిరికాయ ఇచ్చారు కదా అని అంటారు ఆచార్యులు. అప్పుడు లక్ష్మీదేవి అనుగ్రహముతోబంగారు ఉసిరికాయల వర్షం ఆ ఇంటిలో కురిపిస్తుంది. గురువు హృదయం చూస్తాడు. కనకధార స్తోత్రం అలా భూమ్మీదకి వచ్చింది.

ఆచార్యులవారు, మండన మిశ్రుడు గురువు అయిన, కుమరిల భట్టు ఆఖరి క్షణంలో ఉండగా వెళ్తారు. ఆయన మనము చేసిన సత్కర్మ మనకి మోక్షాన్ని ఇస్తుందనే భ్రాంతి లో ఉండేవారు. ఆయనకి ఆచార్యులవారు బ్రహ్మం యొక్క వైభవాన్ని బోధించి, ఆయనకున్న పొరపాటు ఆలోచనని తొలగిస్తారు. అప్పుడాయన శంకరా! నన్నే కాదు, నా శిష్యుడిని కూడా నీవు తరింపచెయ్యాలి, వాడి కంటే వాడి భార్య చాలా వివేకవంతురాలు. ఆమెను కూడా తరింపచేయాలని మాట తీసుకుంటాడు.

ఆచార్యులవారు నర్మదా నదిలో స్నానం చేసి, సన్యాసం తీసుకున్నాక ఓంకారేశ్వరుడి గుడికి వెళతారు. వెళ్ళి నేను బోధించే భోధ ఆత్మవిద్య కదా! అని ఈశ్వరుడిని ప్రశ్నించి అక్కడ ధ్యానము లో ఉండిపోతారు. అక్కడికొచ్చిన భక్తులకి ఆయన నుంచి శాంతి,కాంతి ,జ్ఞానము ప్రవహించి, వారిని తడిపి, హర హర శంకర హర హర మహాదేవ అని ఒక్క కంఠంతో పలికి గుడిలో ఉన్నమాటలురాని లింగాన్ని అడుగుతావేంటి నువ్వే ఈశ్వరుడివి అంటారు అక్కడకు వచ్చిన భక్తులు.

ఆచార్యులవారితో, పద్మపాదులు నాకు యాత్రలకి వెళ్ళాలని ఉందన్నారు. what is there to see in the world అన్నారు ఆచార్యుడు. మీకు వెళ్ళాలనే కోరిక ఉంది కాబట్టి వెళ్ళండి. ప్రయాణంలో కొత్త వారితో జాగ్రత్తగా ఉండండి, ఆడంబరంతో కూడిన మాటలు, ఆడంబరంతో కూడిన ప్రవర్తన ఉన్న వారికి దూరంగా ఉండండి. పాముని చూడగానే ఎలా దూరంగా వెళ్ళిపోతామో, ఆడంబరంగా ఉండే మనుషులకి అలాదూరంగా వెళ్ళిపోవాలి. లేకపోతే అంతకుముందువరకుచేసిన సాధనని, వాడు పీల్చేసి విడిచిపెడతాడన్నారు.

ఒకసారి ఆచార్యులవారు కాశీ వెళ్ళారట. అక్కడ గంగానదిలో స్నానం చేసి విశ్వేశ్వరుడి దర్శనం చేసుకుని మణికర్ణికా ఘాట్ వద్ద ఒక పెద్ద వటవృక్షం ఉండేదట. ఆ వృక్షము నీడలో ధ్యానం చేసుకుంటూ కూర్చునేవారట. కాశీ పట్టణం సాధకులకు రాజధాని. ఆచార్యుల వారి నుండి ప్రవహించిన జ్ఞాన తరంగాలు, శాంతి తరంగాలు, కాశీలో ఉన్న సాధకులని పట్టితెచ్చి, ఆయన సమక్షంలో కూర్చోపెట్టినవి. అది వటవృక్షము కింద జరిగిన లీల. అక్కడ ఆచార్యులవారు మౌనంగా ఉన్నారు, మాటలు లేవు.ఆయన సన్నిధిలో ఎంతో తపస్సు చేసి, సాధన చేసి తొలగించుకోలేని దేహాత్మ బుద్ధి కరిగిపోయి ఆత్మానుభవం పొంది హృదయ శాంతిలో మునిగిపోయారు. ఆయన సమక్షంలో కాలము కూడా స్థంభించిపోయింది. అది వట వృక్షము కింద జరిగిన లీల.

ఆచార్యుడు, తల్లి కోసం మహావిష్ణువుని మా అమ్మకి దర్శనము ఇమ్మని ప్రార్థించాడు. దర్శనం ఇవ్వగానే మనసు చాపల్యం ఆగిపోయింది. అప్పుడు ఆమె విష్ణువు యొక్క రూపం మీద, తన మనస్సుని పెట్టేసరికి, ఆ మనస్సుని ఏకాగ్రము చేసి, హృదయాభిముఖంగా పంపించాడు. అమ్మ మనస్సుని అంతర్ముఖం చేసి, హృదయంలో లయింపచేసి జ్ఞానాన్ని అనుగ్రహించాడు ఆచార్యుడు. ఆచార్యుడు తల్లి దేహం వదిలేసిన తరువాత, ఆ తల్లికి దహన సంస్కారాలు చెయ్యాలనుకున్నాడు ఆచార్యుడు. కానీ ఆయన బంధువులు దానికి అంగీకరించలేదు, నువ్వు దహన సంస్కారాలు చేస్తే నిన్ను కులం నుండి వెలివేస్తాము అన్నారు. అయితే నన్ను కులం నుండి వెలివేసుకోండి. నేను నా తల్లికి ఏ సేవ చేయకపోయినా, కనీసం ఇచ్చిన మాట నిలబెట్టుకుని నేనే దహనసంస్కారాలు చేస్తాను అన్నాడు.

బంధువులందరూ మేము శవాన్ని మొయ్యము, నిప్పు ఇవ్వము అన్నారు. మీరు ఏమీ ఇవ్వవద్దు అని, ఆచార్యుడే స్వయంగా తన తల్లి శరీరాన్ని బయటకి మోసుకొచ్చి, చితిపేర్చి, చేతులతో నిప్పుని రగిలించి అక్కడే దహనం చేసి, గుర్తుకోసం ఇనుప స్తంభం పెట్టి, నేను ఈ ఊరిలో మళ్ళీ కాలుపెట్టను అని చెప్పాడు. శంకరుడంటే, శుభకరుడు, శుభాన్ని ఇచ్చేవాడని అర్థం.

శంకరుడుతో, పద్మపాదుడికి కూడా పూర్వజన్మ అనుబంధం ఉంది. మణికర్ణికా ఘాట్ వద్ద శంకరుడు స్నానానికి వెళుతుంటే, పద్మపాదుడు స్నానమాచరించి వస్తూ, ఒకరిని ఒకరు చూసుకున్నారు ఆ క్షణం నుండి చనిపోయేవరకు ఆ అనుబంధం అలాగే ఉంది.

ఇల్లు కట్టుకోవటానికి సామాగ్రి ఎలా అవసరమో! అలా జ్ఞానం పొందటానికి సామాగ్రి ఉండాలి. గురువు పట్ల విశ్వాసము, హృదయంలో ఉన్న భగవంతుడి పట్ల భక్తి, ప్రకృతి విషయాల పట్ల వైరాగ్యం ఇవన్నీ జ్ఞానం పొందడానికి ఉండవలసిన సామాగ్రి. ఇటుకకి, ఇటుకకి మధ్య సిమెంటు ఆ ఇటుకలని ఎలా కలిపి ఉంచుతుందో! భగవంతుడితో మనల్ని అలా కలిపి ఉంచేది భక్తి. గంగానదిలో స్నానం చేయటం వల్ల పాపాలు నశిస్తాయి. అయితే జ్ఞాని సాంగత్యం వల్ల పాపపు బుద్ధిపోతుంది. ప్రాపంచిక బుద్ధి - పాపపు బుద్ధి ఆయన సాంగత్యంలో నెమ్మదిగా కరిగిపోతుంది. అది జ్ఞాని సాంగత్యంలో మనము పొందే లాభం.

మనలో ఉన్న కామము, మనఇంద్రియాల్ని పట్టుకుంటుంది. దృశ్యం ద్వారా విషయాలని సేకరిస్తుంటే అది కళ్ళకి ఉన్న కామము. అంటే, Tvలను అంటిపెట్టుకొని ఉండటములాంటివి. కొందరు భక్తి విషయాలు అసలు వినరు, లౌకిక విషయాల మీద విపరీతమైన అనురక్తి ఉంటుంది - అది చెవులకి ఉన్న కామం కొందరకి తరుచూ సెంటు వాసన ఉండాలి - అది ముక్కుకి ఉన్న కామం. కొందరకి స్పర్శ ఉండాలి - అది చర్మానికి ఉన్న కామం. కామము ఈవిధంగా ఇంద్రియాలను పట్టుకొని బయటకు లాక్కెళ్ళిపోతుంది. మనము భక్తి మార్గంలో ప్రయాణిస్తున్నామా, జ్ఞాన మార్గమా అది కాదు. ఇంద్రియాలు నిగ్రహింపబడకుండా మనస్సు అంతర్ముఖమవ్వదు అంటారు ఆచార్యులు వారు.

ఒక్క నిమిషం కూడా వృథా చేసుకోకూడదుఅనిఆచార్యులువారు అంటారు. భగవంతుడు కాల రూపంలో ఉన్నాను అన్నాడు. అతిగా విరోధాలు, అతిగా స్నేహాలు పనికిరావు. మనస్సు వాటివల్ల బాహ్యముఖం అయిపోయి లోపలకి గెంటినా వెళ్ళదు. అహంకారం-మమకారం లేకుండా పనిచేస్తూ లౌకిక విషయాలే కాదు - ఈశ్వరానుగ్రహం, మోక్షం కూడా ఆశించవద్దు, రావలసిన సమయానికి అదే వస్తుంది. దానికి భగవంతుడు ఎప్పుడో ముహూర్తం నిర్ణయించాడు. ఆకాశంలో అకస్మాత్తుగా మెరుపులు వస్తాయి. అలా హృదయంలో నుండి ఆకర్షణ వస్తుంది. ఆకర్షణ చటుక్కున మన మనస్సుని హృదయంలోకి గుంజుకుని లయం చేసేస్తుంది. ఈ లోపు వచ్చిందని, రాలేదని ఆ గొడవలు వదిలెయ్యమన్నారు ఆచార్యులవారు. పొయ్యిలో పెట్టిన కట్టెలకు ఏ గతి పడుతుందో, అలా ఆధ్యాత్మిక సంపదలేని భౌతిక సంపదకి ఆగతే పడుతుందన్నారు ఆచార్యులవారు.

ఆచార్యులవారు, వివేకా చూడామణిలో ఏమంటారంటే, ఒకసారి నీ మనస్సు గమ్యాన్ని మర్చిపోతే (If the mind forget its own subject it rolls down) అది అక్కడ ఆగదు. పల్లానికి నీరు ఏ విధంగా వెళుతుందో, అదేవిధంగా మనస్సు జారిపోయి నీచ జన్మలకు వెళ్ళిపోతుంది. అందువల్ల ఎప్పుడూ గమ్యాన్ని మరిచిపోకు, విషయాల పట్ల అజాగ్రత్త పనికిరాదు.

**సాధన మూడు భాగాలు :**

1. మనల్ని మనము పవిత్రం చేసుకోవాలి. మనలో ఉన్న అపవిత్రతే దేహగతమైన నేను. సాధన పేరు మీద దాన్ని పెంచుకోకూడదు. దీపం వెలుతురులో, చీకటిలో కూడా మనము పని చేసుకుంటాము. అలాగే మన దైనందిన జీవితంలో చైతన్యం యొక్క వెలుతురులోనే సృష్టిని చూస్తున్నాము. అలా చూస్తున్నామనే సంగతి మరిచిపోతున్నాము.

2. నువ్వు పవిత్రుడివైతే, ఏ వస్తువుని నువ్వు పొందుదాము అనుకుంటున్నావో, దాని గురించి శ్రవణం చెయ్యాలి. ఆత్మానుభవం పొందిన ఆచార్యుడు చెప్పిన వాక్కుని శ్రద్ధగా శ్రవణం చేసి, మననం చెయ్యాలి.

3. ఏ వస్తువుని పొందాలని శ్రవణం చేస్తున్నావో, జీవితం పొడుగునా దాన్ని పొందటానికి ప్రయత్నం చెయ్యి. దాన్ని అనుభవంలోకి తెచ్చుకో దానితో ఐక్యమవ్వు. ఇవి మూడు సాధనలో భాగాలు.

మన చేతిలో ఉన్నకాలాన్నిఉపయోగించుకొని హృదయంలో ఉన్న సత్యాన్ని తెలుసుకోవాలి.

ఆచార్యులు వారంటారు, సత్పురుషులు, సజ్జనులతోటి స్నేహంతో మీకు దేవతలఅనుగ్రహంతోటి సమానమైన సహాయం అందుతుంది. అంటే, దేవతల ప్రీత్యర్థం, క్రతువులు, యజ్ఞాలు నిర్వహిస్తే ఎటువంటి ఫలితాన్ని అందిస్తారో! దానికి మించిన ఫలితం సజ్జన సాంగత్యంలో మీకు కలుగజేస్తుంది.

వ్యర్థమైన విషయాలకి, వ్యర్థమైన వ్యక్తులకి దూరంగా ఉండండి అన్నారు ఆచార్యులవారు. దయగల హృదయమే ఆరామం. దయగల హృదయమే క్షేత్రం. దయగల హృదయంలో భగవంతుడు నివసిస్తాడు.

ఆచార్యుల వారంటారు, మీరు శ్రద్ధ-వినయము-భక్తి జీవితంలో జాగ్రత్తగా కాపాడుకోండి. భగవంతుడే భక్తుడికి కొన్ని ఆకర్షణలు చూపించి, పరీక్ష పెడతాడు. అందువలన ఈ మూడింటిని జాగ్రత్తగా కాపాడుకుంటే, నీటిలో చేపకి వల ఎట్టిదో సాధకుడికి ఆకర్షణలు అట్టివి.

ఆచార్యుల వారంటారు, నువ్వు పుట్టిన గ్రామంలో సత్పురుషులు లేకపోతే, లౌకికుల గుంపులో పడి నీచ జీవితము గడిపే బదులు, ఆ గ్రామం వదిలి వెళ్ళిపోండి. ఆ గ్రామం వదిలి వెళ్ళటం వలన కష్టాలు ఎదురైనా పర్వాలేదు, ఎందుకంటే ఆ కష్టం ఈ జన్మకు మాత్రమే. కానీ లౌకికుల గుంపులో పడితే, నీచ జన్మల్లోకి నెట్టబడతాము.

ఆచార్యుల వారంటారు, దుఃఖం, కోరిక, కోపం, భయం మనిషిని పీడిస్తాయి. ఏ పనులు మనము ఇప్పుడు చేస్తే, ఏ మాటలు మనము ఇప్పుడు మాట్లాడితే, ఎటువంటి ఆలోచనలు కలిగి ఉంటే, అవి భవిష్యత్తులో దుఃఖంగా, అశాంతిగా మారతాయో! దుఃఖ పీడని మోసుకు వస్తాయో! అవి ఇప్పుడే ఈ క్షణం నుంచే చెయ్యకుండా వాటికి దూరంగా ఉండండి. సత్పురుషులు, సజ్జనులతోటి స్నేహం చేయటం వల్ల దేవతలతో సమానమైన సహాయమందుతుంది. దేవతల ప్రీత్యర్థం క్రతువులు, యజ్ఞాలు నిర్వహిస్తే ఎటువంటి ఫలితం అందుతుందో, అంతకుమించిన ఫలితం సజ్జన సాంగత్యం కలగజేస్తుంది. భూమ్మీద సజ్జనుడిగా జీవించాలి. మానవుడికి సజ్జనత్వం ఎలా వస్తుందంటే, ''ఇతరులు తన పట్ల ఏ పని చేస్తే, ఏ మాట మాట్లాడితే తన మనసుకి బాధ కలుగుతుందో! తాను ఇతరుల పట్ల ఆ పనులు, ఆ మాటలు ఆ ప్రవర్తన లేకుండా ఉంటాడో, అట్టివాడికి సజ్జనత్వం వస్తుంది''.

యోగబుద్ధి కలిగేవరకు దేహబుద్ధి తొలగదు. బ్రహ్మాత్మ బుద్ధి కలిగేవరకు దేహబుద్ధి పోదు. equanimity in mind, outlook, and behavior ఉన్నవాడే యోగి. కష్టసుఖాలను సమానంగా తీసుకునే బుద్ధి ఉన్నవాడు యోగి.

పూజ మనస్సు అణగటానికి, ఇంద్రియ నిగ్రహానికి క్రమశిక్షణ కోసం పెట్టారు పెద్దలు. ఇవన్నీ చేస్తుంటే, భగవంతుడి పట్ల భక్తి-విశ్వాసాలు మనకి పెరుగుతాయని చెబుతున్నారు. మనకి తెలియకుండానే, మన శవాలు భూమ్మీద తిరుగుతుండగానే అంతులేని సుఖశాంతులలో ఓలలాడుతాము. శరీరం ఉండగా, ముక్తుడిగా జీవిస్తాము. శరీరం పడిపోయాక ముక్తి-సుఖంలో లయిస్తాము. పరమాత్మ ధ్యాసలో ఇవన్నీ ఆచరిస్తూ, జీవిస్తూ ఉంటే, వ్యర్థమైన తలంపులు, వ్యర్థమైన పనులు, వ్యర్థమైన మాటలకి దూరమైపోతాము. నాచురల్ గా పవిత్రమైపోతాము. సాధన చేస్తున్నామని తెలియకుండానే సాధన పూర్తయిపోతుంది. ఇది సత్యమని నీకు వాగ్దానం చేసి

చెప్తున్నాను అర్జునా!అన్నాడు పరమాత్మ. మన స్థాయికి దిగి వచ్చి, చెప్పాడు దయాపూర్ణుడు. జీవుడికి సందేహాలు వెంటాడతాయి. అర్జునా! సందేహించకు నీ హితవు కోరి, నీ శ్రేయస్సు కోరి, నీ మంచి కోరి చెబుతున్నాను అర్జునా! అంటున్నాడు పరమాత్మ. ఇలా నీవు జీవిస్తూ ఉంటే, కాలవలో నీరు, నదిలో నీరు ప్రవహించి సముద్రంలో ఐక్యమయ్యేకా ఎలా వేరుగా ఉండవో!అలా నీవు నాలో ఐక్యమైపోతావు. అప్పుడు మనిద్దరం వేరుగా ఉండము, ఒకే ముద్ద అయ్యిపోతాము. గురువు హృదయం పొంగి ప్రవహిస్తూ ఉంటే, ఆ జీవనదిలో మునిగినవాడు అదృష్టవంతుడు. ఒడ్డున కూర్చుని ఏడ్చేవాడు దురదృష్టవంతుడు. అడిగితే చెప్పే గురువు వేరు, తనంతట తాను ప్రవాహంలో అనుగ్రహించి చెప్పే గురువు వేరు. గురువు అనుగ్రహం కట్టలు తెంచుకొని ప్రవహిస్తూ ఉంటే ఆ సమక్షంలో కాలం ఆగిపోతుంది, భక్తులు దేహస్మృతిని కోల్పోతారు. ఆ ఆనందం ముందు వైకుంఠంలో దేవతలు పొందే ఆనందం ఏ పాటిదనిపిస్తుంది. నిరంతరం దైవచింతన, గురుచింతన చేస్తుంటే ఈ లోకాన్ని భోగించాలనే భోగబుద్ధి నశించి ఈశ్వరుడిని పొందాలనే యోగబుద్ధి కలుగుతుంది.

కారణం లేకుండా కార్యం ఉండదు. మనము భగవంతుడి చేతిలో కీలుబొమ్మలము. మనిషి బాహ్యానికి బాగానే ఉన్నా, సంఘటనల మధ్యలో పరీక్షలు ఎదురైనప్పుడు మనము ఎలా నిలబడుతున్నామనేది మన inner strength, spiritual strength మీద ఆధారపడి ఉంటుంది. భగవంతుడి పట్ల నీకు ఉన్న విశ్వాసం నిజమైతే పెద్ద సంఘటన కూడా చిన్నదిగానే కనిపిస్తుంది.

ఎన్నో జన్మల పుణ్యబలం ఉంటేనే కానీ, మానవ జన్మ రాదు. మళ్ళీ ఎంతో పుణ్యబలం ఉంటే కానీ, మోక్షం పొందాలనే కాంక్ష కలగదు. ఎంతో పుణ్యబలం ఉంటే గాని సత్పురుషులని గుర్తించలేము, ఆయన్ని ఆశ్రయించి తరించలేము. అట్టి అమూల్యమైన ఈ జీవితాన్ని వృథా చేసుకోవద్దు.

whatever comes and goes out of our life, we need to accept it.

నీళ్ళు పోసిన కుండకి చిల్లు ఉంటే ఆ నీరు నిలబడకుండా కారిపోతుంది. అలాగే మనము ఎంత సాధన చేసినా మనకి ఎవరిమీదైనా అసూయ ఉంటే సాధనలో

రాణింపు ఉండదు. మనుష్యులలో పెద్ద బలహీనత అసూయ. back biting ఎదురుగా పొగిడి, చాటుగా తిట్టేవారితో జాగ్రత్తగా ఉండమన్నారు ఆచార్యులు.

సూర్యుడికి ప్రకాశం సహజము. అది తెచ్చి పెట్టుకున్నది కాదు, సహజంగా కొందరికి ఎన్ని కష్టాలు ఉన్నా మంచితనమనేది సహజం. అగ్నికి వేడి సహజం, నీటికి తడి సహజం, చంద్రుడికి చల్లదనం సహజం, జీవనదికి ప్రవాహం సహజం, జీవ లక్షణాలు మనలో ఉన్నంత కాలం దుఃఖము సహజం. ఉన్నది ఒక్కటంటే ఒక్కటే. అయితే, అదే మనకి దేహంగా, మనస్సుగా కనిపిస్తోంది. శవ-బుద్ధి నశిస్తే గాని, శివ-బుద్ధి కలగదు. శవ-బుద్ధి లోనుండి బయటకు రావడమే సాధన. ఆచార్యుల వారు అంటారు, ఎవరైనా కక్కిన కూడు వైపు చూస్తారా? ఒకసారి శవ-బుద్ధి నశించి, శివ-బుద్ధి కలిగితే శవం మీదకి అంటే, దేహము మీదకి మనస్సు వెళ్ళనే వెళ్ళదు, అంటే, అది కక్కిన కూడు వంటిదన్నారు.

ఆచార్యులవారు, బాహ్యంగా సత్పురుషుల సహవాసం చేయండి. హృదయంలో ఈశ్వరుడి పట్ల భక్తి కలిగి ఉండు అని చెబుతారు. భగవాన్ మీకు విభక్తి లేకపోతే భక్తి అవసరం లేదు అంటారు. విభక్తితో ఉన్న వాడికి భక్తి అంటారు. భగవంతుడి కంటే సత్పరుషుడే ఎక్కువ, సత్పురుషుడు దైవం దగ్గరికి దారి చూపిస్తాడు.

మంచికి ఫలం సుఖం, చెడుకి ఫలం దుఃఖం. మనము మంచి చేసి సుఖాన్ని కోరుకోవడం కాదు, చెడు చేసన్తూ సుఖాన్ని కోరుకుంటున్నాము. అదెలా సాధ్యపడుతుంది? మనస్సుని ముందు గాడిలో పెట్టుకోవాలి. మంచిని చెయ్యి, చెడుకు దూరంగా ఉండు అన్నాడు పరమాత్మ. మంచి మన హృదయంలో ఉన్న ఈశ్వరుడిని పొందటానికి సహకరిస్తుంది. చెడు హృదయానికి నిన్ను దూరం చేస్తుంది. మంచి నిష్కామంగా చేస్తే అంతఃకరణాన్ని శుభ్రం చేస్తుంది. జీవుడు పవిత్రుడవుతాడు.

కావేరీ నది పుట్టిన చోటుని మేకదాటు అంటారు. అది శ్రీరంగంలో ఎంతో విశాలంగా ఉంటుంది. అలాగే తపస్సు, విద్య సాధకుడి మనస్సుని విశాలం చెయ్యాలి. మనస్సు విశాలమవ్వకుండా ఆత్మజ్ఞానం కలగదు.

మనకి ముందు సరస్వతీ కటాక్షం. తరువాత లక్ష్మీ కటాక్షం. అంటే ముందు బుద్ధి, తరువాత ధనం. బుద్ధి వచ్చిన తరువాత ధనం వస్తే, ఆ బుద్ధిని దనం

పాడుచెయ్యలేదు. బుద్ధి లేకుండా ధనం కనుక వస్తే, ఆ బుద్ధిని ధనం పాడుచేస్తుంది. ధనవ్యామోహం, ఇంటి మీద వ్యామోహం, దేహ వ్యామోహం, స్త్రీ-పురుష వ్యామోహం వీటిలో నుండి అమ్మ దయ లేకుండా బయటకు రాలేము. అంటే, వలని నీటిలో వేసి తీసినప్పుడు ఒక చుక్క నీరు కూడా వలలో ఉండదు. అలాగే అమ్మ కటాక్షం లేకపోతే, ఎన్ని సాధనలు చేసినా జీవుడికి పరిపక్వత రాదు.

పులి మనిషి మాంసం తింటే, ఆ రుచిని అది వదిలి పెట్టలేదు. అలాగే పదవి, అధికారం, గౌరవం, ధనం యొక్క రుచిని చూసిన మనిషి వాటిని విడిచిపెట్టలేడు. వాడి మనస్సు వాటి మీదకే నిరంతరం వెళ్ళిపోతుంది.

## గురుపాదం గురువాక్యం - మోక్షమూలం గురుకృప

భగవంతుడే గురువుగా వస్తాడు. మనము గురువుని ఆ స్థాయిలో చూడలేకపోయినా, కనీసం మనకి పెద్ద బంధువు అనుకోండి.

గురువు మౌనం, గురువు వాక్కు, నీ అహంభావనని, నీ అజ్ఞానాన్ని బద్దలకొడుతుంది. నీ స్వరూపంలో నిన్ను ఐక్యం చేస్తుంది. గురువు అనుగ్రహం, కొండలు-నదులు-సముద్రాలు దాటి, ఆ శిష్యుడు ఎక్కడ ఉన్నా తడిపి తీరుతుంది.

రాముడు, కృష్ణుడు అవతారపురుషులు. వీరు దుష్ట శిక్షణ- శిష్ట రక్షణకోసం బయట ఉన్న రాక్షసుల్ని, శత్రువుల్ని జయించడానికి వచ్చారు. భగవాన్, రామకృష్ణులు వంటి వారు గురువులు. వీరు మనిషిలో ఉన్న లోపల రాక్షసుడ్ని, అంతర్గత శత్రువుని సంహరించి జీవుడిని భగవంతుడిలో ఐక్యం చెయ్యడానికి వచ్చారు.

గురువు మార్గాన్ని మనకి సూచించి, ఇలా నడుచుకో అని బోధిస్తాడు. ప్రయాణం సాధకుడే చెయ్యాలి. నడవవలసింది సాధకుడే. రాబందులు, అన్ని పక్షుల కంటే పైన ఆకాశంలో తిరుగుతాయి. కానీ వాటి చూపు భూమి మీద ఉన్న శవాల మీదే ఉంటుంది. అలా శాస్త్ర వాసన ఉన్న పండితుడు యొక్క మనస్సు బాహ్య ముఖానికి వెళుతుంది కానీ అంతర్ముఖమవ్వదు. అంతర్ముఖమవ్వకుండా ఆత్మజ్ఞానం కలుగదు. ఒక తల్లి - చంకలో ఒక పిల్లవాడిని, చేత్తో ఇంకో పిల్లవాడిని పట్టుకొని రోడ్డు మీద నడుస్తోంది. ఒక కుక్క ఎదురుగా వచ్చి, మొరిగింది. చంకనున్న పిల్లవాడు తల్లిని మరింత గట్టిగా హత్తుకుని ఉన్నాడు. చేతిని పట్టుకున్న పిల్లవాడు పారిపోయి పడిపోయాడు. గురువు ఎన్నుకున్న భక్తుడు చంకనున్న బిడ్డవలె గురువు fold లో నుండి బయటికి రాడు. చేతిని పట్టుకున్న వాడు మనము గురువుని ఆశ్రయించటము లాంటిది. మనకి పట్టుకునే శక్తి ఉండక జారిపోతాము. ఆయన మనల్ని ఎన్నుకుంటే తిరుగులేదు.

ఆయన పట్ల గౌరవభావాన్ని కలిగి ఉండాలి. ఎక్కడైనా అద్వైతం మంచిదే కానీ గురువు వద్ద మాత్రం అద్వైతం పనికిరాదు. వాల్మీకి ఏమంటారంటే, కృతజ్ఞత లేని వాడు - దేహాన్ని విడిచిపెట్టేస్తే ఆ శవాన్ని - మాంసాన్ని ఇష్టంగా తినే రాబందులు కూడా ముట్టుకోవు, అంత హేయమైనది.

రైలు పెట్టేడంత దుఃఖం ఉన్నా అది పోవాలంటే ఒక్కటే మందు - అదే శరణాగతి. శరణాగతి ఉంటే ఎంత దుఃఖం ఉన్నా ఆరిపోతుంది. చేతి మీద మనకి స్పర్శ ఎలా తెలుస్తుందో అలా ఈశ్వరుడి దయ తెలుస్తూ ఉంటుంది. దయ reveal అయినప్పుడు ఎంత బాధ ఉన్నా తొలగిపోతుంది. రాత్రి నిద్రలో వచ్చేది చిన్న కల, జీవితం ఒక పెద్దకల అన్నారు ఆచార్యులవారు. అప్పుడు, అక్కడ ఉన్న భక్తులు ఆచార్యుల వారితో, మనము మాట్లాడుకోవటం కూడా కలలో భాగమే కదా! ఎందుకు ఈ బోధ అన్నారు. స్వప్నంలో సింహం అబద్ధమైనా మనమెలుకువ నిజం. అలాగే గురువు యొక్క బోధ కూడా అబద్ధమైనా, అజ్ఞానమనే నిద్రలో నుండి జ్ఞానమనే మెలుకువ రావటానికి సింహస్వప్నంలా ఉపయోగపడుతుందన్నారు ఆచార్యులవారు.

శాస్త్రం ఏమి చెబుతోందంటే, ప్రపంచంలో ఉన్న సంపద, గౌరవాలు, అన్నీ కలిపినా, ఆత్మ-సుఖంలో ఉన్న ఆనందము అటుంచండి - అవి నిద్రలో ఉన్న సుఖాన్ని కూడా ఇవ్వలేవు, ఇవన్నీ బట్టల మీద దుమ్ము వంటివి. గౌరవాలు, అగౌరవాలు, మహిమలు ఇవన్నీ బాహ్యమైన గొడవలు. వాటివల్ల ఆత్మజ్ఞానం రాదు.

Subject oriented గా ఉంటే mind withdraw అవుతుంది. Mind దాని source లో truth reveal అవుతుంది. సాధకుడు బాహ్య గొడవల్లోకి వెళ్ళకూడదు. మన సాధన ఎంత రహస్యంగా ఉంటే అంతమంచిది. మనము వీరు మంచివారు, వారుచెడ్డవారు అనే తీర్పులు ఇవ్వటము మానెయ్యాలి. దానివల్ల మనస్సు మలినమైపోతుంది.

గురువు చెప్పిన సబ్జెక్ట్ దగ్గర compromise అవ్వకుండా మన జీవితంలో implement చేసుకోవాలి. దేహం దాని courseని బట్టి మరణం వచ్చేవరకూ వెళుతూ ఉంటుంది. ఒకవేళ ఆ దేహం కష్ట ప్రారబ్ధాన్ని అనుభవిస్తున్నా నష్టం లేదు. మనకి గురువు చెప్పిన subject పట్ల proper understanding ఉంటే మనకున్న కష్టం కూడా సుఖంగా మారిపోతుంది. అందుకే subject understanding itself is yoga.

గురువు చేసే పని ఎలా ఉంటుందంటే, రామానుజుడి వద్దకి ఒక భక్తుడు వచ్చేవాడు. వాడికి ఒక రోజు ఒక అందమైన అమ్మాయి కనిపించింది. ఆ అమ్మాయిని వివాహం చేసుకోవాలనే కోరిక కలిగింది. ఆ భక్తుడు రామానుజుడితో, ఆ అమ్మాయి

చాలా అందంగా ఉంది, ఆమె నేత్రాలు ఎంతో సౌందర్యవంతంగా ఉన్నాయి అని చెప్పి, ఆమెను వివాహం చేసుకోవాలని ఉంది అన్నాడు. రామానుజులు మౌనంగా విన్నారు. మరుసటి రోజు ఆ భక్తుడిని తీసుకొని శ్రీరంగంలో ఉన్న రంగనాథుడి గుడికి వెళ్ళారు. లోపలకి వెళ్ళి, రంగనాథుడి దర్శనం చేసుకుంటున్నారు. అప్పుడు రామానుజుడు ఆ భక్తుడితో, నువ్వు వివాహం చేసుకోవాలనుకునే స్త్రీ నేత్రాలు రంగనాథుడి నేత్రాల కంటే సౌందర్యంగా ఉన్నాయా! ప్రేమ, దయ, కరుణ వాత్సల్యం నిండిన ఈ రంగనాథుడి నేత్రాల సౌందర్యం కంటే, రాగద్వేషాలతో నిండిన స్త్రీ నేత్రాల సౌందర్యం నీకు గొప్పగా కనిపిస్తోందా? అని అడిగారు. అలా భక్తుడికి ఆ స్త్రీ పట్ల ఉన్న వ్యామోహాన్ని పరమాత్మ సమక్షంలో తీసేసి కాల్చి బూడిదచేశారు. అలా ఉ ంటుంది గురువు చేసే పని. మన బలహీనతని మనకి చూపించి మనకి తెలియజేసి దాన్ని మనలో నుండి తొలగిస్తారు, అది spiritual surgery.

సత్పురుషుల సాంగత్యం వలన మనలో ఉన్న చెడు రాలిపోయి సత్పురుషుడిలో ఉన్న గుణసంపద మనల్ని వరిస్తుంది. లోకంలో నీచమైన సహవాసాలు చేసే నీచ-జనుల్ని కుక్కలు అన్నారు ఆచార్యులు వారు. వాటిలోంచి బయటకి రావాలని మనకి అంత గట్టిగా చెప్పారు. ఆయన కఠినమైన మాటలు కూడా అనుగ్రహమే. ఆచార్యునికి కనుక స్వార్ధముఉంటే, మన నుండి ఏదైనా పొందాలనుకుంటే మనల్ని పొగిడేవారు. కానీ, ఆ అవసరం ఆయనకి లేదు. భూమ్మీద ఏదైనా చేసి పొందవలసినదంటూ జ్ఞానికిలేదు. మనకి ఏదన్నా మహిమలు ఉంటే, వాటికంటే మనకిఉన్న సహనం, ఓర్పు, నేర్పు వెయ్యిరెట్లు గొప్పవి.

మంచి చేసినవాడికి దుర్గతి లేదు, మంచివారితో సహవాసం మంచి వైపుగా మేల్కొలుపుతుంది. దుష్ట సహవాసాలు మానలేకపోతే మనలో దుష్టత్వం వస్తుంది. మనస్సు పరిశుద్ధమవ్వకుండా హృదయాకారము చెందదు. మధ్వాచార్యుల వారు అంటారు, నీచ సహవాసాలకంటే, పులి నోట్లో పడిపోవడం మంచిది. పులి దేహాన్ని మాత్రమే చంపుతుంది, నీచుడు జన్మజన్మలకి నీచత్వాన్ని నింపేస్తాడు. ఎన్నో జన్మలు పాడు చేసుకునే కంటే, పులి నోట్లో పడిపోయినా నష్టం లేదన్నారు. తల్లి , తన పిల్లలు చెప్పిన మాట వినకపోతే! ఒక్కొక్కసారి దెబ్బలు కొడుతుంది. ఎందుకంటే, తన పిల్లలు పాడవ్వకూడదని.

గురువు-ప్రేమ, తల్లి ప్రేమకి మించిన ప్రేమ. తల్లి ప్రేమ earth bound; గురువు ప్రేమ divine love. గురువు ప్రేమ భూమికి సంబంధించినది కాదు. గురువులో అనుగ్రహం తప్పించి మరొకటి లేదు. లోకంలో ఏమి జరుగుతోందో, మన మనస్సు చూస్తోంది. మన మనస్సులో ఏం జరుగుతోందో, మన మనస్సు తోటి మనల్ని మనము చూసుకోవాలి. కొరివి కట్టి శవానికి నిప్పు పెడితే, శవంతో పాటుగా అది కాలి భస్మమయిపోతుంది. మనస్సుని గమనిస్తూ, మనసు తోటి మనస్సుని విచారణ చేసుకుంటే అది నెమ్మదిగా నశిస్తుంది. మనస్సుని పరిశీలించుకునే వాడు యోగి, ప్రకృతిని పరిశీలించేవాడు సైంటిస్ట్. కబీర్ అంటారు, ఈ సృష్టి మంచి-చెడుల మిశ్రమంగా శాస్త్రం చెబుతోందని, చెడు ఎక్కడ ఉందని సృష్టిలో వెదకడం మొదలుపెడితే బయట ఎక్కడా నాకు చెడు కనిపించలేదు, లోపల చూసుకుంటే నా లోపల కనిపించింది. చాకలివాడు బట్టలని ఎలా బండకేసి బాది, ఉతికి ఎండకి ఎలా ఆరబెడతాడో, అలా నా మనస్సుని బాగు చేసుకున్నాను అన్నారు కబీరు. అదే సాధనంటే, అలా జీవించేవాడు యోగి.

గురువు, మనకి పండో, ఫలమో ఇచ్చి పలకరించటము, చేతులతో ఆశీర్వదించటం కాదు. అనుగ్రహం అంటే, ఆయన మాట, ఆయన చూపు, ఆయన హృదయం మనల్ని వెంటాడి లోపల పరిశీలన చేసుకునే బుద్ధిని తీసుకువచ్చి, మనల్ని హెచ్చరించి, మన దోషపు బుద్ధిని మనకి చూపించి మన స్వభావం మార్చుకోవాలనే తీవ్రమైన తపనని మనకు కలుగజేసి, అందులోంచి విడుదలవ్వటానికి ఆయన బోధను సపోర్ట్ గా ఇవ్వటమే అనుగ్రహం.

ఇకనుండైనా, భగవంతుడు గురించి బ్రతికితే జ్ఞానం వస్తుంది. ఈ అహంకారమనే ఏనుగు, గురువనే సింహనికి మాత్రమే లొంగుతుంది.

గురువు బోధస్వరూపుడిగా ఉండాలి కానీ భక్తులకి బరువుగా ఉండకూడదు. మన హృదయంలో ఉన్న నిజము వైపు మనల్ని, తీసుకువెళ్ళి అందులో మనల్ని స్థిరపరిచే వరకు గురువు విశ్రమించడు.

గురువు బోధ మనకి నచ్చినట్లు ఉండదు. మనము బాగుపడి, మనల్ని మనము ఉద్ధరించుకునేలా గురువు మనకి బోధిస్తాడు, అది శ్రేయస్సు. మనకి

ఇష్టమైనట్లు, మనము కోరుకున్నట్లు చెబితే! అది ప్రేయస్సు. గురువు మనము పవిత్రమవ్వటానికి మాత్రమే బోధించి, మనకి మార్గోపదేశం చేస్తాడు. ప్రేయస్సు కోసం చెప్పేవాడు గురువు కాదు, రాక్షసుడు.

ఏ గురువుని ఆరాధించినా, మన రూప బుద్ధి, నామ బుద్ధి కరగాలి. అలా కరిగితే కానీ, ఆత్మ అనే గూట్లో మనస్సు పడదు. నాలో ఏదో ప్రత్యేకత ఉంది, దాన్ని కాపాడుకోవాలనుకోవడం పెద్ద జబ్బు. ఈ జబ్బు మనల్ని హృదయంలోకి దిగనివ్వదు. క్యాన్సర్ కంటే ప్రమాదమైనది. క్యాన్సర్ ముదిరిపోతే మందులు పనిచెయ్యవు, అలాగే ఈ బుద్ధి బలంగా ఉంటే, మన లోపల మనము ఎన్ని సాధనలు చేసినా మనస్సు వెనక్కి తిరగదు. హృదయంలోకి దిగే అవకాశమే లేదు.

గురువు హృదయాన్ని చీల్చుకుని వచ్చిన భోధ అనే జ్ఞాన కిరణాలు, సూర్యుని నుండి వచ్చిన కిరణాలు లోకంలో ఉన్న చీకటిని తొలగించి, వెలుగుతో నింపుతాయి. అవి జీవుడిలో ఉన్న అజ్ఞానమనే చీకటిని తొలగించి జ్ఞానమనే తేజస్సుని నింపుతాయి.

భగవంతుడిలో శిక్షణ ఒక భాగము, రక్షణ ఒక భాగము, ఇవి రెండూ ఉంటాయి. గురువులో రక్షణ భాగము తప్పించి మరొకటి ఉండదు.

ఎంతో కటిక చీకటిని ఒక చిన్న చిరు దీపం ఎలా తొలగిస్తుందో! అలా గురువాక్యం జన్మజన్మల నుంచి మనలో పేరుకొని ఉన్న అజ్ఞానం అనే చీకటిని పారద్రోలుతుంది.

బ్రహ్మ సృష్టిస్తాడు; విష్ణువు పోషిస్తాడు; శివుడు లయం చేసుకుంటాడు. మనకి త్రిమూర్తులు అక్కర్లేదు ఒక గురు-మూర్తి చాలు. చెరువులో ఉన్న నీరు ఆత్మ, త్రిమూర్తులు లేదా హృదయం అనుకుంటే, గొట్టాల ద్వారా మన ఇంటికి వచ్చి, మన దాహాన్ని, మన అవసరాల్ని తీర్చే నీరు గురుమూర్తి. త్రిమూర్తులు చేసే పనినంతటని 'గురుమూర్తి' ఒక్కరే చెయ్యగలరు.

ఇక్కడ ఒట్టిమాటలు చెప్పటం కాదు, ఆ మాటలు యొక్క అనుభవం కూడా గురువు మీకు ప్రసాదిస్తాడు. అంతేకాదు, గురువు యొక్క సమక్షంలో సమస్తమైన సుఖశాంతులన్నీ మిమ్మల్ని వరిస్తాయి.

గురువు యొక్క చూపు, మాట, స్పర్శ, కదలిక అన్ని అనుగ్రహమే. గురువు దేహం ధరించి ఉండటమే అనుగ్రహం. మహాత్ముల పాద స్పర్శ లో నుండి వచ్చే ఆనందం కోసం భూమాత ఎన్నో భరిస్తుంది. అన్నిటికంటే ఉత్తమమైన దీక్ష గురువు యొక్క  మౌనమే.

గురువు మౌనం మన మాటల్ని తగ్గించి, మన భయాన్ని తొలగించి, మనస్సుని అంతర్ముఖపరిచి, మనస్సుని దాని మూలంలోకి నెట్టివేస్తుంది. గురువు యొక్క మౌనం, ప్రేమ, ఆప్యాయత మన understanding కి అతీతం. మనము అర్థం చేసుకోలేము. మన మనస్సుకి, వాక్కుకి అది అందదు. నిజమైన భగవంతుడు సజీవంగా శాంతితో, కాంతితో, సుఖంతో, ఆనందంతో మన హృదయంలో వెలుగుతున్నాడు. అక్కడికి గురువు యొక్క మౌనం మనల్ని తోలుకుపోతుంది.

బ్రహ్మలా జ్ఞాన కాంక్షని కలగజేస్తాడు, ఆయన సాంగత్యంలో పొందిన జ్ఞానాన్ని జారిపోకుండా అందులో స్థిరపడేలా విష్ణువులా చూస్తాడు, మనలో ఉన్న కలుపు మొక్కల్ని తొలగించి, జ్ఞానంలో స్థిరపరిచి... శివుడిలా జ్ఞాన గంగలో మనల్ని లయింప చేస్తాడు. వాడే గురుమూర్తి.

రామానుజులు : జ్ఞానం, మోక్షం మాట అటుంచండి. మనం బాగుపడాలి అంటే ఎంతోకొంత పూర్వ పుణ్యం, సత్కర్మ లేకపోతే, పెద్దల్ని సేవించి ఉండకపోతే, మన ఇంద్రియాలకి ఉన్న ఒక్క దోషాన్ని కూడా బుద్ధి గ్రహించలేదు. గురువు యొక్క కృప నీమీద వర్షిస్తే, ఆ కృపా వర్షంలో నీ బుద్ధి నీకున్న బలహీనతల్ని గ్రహిస్తుంది. వాటిని గ్రహించగలిగితేనే, విడిచిపెట్టాలనే సంకల్పం వస్తుంది. గాఢనిద్రలో ఉన్నవాడు మేల్కొనపోక పోతే, తట్టి ఎలా లేపుతామో, అలా గురువు యొక్క మౌనం, గురువు యొక్క బోధ అజ్ఞానమనే నిద్రలో నుండి మనల్ని తట్టి లేపుతుంది.

గురువుని కొందరు ఏమని ప్రార్థిస్తారంటే, మాకు చాలా ఇంద్రియాలున్నాయి. ఏ ఇంద్రియాల ద్వారా - ఏ పొరపాటు జరగకుండా చూడు తండ్రీ! అని ప్రార్థిస్తారు. నాన్నగారు ఒకసారి హైదరాబాదులో ఉదయం నుండి సాయంత్రం వరకు విరామం లేకుండా చాలామంది భక్తుల గృహాలకి వెళ్ళి వచ్చారు. ఆయన వెంట ఉన్న వారికి కూడా అలసటగా అనిపించింది. నాన్నగారు మీకు ఉదయం నుండి విశ్రాంతి లేదని

నాన్నగారితో ఆయన వెంట ఉన్నవారంటే, నాన్నగారు వెంటనే, rest ఎక్కువైతే rust పడతాము. దేహం ఒక పనిముట్టు. వస్తువుని వాడితే అరిగిపోయిపోతుంది, వాడకపోతే తుప్పు పట్టి పోతుంది. భూమి మీద ఎవరికీ ఉపయోగపడకుండా తుప్పుపట్టి పోవటం కన్నా మన తోటివారికి ఉపయోగపడుతూ అరిగిపోయిపోవటం మంచిదన్నారు. జ్ఞాని మాట అలౌకికమైనది. అదే మన మనస్సుని దొర్లించుకుంటూ హృదయంలోకి గెంటుకుపోతుంది. అది మాటకాదు - మాట రూపంలో ఉన్న దయ.

నాన్నగారు: "సమస్త జీవకోటిని ప్రేమించడమే నా స్వభావం. అది నన్ను గురువు (భగవాన్ రమణుల) హృదయంలోకి లాక్కువెళ్ళి అక్కడ స్థిరపరిచింది. ఈ జీవితం భగవాన్ బోధ, భగవాన్ భక్తులు, భగవాన్ పనికి అంకితం".

జన్మ జన్మల పుణ్య ఫలం వల్ల మిథ్యా నేనుకి (దొంగనేను), వేరుబుద్ధి ఉన్న జీవుడికి...దేహదారుడైన గురువు కావాలనే తపన కలుగుతుంది. అప్పుడు ఎవరు నా గురువనే అన్వేషణ ప్రారంభమవుతుంది. వాడి తపనని చూసి, లోపల ఉన్న ఆత్మే దేహం ధరించి వాడిని చేరుతుంది. వాడే గురువు, సాధన లేకుండా సిద్ధి కలగదు. మనము ఆహారం ఎంత తీసుకున్నా, మనకి ఎంత జీర్ణమయ్యిందో అది మాత్రమే ఉపకారం చేస్తుంది. అలాగే మనము ఎంత విన్నా ఎంత అర్థమయ్యిందో అంతే మనకి ఉపయోగపడుతుంది.

జ్ఞాని సాధ్యమైనంతవరకు మౌనంగానే బోధిస్తారు. మాటలకి సత్యం, జ్ఞానం అందదు. మనలో ఆ మౌనాన్ని అందుకునే పవిత్రత - యోగ్యత లేకపోతే మన మీద ప్రేమతో, దయతో మాట్లాడతారు. గురువంటే దేహం కాదు. పరిశుద్ధ హృదయంలోకి ప్రవేశించేటప్పుడు తెలుస్తుంది ఆయన మనల్ని సక్రమంగా తీర్చిదిద్దటానికి ఎంతో కృషి చేశారని.

ఛాందోగ్యోపనిషత్ లో సనత్ కుమారుడు అంటారు, పెద్ద పెద్ద విషయాలు ఎలా వున్నా, ముందు ఇవి సరి చేసుకోండి. అవి ఏమిటంటే:

1. ఆహార శుద్ధి ఉండాలి. ఆహారం శుద్ధిగా ఉంటే, అంతఃకరణ శుద్ధి అవుతుంది. మనస్సు శుద్ధి అయిన వాడికే జ్ఞానం పొందాలనే బుద్ధి కలుగుతుంది. ఎర్ర చీమని పంచదారలో వేస్తే, అది అందులో నుండి ఎలా

బయటికి రాదో అలా జ్ఞానంలో నుండి మనసు బయటకిరాదు.

2. దైనందిన జీవితంలో నువ్వు చేసే పని స్వార్థరహితంగా ఉంటే, పవిత్రులమవుతాము. స్వార్థపూరితమైన పనుల వల్ల అపవిత్రత పెరుగుతుంది.

3. మాట సరళంగా, పవిత్రంగా, ప్రేమ పూరితంగా ఉండాలి. మనము బాగుపడటానికి ఉపయోగపడాలి. listen more; speak less. ఇంద్రియాలకి నిగ్రహం ఉండాలి, మనస్సుకి చాపల్యం తగ్గాలి, బుద్ధికి ఏకాగ్రత రావాలి. అప్పుడు మనము అంతర్ముఖంగా జీవించగలుగుతాము.

4. మన జీవిత గమ్యం ఆత్మ జ్ఞానం. అది మరిచిపోకూడదు. మనస్సు గమ్యాన్ని మరిచిపోతే, ఆ జన్మకాజన్మ పతనమైపోతాము.

5. వీలైనంతవరకూ సంకల్పాలు తగ్గించుకోవాలి. లేకపోతే అహంభావన పెరిగిపోతుంది.

6. ఈశ్వర ప్రీత్యర్థము జీవించాలి. మన త్రికరణాలని భగవంతుడికి అర్పిస్తే, మనకి ఆయన్ని తెలుసుకునే ప్రసాద బుద్ధిని అనుగ్రహిస్తాడు. సూర్యుడు అందరికీ వెలుగునిస్తాడు. కొందరు సద్వినియోగం చేసుకొని బాగుపడతారు, మరికొందరు దుర్వినియోగం చేసుకొని పతనమవుతారు. అంటే మన బుద్ధిని బట్టి మనకి సూర్యుని వెలుగు ఉపయోగపడుతుంది.

కాకులు చంద్రుడిని ఎలా గుర్తించలేవో! అలా కర్మ ఫలం పట్ల ఆసక్తి ఉన్న జీవికి భగవద్గీత విన్నా, చదివినా కూడా అర్థం కాదు అన్నారు జ్ఞానదేవుడు. సమస్త అరిష్టాలకి కారణం కోరికే. కోరిక మనకి ఫుల్‌ఫిల్ అవ్వనప్పుడు కోపంగా మారుతుంది. కోపం మనలో ఉన్న వివేకాన్ని చంపేస్తుంది. సుడిగుండంలో పడ్డవాడు పరిస్థితి ఎలా ఉంటుందో అలా విషయాకర్షణలో పడ్డ జీవుడు అశాంతి అనే సుడిగుండంలో పడిపోతాడు. వాడిని వివేకం విడిచి పెట్టేస్తుంది.

ఆత్మజ్ఞానం పొందటం వల్ల మాత్రమే గురువు రుణం తీర్చుకోగలము. అనుగ్రహానికి అసాధ్యమంటూ లేదు. మనలోపల ఉన్న అలవాట్లు, బలహీనతలు

మనల్ని గిల్లుతున్నప్పుడు మనకి ఎన్ని జన్మలెత్తినా జ్ఞానం రాదనిపిస్తుంది. మన అలవాట్లు యొక్క వేగం, వాసనల యొక్క వేగం మన మెదడుకి చూపించి తీసేస్తాడు. ఏ తలంపు మన మెదడుకు వస్తే ఆ నిమిషం అదే నిజమనిపిస్తుంది - అదే మానవుడి బలహీనత. సాధన చేసేటప్పుడు గురువు మన బలహీనతలను కెలికి చూపిస్తాడు, మనకి చూపించి వాటిలో నుండి బయటకు రావాలనే తపనని మనకి కలుగజేసి ఆ బలహీనతని జ్ఞానాగ్ని చేత burn చేసి మనల్ని నిర్మలం చేసి తరింపచేస్తారు.

గురువు యొక్క ప్రేమ ఎలా ఉంటుందంటే, స్వామి శివానందకి నాలుగు ఇష్టమైన రోజులున్నాయి. ఆ రోజుల్లో వచ్చిన భక్తులకి ఏదోకటి ఆయన చేతితో ఇచ్చి పంపేవారు. ఒకరోజు స్వామి, అక్కడకి వచ్చిన వారందరికీ బట్టలు ఇస్తున్నారు. ఒక అతను తీసుకోవడానికి వచ్చారు. బట్టలు అందించేవారు శివానందగారితో వీడికి మిమ్మల్ని తిట్టటమే పని ఇంకోపని లేదన్నారు. శివానందగారు, వారితో ఆయనకేమో మనల్ని తిట్టడం పని, మనికి ఇవ్వటం పని. మన పని మనము చేద్దాము, ఆయన పని ఆయన చేస్తారు అన్నారు. ఈ లోకంలో ఎవరికి నచ్చిన పని వారు చేస్తారు. ఏదైతే వేదాలలో, ఉపనిషత్తులో చెప్పబడి ఉందో! అది జ్ఞానులు దేహం ధరించి వచ్చినప్పుడు జీవనదిలా ప్రవహిస్తుంది. వారు పనికోసమో! అవసరార్థమో తిరగరు. కేవలము సృష్టి పట్ల వారికున్న ఆప్యాయత వల్ల, అనుగ్రహం వల్ల తిరుగుతారు.

జ్ఞాని యొక్క నాలుక హృదయంలో ఉంటుంది. జ్ఞాని ఏది మాట్లాడినా అది హృదయవాణి. ఆ మాటలు నదులు, సముద్రాలు, ఖండాలు దాటుతాయి. ఆ వాక్యము కలకాలం చిరకాలం నిలిచి ఉంటుంది. ఆ మాటలకి మరణం లేదు. సూర్యుడు చంద్రుడు ఎంతకాలం ఉంటారో, నదులు ఎంతకాలం ప్రవహిస్తాయో, ఎంతకాలం జీవకోటి సృష్టిలో ఉంటుందో, అంతకాలం ఆమాటలు సంచరిస్తూనే ఉంటాయి. అది గురువాక్య వైభవం. ఈ దేహబుద్ధి, ఈ పశుబుద్ధి, ఈ కటిక గాఢాంధకారంలోనుండి బయటకి రావాలంటే, గురుమూర్తి లేకుండా సాధ్యము కాదు. కెరటాల ప్రభావం సముద్ర మధ్యలో ఎలా ఉండదో, తెర మీద బొమ్మలు ఆడినా వాటి ప్రభావం తెరకు ఎలా ఉండదో, అలాగే ప్రకృతి గొడవలు, ప్రకృతి విషయాలు జ్ఞాని హృదయాన్ని తాకవు. అట్టి పరమపవిత్రుడి హృదయంలో రవ్వంత మనకి స్థానం దొరికినా మన పని పూర్తయిపోయినట్లే.

మూడు గుణాలు దాటిన వారికి నమస్కరిస్తే, వారి అనుగ్రహం, దయ మనకు కలిగి, మనము కూడా గుణాతీతులం అవ్వటానికి ప్రేరణ కలుగుతుంది. గురువు యొక్క హృదయం ఖాళీ అయిపోయి ఉంటుంది కాబట్టి ఆయనలో ఉన్న చైతన్యంలోంచి... సుఖ ప్రవాహం, శాంతి ప్రవాహం గురు హృదయమనే తూరని ఉపయోగించుకుని భక్తుని హృదయంలోకి ప్రవేశిస్తుంది. డాబా మీద కురిసిన వర్షపు నీరు, తూర ద్వారా నేల మీదకి ఎలా వస్తుందో అలా గురువు హృదయంలో నుండి, అమృతత్వం ప్రవహించి శిష్యుడిని తాకుతుంది.

ఆప్త వాక్యము : ఆప్తుడు చెప్పే వాక్యము. అంటే, ఇంద్రియ-నిగ్రహం, మనో-నిగ్రహం కలిగి, తపస్సు ఆచరించి, మన యోగ - క్షేమాలు కోరుకుంటూ, సహృదయంతో మనల్ని ప్రేమించి, మన ఉన్నతిని కోరుతూ చెప్పే వాక్యం ఆప్తవాక్యం.

మనము ఏదిగా ఉన్నామో దాని ఎరుక మనకి లేదు. మనము ఏదైతే కాదో అదే మనమనే భ్రాంతిలో ఉన్నాము. మనము కాని దేహమే మనము అనే ముడి ఈశ్వరుడు పెట్టాడు. గురువు సహాయంతో, శాస్త్రం సహాయంతో ఆ ముడిని తెంపుకోవాలి. గురువు యొక్క సహాయం అక్కడే అవసరం. మన ఇంట్లో ఎంత nearest and dearest beings ఉన్నా, శరీరం నుంచి మనము విడిపోయినప్పుడు వారు మన కూడా రాలేరు. గురువు స్థానము హృదయ స్థానమే.

నాన్నగారితో, ఒక భక్తురాలు నా చేతులు ఎప్పుడూ మంచిని చేసేలా అనుగ్రహించండి నాన్నగారు. అదే విధంగా చేసిన మంచిని చెయ్యి వదిలేస్తోంది కానీ, మనస్సు వదలటములేదు మనస్సు కూడా వదిలేసేలా అనుగ్రహించండని అడిగారు. అప్పుడు నాన్నగారు అమ్మా! మీరు ఏ మంచిని చేశారో దాన్ని ఇతరులకి తెలియాలనే గొడవ వదిలెయ్యండి. దాన్ని ఇతరులతో చెప్పి చర్చించవద్దు. భగవంతుడు మంచి చేసే శక్తి మనకి ఇవ్వకపోతే అసలు చెయ్యటానికి మనము ఎవరము. భగవంతుడు graceని ఆయన ప్రేరణని గుర్తించండి. అప్పుడే నెమ్మదిగా మీ మనస్సుకి కూడా వదిలెయ్యటం ప్రాక్టీస్ అవుతుంది. మనము మంచినిఎంత ఆచరించగలిగితే అంత ఆచరిస్తే భవిష్యత్తులో మహా ప్రమాదంలో నుండి మనల్ని రక్షిస్తుంది అన్నాడు పరమాత్మ. work is worship, share your food with others. ఇలా జీవిస్తే నెమ్మదిగా మనము పక్వతకి వస్తాము. మహాత్ములు ఎన్నడూ సామాన్య మానవునికి దూరం అవ్వలేదు.

మనకి కొంచెం చదువు, అధికారము, ధనము ఏది కలిగినా సామాన్యమానవునికి దూరమైపోతున్నాము. అంటే వాటి మాయలో మనము పడిపోతున్నామని అర్థము.

కంచి పరమాచార్యులవారు, దక్షిణ కైలాసం, శ్రీశైల యాత్ర చేస్తుంటే మార్గమధ్యంలో వర్షం వచ్చింది. భక్తులు పల్లకి తెచ్చి అందులో కూర్చోమన్నారు. మీరందరూ తడుస్తూ నడుస్తుంటే, నేను పల్లకి ఎక్కను అని, 10km లు తడుస్తూ నడిచారు. అలా నడిచి వెళ్ళిన తరువాత ఒక గ్రామము వచ్చింది. అక్కడి ప్రజలు అత్యంత ప్రేమతో స్వామిని అక్కడే ఉండిపోమని అడిగారు. మరుసటి రోజు చంద్రమౌళీశ్వరుడి పూజకి బిల్వపత్రాలు దొరకలేదు. స్వామి పూజ చేస్తే కానీ భోజనం చెయ్యరని, భక్తులందరూ చాలా బాధగా ఉన్నారు. ఈ లోపు స్వామి బిల్వం దొరికిందా అని అడిగారు. దొరకలేదు అన్నారు భక్తులు. స్వామి, ధ్యానంలో కూర్చుని పూజ మొదలు పెట్టారు. ఎవరో ఒక అబ్బాయి గుమ్మంలో, బిల్వాలు బుట్ట పెట్టి వెళ్ళారు. మరునాడు కూడా ఒక అబ్బాయి బిల్వాలు పెట్టి వెళుతుంటే, పెరివర స్వామి పురందర అని పిలిచారు. వాడు వెనక్కి తిరిగి, స్వామి, మా తండ్రి పురందరదాసు, త్యాగరాజు స్వామి కీర్తనలు నేర్పారు. నా పేరు పురందర కేశవులు అన్నాడు. బిల్వపత్రం పూజలో పెడితే, శివుడికి ప్రీతికరమని మా తండ్రి చెప్పాడు అంటాడు. అప్పుడు స్వామి నీకు ఏమి కావాలో కోరుకో నువ్వు నా పూజకి సహకరించావు అంటే, నాకు రెండు కోరికలు ఉన్నాయి. ఒకటి, మీరు ఇక్కడ ఉన్నంతవరకు ప్రతిరోజు మీ వద్దకు వచ్చి కీర్తనలు పాడే అవకాశము ఇవ్వండి. రెండవది, మీరు వెళ్ళేటప్పుడు అడుగుతానని చెప్పి, స్వామి బయలుదేరేటప్పుడు నాకు శరీరం విడిచేలోపు మోక్షం కావాలి అంటాడు. స్వామి అనుగ్రహించి, వెళతారు. ఇది జరిగిన 50 సంవత్సరాలు తరువాత ఒకరోజు మధ్యాహ్నం రెండు గంటలకు పుష్కరిణిలో స్నానం చేస్తున్నారు. ఈ సమయంలో స్నానమాచరించటమేమిటని స్వామిని భక్తుల అడిగితే, పురందర కేశవులు శరీరాన్ని విడిచిపెట్టాడు. వాడికి 5,6 జన్మలు వచ్చేవి ఉన్నాయి. కానీ గురువు అనుగ్రహం వలన వాటిని దాటి ఈ జన్మలోనే దాటిమోక్ష సుఖాన్ని పొందాడు. అది గురుకృప.

## సహజ ముక్తి- సరళం సులభంహస్తామలకం

జీవితంలో కష్ట సుఖాల్ని సమానంగా సహజముగా తీసుకునే బుద్ధి ఉన్నవాడే యోగి అన్నారు ఆచార్యులు.

"equanimity" in outlook సరియైన చూపు, "equanimity" in mind సరియైన మనసు, "equanimity" in words సరియైన మాట, "equanimity" in behavior హెచ్చుతగ్గులు లేని సమానమైన ప్రవర్తన ఉన్నవాడే అర్హుడు అన్నాడు బుద్ధుడు.

ఎవరైతే తనని తాను పోగొట్టుకుంటారో, వారు మాత్రమే స్వర్గ రాజ్యాన్ని పొందుతారు అన్నారు బైబిల్ లో ఏసు.

జీవితమంటే, జననానికి మరణానికి మధ్య ఉన్న చిన్న ఖాళీ మాత్రమే. ఈ చిన్న ఖాళీలో మీరు వీలైనంత వరకు సంతోషంగా ఉండండి. ఇతరులను సంతోషంగా ఉంచేందుకు ప్రయత్నించండి. జీవితంలో ప్రతీ క్షణాన్ని ఆస్వాదించండి.

Subject understanding లోనే 90 శాతం సాధన పూర్తయిపోతుంది. మిగతా పది శాతం ప్రయత్నం. నాన్నగారి వద్దకి ఒక భక్తుడు వచ్చి, మహాత్ముడు స్థాయికి ఎవరు ఎదుగుతారు? అని ప్రశ్నించారు. నా దేహాన్ని నాది అనుకుని ఎలా ప్రేమిస్తానో ఇతరులదేహం కూడా నాదే అని ప్రేమించే స్థాయికి ఎదిగినవాడు మహాత్ముడు అన్నారు. నాన్నగారు చిరునవ్వుతో.

శాస్త్రం చదివినంత మాత్రము చేత, ఆత్మజ్ఞానం రాదు. అది acquired నాలెడ్జ్. మనసు చేత acquire చేయబడింది. మనము పవిత్రమవ్వటానికి శాస్త్రం మనకి సహాయం చేస్తుంది. మనకి మూడు పనిముట్లు ఉన్నాయి. 1. శరీరం, 2. మనస్సు, 3. వాక్కు ఈ మూడింటిని సవ్యంగా ఉపయోగించుకుంటే, మనము పవిత్రమవుతాము. చిన్నపచ్చికాయని కోసేస్తే, పండదు సరికదా, కుళ్ళిపోతుంది. అలా సహజమైన దారిలోనే జీవుడికి పక్వత రావాలి.

భగవంతుడితో కలిసి ఉన్న వాడికి సాధన అక్కర్లేదు. వేరుపడిన వాడికి సాధన. సాధన నిజం కాదు కాబట్టి, సాధన చేసేటప్పుడు, సాధకుడు సుఖంగా ఉండలేడు.

భక్తి భావం కుదిరితే ఊపిరి సలపదు. సాధనలో చాలా సఫరింగ్ ఉంటుంది. విసుగు చెందకు. ఆ suffering నిన్ను greatest happiness వైపు మేల్కొలుపుతుంది.

యోగి అంటే, సమాన బుద్ధి కలవాడు. ఎవరైనా పొగిడినప్పుడు మీకు సంతోషం వస్తే, మీరు మనస్సుతో తాదాత్మ్యయం పొందుతున్నారని అర్థము. మీరు మీ మనస్సుతో తాదాత్మ్యయం పొందకపోతే నిర్వికారంగా ఉంటారు.

ఎవరికి భోగం పట్ల ఆపేక్ష లేదో, అనురక్తి లేదో, భోగాన్ని అనుభవించాలనే కాంక్ష లేదో వారికి ఈ క్షణమే జ్ఞానం వరిస్తుంది.

లౌకికుల మధ్యలో, వ్యసనాలతో, ఆడంబరాలతో జీవించే కంటే భక్తి భావాలతో ఒంటరి జీవితం గడపటమే శ్రేయోదాయకం అంటారు సూరదాసు. నటరాజస్వామిని సర్పము చుట్టబడి ఉన్నా నాట్యం ఎలా చేస్తున్నాడో! అలాగే మన జీవితంలో ఎన్ని భయంకర పరిస్థితులు ఎదురైనా ఆధ్యాత్మికంగా మనము చేసుకునే సాధనని విడిచిపెట్టకుండా కొనసాగించాలి.

సాధన అంటే, మాట ,తలంపు, పని. ఇవి మూడు పవిత్రం చేసుకోవాలి. ఒకటిగా ఉండేటట్లు చేసుకోవటమే సాధన. బుద్ధుడికి, ఒక వ్యక్తి మీద దయ ఎందుకు వచ్చిందంటే, వాడి మైండ్లో ఏది ఉందో, అది వాడు నోటితో చెప్తున్నాడు. వాడి సిన్సియారిటీని చూసి ఆఖరి క్షణాల్లో సర్జరీ పూర్తి చేసేసాడు. పునర్జన్మల నుండి విడుదల పొంది, హృదయంలో ఉన్న ఆత్మశాంతితో ఐక్యమైపోయాడు. ఈ ప్రపంచంలో విలువ కట్టలేనిది ఆత్మశాంతి ఒక్కటే. ప్రారబ్ధమనేది కేవలం దేహానికి సంబంధించినది. రియలైజేషన్ కి దానికి సంబంధములేదు. రియలైజేషన్ యొక్క తాళంచెవి, ఈశ్వరుని చేతిలో ఉంది. మన వద్ద పెట్టె ఉన్నా తాళంలేకపోతే సంపద దొరకదు. బుద్ధుడి వద్దకి అతన్ని ప్రారబ్ధం తీసుకువచ్చింది. అయితే బుద్ధుడి దయ వాడికి రియలైజేషన్ని తీసుకువచ్చింది.

లోకంలో మనపని మనము చేసుకుంటూ, ఎటువంటి వ్యక్తులు ఎదురైనా, ఎలాంటి పరిస్థితులు వచ్చినా, not this, not this అనుకుంటూ ఆత్మజ్ఞానాన్నే గమ్యంగా పెట్టుకుని జీవితంలో ఎదురీదాలి.

మన బతుకులు బానిస బ్రతుకులు. ఇష్టా-అయిష్టాలలో నుండి కోరిక-ద్వేషంలో నుండి విడుదల పొంది స్వతంత్రుడై జీవించాలి.

బుద్ధిమంతుడికి, చిన్న ఉపకారం చేసినా జీవితాంతము జ్ఞాపకం ఉంచుకుంటాడు. దుష్టుడికి వంద ఉపకారాలు చేసినా, వెంటనే మర్చిపోతాడు.

మీ మనస్సులో ఉన్న విషాన్ని కడుక్కోకుండా, మీ మనస్సుని మంచితనంతో నింపుకోకుండా జ్ఞానాన్ని ఎలా ఆశిస్తారు. సహృదయంతో, సద్బుద్ధితో, మంచి మనస్సుతో చిన్న పని చేసినా మనము ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతాము. మంచి మనస్సు జ్ఞానం పొందడానికి సహాయ సహకారాలు అందిస్తుంది.

మనలో చాలా లోపాలు ఉన్నాయి. మనకి జ్ఞానం ఎలా వస్తుందని మనము అడగవచ్చు. గురువు హృదయంలోంచి వచ్చిన జ్ఞానకణం 1000 జన్మల వాసనలున్నా కరిగించేస్తుంది. అయితే, మన మైండ్, బాడీ కూడా కోపరేట్ చెయ్యాలి. ఎంత పెద్ద గడ్డిమేటు అయినా, ఒక్క నిప్పురవ్వ చాలు. మనిషికి అసాధ్యం ఉంది కానీ, ఈశ్వరుడికి అసాధ్యం అంటూ ఏదీలేదు. భగవంతుడు మన మాటలు, పనులు చూడడు. మాట వెనకాల, పని వెనకాల ప్రేరణని చూస్తాడు. ఆ ప్రేరణని బట్టి ఆయన దయ రివీల్ అవుతుంది. ఆయన దయకి అన్ని సాధ్యమే.

మనస్సు కోరికల మీదకి, విషయాల మీదకి, ఆడంబరాల మీదకి ముక్కలుముక్కలుగా వెళ్ళి అంటుకుపోతే అది బలహీనమైపోతుంది. బలహీనమైన మనస్సుకి జ్ఞానం రాదు. అన్నింటిలో ఉన్న అల్పత్వాన్ని అది తెలుసుకుని, హృదయం వైపుకి తిరిగి అక్కడఉన్న వస్తువు ఒక్క దానిని మాత్రమే అది కోరుకుని అటువైపు ప్రయాణిస్తే దాన్ని పొందుతుంది.

ఇతరులకు ఉన్నది మీకు కావాలనుకుంటే అసూయ వస్తుంది. వారికి ఉన్నది వారు తింటారు, మనకి ఉన్నది మనము తింటాము అనుకొన్నప్పుడు నీకు అసూయ వచ్చే అవకాశం ఉండదు.

బాగా పండిన పండుని రాయిపెట్టి కొట్టనక్కరలేకుండానే, దానంతట అదే రాలిపోతుంది. అలాగే మీ దేహం ఎక్కడ ఉన్నా లోపల పక్వానికి వస్తే, అజ్ఞానం దానంతట అదే రాలిపోతుంది.

భగవంతుడిని, నోటితో నీ ఇష్టమే - నా ఇష్టం అని అంటాము. మనసులో నా ఇష్టాన్ని నీ ఇష్టంగా చేసుకో అంటాము. మనసుకి, నోటికి చాలా దూరం ఉంది. ఈ దేహబుద్ధియే అన్ని గొడవలకి కారణం. ఈ దేహము నేను అనుకున్నంత కాలం బంధం తప్పదు

మనలో 99 మంచి గుణాలున్నా, ఒక ద్వేషము అనే చెడ్డ గుణం ఉంటే, ఆ ఒక్క చెడ్డ గుణమే, మన రెండు మూడు జన్మలలో మనలో ఉన్న 99 మంచి గుణాలను కడిగేస్తుంది. ద్వేషం అంత ప్రమాదం. ఎవరి పట్ల ద్వేషం పనికిరాదు అన్నాడు మహమ్మద్ ప్రవక్త. లోపల మెచ్యూరిటీ లేని వారితో, బుద్ధికి పక్వత లేని వారితో, లోపల సహృదయం లేని వారితో ఎన్నడూ మాటలు కలపకూడదు. ఆ మాటలు మనల్ని లోపల కుళ్ళబెడతాయి.

మనము భూమ్మీదకి వచ్చిన తరువాత జీవితంలో, కనీసం ఒక్కసారి కూడా మనము ఎవరమో మనము తెలుసుకోవాలనే ప్రశ్న మనలో ఉదయించకపోవటమే అజ్ఞానం. అదే పాపము. దుమ్ము దులపటానికి చీపురు ఎలా అవసరమో, మలం కడగటానికి నీరు అవసరము. అలా జీవుడు జన్మజన్మల నుంచి మోసుకు వచ్చిన పాపపు బుద్ధిని కడగటానికి దైవ ధ్యానము, ఆత్మ విచారణ, నిష్కామకర్మ కూడా అంతే అవసరము.

వ్యక్తులు, సంపదలు మనల్ని వదిలేసినా పరవాలేదు. శరీరం మరణించిన తరువాత, అవి మన కూడా రావు. మనకున్న దైవగుణాల్ని, మనము దేహం విడిపోయే క్షణం వరకు మనల్ని వదిలేయకుండా జాగ్రత్తగా కాపాడుకోవాలి. జీవుని కూడా వచ్చే నిజమైన సంపద అదే. శాంతిని మించిన భర్త లేడు, దానాన్ని మించిన స్నేహితుడు లేడు. దేహమరణానంతరం జీవుడు కూడా వచ్చే స్నేహితుడు ఎవరంటే, దేహములో ఉండగా చేసే దానమే. selfless work is an expression of love on others from us. లౌకికులు మాటలతో సరిపెడతారు. యోగులు, భక్తులు, సాధకులు వారి ప్రేమని పని రూపంలో వ్యక్తం చేస్తారు.

మన జీవిత గమ్యం, సత్యదర్శనమే. మన కాలాన్ని మూడు భాగాలుగా విడదీసుకోవాలి.

1. మన దైనందిన జీవితంలో మన పనులని మనము శ్రద్ధగా చెయ్యాలి. అశ్రద్ధగా ఉంటే జీవుడికి ఋణం పెరిగిపోతుంది.

2. మనిషి సంఘజీవి. సమాజ రూపములోఉన్న నారాయణుడికి మనము చెయ్యగలిగిన సేవ చేయ్యాలి. భగవాన్ ఏమంటారంటే, ఇచ్చిన ప్రతిదీ తిరిగి నీకేవస్తుందని తెలిస్తే, నువ్వు ఇవ్వకుండా ఎలా ఉండగలవు. సమాజానికి మనము ఉపయోగపడటము వల్ల పవిత్రమవుతాము

3. మిగతా కాలాన్ని ఆత్మజ్ఞాన సముపార్జన కోసం ఉపయోగించుకోవాలి. దేహాన్ని ప్రారబ్దానికి వదిలెయ్యాలి. బాహ్యంగా దేన్ని గమ్యంగా పెట్టుకున్నా, ఆత్మ జ్ఞానాన్ని పొందలేము. భూమిని అరకలతో దున్ని పంటవేస్తాము. సత్కర్మ చేయడం వల్ల హృదయ-క్షేత్రము శుద్ధి అవుతుంది. అప్పుడు మనము విన్న మాటలు హృదయంలో నిలబడతాయి. వాటిని ఆచరించాలనేబుద్ధి కలుగుతుంది. ఆచరిస్తే జ్ఞానవంతులమవుతాము.

తాపీమేస్త్రి ఒక్కో ఇటుక పేర్చి, ఇల్లు ఎలా నిర్మిస్తాడో! అలా మనము చిన్న, చిన్న మంచి పనులు చేస్తూ, సత్పురుషుల సహవాసాలు చేస్తూ జ్ఞానమనే ఇంటిని కట్టుకోవటానికి ఒక్కో ఇటుక పేర్చుకోవాలి.పడక కుర్చీ వేదాంతాలు మాట్లాడకండి. గురువు చెప్పిన వాక్యం విని, అది ఆచరించలేకపోతున్నామంటే మనస్సులో ఏదో దోషం ఉందని గుర్తు.

మనము చెయ్యవలసింది ఒక్కటే. నువ్వు బయట చూసినట్టు లోపలికి చూసుకో. లోపలకి చూసుకునే పని సరైన పద్ధతిలో చెయ్యాలి. నేను ఎవడు అనే విచారణ నువ్వు క్రమపద్ధతిలో చేస్తే, నీ ప్రశ్నలన్నిటికి సరైన సమాధానం తెలుస్తుంది. అంతర్యామిగా ఈశ్వరుడు ఉన్నాడు. మీకు వాడిని తెలుసుకోవాలని ఉంది. వాడికి కూడా నీకు తెలియబడాలని ఉంటే, తెలియబడతాడు. మీ ప్రయత్నం మీరు చేస్తుంటే, మీకు ఎప్పుడు తెలియబడాలో ఆ ముహూర్తం ఆయనే పెట్టుకుంటాడు. మన ప్రయత్నం మాత్రము మానకుండా సహనంగా చేస్తూ ఉండాలి.

ఆధ్యాత్మిక పురోగతి తప్పించి, ఏది సాధించినా అది జీవితంలో stupid stuff.

స్వభావం మార్చుకోవటం చాలా కష్టం. కాలం కలసి రావాలి, దైవానుగ్రహం ఉండాలి. కృషి కూడా ఉండాలి, నిగ్రహం ఒక్కటే సరిపోదు. మిగతా పరిస్థితులు కూడా కలిసిరావాలి.

అన్ని సిద్ధులలోకెల్లా ఉత్తమోత్తమమైన సిద్ధి ఆత్మసాక్షాత్కారం. మిగతా సిద్ధులు ఏమైనా కలిగి, వాటిలోకి మీరు వెళితే మీరు గమ్యాన్ని మిస్ అయ్యిపోతారు.

లోపల వైరాగ్యం ఉండాలి, ప్రవర్తనలో బాధ్యత ఉండాలి. జనకుడు మహారాజు అయినా, లోపల వైరాగ్యం కలిగి ఉండేవాడు.

ఒకసారి అరుణాచలంలో, నాన్నగారి ఆశ్రమానికి ఒక అమెరికన్ వచ్చి, నాన్నగారిని కొన్ని ప్రశ్నలు అడిగారు.

అమెరికన్ : మీరు ఎవరు? ఈ జన్మలో మీపని ఏమిటి?

నాన్నగారు : నేను జీవులందరినీ ప్రేమించడానికి వచ్చాను. ప్రేమే నా స్వభావం, ప్రేమే నేను. ఈ జన్మలో నాపని ఏంటంటే, మీ హృదయంలో ఉన్న సత్య స్వరూపమే మీరు. అటువైపుగా మిమ్మల్ని తిప్పి, మీరు ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందేటట్లుగా మిమ్మల్ని ప్రోత్సహించడమే.

అమెరికన్ : మీ బోధలు ఏమిటి?

నాన్నగారు : మీరు, మీ హృదయంలోకి మేల్కొనటానికి, ఆత్మానుభవం పొందటానికి, మీ జీవిత గమ్యమైన మీ హృదయ-స్థానాన్ని మీరు చేరటానికి, నామాట, నాచూపు, నాపని, నాసమక్షం మీకు సపోర్ట్ గా ఉంటాయి.

అమెరికన్ : మీ భక్తులు పట్ల, మీ ప్రేమ ఎలా పనిచేస్తుంది.

నాన్నగారు : నా భక్తుల మీద, నాకు అసాధారణమైన ప్రేమ ఉంది. వారు ఎటువంటివారైన ప్రేమిస్తాను. ప్రేమే నా స్వభావం. ఆ ప్రేమ, వారి ప్రార్థబ్దానుసారం వచ్చిన కర్మల నుండి కలిగే దుఃఖాన్ని మర్చిపోయేలా చేస్తుంది. దుఃఖముచేత పీడింపబడకుండా, కష్ట సమయాల్లో ధైర్యాన్ని వీడకుండా, వాటిని అంగీకరించి quiet గా అనుభవించే శక్తినిస్తుంది.

అమెరికన్ : మిమ్మల్ని మీరు తెలుసుకోండి అంటున్నారు, అది ఎలా?

నాన్నగారు :

1. నిరాడంబర జీవితాన్ని జీవించండి.
2. మీకు వచ్చే ఆలోచనల విషయంలో, మీరు చేసే పనుల విషయంలో, మీరు మాట్లాడే మాటల విషయంలో సత్యానికి సంబంధించిన ఎరుకని కలిగి ఉండండి.
3. కష్ట-సుఖాల పట్ల ఉదాసీనంగా ఉండండి.
4. జీవితం పొడుగునా వివేకాన్ని,వినయాన్ని విడిచిపెట్టవద్దు.
5. Remember all the good and forget all the bad.

అలా జీవిస్తే మన సహజ స్వరూపం మనకి తెలుస్తుంది. మన జీవిత గమ్యం మనకి అర్థమవుతుంది. అప్పుడు, నెమ్మదిగా నది వెళ్లి సముద్రంలో ఐక్యమైనట్లు మన జీవిత విధానంలోనే అంతర్ముఖంగా ప్రయాణించి ఆత్మాకారం చెందుతాము.

ఆ అమెరికన్, నాన్నగారి రెండు చేతులు పట్టుకుని how natural it is అన్నారు. వెంటనే నాన్నగారు నవ్వుతూ, వస్తువు సహజంగా ఉంది, దాన్ని పొందే ప్రయత్నం కూడా సహజంగా ఉండాలి. మాది సహజ -విద్య అన్నారు.

మనకు మోక్షము రాకపోవడానికి కారణం లోపల వేరుగా, బయట వేరుగా ఉంటాము. లోపలా-బయటా ఒక్కటిగా ఉన్న వాడికి జ్ఞానం వస్తుంది. వ్యవహారంలో చాలామంది ఈ బయట గొడవలు ఎందుకని లోపల విషయము చెప్పండంటారు. లోపల జీవితం, బయట జీవితం భిన్నంగా ఉన్నంతకాలము జ్ఞానము వచ్చే సమస్యలేదు.

సొంత-బుద్ధిని, సత్పురుషుల-సహవాసాన్ని మనము ఎప్పుడూ కాపాడుకోవాలి. చీకటిలో ఎక్కువ కాలం ఉండలేము. జరిగిపోయిన గొడవలు తలపెట్టుకోవడం చీకటిలోకి వెళ్ళడం వంటిది. వాటిని విడిచి పెట్టేయటం, వెలుగులోకి ప్రవేశించటం వంటిది. ఈగలు పుండును కోరుకుంటాయి, మంచి మనస్సు లేని వాళ్ళు కలహాలు కోరుకుంటారు. మంచి మనస్సున్న వాళ్ళు మంచిని కోరుకుంటారు. goodness must be the foundation of knowledge.

కొందరు భక్తులు నాన్నగారితో ఏమనేవారంటే, నాన్నగారు మాకు ప్రాణాయామాలు, సాధనలు తెలియదు. మీరు చెప్పిన భగవంతుడి మాటలు, రమణ భాస్కర చదువుకుంటున్నాము. మేము ఇద్దరం కలిస్తే వాటి గురించే మాట్లాడుకుంటున్నాము, అవే వింటున్నాము. మా మనస్సుని మీరు చెప్పిన వాక్యములలో నానబెట్టుకుంటున్నాము. అది చాలు మేము పవిత్రమవ్వటానికి అనిపిస్తోంది అన్నారు. నాన్నగారు చిరునవ్వుతో వారిని అనుగ్రహిస్తూ, అదియే సరిపోతుంది అన్నారు.

నచికేతుడితో యమధర్మరాజు అంటారు. నచికేతు ఈ ప్రపంచంలో రెండు మార్గాలు: ఒకటి ప్రేయో మార్గం, రెండవది శ్రేయో మార్గం. కనిపించేదంతా నిజం, ఈదేహం నిజం, ఈవిషయాలు నిజం అని ఈమాయలోపడి జీవించేవారిది ప్రేయో మార్గం. ఈ సృష్టికి అతీతంగా ఏదో ఉంది, అది ఈ లోకానికి, దేహానికి అతీతంగా ఉంది - అది ఒక్కటి మాత్రమే నిజమని దాన్ని తెలుసుకోవడానికి శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకుని ఎవరైతే జీవిస్తారో, అది శ్రేయో మార్గం. నీకు ఏది కావాలో నిర్ణయించుకో అన్నారు యముడు..

పాలు కదపకుండా ఉంటే కదా, అది పెరుగు అయ్యేది. అలాగే మనము అతిగా జన సమూహంలోకి తిరగకుండా ఏకాంతంగా గడపుతూ మనస్సు భగవంతుడి పాదాల్ని అంటిపెట్టుకొని నిర్మలంగా, నిశ్చలంగా ప్రారబ్ధ పరిస్థితులకి కదలకుండా ఉంటే ఆత్మజ్ఞానానికి కావలసిన అర్హత వస్తుంది. శరీరం శవమయ్యిన తరువాత చితి మీద పెట్టి కాలుస్తారు. అది చితి. చింత అంటే, మనసులో ఊహించుకొని, బెంగలు పెట్టుకుని అనారోగ్యం, భయం, అసూయ, అసహనం తెచ్చుకుంటే అది చింత.

''క్షుద్రం హృదయం దౌర్బల్యం'' అన్నిటికంటే నీచాతి నీచమైనది. మనలో ఉన్న పిరికితనం అంతకంటే నీచమైనది ఈలోకంలో ఇంకొకటి లేదు. సమస్యల మధ్యలో, అనేక సంఘటనల మధ్యలో కూడా ఆనందంగా ఉండటం practice చెయ్యాలి. ఏది వచ్చినా even this shall pass away అనుకోవాలి. అక్కడ మనము ఆగిపోకూడదు, దాన్ని లోపలికి పీల్చుకోకూడదు. బాహ్య సంఘటనల ప్రభావం మన మీద పడకుండా ఉండాలంటే, గురువనుగ్రహాన్ని మనము సంపాదించుకోవాలి. గురువు యొక్క one touch is enough, one word is enough. మనము గురువు

నుండి పొందిన శాంతిని, కాంతిని, విజ్ఞతని ఉపయోగించుకొని దేహాత్మబుద్ధనే జైలుగోడలని బద్దలుగొట్టి బ్రహ్మాత్మ బుద్ధిని పొందాలి.

చనిపోయిన తరువాత కాలని ఎముకలని నదిలో ఎలా కలుపుతారో, మనము బ్రతికి ఉండగానే జీవుడు పట్టుకున్న గౌరవాలను, గొప్పలని, లోకానికి సంబంధించిన ఆకర్షణలని, ఆశలని, భోగాల్ని అన్నింటినీ హృదయ గంగలో నిమజ్జనం చేసేయ్యాలి. బంగారాన్ని కంసాలి ఎలా పరిశీలిస్తాడో, అలా భగవంతుడి వాక్యానికి అనుగుణంగా మన మనసు ఉందో లేదో చూసుకుంటూ.. లేకపోతే సరిచేసుకోవాలి. దాన్ని మించిన పని ఈ సృష్టిలో ఇంకొకటి లేదు. జపం, ధ్యానం, పూజ అన్ని భగవంతుడికి ఇష్టమే. అయితే లోకక్షేమం కోసం పని చేస్తే ఆపని ఆయనకి అత్యంత ఇష్టం. దానికి ప్రతిగా మన అజ్ఞానాన్ని ఆయన తీసుకొని జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. పెళ్ళి కూతురిని ఎలా అలంకరిస్తామో, అలా శాంతితో, సుఖంతో, ఆనందంతో, జ్ఞానంతో మనల్ని భగవంతుడు అలంకరిస్తాడు.

మనిషి కలుషితం అవ్వటానికి కారణం రాగద్వేషాలు. గీత పొడుగునా రాగద్వేషాలలో నుండి ఎలా బయటికి రావాలో చెప్పాడు పరమాత్మ. అయితే జ్ఞానేశ్వర్ ఏమంటారంటే, మనము రాగద్వేషాలు విడిచిపెట్టేద్దామనుకుంటున్నాము, కానీ అవి మనల్ని వదలాలి కదా! ఈ ప్రపంచాన్ని భోగించాలనే భోగవాసన మనకి ఉన్నంత కాలం ఎన్ని సాధనలు చేసినా రాగద్వేషాలు మనల్ని విడిచిపెట్టవు అన్నారు. జడ వస్తువుని కూడా నడిపించిన మహిమాన్వితుడు జ్ఞానేశ్వర్. భగవద్గీత చెబుతూ నేను పెద్ద పెద్ద తపస్సులు చెయ్యలేదు, చెయ్యకపోయినా మీ ఇంట్లో చంటిబిడ్డలు మాట్లాడుతుంటే ఎలా వింటారో! అలా ఈ బిడ్డ చెప్పే మాటల్ని కూడా మీరు వినండి. ఇది వాస్తవము, వాస్తవము అంటారు. రాగద్వేషాలలో నుండి విడుదల పొందితే, పవిత్రాలకే పవిత్రమైనది మన హృదయం అక్కడికి చేరుకుంటాము. పొయ్యిలో నిప్పురవ్వల్ని గొట్టంపెట్టి ఊదుతాము. అలాగే మహాత్ముల బోధ మన హృదయంలో జ్ఞానకాంక్షని మరింత రగిలించడానికి, జ్ఞానాగ్నిని ప్రజ్వలింప చెయ్యటానికి ఉపయోగపడుతుంది.

మనందరం సాధనా రత్నాలుగా జీవించాలి. ధనాన్ని మన ఖర్చులకి జాగ్రత్తగా ఎలా పొదుపు చేసుకుంటామో, కాలాన్ని జాగ్రత్తగా అలా ఉపయోగించుకోవాలి.

భట్రాజులు మాటలతో సరిపెడతారు, భక్తులు-యోగులు వారి ప్రేమని పని రూపంలో వ్యక్తం చేస్తారు. work is an expression of our love on other's well being.

బుడగకి ఆధారంగా సముద్రం ఉంది. బుడగ అణిగిపోతే సముద్రం అవుతుంది. అలా మూలతలంపుకి ఆధారంగా చైతన్యం ఉంది. మూలతలంపు మూలంలోకి వెళ్ళిపోతే, చైతన్యం అవుతాము. మనము సాధన చేసి రూపబుద్ధి, నామబుద్ధిలోంచి విడుదల పొందితే, నెమ్మదిగా మూలతలంపుకి ఫుడ్‌సప్లై తగ్గిపోయి అణిగిపోవటం మొదలవుతుంది. నది ప్రయాణించి సముద్రంలో ఎలా ఐక్యమవుతుందో, అలా మూలతలంపు విజృంభణ తగ్గి, నెమ్మదిగా దాని source అయిన చైతన్యంలో అణిగిపోతుంది. అయితే! ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం లేకుండా అంతఃకరణ శుద్ధి రాదు. అంతఃకరణ శుద్ధి లేనివాడు నామబుద్ధి లోంచి, రూపబుద్ధి లోంచి విడుదల పొందలేడు.

దేహం జన్మిస్తుంది, దేహం మరణిస్తుంది. పుట్టుక, చావు అంతా తలంపే. దేహం జన్మించటము పుట్టుక కాదు. మరణించడం చావు కాదు. ఈ రెండు తలంపులే. మన దేహము ఉండగానే మారుమనస్సుని పొందాలి. శరీరం శవమైన తరువాత దహనం చేసేస్తారు. మనము బ్రతికి ఉండగానే లోపల చనిపోతే, రియలైజేషన్ వచ్చేస్తుంది. దేహం గొడవలను తీసుకురాదు, కానీ దేహంతో తాదాత్మ్యం పొందే నేను మాత్రం అన్ని సమస్యల్ని మోసుకువస్తుంది. no mind stateకి వెళ్ళిన వాడిని సమస్యలు ముట్టుకోవు.

మనసు ఏ కారణం వలన బయటకు వెళుతుందో దానిని చూసుకొని, ఆ కారణాన్ని కత్తిరించాలి. మనస్సు pleasures కోసమే వెళుతుంది. అదంతా pain గా మారుతుంది. అది పరిణామ సిద్ధాంతం. ఆనందమనేది నీ హృదయంలోనే స్వతంత్రంగా ఉంది. ఆనందం దేని మీద ఆధారపడి లేదు.

కోరిక మారకుండా కర్మ మారదు. నీ కోరిక మోక్షం వైపు తిరిగితే కానీ, మోక్షానికి సహకరించే పని చెయ్యలేము. నువ్వు చేతులతో ఏ పని చేసినా, కోరికని తీసేసేటప్పుడు పెయిన్ ఉంటుంది. అప్పుడే ఈశ్వరుడి అనుగ్రహం ఉండాలి.

భయము అనేది otherness నుండి వస్తోంది. ఏ తలంపులతో మైండ్ తయారయ్యిందో, ఆ తలంపులను తీసేస్తే మైండ్ లేదు.

రమణులు అంటారు, నోటికి పని తగ్గించండి, చేతికి పని చెప్పండి. భగవంతుడు మనకి బంధువులను ఇచ్చాడు, వారిని మార్చుకోలేము. అయితే, మంచి స్నేహితుల్ని, సత్పురుషుల్ని మన తెలివితో, వివేకంతో సంపాదించుకోవాలి.

ఎవరికి ఏది ఇష్టమైన మార్గమో అదే వారికి శ్రేష్ఠము. అయితే శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకుని జీవించాలి.

కుండ అమ్మేవాడి వద్ద కుండని మోగించి.. అది ఖంగుమంటేనే, ఆ కుండని కొనుగోలుచేస్తారు. ఓటి శబ్దం వస్తే, ఆ కుండని మట్టిలో కలిపేస్తారు. అలా మన జీవితంలో ఎదురయ్యే పరిస్థితుల మధ్యలో సమానంగా ఉండాలి. ఎగిరెగిరిపడితే మనల్ని భగవంతుడు మట్టిలో కలిపేస్తాడు. అంటే, పునర్జన్మలో పడిపోతాము. సమానంగా జీవిస్తే ఈశ్వరుడు తన హృదయంలోకి తీసుకుంటాడు. భగవంతుడు మనకిచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోకుండా, భగవంతుడిని అధికంగా ధనము ఇవ్వు, తెలివిని ఇవ్వు అని అడగటం భక్తుడి లక్షణం కాదు. నన్ను నేను ఖాళీ చేసుకుంటాను, నన్ను నీ చేతుల్లో పనిముట్టుగా చేసుకుని వాడుకో ప్రభు! అని ప్రార్థించాలి.

వ్యాపారస్తుడు ధనం ఎలా సంపాదించుకుంటాడో, రాజకీయ నాయకుడు అధికారం ఎలా సంపాదించుకుంటాడో! అలా భక్తుడు భగవంతుడి దయని సంపాదించుకోవాలి. ఆయన దయ ఎలా వస్తుందంటే, శాస్త్ర వాక్యాలను శ్రవణం చేసి, స్వాధ్యాయం చేసి, విశ్వాసం పెంచుకొని జీవించే వారికి ఆయన దయ కలుగుతుంది. సూర్యకిరణం తాకగానే భూమిని ఆవరించి ఉన్న మంచు ఎలా కరిగిపోతుందో, అలా భగవంతుడి దయ అనే కిరణం తాకినప్పుడు, మనము మన ఇరుకు స్వభావంలోంచి, మనకి తెలియకుండానే బయటకు వచ్చేస్తాము.

మనము రజోగుణం ఉన్న వారితో సహవాసం చేస్తే, మనకి కూడా రజోగుణం వచ్చేస్తుంది. ఎంతో సుదీర్ఘ పోరాటం వల్ల కానీ రజోగుణంలోంచి బయటపడలేము. ఒక చెడ్డవాడు, మంచివాడిగా కనిపించవచ్చు కానీ ఏదో ఒక రోజు వాడి స్వభావం బయటపడిపోతుంది. దీనికి ఉదాహరణగా నాన్నగారు ఒక్కటి చెప్పారు : ఒక మేక

పురుడు పోసుకుంది, ఆ సమయంలోనే, అటువైపు ఒక పులి వచ్చింది. ఆ పులిని చూసి,తల్లి మేక పారిపోయింది.అప్పుడే పుట్టిన మేకపిల్ల అక్కడే ఉండిపోయింది. పులి వచ్చి, మేక పిల్లను చూసి దాన్ని నాకింది. మేకపిల్ల కూడా పులిని ప్రేమగా నాకింది. కానీ పులికి దానికి ఉన్న సహజ స్వభావం వలన క్రూరత్వం వచ్చి, మేక పిల్లని చంపి తినేసింది. మనిషి స్వభావం కూడా అటువంటిదే. ఒక చెడ్డవాడు ఏదైనా మంచి పని చేసినంత మాత్రానే, వాడు మంచివాడు కాదు. ఒక మంచివాడు ఏదైనా చెడ్డ పని చేసినంత మాత్రంచేతనే వాడు చెడ్డవాడు కాదు. అది ఒక యాక్సిడెంట్ వంటిది. స్వభావం మార్చుకోవడానికి చాలా కష్టపడాలి. ధనము-చదువు-గౌరవము సంపాదించడం కంటే మానవ స్వభావం మార్చుకోవటానికి చాలా కష్టపడాలి. స్వభావం మారకుండా జ్ఞానం కలగదు.

ఈ ప్రవచనాల వల్ల ఉపయోగం ఏమిటని అంటారు చాలామంది స్థూలబుద్ధి కలవారు. అట్టి వారిని చూసి మనము జాలిపడాలి కానీ కోప్పడకూడదు. శరీరానికి ఎలా అవసరాలు ఉంటాయో, అలా మనస్సుకి కూడా అవసరాలు ఉంటాయి. ఈ ప్రవచనాలు మనస్సుకున్న అవసరాలను తీరుస్తాయి. అంటే శరీరము, మనస్సు కలిస్తేనే మనిషి అవుతాడు.

మనకి మధ్యేమార్గం మంచిది. ఆధ్యాత్మికంగా ఎదగాలంటే, అతి నిద్ర, అతి తిండి, అతిగా మాట్లాడడం పనికిరాదు. ఈ వ్యవహారంలో యుక్తంగా తగు మాత్రంగా ఉండాలి. నిజమైన సుఖి బుద్ధుడే. వారు homeless, penniless. అన్ని less లే. కానీ highest happiness పొందారు.

పెద్దపులిలా బలవంతుడు, సింహంలా ధైర్యవంతుడు. ఎవరైతే తన జీవితంలో వచ్చిన కష్టాల్ని, సమస్యల్ని ఎందుకు వచ్చాయి అనే ప్రశ్న లేకుండా భరిస్తాడో వాడే వీర్యవాన్, బలవాన్, ధైర్యవాన్. Miltonకి గుడ్డితనం వచ్చినా, నాలుగు మంచి మాటలు తనకి తెలిసినవి తన Paradise lost లో ఇంకొకరిని పట్టుకొని రాయించాడు.

నిరంతరము భగవంతుడుని జ్ఞాపకం పెట్టుకోవటమే భక్తి. ఇతరులు ఎవ్వరూ మనకి విరోధులు కాదు. మన వాసనలు, అలవాట్లే మనకి విరోధులు. అది మనము గుర్తించి వాటిని విడిచిపెట్టడమే సాధన.

అర్థం చేసుకోవడానికి మించిన యోగం ఇంకొకటి లేదు. మీకు అర్థమయ్యేలా చెప్పలేకపోతే, ఆ దోషం మీది కాదు, గురువుదే.

పక్షులు తియ్యటి పండు మీద వాలతాయి. కానీ చేదుపళ్ళు మీద వాలవు. అలాగే లోకం కూడా మంచి వాడిని విమర్శిస్తుంది. కానీ చెడ్డవాడి జోలికి వెళ్ళదు. మంచితనం అనేది పునాది. గుండె నిమిషానికి ఎన్నిసార్లు కొట్టుకుని కరెక్ట్ గా ఎలా పని చేస్తుందో, జీవితంలో అన్ని విషయాల్లో అలాగే కరెక్ట్ గా ఉండు.

మనందరికీ ఉన్న పెద్ద రోగం ఆత్మ-స్తుతి, పర-నింద. మనకు తెలియకుండానే వీటివల్ల మనస్సు మరింత ప్రకృతిలోకి వెళ్ళిపోతుంది. ఇదంతా వ్యర్థమే. మనమీద ఎవరికైనా, అసూయ ఉంటే మనలో ఉన్న మంచిని వారు చూడలేరు, వారి అసూయని మనము చూడకూడదు, సదాచారాన్ని విడిచిపెట్టకూడదు. సదాచారం మనల్ని పవిత్రముచేస్తుంది. సదాచారం లేకుండా అంతర్ముఖప్రయాణం జరగదు.

Love all, but trust very few. అందరినీ ప్రేమించు కానీ కొంతమందినే నమ్ము. అందరినీ నమ్మకూడదు. విచక్షణ-వివేకాలతో ఎవరిని నమ్మాలో వారినే నమ్ము. మనల్ని ప్రేమించిన వారికి, నమ్మినవారికి ఉపకారం చేయండి. మనల్ని నమ్మని వారికి, ప్రేమించని వారికి కూడా ఉపకారం చేయకపోయినా అపకారం మాత్రం చేయకూడదు అన్నాడు Shakespeare.

అన్నీ ఉన్నా, అణిగి ఉన్న వాడిని ఆత్మానుభవం కోరికతో పని లేకుండా అనుగ్రహిస్తుంది.

భగవంతుడు నీ లోపల ఉండే పని చేస్తున్నాడు. నా లోపల ఉన్నది నీవే, కానీ ఆ భావన నాకు రాకుండా ఏవైతే అడ్డు వస్తున్నాయో, ఆ పొరలను తీసివెయ్యి స్వామి అని ప్రార్థించాలి. ప్రార్థన జీవుడికి స్నానం వంటిది. ప్రార్థన వలన ఫలం వస్తుంది. కానీ ఎదురు చూడకూడదు. ఎదురు చూస్తే tiredness వస్తుంది.

likes - dislikes వలనే మనస్సు extrovert అవుతుంది. likes-dislikes తగ్గితే mind ఎక్కువగా heart cave లో ఉంటుంది. రాగద్వేషాలు - కామక్రోధాలు ఒక్కటే. lust - anger ఇవన్నీ likes - dislikes లో నుండే వస్తాయి. అవే root causes.

మీరు ఏమీ చెయ్యకపోయినా, నీకు సత్యం పట్ల, జ్ఞానం పట్ల, ధర్మం పట్ల, గురువు పట్ల, పరిమితి లేని గౌరవం కనుక ఉంటే జ్ఞానం వచ్చి తీరుతుంది.

మనకి ఎవరితోనైనా అభిప్రాయభేదాలు ఉండవచ్చు. కానీ విరోధత్వం ఉండకూడదు. శబ్దం ఈశ్వరుడు అయితే, దాని అర్థం పార్వతి. భగవంతుడి నోట్లోంచి వచ్చే శబ్దం పట్ల మనకి శ్రద్ధ లేనప్పుడు, దాని అర్థాన్ని పొందలేము.

మనిషి ఆధ్యాత్మికంగా కానీ, భౌతికంగా కానీ అభివృద్ధిలోకి రావాలంటే, ఏకాగ్రత-పవిత్రత అవసరము. మనిషి మాటలో - చేతలో - ఆలోచనలో ప్రవర్తనలో క్రమశిక్షణ ఉంటే, అవి రెండూ వచ్చేస్తాయి. గుర్రం వెనుక చక్రాలు ఎలా వస్తాయో, అలా క్రమశిక్షణ విడిచి పెట్టకపోతే మనకూడా అన్నీ వస్తాయి. అప్పుడు స్థితప్రజ్ఞత్వం కలుగుతుంది.

నోటితో తీసుకునే పదార్థం దేహానికి ఆహారం, చెవులతో వినే మాటలు మనస్సుకి ఆహారం. ఇవి రెండూ శుచిగా, పవిత్రంగా ఉండేటట్లు చూసుకోవాలని చెబుతోంది వేదం.

ఏ గూటి పక్షులు ఆ గూటికే చేరుతాయి అని చెబుతోంది శాస్త్రం. అంటే భక్తుడు-భగవంతుడి వద్దకు, కలహ ప్రియులు-కలహాలు ఎక్కడ ఉంటే అక్కడికి చేరుతారు, లౌకికులు-లోకంలో ఉన్న విషయాల వద్దకి, ధన కాంక్ష ఉన్నవారు-ధనవంతుల వద్దకి, రాజకీయ వాసన ఉన్నవారు-రాజకీయ నాయకుల వద్దకి లోభిత్వం కలవాడు ఎక్కడికి వెళితే, లాభదాయకమో చూసుకొని అక్కడికి చేరుతారు.

సత్సంగం వల్ల ప్రాపంచిక విషయాలు తగ్గుతాయి. మనకు ఈ ప్రపంచం మీద attachment ఉంది. కానీ మనందరం detached attachment సంపాదించుకోవాలి.

Negative mind can ever give you a positive life.

మన శరీరాన్ని భగవంతుడు పనిముట్టుగా ఉపయోగించుకుంటున్నాడు. ఐశ్వర్యమంతా భగవంతుడిదే. దేహం యొక్క ప్రారబ్ధాన్ని బట్టి మనకి కేటాయిస్తాడు.

మీరు బాగుపడాలంటే, ఎండ్రిన్ డబ్బాకి ఎలా దూరంగా ఉంటామో, అలా ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోకి రావాలంటే, మూడు విడిచిపెట్టాలి.

1. మమత 2. ఫల కాంక్ష, 3. ఆసక్తి.

ఇంటిదగ్గర మనుషులకు చేసేది సేవ అనుకోకుండా పూజ అనుకోండి. సేవ అనేది politicalగా ఎక్కువ ఉపయోగిస్తారు.

గౌరవం బయట చూపుని పెంచుతుంది, అగౌరవం లోపల చూపుని పెంచుతుంది.

ప్రతీరోజు భోజనం చేస్తుంటే, శరీరం ఎలా పెరుగుతుందో, సాధన చేసే కొద్దీ భక్తి అలా పెరుగుతుంది. భక్తి పెరిగేకొలది, భగవంతుడు దయ, గురువు దయ, గురువు సహవాసం చాలనే స్థాయికి సాధకుడు ఎదుగుతాడు.

అందరి హృదయంలో భగవంతుడు ఉన్నాడు. ఎవరి హృదయమైతే, నిర్మలంగా, పవిత్రంగా, పరిశుద్ధంగా ఉందో ఆ హృదయంలో భగవంతుడు ప్రతిబింబిస్తాడు. వారినే మనము యోగి అని, ఋషి అని, సత్పురుషుడని అంటాము.

పూజ-జప-ధ్యానాలు మనకి నిగ్రహాన్ని తెస్తాయి. మనో నిగ్రహం ఉన్నవాడికి జీవితము ఒక వరంలా ఉంటుంది. వాడు జీవితాన్ని సద్వినియోగం చేసుకుంటాడు. మనోనిగ్రహం లేని వాడికి జీవితము ఒక శిక్షలా కనిపిస్తుంది.

కొందరికి చెప్పుడు మాటలు చెప్పే అలవాటు ఉంటుంది. సొంతబుద్ధి లేని వాడికి ఆత్మ సాక్షాత్కారం కలగదు. పొగడ్తల వల్ల వచ్చే ఆనందం, విమర్శల వల్ల కలిగే దుఃఖం అవన్నీ ఫీలింగ్స్. సొంత బుద్ధి ఉన్నవాడు వాటికి దూరంగా ఉంటాడు.

కష్టం వచ్చినప్పుడు కష్టపడుతున్నాను అనే ఫీలింగు మనస్సుకి రాకుండా చూసుకుంటే, రోజు పూజలు-జపాలు చేసే వారి కంటే వీళ్ళు చాలా వేగంగా మనోవికాసం పొందుతారు. కొందరు 100 సంవత్సరాలు జీవించినా, మనోవికాసం లేకుండా కనుబొమ్మల మీద వెంట్రుకల్లా జీవించి చనిపోతారు.

కొందరికి, కర్మ అంటే చాలా ఇష్టం. కర్మ చేసే వాడికి కర్మఫలం మీద, భక్తుడికి మోక్షం మీద ఉంటుంది. తత్వం తెలిసినవాడికి దేని మీద ఉండదు.

మనల్ని ఎవరైనా విమర్శిస్తుంటే, మన ఫీలింగు హర్ట్ అయితే నీలో అపవిత్రత ఉన్నట్టే.

ఒక భక్తుడు నాన్నగారితో పాపం అంటే ఏమిటి? భూమి మీద ఎవరు పాపి అని అడిగారు నాన్నగారు అన్నారు, మనల్ని ఎవరైనా పాపులు అంటే, మనము ఊరుకోము. హృదయంలో ఉన్నది-నోటిలో ఉండదు. నోటిలో ఉన్నది చేతిలో ఉండదు. అంటే, ఆలోచన, మాట, చేత ఈ త్రికరణాలు ఏకంగా లేనివాడు కపటి. వాడే పాపి, కపటికి జ్ఞానం రాదు.

ఎవరి హృదయము దయాపూరితమో, అట్టివారిని చూసి, దేవతలు కూడా ఇటువంటి దయా-పూర్ణులని ఈ భూమ్మీద మళ్ళీ ఎప్పుడు చూస్తామా, అనే గౌరవభావనతో నమస్కరిస్తారు.

సంసారమనే రోగంలోనుండి దైవ స్మరణ లేకుండా బయటకి రాలేము. రాముడి వాక్యం అర్థమైతే సంసార రోగములో నుండి విడుదల పొందుతాము. గురువు బోధిస్తుంటే కొందరు ఎలా వింటారంటే, శరీరంలోని అవయవాలన్నిటిని చెవులు చేసుకొని వింటారు. అది గురువు వాక్యం శ్రవణం చేయటం పట్ల వారికున్న శ్రద్ధ, భగవంతుడే సకలమని జీవించే వారికి వ్యర్థమైన మాటలు చెవిన పడినా అవి లోపలకి దిగవు, రాలిపోతాయి.

ప్రాపంచిక జ్వరం తగ్గించుకోవటానికి సత్సంగం, సత్పురుషుల సాంగత్యం ఉపయోగపడుతాయి. సత్పురుషుల సాంగత్యం వలన సద్బుద్ధి కలుగుతుంది. సద్బుద్ధి నిన్ను నీవు బాగుచేసుకోవటానికి నీకు ఉపయోగపడుతుంది.మట్టిని శుభ్రం చెయ్యటానికి కుండలు చేసే కుమ్మరి ఎంత శ్రమిస్తాడో, సత్పురుషుడు మనల్ని పవిత్రం చెయ్యటానికి అంత శ్రమిస్తాడు.

Shakespeare అంటారు,"Show me a good man; show me a gentleman; show me an evolved soul; I will keep him in my heart".

మంచితనము జ్ఞానం పొందటానికి సహకరిస్తుంది. అయితే మంచితనంలో జ్ఞానం కలవాలి. జ్ఞానం కలవకపోతే ఆ మంచితనం సద్వినియోగం అవ్వదు.

మహాత్ములు శుద్ధ మనస్సుని కలిగి ఉంటారు. మనము కూడా మన మనస్సుని, అందులో ఉన్న అశుద్ధాన్ని కడుక్కోగలిగితే శుద్ధ మనస్సుని పొందుతాము. శుద్ధ మనస్సు ఉన్నవాడు మాత్రమే హృదయ-గంగలో రమించి, హృదయంలో మునకలు వేస్తాడు.

మనస్సులో మలినం ఉన్నంత కాలం మాత్రం ప్రకృతిలో తేలిపోవలసిందే. డాక్టర్లు ఆపరేషన్ చేసే ముందు కత్తులను ఉడకబెడతారు. అలా మోక్షం పొందాలనుకుంటే మన ఇంద్రియాలని, మనస్సుని, బుద్ధిని, దేహాన్ని దైవత్వంలో ఉడకబెట్టాలి. మంచి పుస్తకం కూడా మంచి స్నేహితుడితో సమానం. కాలం వృధా చెయ్యకూడదు. అన్నింటి కంటే విలువైనది కాలం. ఒక అరగంట మనము జపం-ధ్యానం-సత్కర్మ-సత్సంగం-స్వాధ్యాయం ఏది చేసినా దాని ఫలితము మన కళ్ళకు కనిపించదు. కానీ అది మనకూడా వస్తుందని, మనము బాగుపడటానికి ఉపయోగ పడుతుందని, అది ఫలించి వివేకంగా, వైరాగ్యంగా మన స్వభావంలో ఇంకుతుందని మనకి తెలియదు. అది తెలియకుండానే జరుగుతుంది కాబట్టి మనము వాటి పట్ల అశ్రద్ధగా ఉంటాము.

ఈశ్వరుడు మనల్ని ఆయన హృదయంలోకి తీసుకోవాలంటే, మన జీవితంలో క్వాలిటీ ఉండాలి. భుజించే ఆహారం విషయంలో, ధరించే వస్త్రం విషయంలో మనము క్వాలిటీని చూసుకుంటాము. మనము మాట్లాడే మాటలు, మన భావాలు, మనము చేసే పనుల్లో క్వాలిటీ ఏది. దేహంలో అనేక ఇంద్రియాలున్నాయి ఒక్కో దానికి ఒక్కొక్క ఇష్టం ఉంటుంది. అంత ఇష్టం పరమాత్మ పట్ల కలిగి ఉంటే నేచురల్ గా ఈశ్వరుడు స్వాధీనమవుతాడు.

మీకు ఉపన్యాసాలు చెప్పటం, మిమ్మల్ని పలకరించటం గురువు అనుగ్రహం కాదు. మిమ్మల్ని ఏ వాసన పీడిస్తోందో, ఆ వాసనని మీకు తెలియకుండానే అందులో నుండి విడుదల చెయ్యటమనేది గొప్ప సహాయం. అది గురువు యొక్క ఉత్తమోత్తమమైన అనుగ్రహం.

ఈశ్వరుడు లోంచే ఐశ్వర్యమనే పేరు వచ్చింది. మీరు కాపలాదారులు అంతేగాని ఆ ఐశ్వర్యం మీది కాదు. ధనం వల్ల భోగం వస్తుంది. భక్తి వల్ల యోగం వస్తుంది. యోగం వల్ల జ్ఞానం వస్తుంది.

నేను అనే తలంపు నీచేత పాపం చేయిస్తుంది. అదే బురద నేను, మలినంతో కూడిన నేను. ఈ నేనును సంహరించటమే సాధన.

మనకి లోకం మీద ఉన్న గౌరవం ఈశ్వరుడి మీద లేదు. భగవంతుడు సృష్టించిన, సృష్టి మీద ఉన్న గౌరవం భగవంతుడి మీద లేదు. లోకంలో గౌరవం సంపాదించుకోగలము గాని ఈశ్వరుడి అనుగ్రహం, ఈశ్వరుడు సంతోషపడేలా జీవించాలని మనము అనుకోవటములేదు.

కర్మఫలం మీద ఉన్న ప్రేమ, ఆప్యాయత - కర్మ మీద లేదు. కర్మ చేసేటప్పుడు కూడా అంత ప్రేమ ఉంటే, నీవు పవిత్రుడువి అయిపోతావు. కర్మఫలదాత - కర్మసాక్షి అనేవి భగవంతుడి పేర్లు.

ముసలితనం కూడా మీదకి వస్తే గాని తెలియదు. శరీరం వచ్చిందంటే, కాలంలో తప్పక ముసలితనం వచ్చేస్తుంది. ముసలితనం వస్తే రోగం వస్తుంది. మన జీవితాలన్ని already తీసేసిన సినిమాలు. మనిషి పుట్టిన రోజునే, చనిపోయే రోజు కూడా నిర్ణయించబడి బయటికి వచ్చాము.

శరీరంలో రోగము ఉంటే, అది పోయేవరకు ఆరోగ్యాన్ని ఆశించినా రాదు. అలాగే నీ లోపల బలహీనతలు ఉన్నంతకాలం, శాంతి కుదరదు. శాంతి లేని వాడికి సుఖం ఉండదు.

సహజంగా ప్రతివాడు, తనని తాను ప్రేమించుకుంటాడు. ఇతరులని విమర్శిస్తాడు. జ్ఞానం పొందాలంటే, నిన్ను నీవు విమర్శించుకో. ఇతరులను ప్రేమించు. నీవు పవిత్రుడివి అయిపోతావు జ్ఞానం నిన్ను వరిస్తుంది.

జన్మించినప్పుడు ఏడుస్తూనే జన్మిస్తాము. కనీసం మరణించే సమయానికైనా దుఃఖం తగ్గించుకొని - సుఖంగా దేహం విడిచిపెట్టాలి. లేకపోతే ఈ దుఃఖమే మరుజన్మకి కొనసాగుతుంది. దుఃఖానికి కారణం మమకారమే. దేహం విడిచిపెట్టే

సమయానికి భయము, దుఃఖము ఇవి రెండూ ఉండకూడదు. దోసపండు తీగని ఎంత సహజంగా వదిలేస్తోందో, అలా జీవుడు పక్వానికి వస్తే దేహం నుండి సహజంగా విడివడిపోతాడు. మరణించే సమయంలోపు మనము నెమ్మదిగా అహంకారం, మమకారం లోనుండి బయటకు రాగలిగితే మనము దుఃఖరహిత స్థితిని అందుకుంటాము. మనకి భగవంతుడి పట్ల విశ్వాసం ఉంటే, ఆ విశ్వాసమే మన కష్ట సమయాల్లో మనల్ని గొడుగు వలె రక్షిస్తుంది. Faith can move mountains. మనము మంచి విని, మంచి మాట్లాడి, కళ్ళతో మంచిని చూసి, చేతులతో మంచిని చేసి ఉంటే అది దైవ అనుగ్రహం పొందటానికి కావలసిన అర్హతను తీసుకొచ్చి లోపల ఆత్మ-బలంగా (spiritual strength) మారి ప్రారబ్దం కొట్టే దెబ్బల నుండి మనల్ని రక్షిస్తుంది. ఆత్మబలం ఉన్నవాడు జీవితంలో వచ్చే పెద్ద కష్టాన్ని కూడా చిన్నదిగా తీసుకుంటాడు. ఆత్మబలం లేనివాడు చిన్న కష్టాన్ని కూడా పెద్దదిగా చేసుకుని అశాంతి అనే సముద్రంలో కొట్టుకుపోతాడు.

Bare injury; bare insult; that is highest Sadhana. ఆత్మబలం లేకుండా అది సాధ్యముకాదు. జీవుని యొక్క ప్రయాణం హృదయాభిముఖంగా జరగాలి. ధర్మామీటరు మన జ్వరాన్ని ఎలా పట్టి చూపిస్తుందో, అలా మనము - మన హృదయం వైపు దిగుతున్నామా లేదా అని చూసుకోవాలి. అంటే, జీవితంలో మనకి ఎదురయ్యే మంచి చెడుల పట్ల ఉదాశీనంగా ఉండి - దుఃఖకారణాలు ఉన్నప్పటికీ దుఃఖము లేకుండా, గర్వ కారణాలు ఉన్నప్పటికీ గర్వము లేకుండా ఎవరైతే వినయంతో, విజ్ఞతతో reaction లేకుండా ఉండగలుగుతున్నారో ఆ జీవుడు హృదయాబిముఖంగా ప్రయాణం చేస్తున్నాడని గుర్తు.

భక్తి అనేది మనకి, భగవంతుడికి సంబంధించినది. భక్తి మనలో రహస్యంగా ఉండటం మంచిది. ఇంట్లోవారికి, సమాజానికి సంబంధం లేదు. భగవంతుడితో అనుబంధం కలుగజేసేది భక్తి. మన భక్తి ఇతరులకు తెలియాలని మనము అనుకుంటే అందులో క్వాలిటీ తగ్గుతుంది. ఒక మంచి పనిచేసి అది ఇతరులకు తెలియాలనుకుంటే అనేకత్వం పెరిగిపోతుంది. నెమ్మదిగా మనకి తెలియకుండానే కీర్తి కాంక్ష పెరిగిపోయి - పతనమైపోతాము. కీర్తి కాంక్ష చాలా ప్రమాదము.

మనకి విద్య వలన వినయం రావాలి. విద్యవలన కనుక గర్వం వస్తే మనము నశిస్తాము. వినయంతో కూడిన విద్య మనకి ఆత్మజ్ఞానానికి సహకరిస్తుంది. మనకి విద్యతో పాటు తపస్సు కూడా ఉండాలి. మనము సాధనలో సక్సెస్ అవ్వలేక పోవటానికి కారణం విద్య ఉందిగాని తపస్సు లేదు.

మన మైండ్ right గా ఉంటే సుఖం. wrong గా ఉంటే దుఃఖం. పక్షులు గూళ్ళు ఎలా కట్టుకుంటాయో! అలా జన్మాంతర వాసనలన్ని మనస్సులో గూడు కట్టుకుంటాయి. ఆ గూటిని బద్దలుకొట్టి ఆ వాసనలని ఖాళీ చెయ్యాలి. హృదయం ఖాళీ అవ్వకుండా ఎవ్వరికీ జ్ఞానం రాదు. ఖాళీ చేసుకోవటమే సాధన. ఏ తలంపులు మనస్సుని పెంచుతాయో వాటిని తగ్గించుకోవాలి. వెయ్యి కోట్లు ధనమున్నా మన మైండ్ wrong మైండ్ అయితే దుఃఖం వచ్చి తీరుతుంది. right mind మనకి రక్షణని ఇస్తుంది. వాతావరణ కాలుష్యం వల్ల జ్వరాలు వస్తాయి. మందులు వాడితే తగ్గుతాయి. భావ కాలుష్యం చాలా ప్రమాదము. చెడ్డ భావాలు ఉన్నవారితో సహవాసం చేస్తే చెడ్డబుద్ధి వస్తుంది. అది మరణానంతరం చీకటి లోకాలకి నిన్ను తీసుకుపోతుంది.

కొంతమంది అబద్ధాలు చెప్తారు, నిమిషానికో మాట నిమిషానికో అబద్ధం. అట్టివారి సహవాసం త్రాచుపాముతో సహవాసం చెయ్యటం వంటిది. పాము కరిస్తే శరీరానికీ విషం ఎక్కుతుంది, దేహం చనిపోతుంది. కానీ అబద్ధాలు చెప్పే వారితో సహవాసం వల్ల జీవుడు విషపూరితమవుతాడు. వాడే రాబోయే జన్మలకి విషాన్ని మోసుకుపోతాడు. అందుచేత సహవాసాల విషయంలో తస్మాత్ జాగ్రత్త.

మన స్వభావం మన ప్రవర్తన మార్చుకునే ప్రయత్నం చెయ్యాలి. మన స్వార్థబుద్ధిలో నుండి కుచేష్టలలోనుండి, కుతంత్రాలలో నుండి బయటకు రావాలి. సాత్విక కర్మ, సాత్విక వాక్కు, సాత్విక బుద్ధి సంపాదించుకోవాలి. బయట ఉన్న వెలుగు కిటికీలకు ఉన్న రంధ్రాల నుండి లోపలికి ఎలా వచ్చేస్తుందో! లోపలున్న బలహీనతలు, సంస్కారాలు, ఇంద్రియాలనే చిల్లులలోనుండి ప్రపంచంలోకి పడిపోతాయి. వాటికి సాత్విక ప్రవృత్తితో అడ్డుకట్ట వేస్తే నెమ్మదిగా హృదయాభిముఖంగా ప్రయాణం మొదలవుతుంది. ఇంద్రియాలని సాధన పేరుతో బలవంతంగా అణిచి ఉంచటముకాదు. ఇంద్రియాలని ప్రకృతి వైపు నుండి, హృదయం వైపుకి తిప్పుకుని వాటిని proper way లో ఉపయోగించుకోవాలి. దేవాలయం కడితే పుణ్యం వస్తుంది.

హృదయాన్ని దేవాలయంగా చేసుకున్న వాడికి జ్ఞానం వస్తుంది. దేవతలు కూడా వాడిని చూసి అసూయపడే సుఖాన్ని వాడు అనుభవిస్తాడు.

దేహము శుభ్రంగా ఉంచుకోవడం ఎంత అవసరమో, మనస్సుని శుభ్రంగా ఉంచుకోవడం కూడా అంతే అవసరం. స్నానం దేహాన్ని ఎలా శుభ్రం చేస్తుందో, అలా సత్యమునే పలుకుతుంటే సత్యమే మన మనస్సుని శుభ్రం చేస్తుంది. అబద్ధాలు-అసత్యాలు మాట్లాడితే అవి మనస్సుని మరింత మలినం చేసేస్తాయి అన్నారు తిరువళ్ళువర్.

ఆవు పొదుగు దగ్గర పిండితేనే పాలు వస్తాయి. అలాగే భగవంతుడు అంతటా ఉన్నప్పటికీ గురువునో, రాముడినో, ఎవరో ఒక దేవతా పురుషుడిని ఆరాధిస్తూ, వారిని ధ్యానిస్తూ, పూజిస్తే జ్ఞానధార మనకి అందుతుంది. భగవంతుడు గోవు అయితే మహాత్ములు గోవుపొదుగు వంటివారు. పువ్వుల నుండి పరిమళం ఎలా వ్యాపిస్తుందో, అలా స్వరూప సుఖం పొందిన జ్ఞాని హృదయం నుండి జ్ఞానం, శాంతి, దయ ఆయన ఎక్కడ ఉంటే అక్కడ సహజంగా వ్యాపిస్తాయి. భగవంతునికి శరణాగతి చెంది జీవిస్తే అయన వారికి గొడుగై కాపాడుకుంటారు.

ఒకసారి నాన్నగారు ఒక మామ్మగారిని చూడటానికి వెళ్ళారు. ఆవిడకి 85 సంవత్సరాలు ఉంటాయి. నాన్నగారు, మామ్మగారిని ఎలా ఉన్నారని అడిగారు. ఆ మామగారు చిరునవ్వుతో fit for heaven అన్నారు. స్వర్గానికి వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నాను. భగవంతుడు ఇచ్చిన జీవితాన్ని పూర్ణంగా సద్వినియోగం చేసుకున్నాను. నా మనస్సుకి ఏ బెంగలు, ఏ బాధలు లేవు. మరణ-రూపంతో వచ్చేవాడు భగవంతుడే. ఆయన ఎప్పుడు వచ్చినా, ఆయన చెయ్యి పట్టుకుని ఆయనతో వెళ్ళటానికి సిద్ధంగా ఉన్నాను అన్నారు.

ఒక భక్తురాలు, నాన్నగారితో గురువు వద్దకి సామాన్య భక్తుడిలా వచ్చి, వెళ్ళిపోయి తన సాధన తాను చేసుకున్నవారు అదృష్టవంతులు నాన్నగారు. బాధ్యతలు మైండ్ ని పొల్యూట్ చేస్తాయి అనిపిస్తోంది అన్నారు. నాన్నగారు అంటారు, అమ్మా! పని ఎవ్వరూ చెయ్యరు, పని చేస్తునట్లు నటిస్తారు. భగవంతుడు అంతర్యామి, వాడికి తెలియనిదంటూ ఏదీ ఉండదు. so-called devotees ఎక్కువమంది. అయితే, గురువు వద్ద సబ్జెక్ట్

శ్రవణం చేయడం వల్ల, సూక్ష్మ బుద్ధి వస్తుంది. సూక్ష్మబుద్ధి వల్ల తెలివితేటలు పెరుగుతాయి. ఆ తెలివితేటల్ని లోపల బాగుపడటానికి inner work కోసం ఉపయోగించుకునేవారు చాలా తక్కువ. బయట లోకంలో గొప్పలు, గౌరవాలు కోసం ఉపయోగించుకుని పాడైపోయే వారు ఉంటారు. ఎవరూ బాధ్యత తీసుకోరు కానీ గౌరవం కావాలి. గురువు పని ఇది, భగవంతుడు పని ఇది, అది మన పని అని ఎవరైతే బాధ్యతగా ఉంటారో, వారికి ఏ సాధనలు అక్కర్లేదు.

ఒక కథ ఉంది, ఒకరోజు ఒక మహారాజు రాజ్య క్షేమం కోసం యజ్ఞం చేస్తున్నారు. రాజు దగ్గర గొప్పకోసం అందరూ, మాకు ఏదన్న పని చెప్పండి. మమ్మల్ని ఏం చేయమంటారని అడిగారు. అప్పుడు రాజు, మీ పెరట్లో ఉన్న ఆవు పాలు యజ్ఞ ప్రసాదం చెయ్యటానికి పంపమన్నారు. అందరూ రాజుగారి దగ్గర పంపుతామని చెప్పి, ఇంటికి వచ్చిన తరువాత అందరూ ఎలాగూ పాలు పంపుతారు కాబట్టి,మనము పంపకపోయినా రాజుకి ఏమీ తెలియదనే ఆలోచనతోనే అందరూ వున్నారు. యజ్ఞ ప్రసాదానికి పాలు లేవు. ఇది మనుషుల యొక్క స్వభావం. బాధ్యత లేని జీవితాలు, చిన్న మాటని కూడా నిలబెట్టుకోలేని మనస్సులు, అల్పమైన స్వభావం. భగవంతుడిని పొందడానికి ఎన్నో సాధనాలు ఉన్నాయి. అయితే, అత్యంత వేగంగా ఆయన అనుగ్రహం ఎలా పొందుతారు అంటే, ఆయన భక్తుల దేహంతో తాదాత్మ్యయం అయ్యి ఉంటారు. భక్తులకు సేవ చేయడం వల్ల ఆయన అనుగ్రహం వేగంగా పొందుతాము.

నువ్వు సొంత పని చేస్తున్నా, నేను చేస్తున్నాను అనే భావన లేకుండా చేస్తే అహంభావం అణిగిపోతుంది. జ్ఞాని పనిచెయ్యాలని చెయ్యరు. వారి ద్వారా పని జరుగుతుంది. కబీర్ కి ఇంట్లో ఏమీ లేకపోతే దొంగతనం చేసి భక్తులకి భోజనం పెట్టేవారు అన్నారు.

మనస్సు నశించకుండా జ్ఞానము కలుగదు. మనసు నశించాలంటే, మనము దృష్టి పెట్టవలిసినివి

1. పరిశీలన: దొంగ మనము మెలుకువగా ఉంటే దొంగతనం చెయ్యడు. ఏమరుపాటుగా ఉంటే చేస్తాడు. అలా నీమీద నీకు పరిశీలన ఉంటే పొరపాటు జరగదు.

2. గమ్యం మీద మనస్సును పెడితే దాని వేగం తగ్గుతుంది. constant remembrance. నీ మనస్సుని శాంత పరుస్తుంది.

3. తక్కువ మాట్లాడటం వల్ల కూడా మనస్సు తగ్గుతుంది. నూటికి 99 మాటలు వ్యర్థమైనవే.

4. అన్వేషణ: లోపల ఏది ఉంది అనేది అన్వేషిస్తుంటే, అన్వేషణలో నీ మనస్సు నశిస్తుంది.

నాన్నగారు భక్తులను రెండు విషయాలకి దూరంగా ఉండమనేవారు. 1. ప్రచారం, 2. రాజకీయం ఇవి రెండూ భక్తులకి పనికిరావు. వారు గమ్యం తప్పిపోతారు, ఒకసారి చేతిలో ఉన్న బంతి జారిపోతే అది పల్లాన్ని వెతుక్కుంటూ వెళ్ళిపోతుంది. ఈ రెండిటి గొడవలో పడ్డవారు గమ్యం నుంచి జారిపోతారు. ఒక లౌకికుడితో అరగంట కాలక్షేపం చేస్తే ఆరు నెలల సాధన కరిగిపోతుంది. భక్తులతో, సాధకులతో సహవాసం చేస్తే మోక్షం పట్ల అపేక్ష, జిజ్ఞాస కలుగుతుంది. శరీరం మీద పుండు వస్తే, ointment ఎలా రాసుకుంటామో, అలా ఆకలనే రోగం వస్తే, అన్నం అనే మందును పెట్టాలి అన్నారు ఆచార్యులు.

సమాజం, ధర్మం చుట్టూ తిరగాలని భగవంతుడు శాస్త్రములో చెప్పాడు. అయితే సమాజం ప్రస్తుతం ధర్మాన్ని విడిచి పెట్టేసి, ధనము చుట్టూ తిరుగుతోంది. దాని పరిణామం జీవకోటి అనుభవిస్తోంది. భౌతిక అవసరాలకి లోటు లేకపోయినా సమాజంలో అశాంతి పెరిగిపోతుంది.

కామక్రోధాలు, ప్రియా-అప్రియాలు, రాగద్వేషాలు ఇవి నిప్పుతో సమానం. ఇవి జీవుడిని మండింప చేస్తాయి. వాడిని లోపల చల్లగా, శాంతిగా ఉండనివ్వవు. అవి రేగినప్పుడు నోటిలోనుండి ఏ మాటలు వస్తున్నాయో, వారు చేతులతో ఏ పనులు చేస్తున్నారో, వారికే తెలియదు. లోపల కాలిపోతారు, బయట సమాజాన్ని తగలపెడతారు. అందుకే అవి జీవుడికి అంతర్గత శత్రువులు. మహాశని, మహాపాపం, జన్మజన్మల పీడ అన్నారు పరమాత్మ.

కొంతమంది డాక్టర్లు నాలుకని చూసి దేహారోగ్యం చెప్పేస్తారు. నాలుక మీద నుండి జారే మాటలను బట్టి మానసిక ఆరోగ్యం తెలుస్తుంది. మన మనస్సు ఎలా ఉందో, మన మాటలు చెప్పేస్తాయి.

మనము ఉన్నచోట ఉండి కూడా, యోగస్థితిని పొందవచ్చు. దానికి ఒక టెక్నిక్ ఉంది. మనకి ఒక సంకల్పం ఉంటుంది, ఈశ్వరుడికి ఒక సంకల్పం ఉంటుంది. ఈశ్వర సంకల్పమే జరుగుతుంది. మన సంకల్పం కనుక ఈశ్వర సంకల్పానికి భిన్నంగా ఉంటే, మన సంకల్పాన్ని ప్రక్కకి నెట్టి మనము ఈశ్వర సంకల్పానికి మన మనస్సుని tune చేసుకుంటే ఆయన సంకల్పాన్ని గౌరవించి - ఇష్టంగా, ప్రీతిగా పాయసాన్ని ఎంజాయ్ చేసినట్టు ఎంజాయ్ చేస్తూ దాన్ని అనుభవించేస్తే యోగస్థితిని సహజంగానే పొందుతాము.

మనము ఏదైనా సత్కర్మ చేస్తే దాన్ని చూసి, లోకమంతా సంతోషిస్తారు అనుకుంటే అది వెర్రితనం. సత్పురుషుడు మాత్రమే మంచిని చూసి సంతోషిస్తాడు. మనము మంచిని చెయ్యకపోయినా, మంచి చేసే వారిని చూసి సంతోషిస్తే కనీసం అలా సంతోషించే స్థాయికి అయినా మనము ఎదిగితే, భగవంతుడు అందులో మనకి కొంత ఫలాన్ని పంచుతాడు. తిలక్ గారు ఏమంటారంటే, భగవద్గీతలో పరమాత్మ చెప్పిన విధంగా కర్మలని చేస్తే అవి నన్ను పవిత్రుడిని చేస్తాయి. Service has purified me. Service నన్ను uplift చేసింది.

చెట్టుకింద నీడలో ఒకరు హాయిగా విశ్రాంతి తీసుకుంటాడు. మరొకరు చెట్టుకి ఉరి వేసుకుంటాడు. చెట్టు ఒకరిని ఇలా చేయమని, మరొకరిని అలా చేయమని చెప్పదు. వారి బుద్ధిని బట్టి - వారు అలా సిద్ధమవుతారు. లోకం కూడా అంతే, మన లోకపు అల్లర్లలోకి వెళ్ళకూడదు. మనం లోకంలోకి వచ్చామనే గుర్తు కూడా కనపడకుండా తరించాలి. ఎట్టి గుర్తింపులు, ఎట్టి గౌరవాలు వెనక మనము పరుగులు పెట్టకూడదు.

let us remain being good and do our duty. ప్రపంచంలో అన్నిటికంటే గొప్పపని తన పొరపాట్లని, తన బలహీనతలను తెలుసుకోవటమే. ప్రపంచంలో గొప్ప ధైర్యం ఏదంటే, తన బలహీనతలని గ్రహించి క్షమించమని వేడుకోవటమే.

మనస్సుని నిగ్రహించుకోవడం చాలా కష్టం. డాక్టర్ మెడిసిన్ ని ఎలా ప్రాక్టీస్ చేస్తారో, లాయర్ లా ని ఎలా ప్రాక్టీస్ చేస్తారో, అలా అభ్యాసం ద్వారా మనస్సుని నిగ్రహించుకునే ప్రయత్నాన్ని ప్రాక్టీస్ చెయ్యాలి అదే సాధన. రోగం తగ్గించుకోవడానికి డాక్టర్ ఎలా సహాయం చేస్తాడో, భవ-రోగంలో నుండి మనము బయటకు రావడానికి గురువు అలా సహాయం చేస్తాడు

Service without ego. Service with ego; ego చేసిన ప్రతీ పని మనల్ని జన్మ పరంపరలోకి నెట్టేస్తుంది. అజ్ఞానం బలీయం. కలి దోషం ఏమిటంటే, మనల్ని మనము బాగు చేసుకోవడం మానేసి, మనల్ని మనము ఉద్ధరించుకోవడం మానేసి, ఇతరుల్ని ఉద్ధరించాలనుకుంటాము. మన మాటలు మనము పవిత్రమవ్వటానికి ఉపయోగపడకపోతే, ఇతరుల మీద అవి ఏమాత్రం ప్రభావం చూపించవు. గడ్డిపరక గాలికి ఏవిదంగా కొట్టుకుపోతుందో, అలా మన మాటలు కూడా కొట్టుకుపోతాయి.

An aim less life is always a miserable life. స్వాతంత్ర ఉద్యమంలో పోరాడిన దేశ - భక్తులందరూ స్వతంత్రము మా జన్మహక్కు, మేము ఇతరులకి బానిసలా ఉండము అన్నారు. అలాగే సాధకులు Realization is our birth right అని జీవిస్తూ, లోపల ఉన్న బలహీనతలకి బానిసలా బ్రతకకూడదు. దేహానికి, మనస్సుకు, ఇంద్రియాలకు ఎంతకాలము బానిసలాబ్రతుకుతాము. లోపల ఉన్న చైతన్యం సర్వస్వతంత్ర మైనది. గంగానదిలో స్నానం చేస్తే పాపం పోతుంది. జ్ఞాని దర్శనం వల్ల పాపం చేసే బుద్ధి పోతుంది.

ఈ భూమ్మీదకి మనము ట్రైనింగ్ కోసం వచ్చాము. సత్యాన్వేషకుడు ఎలా ఉండాలంటే, కొండని గాలివాన ఎలా కొట్టేసినా అది కదలదు-మెదలదు స్థిరంగా అలాగే ఉంటుంది. అలా జీవితంలో నిందా-స్తుతులు వచ్చి మీద పడినా మనస్సులోకి తీసుకోకుండా స్థిరంగా ఉండాలి సత్యాన్వేషణలో. లేదంటే మార్గం తప్పిపోతాము, జారిపోతాము. మన సాధనని ధ్వంసం చేసేవి మనలో ఉన్న ద్వంద్వాలే. ముందు వాటిని విసర్జించాలి.

దైనందిన జీవితంలో మనకి పుణ్యం తెచ్చినా - పాపం తెచ్చినా మన త్రికరణాలే. దేహ-గతమైన నేనుని పోగొట్టుకోవటానికి పెద్దపెద్ద తపస్సులు చెయ్యనక్కర్లేదు. ఇంట్లో పనుల మానెయ్యనక్కర్లేదు. మన నోటిలో నుండి వెలువడే మాట అహంకారము

కోసం, గొప్పల కోసం మాట్లాడకూడదు. వాటి కోసం మాట్లాడితే, దేహబుద్ధి పెరిగిపోతుంది. మన చేతితో చేసే పనులు స్వార్థం కోసం, గౌరవాల కోసం చెయ్యకూడదు. మన మాటల ద్వారా, చేతల ద్వారా దేహబుద్ధి పెరగకూడదు. మనము అది గమనించుకుంటూ, జాగ్రత్తపడితే అజ్ఞానం లోనించి బయటకు వచ్చేస్తాము.

ఎలుకలు కలుగుల్లో ఉండి బతుకుతాయి. మేత కోసం బయటకి వచ్చి, చెత్తా-చెదారం పోగు చేసుకుని కలుగులోకి వెళ్ళిపోతాయి. మనము కూడా అలాగే తయారయ్యాము. ఆ కలుగులోంచి బయటకి వచ్చి, ఈ విశాల విశ్వంలో ఉన్న జీవకోటి కష్ట-సుఖాల మధ్యలో, గౌరవ-అగౌరవాలలో భగవంతుడిని చూసే ప్రయత్నం చేస్తుంటే, నెమ్మది నెమ్మదిగా మనము widen అవుతాము. బుడగలో గాలిని ఊదే కొలది అది ఉబ్బి తర్వాత పగిలిపోతుంది. మనము కూడా widen అయ్యి, దేహాత్మ-బుద్ధి అనే బుడగ పగిలి, లోపల ఉన్న సత్యాత్మ ఎరుకని పొందుతాము. మన చిత్తాన్ని పరీక్షించకుండా మనకి భగవంతుడు గ్రేస్ ని విడుదలచెయ్యడు.

ఇప్పుడున్న శరీరాలు 10 సంవత్సరాల తర్వాత ఉండవు, ఇవన్నీ జడాలు. ప్రతీ జడ వస్తువు కాంలలో కొట్టుకుపోతుంది. కాలము చేత అంటబడనది చైతన్యం ఒకటి మాత్రమే. అహంకారం-మమకారం ఇవి రెండూ రోగాలు. త్యాగం వల్ల మమకారం తగ్గుతుంది. ఆత్మ జ్ఞానంవల్ల అహంకారం తగ్గుతుంది. ఇది రెండు ప్రకృతి గుణాల వల్ల పెరిగిపోతాయి.

అందర్నీ చదువుకున్న మూర్ఖులు, చదువు లేని మూర్ఖులు అన్నారు భగవాన్. మూర్ఖత్వము మాత్రము ఇద్దరికీ సమానమే. మనము చదువుకున్న చదువు, మనస్సుని, ఇంద్రియాల్ని నిగ్రహించుకుని ప్రేమమయంగా జీవించటానికి మనకి సహకరిస్తే అది ఉత్తమ చదువుతోపాటు, ఉత్తమ జీవనమవుతుంది.

తాబేలుకి ఏదైనా ప్రమాదం వస్తే, దాని తల, కాళ్లు, చేతులు లోపలికి లాగేసుకుంటుంది. అలాగే ఇంద్రియ-విషయాలమీదకు వెళ్తున్న మన మనస్సుని withdraw చెయ్యాలి. withdraw చెయ్యకపోతే, మనస్సు, ఇంద్రియాలు మలినమైపోతాయి. మనము పవిత్రమవ్వలేము.

స్వార్థం ఉన్న వాడికి వ్యక్తి భావన పెరుగుతుంది. వ్యక్తి భావన పెరిగే కొలది

స్వార్థం పెరిగిపోతుంది. నూటికి నూరుపాళ్ళు మనము స్వార్థం తగ్గించుకోలేక పోయినప్పటికీ, కొద్ది కొద్దిగా అయినా తగ్గించుకుని, మంచిని చేస్తుంటే మరణానంతరం ఆమంచి మనకి ఎలా వెలుగుని తీసుకువస్తుందో, అది మన ఊహకి అందదు. మరణానంతరం మన కూడా వచ్చేవాడు జీవుడికి నిజమైన స్నేహితుడు, మనము జీవించి ఉండగా చేసిన దానమే నిజమైన దానము.

సరుకులు బజార్ లో ఉన్నా అవి కొనుగోలు చేసే శక్తి లేనివాడిని బీదవాడు అంటారు. మహాత్ములు ఎంత బోధించినా, శాస్త్రాలు ఎంత ఘోషించినా వాటిని అర్థం చేసుకునే శక్తి లేనివాడు ఈ భూమ్మీద అజ్ఞానిగానే మిగిలిపోతాడు.

పొయ్యిలో పిడకలకి ఏ గతి పడుతుందో, మంచితనం లేని తెలివితేటలకు కూడా ఆ గతే పడుతుంది.

మీరు ఒక్కరే జ్ఞానం పొందటం కాదు. మీ సహనం, మీ వైరాగ్యం, మీ జ్ఞానం వలన మీ ఇంటిని స్వర్గ రాజ్యం చేసుకోగలిగితే అది వైభవం. నువ్వు ఎవరికైనా మామిడిపండు ఇస్తే, అది ఇతరులు తింటే పోతుంది. ఎదుటివారు ఆధ్యాత్మిక పురోభివృద్ధి సాధించడానికి మనము ఒక్క వాక్యం చెప్తే, వాళ్లు పవిత్రులవుతారు.

జీవితంలో బయట వ్యక్తులపట్ల కానీ, బయట పరిస్థితులపట్ల కాని యాక్షన్ ఉండాలి కానీ రియాక్షన్ ఉండకూడదు. అది బహిర్సమాధి. దేహాభిమానం, మనస్సు పట్ల జీవాభిమానం ఇవి రెండిటినీ పక్కకు పెట్టి జీవిస్తే వాడికి అంతర్సమాధి సిద్ధిస్తుంది. అప్పుడు వాడికి ఆత్మ సుఖం హృదయంలో sprinkle అవుతుంది.

మర్రి విత్తనం చాలా చిన్నది. ఆ చిన్న విత్తనంలో మహావృక్షం దాగి ఉంది. అలాగే కామము (కోరిక) అనే విత్తనంలో జన్మలన్నీ దాగి ఉన్నాయి. విత్తనంలో మొలకెత్తే బీజం వేగిపోవాలి. అంటే మన జీవితంలో సంతోషపడే సంఘటనలు జరిగితే లోపల detached గా ఉండాలి. ఇది నేను కాదు, నేను కాదు అనే ఎరుకతో ఉండాలి. దుఃఖపడే సంఘటనలు జరిగినా కూడా ఇది నేనుకాదనే ఎరుక కలిగి ఉండి, వాటితో కలవకుండా విడివడి ఉండగలిగితే మన లోపల కామమనే బీజం వేగిపోతుంది, తిరిగి మొలకెత్తదు. శేషము లేకుండా కోరిక నశించిన వాడు జన్మ పరంపరలోనుండి బయటకు వచ్చేస్తాడు.

దేహము-లోకము ఇదేనా జీవితం, మనము జీవితం పొడుగునా వాటి చుట్టూ తిరుగుతూ ఉంటే, మళ్ళీ వాటిల్లోకే మన ప్రయాణం. ఈత ఈదేవాడు నీటి ప్రవాహాన్ని రెండు చేతులతో ప్రక్కకి నెట్టుకుంటూ ముందుకు వెళ్తాడు. అలాగే దేహబుద్ధిని, లోకబుద్ధిని మనము ప్రక్కకి నెట్టుకోగలిగితే చైతన్యం వైపు మన ప్రయాణం జరుగుతుంది.

ఇంట్లో ఉన్న బంగారం వల్ల భోగం వస్తుంది. హృదయంలో ఉన్న బంగారం వల్ల మోక్షం వస్తుంది.

గీత చదివితే పుణ్యం, అది అర్థం చేసుకొని జీవిస్తే జ్ఞానం వస్తుంది.

social-reforming కాదు, కావలసింది self-reforming. ఒక్క జ్ఞాని మాత్రమే జీవకోటిని ప్రేమించగలడు. మనము కామిస్తాము కానీ, ప్రేమించలేము. ప్రేమ శాంతిని - జ్ఞానాన్ని తీసుకువస్తుంది. కామము దుఃఖాన్ని, అశాంతిని తీసుకువస్తుంది.

రోజులు బాగా వెళ్ళిపోతున్నాయి అనుకుంటున్నాము. ఈ ధనం, చదువులు, గౌరవాలు వీటన్నిటిని భోగ రూపంలో అనుభవిస్తున్నాము. అవి మనల్ని విడిచిపెట్టవు. మన మనస్సుకి అవే కావాలనిపిస్తుంది. నీ ఇంద్రియాలు, మనసు అటే లాగేస్తాయి తప్ప భగవంతుడు వైపు తిరగవు.

కల్పవృక్షం - కామధేనువు అడిగినవే ఇస్తాయి. సత్పురుషుడి సహవాసం అడగనిది కూడా అనుగ్రహిస్తుంది. జీవితాన్ని నిర్మలంగా శాంతిగా జీవించండి. వ్యర్థమైన గౌరవాలు, వ్యర్థమైన వ్యక్తులు, వ్యర్థమైన విషయాలు, వ్యర్థమైన ఆకర్షణలు మీదకి మన మనస్సుని వెళ్ళనివ్వకండి. సదా గురువుని ప్రేమించండి.

శ్రవణ, మనన, ధ్యానాల వలన నీకు ఆధ్యాత్మిక సంపద కలుగుతుంది. అవే నీకు నిధి ధ్యాసని తీసుకువస్తాయి. నిధి-ధ్యాసలు నీకు జ్ఞానాన్ని పట్టిస్తాయి. ఆకాశానికి - మేఘానికి ఎటువంటి సంబంధం ఉందో, ఆత్మకి దేహానికి అటువంటి సంబంధమే ఉంది. శ్రవణ-మననాలు నీలోపల ఉన్న అజ్ఞానాన్ని కక్కిస్తాయి. నిధి-ధ్యాసలు నీకు జ్ఞానాన్ని పట్టిస్తాయి. నిరంతరం నువ్వు దేనిని చింతిస్తే అదే నీవు అవుతావు.

కోరికలకతీతంగా భగవంతుని ఆరాధిస్తే ప్రేమ అనే లాభం కలుగుతుంది. ధ్రువుడు భాగవతంలో ఏమంటాడంటే, వాసుదేవా! ఈ అడవిలోకి, లౌకిక ప్రయోజనాలనే గాజు పెంకుల కోసము వచ్చాను. కానీ రత్నాలు ఇచ్చావు. పినతల్లి అగౌరవం భరించలేక వచ్చాను కానీ రత్నాలను అనుగ్రహించావు అంటాడు.

love your work for other's well being. భట్రాజులు మాటలతో సరిపెడతారు, యోగులు, భక్తులు వారి ప్రేమని పని రూపంలో వ్యక్తముచేస్తారు. గురువు పట్ల మన ప్రేమని భక్తిని నోటికి పరిమితము చెయ్యకూడదు, చేతులతో కూడా ఆరాధించాలి. దానివల్ల మన మనస్సు పవిత్రమవుతుంది.

ఒకసారి నాన్నగారు గోదావరి ఒడ్డున ఉన్న మల్లేశ్వరం అనే చిన్న గ్రామానికి వెళ్ళారు. అక్కడ ఒక స్వామి సుబ్రహ్మణ్యుడిని ఆరాధించేవారు. ఆ స్వామి సుబ్రహ్మణ్యుడిని ఆరాధిస్తూ అఖండ జ్యోతిని వెలిగించి, ఆయన అనుగ్రహం పొందటముకోసం జీవితాన్ని ఆయన స్మరణతో గడిపేవారు. ఆ ప్రదేశానికి నాన్నగారు వచ్చి, అక్కడ ఉన్న జ్యోతికి నమస్కరించి ప్రవచనం చెప్పటం మొదలుపెట్టారు: స్వామి యొక్క ఆరాధన ఫలంగా, ఉపాసన ఫలంగా మేము ఈ గ్రామానికి వచ్చాము. ఇక్కడ సుబ్రహ్మణ్యుడే ఈ ప్రకృతి రూపంలో పొంగి ప్రవహిస్తున్నాడని ఇక్కడకు వచ్చిన తరువాత తెలిసింది. మా రాకకి కారణం సుబ్రహ్మణ్యుడి ఆరాధన. స్వామి 70 సం॥లు సుబ్రహ్మణ్యుడిని ఆరాధించారు.వారికి నా నమస్కారాలు. మనము చేసిన పుణ్యం, చేసిన సత్కర్మ, చేసిన ఆరాధన ఊరికేపోదు. జ్ఞాని సమక్షం లభించాలంటే, జీవుడు పెట్టి పుట్టాలి. స్వామి ఆరాధన మనకి అనుగ్రహ ప్రవాహంగా మారి ఆరోజు నాన్నగారు, ఆమహాత్ముని సాంగత్యంలో పొంగి,పొంగి చెప్తున్నారు. మహాత్ముల సాంగత్యంలో, మహర్షుల సహవాసంలో వారి సన్నిధిలో రాబోయే జన్మల కారణాలు కదిలి కరిగి నశిస్తాయి, రాలిపోతాయి, ఎండిపోతాయి. మాటలతో చెప్పలేని దాన్ని ఎంత వరకు చెప్పగలరో, అంతవరకు చెప్తున్నారు. మీకు పునర్జన్మ కారణాలు నశించడమే కాదు, మీ మనస్సు నిర్మలమై, నిశ్చలమై సమాధిస్థితి కూడా వచ్చేస్తుంది. ఏ పవిత్రుల తపోఫలమో మనమందరము ఆయన దర్శనాన్ని, ఆయన సాంగత్యాన్ని పొందాము.

మనము అన్నం తింటున్నాము, ఇంద్రియ భోగాలు అనుభవిస్తున్నాము. సత్యాన్వేషణ లేనప్పుడు, మోక్షకాంక్ష లేనప్పుడు, పందికి మనకి బేధం లేదన్నారు

ఆచార్యులు. భోగబుద్ధితో ఆత్మజ్ఞానం పొందలేము. యోగబుద్ధి వలన జ్ఞానం పొందుతాము.పశువులైన ఆవులకి, యజమాని కొంచెము గడ్డిపెడితే కుంచుడు పాలు-ఇస్తున్నాయి. మనము ఏ పని చెయ్యముకానీ, అన్ని భోగాలు - అన్ని సుఖాలు ఏ-పని, ఏ-కృషి లేకుండా వచ్చెయ్యాలి అనుకుంటాము. మనలాంటి వారిని భగవద్గీతలో డంబాచారి, మిధ్యాచారి అన్నారు. మనిషి జన్మఎత్తి, భక్తి లేకుండా ఉండటం కంటే, పశుజన్మఎత్తి భక్తి కలిగి ఉండటం మంచిది

మేఘాలు అడ్డువస్తే, ఆకాశంలో సూర్యుడు ఎలా కనిపించకుండా ఉంటాడో, అలాగే మనలో భగవంతుడు ఉన్నా ఈ చెడ్డ గుణాలు, చెడు సంస్కారాలు వల్ల మనకు గోచరం అవ్వటం లేదు.

వ్యవహారిక జీవితంలో ద్వైతపరంగానే ఉంటాము. అద్వైతాన్ని గమ్యంగా పెట్టుకోవాలి. అద్వైత వాసన లేకుండా అద్వైతానుభవం రాదు. అద్వైత సంస్కారం పుణ్యబలం లేకుండా రాదు. సత్కర్మని ఏదో రూపంలో చేసి ఉండాలి, సబ్జెక్ట్ ని విని ఉండాలి. ప్రతీ జ్ఞాని కరుణా స్వరూపడే, ఏజ్ఞాని భక్తి లేకుండా, ప్రేమ లేకుండా, దయ లేకుండా ఉండడు. ఈ సృష్టి లేదని చెప్పిన భగవాన్ కూడా అరుణాచలేశ్వరుని ఊరేగింపులో విగ్రహం చూసినా, రామాయణం చదివేటప్పుడు అరణ్యపర్వం వింటున్నా కళ్ళ వెంట నీరు వచ్చేది. తత్వం వద్దకు వచ్చేసరికి ఉన్నది ఒక్కటంటే ఒక్కటే. మనము ఏ మార్గంలో ప్రయాణం చేసినా, ఏ గురువుని ఆశ్రయించినా మనము పవిత్రమవ్వాలి. భగవంతుడిని పొందాలంటే, నిరాకారాన్ని, నిర్గుణాన్ని ఆరాధించటం కష్టము. manifested God ని ఆధారంగా పెట్టుకోవాలి, వారి దయని సంపాదించి జ్ఞానం పొందాలి. జనన-మరణ చక్రంలోంచి బయటకి తీసి మనల్ని స్వరూప సుఖంలో ఐక్యం చేసేవాడు గురువు మాత్రమే.

గోదావరి నదికి వరదవస్తే గడ్డిపరకలు కొట్టుకుపోతాయి, పెద్ద పెద్ద బండరాళ్ళు కూడా కొట్టుకుపోతాయి. అలాగే ఒక మహాత్ముడు భూమి మీదకు వచ్చినప్పుడు, తపస్సులు చేసి మనస్సుని ఎండింప చేసుకున్న యోగులు మాత్రమే కాదు - సామాన్యులు కూడా తరిస్తారు. గోదావరికి వరద వచ్చినట్టు ఒక్కోసారి గురువు హృదయం కూడా పొంగిపోతుంది. అప్పుడు ఆ సమక్షంలో ఉన్నవారు ధన్యులు. జన్మ జన్మల నుండి వారిలో గూడుకట్టుకుని ఉన్న వాసనలన్ని

గురువుయొక్క అనుగ్రహ వర్షంలో కొట్టుకుపోతాయి.

Shakespeare: I always feel happy because I don't expect anything from anyone. expectation always hurts, life is too short. so, love your life, be happy and keep smiling.

Listen before you speak, think before you spend, earn before you pay, forgive before you hurt, feel love before you hate, love to learn never quit and never react.

Use your voice of kindness, your ears of compassion, and hands of charity, your mind of truth and your heart out of love on humanity.

నాన్నగారు చిన్నతనంలో పండుగలకి కొమ్మర అమ్మమ్మ గారింటికి వెళ్ళేవారు. వారు అమ్మమ్మ సీతమ్మ గారు, నాన్నగారికి కొత్తబట్టలు కుట్టించేవారు. పండుగలప్పుడు ముప్పర్తిపాడు నుండి ఒక టైలర్ కొమ్మర వచ్చి, గ్రామంలో అందరి బట్టలు కుట్టి వెళ్ళేవాడు. నాన్నగారు అమ్మమ్మ కొన్న బట్టలు తీసుకొని, భాషా వద్దకి వెళ్ళి కొలతలు ఇచ్చి కుట్టమనేవారు. భాషా నాన్నగారిని ఇదుగో 'జిన్నూరు' మీరు నా వద్ద కుర్చుంటే నేను మీ బట్టలు కుడతాను. అని నాన్నగారిని తన వద్ద కూర్చోపెట్టుకొని సంతోషపడేవారు. నాన్నగారు జ్ఞానం పొందిన తరువాత చెప్పే ప్రవచనాలు వినటానికి ముప్పర్తిపాడు నుండి కొందరు భక్తులు వచ్చేవారు. వారు, నాన్నగారిని మీరు ఒకసారి మా గ్రామం రావాలని అడిగారు. నాన్నగారు అక్కడకి వెళ్ళినప్పుడు ఇక్కడ భాషా అనే ఒక టైలర్ ఉంటాడు. అతని అడ్రెస్స్ కనుక్కోమని వెళ్ళారు. అప్పటకి భాషా చనిపోయి రెండు నెలలు అయ్యిందని కుటుంబ సభ్యులు చెబుతారు. నాన్నగారు మన భాషా వెళ్ళిపోయాడా ఎక్కడకి వెళ్ళతాడు? వాడి ఆప్యాయత మన వద్దకే తీసుకు వస్తుంది. భాషాని మనం చూడకపోయినా, భాషా ఉన్న ఇంటిని మనం చూసి వస్తున్నాము అన్నారు. అది గురువు యొక్క అపాయ్యత.మనం గురువుని స్మరించటం కాదు, గురువు హృదయంలో మనం రవ్వంత స్థానం సంపాదించుకుంటే చాలు. మనం భూమ్మీదకి వచ్చిన పని పూర్తవుతుంది.

## భక్తి - శరణాగతి - జ్ఞానవిచారణ -సాధనా సంపత్తి

భక్తి సామాన్యం కాదు, పెద్దపులి వంటిది. పెద్దపులి దగ్గరకి మేకలు, చిన్న జంతువులు ఎలా వెళ్ళలేవో, భక్తి ఉన్నచోట విషయాలు అలా చేరవు, అంటారు మధ్వాచార్యులు

లోపల ఉన్న వస్తువు కర్మఫలం వలన పొందేది కాదు. అది ప్రేమ ఫలం, జ్ఞాన ఫలం వలన పొందేది. కర్మఫలం వల్ల పుణ్యం వస్తుంది, పుణ్యం వలన భోగం వస్తుంది. మనలో ఉన్నప్రేమ - స్వచ్ఛత - నిర్మలత్వానికి జ్ఞానం వస్తుంది.

నాకేది మంచిదో, నాకంటే ఈశ్వరుడికి బాగా తెలుసు అని అనుకుని శరణాగతి చేస్తే, అహంకారం నెమ్మదిగా నశిస్తుంది.

రమణులు అంటారు, మోక్షమంటే విడుదల. సాధన అంటే విడిచిపెట్టడం. వ్యర్థమైన తలంపులు, వ్యర్థమైన మాటలు, వ్యర్థమైన పనులు ఇవన్నీ వదిలేస్తే మనసు గూట్లో పడిపోతుంది. రక్తం పడితే దేహానికి శక్తి వస్తుంది, శ్రద్ధ పెడితే జీవుడు దేవుడవుతాడు. జ్ఞానం పొంది సుఖి అవుతాడు.

స్వప్నంలో నుండి మేల్కొన్న వాడికి స్వప్నం నిజం కాదు, హృదయంలో మేల్కొన్న వాడికి దేహం నిజం కాదు.

శ్రద్ధ లేని శ్రవణం, భక్తి లేని పూజ, ఆదరణ లేని పెట్టు-పోతలు, చరిత్ర-శుద్ధి లేని జన్మ, విశ్వాసం లేని సేవ దండుగ అని భాగవతం చెబుతోంది.

భగవంతుడి వైభవం, ఆయన దేహాన్ని సృజించుకుని రాముడిగా, కృష్ణుడిగా అవతరించినప్పుడు తెలుస్తుంది.లోపల ఉన్న అంతర్యామి అవతార పురుషుడిగా భూమ్మీదకి వచ్చినప్పుడు జీవకోటికి భగవంతుడి వైభవం తెలుస్తుంది.

నరుడై పుడితే సరిపోదు. నారాయణుడిని స్మరించి, స్మరించి పొందు. be still and know that you are God. నీవే ఆ బ్రహ్మము.

అగ్నిలో కర్పూరం ఎలా కరిగిపోతుందో, మీకు భగవంతుని పట్ల ఉన్న భక్తి అనే జ్ఞానాగ్నిలో, నీ మనస్సు కాలిపోవాలి.

1000 సం॥లు తపస్సు చేసిన వారికంటే, ఈశ్వరుని దయ అనే కిరణం తాకినవాడు తరిస్తాడు. మన భర్త, పిల్లలకోసం తపించే తపనలో ఒక వంతు ఈశ్వరుడు కోసం తపిస్తే చాలు. ఆయన దయని పొందుతాము. ఈశ్వరుడు మన అంతస్థుని, భౌతిక స్థితిగతులను చూడడు. ఈశ్వరుడు మనల్ని కరుణించే ముందు హృదయంలో మనము ఎలా ఉన్నామని చూస్తాడు. కొందరు పరిస్థితులు బాగాలేనప్పుడు కూడా బాధకి గురికారు. వారిని ఈశ్వరుడు అనుగ్రహిస్తాడు.

స్థిరభక్తి మనల్ని మోక్ష స్థితికి మోసుకుపోతుంది. ఈశ్వరుడి పట్ల, గురువు పట్ల జీవితం పొడుగునా భక్తి విశ్వాసాలు కలిగి ఉండాలి. విశ్వాసానికి మించిన సాధన ఇంకొకటి లేదు. గురువు పట్ల కృతజ్ఞత కలిగి ఉండాలి. అయితే, విశ్వాసం కూడా భగవంతుడి దయ ఉన్నవాడికే సిద్ధిస్తుంది.

కొందరు మనుష్యుల్ని గాఢంగా ప్రేమిస్తారు, వారిని lover of humanity అంటారు. శరీరం శవమైన తరువాత పంచభూతాల్లో కలిసిపోతుంది. కానీ వారికి మానవజాతి పట్ల ఉన్న ప్రేమ పోయేది కాదు. ఈ సృష్టి ఉన్నంతకాలం ఆ ప్రేమ అజరామరం. భాగవతంలో ఒక కథ ఉంది : ఒక భక్తుడు, భగవంతుడిని అందరి హృదయాలలో నీవు అంతర్యామిగా ఉండి వారి వారి కర్మలని ఒక దేహంలో ఉండగా చేసినది, మరొక దేహంలో ఉండగా అనుభవింప చేస్తున్నావు. వారి కర్మ వారిని పీడించేస్తోంది. ఓ ఈశ్వరా! ఈ జీవకోటి అందరి హృదయాల్లో నీతో పాటు నన్ను కూడా ఉండనియ్యి. వారిని పూర్వజన్మలు నుండి వచ్చిన కర్మ పీడించకుండా దాన్ని నేను అనుభవిస్తాను. ఈ వరాన్ని అనుగ్రహించమని ప్రార్థిస్తాడు ఆ భక్తుడు. ఆ భక్తుడికి జీవకోటి పట్ల హద్దులు లేని ప్రేమ ఉంది.

మనము ఏ పని చేసినా, పవిత్రత సంపాదించుకోవడం కోసం చెయ్యాలి. కీర్తి కాముకత్వం కోసం పనిచెయ్యకూడదు. Milton paradise lostలో అంటారు, స్వర్గం మన హృదయంలోనే ఉంది. right speech, right action, right living, right knowing, right behavior లేనందు వల్ల మన హృదయంలో ఉన్న స్వర్గాన్ని మనము తెలుసుకోలేక, నష్టపోతున్నాము. నిజంగా పనిచేసే వాడికి publicity అవసరం ఉండదు. మనము చేసినట్టుగా కనిపించాలనుకుంటాము కాబట్టి publicity కావాలి.

త్యాగరాజు అంటారు, తనువు తాను కాదని తెలిసిన వాడికి జపమేల? తపమేల? ధ్యానమేల?

విచారణ మార్గం, అజ్ఞానమనే తాడుని తెంపేస్తుంది. అజ్ఞానమంటే మనము ఎవరమో మనకి తెలియకపోవటము. శరీరం ఉండగానే జ్ఞానం పొందాలి.

జన్మజన్మల నుంచి జీవుడు మోసుకొచ్చిన వాసనలన్నీ జీవుడిని కుదురుగా ఉండనివ్వవు. వాసనలు మనస్సుని బయట ప్రపంచంలోకి, విషయాల్లోకి తీసుకువెళ్ళిపోతాయి. దానికి విరుగుడుగా మనసుని అంతర్యామి అయిన పరమాత్మ దగ్గర ఉంచటం అలవాటు చేసుకోవాలి. కృష్ణుడు అర్జునుడితో, ప్రియాతి ప్రియమైన అర్జునా! నీకు ఈ మార్గం చెప్తున్నాను. నువ్వు నా భక్తుడిగా ఉండు. ఇక్కడ నా భక్తుడు అంటే పరమాత్మకి భక్తునిగా ఉండమని చెప్పటం. నీ కళ్ళు, నీ నాలుక, నీ చెవులు, నీ చేతులు నాకు ఇచ్చెయ్యి. నా నామాన్ని స్మరించు, నా రూపాన్ని ధ్యానించు, నాకిష్టమైన పనులు చెయ్యి. నెమ్మదిగా పవిత్రుడివి అవుతావు.

గీత-గంగ-గాయత్రి-గోవింద ఈ నాలుగు బుద్ధిని శుద్ధి చేస్తాయి. భగవంతుడిని తెలుసుకోవటానికి ఏ రకమైన బుద్ధి ఉండాలో అట్టి బుద్ధిని ప్రసాదిస్తాయి.

ప్రపంచం క్షణికం, మనసు క్షణికం, దేహం క్షణికం. ఈరోజు ఉన్నదేహం రేపు ఉండకపోవచ్చు. కానీ మనకి false identification ఉన్నంతకాలం, అవి నిజమని అనిపిస్తాయి. మనకి లోపల wrong identification ఉన్నంతకాలం నిగ్రహం ఉన్నా, అది నిజం కాదు. ఎప్పుడోకప్పుడు జారిపోవచ్చు. భగవద్గీతలో పరమాత్మ అందుకే నిగ్రహం కింకరిష్యతి అన్నారు.

మనిషి ఎంత పవిత్రుడైనా, వాడికి మోహంఉన్నప్పుడు బలహీనత సృష్టించబడుతుంది. ఆ బలహీనతలోనుండే bondage బంధం పుట్టుకొస్తుంది.

ఆధ్యాత్మికంగా ఎదగాలంటే, ఆత్మవిశ్వాసం పెంచుకోవాలి. మిమ్మల్ని ఎదుటివారి కళ్ళతో చూసుకోకండి. ఎదుటివారి కళ్ళతో మనల్ని చూసుకోకూడదు.

నువ్వు చేసే పని ప్రేమతో చెయ్యాలి. నిర్మలంగా నిశ్చలంగా చేస్తే అది సత్కర్మ. అది నీ మనస్సుకి ఉన్న దుమ్ముని దులిపేస్తుంది. శ్రవణం కూడా నీ మనస్సుకి

ఉన్న దుమ్ముని దులిపేస్తుంది. నీ మనస్సుకి పవిత్రత వచ్చి, లోచూపు వస్తుంది. హృదయాభిముఖంగా ప్రయాణిస్తావు. జ్ఞాన కాంక్ష, ముముక్షత్వం కలుగుతుంది. అది జ్ఞానం పొందటానికి పెట్టుబడి.

పరిమళం లేని పువ్వు ఎటువంటిదో, అనుష్ఠానంలేని అధ్యయనం అటువంటిదే.

శ్రవణం కంటే మననం గొప్పది. మననం కంటే నిధిధ్యాస గొప్పది. శ్రవణం చేస్తూ ఉంటే, అది నిధి ధ్యాసగా మారుతుంది. అప్పుడు విషయాలనే రాక్షసులు నిన్ను విడిచిపెట్టేస్తాయి.

సూర్యుడి కూడా వేడి ఎలా ఉంటుందో, చంద్రుడి కూడా చల్లదనం ఎలా ఉంటుందో, జ్ఞాని కూడా శాంతి అలా ఉంటుంది.

ప్రారబ్ధ కర్మ శరీరాన్ని తీసుకువస్తుంది. ప్రారబ్ధాన్ని ఎలా జయించాలంటే, ప్రతిక్రియ లేకుండా అనుభవిస్తే ప్రారబ్ధాన్ని జయించినవాడవుతారు. రాబోయే జన్మలో ఉత్తమ జీవితాన్నిచ్చి, సాధన పట్ల శ్రద్ధని అనుగ్రహించి, స్థిర భక్తిని ఇస్తాడు భగవంతుడు.

ఒక్క ధనమే కాదు సదాచారం, సద్బుద్ధి, సత్ప్రవర్తన కూడా ఉండాలి. ఇవి లేకుండా ధనం ఉన్నా ఆధనం సద్వినియోగమవ్వదు. పెడదారిలోకి మనిల్ని లాగేస్తుంది.

ఇతరులకి మన పట్ల సహృదయం లేకపోయినా, మనము మాత్రం వారి పట్ల సహృదయం కలిగి ఉంటే భగవంతుడు ఆయన అనుగ్రహంతో మనల్ని కప్పుతాడు.

నీ నిజమైన స్నేహితుడు, నీలో ఏదైనా మంచి గుణం ఉంటే దాన్ని చూడటానికి ప్రయత్నం చేస్తాడు. నీ పట్ల స్నేహభావం లేనివాడు, అసూయ ఉన్నవాడు మీలో ఉన్న చెడ్డ గుణాన్ని చూస్తాడు.

జ్ఞాన సముపార్జన కోసం ప్రయత్నం చెయ్యాలనే బుద్ధిని భగవంతుడే ఇవ్వాలి. సత్కర్మ చేయడం వల్ల శుద్ధబుద్ధిని ఇస్తాడు.

విషయ చింతన పెరిగేకొలది మనస్సు మలినమవుతుంది. భోగబుద్ధి పెరుగుతుంది. ఆత్మని స్మరించే కొలది మనసు శుచి అవుతుంది.

మనము ఉన్నాము, ఈశ్వరుడు లేడని అనుకుంటున్నాము. యదార్థానికి మనము లేము ఈశ్వరుడే ఉన్నాడు.

అద్వైతం అంటే రెండు లేవు, ఉన్నది ఒక్కటంటే ఒక్కటే. జీవుడు అణిగిన వెంటనే బాహ్య దృష్టి ఉండదు. నువ్వు,నేను అణిగి అద్వైత భావన కలిగితే, అవధులు లేని శాంతి కలుగుతుంది.

మన మనస్సుతో నేర్చుకున్న ప్రతిదీ మరిచిపోతాము. అది వ్యవహారిక జ్ఞానం. భగవంతుడు మనకంటే వేరుగా ఉన్నాడు అంటే, ఇష్టపడతాము. అద్వైత రుచి, పూర్వ జన్మల సుకృతం ఉంటేనే కానీ కలుగదు.

మనస్సు అణగటం వేరు, నశించటము వేరు. పూర్ణ నాశనమంటే శేషం లేకుండా నశించటము.

దేహగతమైన బుద్ధి నశిస్తే కానీ శాంతి కలగదు. ప్రపంచం మీద ఆధారపడ్డ శాంతి పరిణామంలో దుఃఖం కింద మారిపోతుంది.

హృదయంలో శాంతి, సుఖము ఉన్నాయి. హృదయంలో తప్పించి, ప్రపంచంలో ఏ వస్తువులోనూఏమీ లేదు. సుఖమనేది ఎక్కడా లేదు. ఈ వాక్యం పట్ల హృదయంలో మనకి విశ్వాసం కలగాలి.

త్యాగి కాని వాడు, జ్ఞాని కాలేడు అన్నారు మళయాళ స్వామి. జీవితంలో త్యాగమునుంచి మాత్రమేమనసుకి సంతృప్తి వస్తుంది. సంతృప్తి లోంచి అంతర్ దృష్టి కలుగుతుంది. అంతర్ దృష్టి మనల్ని మనము పరిశీలించుకునే శక్తిని ఇస్తుంది. ఈ ప్రవచనాలు, ఈ సత్సంగాలు అన్నీ మనల్ని మనము పరిశీలించుకోవడానికే. లోకాన్ని శోధించిన వాడికి విషయాలను శోధించిన వాడికి మోక్షం రాదు. మనల్ని మనము శోధించుకోవాలి, మన మనసుని మనము పరిశీలించుకోవడం అనేది నిరంతర ప్రక్రియ. దానివల్ల చిత్తశుద్ధి కలుగుతుంది. నరక ద్వారాలు మూడు ఉన్నాయి. కోరిక - కోపం - లోభిత్వం. అయితే! మోక్షానికి వెళ్ళే దారి ఒక్కటే అదే చిత్తశుద్ధి. "చిత్తశోధకం - ముక్తిసాధకం".

సాధన అంటే బయట చేసేది కాదు. నీ హృదయాన్ని ఖాళీ చేసుకోవటమే సాధన. హృదయం ఖాళీ అవ్వాలి. ఈ బోధ అనేది ఒక మతానికో, ఒక వర్గానికో పరిమితమైనది కాదు. యూనివర్సల్.

నీ శరీరం ఉన్నంతవరకు ఇష్టాయిష్టాలు ఉంటాయి. అవి లేవని నమ్మకూడదు. శరీరం పోయేటప్పుడు కూడా రావచ్చు. ఈ మనస్సుని నమ్మటానికి లేదు అంటుంది భగవద్గీత.

ఉపనిషత్తు అంటే, సమీపంగా కూర్చోవటమని అర్థం. శరీరం ఎక్కడ ఉందో, మనస్సు కూడా అక్కడే ఉండాలి. అంటే, teachingకి సమీపంలోనే మన మనస్సు ఉండాలి. వారు చెప్పేది మనము follow అవుతూ ఉండాలి.

తెలివి తక్కువ వాడికి, తెలివైన వాడికి ఒక్కటే తేడా. ఏంటంటే, ఇద్దరికీ అవకాశాలు వస్తాయి. తెలివి తక్కువ వాడు జీవితంలో వచ్చిన అవకాశాలను వదులుకుంటాడు. తెలివైనవాడు పట్టుకుంటాడు. అవకాశాన్ని జీవితంలో ఒడిసిపట్టుకొని బాగుపడతాడు.

సత్సంగాలు subject orientedగా ఉండాలి. అలా కనుక మనము జరుపుకోగలిగితే పాలకొల్లు నుండి జిన్నూరు బయలుదేరితే నెమ్మదిగా ఎలా చేరుకోగలమో! అలా సత్సంగం నెమ్మదిగా మనలని హృదయ గుహలోకి చేరుస్తుంది. తల్లిదండ్రులు మనకి శరీరాన్ని ఇస్తారు. గురువు శరీరాలు అనే ప్రమాదంలోకి మనముతిరిగి రాకుండా చూస్తాడు.

మనకిష్టమైన మంత్రాన్ని స్మరిస్తూ ఉంటే ఏదో ఒకరోజు అది ఫలిస్తుంది. అయితే ఈలోపు మనము దారితప్పకూడదు. అన్నము వండటము వేరు, తినటం వేరు. అలాగే మంత్రము చెయ్యటము వేరు. అది ఫలించి, దాని తాలూకు సుఖంలో ఓలలాడటం వేరు.

కైవల్య నవనీతములో ఏమని చెప్పారంటే, మనము 'నేను నేను' అంటున్నాము. నేను గొడవ వదిలేసి 'నువ్వు నువ్వు' అంటే ఈశ్వరుడు భక్తినిస్తారు. ఈశ్వరుడిని వెనక్కి నెట్టేసి, మన నేను(దేహాత్మబుద్ధి) ముందు ఉన్నంతకాలం భక్తిని అనుగ్రహించడు.

అంతటా ఉన్న భగవంతుడిని దర్శించే ప్రయత్నం చేస్తుంటే, అన్యచింతన విడిచిపెట్టి అనన్య చింతనతో ఉంటే, అట్టి వారి యోగక్షేమాలు చూసే బాధ్యత నాది అన్నారు . యోగమంటే లేనిది ఇవ్వడం, క్షేమమంటే ఉన్నది పోకుండా కాపాడటం.

అన్ని నదులు సముద్రంలో ఎలా కలుస్తాయో, అలా అన్ని మార్గాలు విచారణ-మార్గంలో కలవాల్సిందే. ఎవరు ఏ మార్గంలో ప్రయాణించినా, వివేకం, విచారణ ఉండి తీరవలసిందే. ఇంట్లో పొయ్యి, కూరలు, అన్నీ ఉన్నా వంట చేయలేము, నిప్పు ఉండవలసిందే - అదే జ్ఞానాగ్ని, అదే విచారణమార్గం, జ్ఞాన మార్గం. జ్ఞానము పొందిన వారే మోక్ష సుఖాన్ని పొందుతారు ఏ మార్గంలో ప్రయాణం చేసినా చిట్టచివరికి హృదయంలో ఉన్న పరమాత్మలో అణగవలిసిందే.

మట్టిని అనేకరకాలైన కుండలుగా తయారు చేస్తాడు కుమ్మరి. ఆ కుండలు రూప నామాలకి కారణం మట్టే. కుండని విడిచిపెట్టి మట్టి ఉండగలదు. మట్టిని విడిచి, కుండ ఉండదు. అలాగే బ్రహ్మమునందే ఈ జీవకోటి - నామరూపాలు కల్పించబడ్డాయి. నామ రూపాలకి అతీతంగా బ్రహ్మం ఉంది. బ్రహ్మముకి అతీతంగా నామరూపాలు లేవు. ఈ ప్రపంచాన్ని బ్రహ్మముగా చూడటమే, నిజమైన చూపు.

దేహంలో అన్ని అవయవాలు ఎలా అవసరమో, అలా మనిషికి సంపద, విద్య, సదాచారం, సమగ్రత అన్నీ అవసరమే. భక్తికి, ముక్తి దాసి. హృదయంలో భగవంతుడిపట్ల పూర్ణభక్తి, స్థిరభక్తి, శరణాగతి ఉంటే అట్టి వారిని ముక్తికాంత వరిస్తుంది. అది కోరుకుంటే వచ్చేది కాదు, deservedness ఉన్న చోట అది వరిస్తుంది. యజమాని వద్ద దాసి ఎలా ఉంటుందో, భక్తి ఉన్నచోట ముక్తి సుఖం అలా ఉంటుంది.

మనకి దేహం పడిపోయినంత మాత్రం చేత, జీవుడులో ఏమీ మార్పు ఉండదు. ఇవే రాగ-ద్వేషాలు, అసూయలతో మరు-జన్మకి సిద్ధమవుతాము. ఇతరుల పట్ల అసూయ ఉంటే, ఎదుటవారు ఎంత మంచి చేసినా, అది మన మనస్సు చెడ్డగానే చూపిస్తుంది. మహామాయ. ఈ శరీరంలో ఉండగానే, సత్పురుషులను ఆశ్రయించి, కుచేష్టలు కుతంత్రాలలో నుండి బయటకు వచ్చి, బాగుపడే ప్రయత్నము చేసుకోవాలి.

భగవంతుడంటే, కర్మ ఫల-దాత. గురువంటే, మనము ఏ కర్తృత్వ బుద్ధితో పని చేస్తున్నామో, ఆ కర్తృత్వ బుద్ధిని తీసేస్తాడు. కర్తృత్వం లేకుండా మనము పని చేస్తే, అది మనల్ని చుట్టుకోదు, మనల్ని పవిత్రముచేస్తుంది.

సాధన లేకుండా నిరంతరం సోమరితనానికి అలవాటు పడిపోయి, ఇహానికి-పరానికి కాకుండా, కేవలం పొట్టకే పరిమితమైన వారిని Shakespeare అడుక్కుతినే వారికి అన్నగారు అన్నారు. అలా ఉండకూడదు effort is needed. మనమీద ఎవరికన్నా అసూయ ఉంటే, మనలో ఉన్న మంచిని వారు చూడలేరు. వాళ్ళ అసూయని మనము చూడకూడదు. సదాచారాన్ని విడిచిపెట్టకూడదు, సదాచారం మనల్ని పవిత్రం చేస్తుంది. సదాచారం లేకుండా inner journey జరగదు.

జన్మజన్మల నుండి జీవుడిలో ఘనీభవించి ఉన్న వాసనలని భగవంతుని నామం, వేరుతో సహా పెకలించిపడేస్తుంది. ఈ భూమి మీద రామనామం తియ్యలేని పాపముగాని, దోషముగాని లేదని వాల్మీకి అంటారు. దుమ్ము తుడవటానికి చీపురు ఎలా అవసరమో, మలం కడగటానికి నీరు ఎలా అవసరమో, మనలో ఉన్న పాపపు బుద్ధిని కడగటానికి ఇవన్ని అంతే అవసరం. వేగించిన విత్తనం ఎలా మొలవదో, అలా ఫల-కాంక్ష లేకుండా పని చేస్తుంటే జన్మజన్మల దోషాలు నుండి విడుదల పొందుతాము.

భగవంతుడిని జ్ఞాపకంలో ఉంచుకున్న వాడు మంచి చేస్తాడు, భగవంతుడిని మరిచిపోయిన వాడు చెడ్డ చేస్తాడు. మనము భగవంతుడిని జ్ఞాపకంలో పెట్టుకున్నామో, లేదో అనేది మన ప్రవర్తన, మన మాటలు, మన పనులు తెలియజేస్తాయి.

మనము చేసే పని నిష్కామంగా, ప్రేమగా చెయ్యాలి. ఫలితాన్ని ఇచ్చేది భగవంతుడు మాత్రమే. కాటన్ దొర పనిచేసి వెళ్ళిపోయాడు. ఆ ఫలితాన్ని ఈశ్వరుడు ఇప్పుడు ఇస్తున్నాడు. కర్మఫలం ఎప్పుడు ఎక్కడ ఎలా ఇవ్వాలో ఈశ్వరుడే నిర్ణయించుకుంటాడు. మనము ఆశించకపోతే రాదనుకుంటాము అదే జీవ లక్షణము. జీవ లక్షణాలను వదిలించుకోవాలి. నిప్పుకు వేడి ఎలా సహజమో! భగవంతుడికి దయ, కరుణ అలా సహజం. ఆయన దయలో మన జీవ లక్షణాలు కరిగిపోవాలి.

సబ్జెక్టు ని శ్రవణం చెయ్యగా, చెయ్యగా సూక్ష్మ బుద్ధి వస్తుంది. సూక్ష్మ బుద్ధి వల్ల తెలివితేటలు పెరుగుతాయి. దాన్ని ఎలా ఉపయోగించుకుంటున్నాము అనేది

వారి బుద్ధిని బట్టి ఉంటుంది. బుద్ధి శుద్ధి అవ్వకపోతే, దాన్ని మనము బాహ్యంగా ఉపయోగించుకుంటాం. శుద్ధి అయితే హృదయం వైపుగా ప్రయాణించడానికి, లోపల ప్రయాణానికి ఉపయోగించుకుంటాం. జ్ఞానం మనము అనుకుంటే వచ్చేది కాదు, recommendation వల్ల వచ్చేది అంతకన్నా కాదు. వీడికి తెలియపడాలని ఈశ్వరుడు అనుకోవాలి. ఆయన ఎవరికైతే తెలియబడాలనుకున్నాడో, వాడికి మాత్రమే తెలియబడతాడు.

రాధ ఒక మాట చెప్తుంది, ఎంతో పెద్ద పెద్ద తపస్సులు చేసి శరీరాన్ని, మనస్సుని ఎండబెట్టేసి ఏ స్థాయిని పొందగలుగుతున్నారో, నేను కృష్ణుడిని ప్రేమించి అదే స్థాయిని పొందుతున్నాను. కేవలం స్వచ్ఛమైన ప్రేమ వలన పరమాత్మని పొందుతున్నాను అంది.

గురువుకి మనము ఏదో చేస్తున్నాము అని అనుకుంటే, మూలంలో కుళ్ళిపోతాము. మనల్ని ఆయన అనుగ్రహించాలనుకున్నప్పుడు, భగవంతుడు ఒంపు కోసం, మనకి పనిచేసే అవకాశం ఇస్తాడు. ఇది గ్రహింపులో ఉన్నవాడు ఉత్తముడు, అదృష్టవంతుడు.

మానవుడికి సంతోషం కంటే, దుఃఖం ఎక్కువ పాఠాలు నేర్పుతుంది. నిరంతరం మన మనసు చాపల్యం వల్ల ఇంద్రియాలు కదులుతాయి. మనస్సు చాపల్యం తగ్గితే దాన్ని భగవంతుడు మీద నిలిపితే ఇంద్రియాల వేగం తగ్గి, మనస్సు నెమ్మదిగా హృదయం వైపు దిగటం మొదలుపెడుతుంది. అది పవిత్రమై ఆత్మాకారం చెందుతుంది. దుఃఖమంతా ఇంద్రియాల్లోనే ఉంది. ఇంద్రియాలు స్వాధీనం అయ్యేకొలది దుఃఖం విడిచి పెట్టేస్తుంది.

మనకి దుఃఖంతో సంబంధం తెగిపోవాలి అంటే ఇవి మూడు వదలాలి: ఆసక్తి - మమత - అహంభావన.

పనిమీద శ్రద్ధ ఉండదు, పని గురించి ఆలోచించము. ఫలితం గురించి ఆలోచిస్తాము. మన చేతిలో ఉన్న పనిని చిత్తశుద్ధితో చేస్తే, మన పూర్వీకులు కూడా పొందలేని శాంతిని మనము పొందుతాము. పని చెయ్యాలి, ఫలితం పట్ల ఆసక్తి వద్దు.

మమత : మనకి దేనిమీదైతే బలమైన మమకారం ఉందో, అక్కడ నుండే భయం వస్తుంది. జాగ్రత్తగా పరిశీలించుకుని అందులో నుండి బయటకి రావాలి.

అహంభావన : మన ఆస్థిత్వాన్ని దేహానికి పరిమితం చేసుకొని, జీవించినంత కాలం మనల్ని దుఃఖం విడిచిపెట్టదు.

ఈ మూడింటిలో నుండి బయటకి రావడానికి భగవద్గీతలో అనేక ఉపాయాలు చెప్పాడు. ఆ ఉపాయమే యోగం.

శరీరంలో దోషం ఉంటే, ఆరోగ్యం కష్టం. మనసులో అశాంతి కారణాలు ఉంటే, సుఖం పొందటం కష్టం. రామకృష్ణులు అంటారు, మన స్వరూప సుఖానికి ఏ వాసనలు అడ్డు వస్తున్నాయో! వాటిని మనము మింగలేకపోతే గురువు ప్రేమ వాటిని మింగేసి మనల్ని స్వరూపంలో ఐక్యం చేస్తుంది. గురువు శరీరానికి చావు ఉంది, ఆ శరీరం ద్వారా మనము ఏ ప్రేమను పొందామో ఆ ప్రేమకు చావు లేదు. ఆ ప్రేమ మనలో ప్రవేశించి మనల్ని పరిశుద్ధుల్ని చేసే వరకు విడిచిపెట్టదు.

మనస్సులో ఉన్న కల్మషాలని భక్తి, మన మనస్సుకి అంటనివ్వదు. పాములో ఉన్న విషం పాముని ఏమీ చెయ్యదు, మనల్ని చంపేస్తుంది. భగవంతుడిలో ఉన్న మాయ భగవంతుడిని ఏమీ చెయ్యదు, జీవకోటిని భ్రాంతిలో పడేస్తుంది. భగవంతుడి అనుగ్రహానికి దూరమయ్యేలా మనము జీవించకూడదు. భగవంతుడికి దూరమైన జీవుడి ముఖం ఎలా ఉంటుందంటే నీరు లేక, ఎండిపోయి ఇసుకమేటలు వేసిన నదిలా ఉంటుంది.

ఎంతో ఆశ్చర్యం! ఎంతో అబ్బురం!. జ్ఞానం వచ్చిన తరువాత అప్పటివరకు నిజముగా కనిపించిన ప్రపంచం అబద్ధమని తెలుస్తుంది. అదే శరీరంలో జ్ఞానం పొందాక నామరూపాలతో కర్మలతో కూడిన ప్రపంచం అసత్యంగా తెలుస్తుంది. ఇది చాలా అపూర్వం.

మన దేహానికి కేటాయించిన పనిని ధర్మంగా, హృదయపూర్వకంగా చేస్తే జ్ఞానం వస్తుంది. జ్ఞానంలోనుండే శాంతి ఉద్భవిస్తుంది. హృదయ శాంతిలో దేహభావన కరిగిపోతుంది.

సమాజంలో త్యాగము - సహనము కనపడదు. త్యాగము నేర్పటమే గీత యొక్క ఉపదేశము అన్నారు రామకృష్ణులు. త్యాగి కాని వాడు జ్ఞానికాలేడు. అందరికీ క్షణికావేశాలే, వాటికి అంతం లేదు. గీత త్యాగబుద్ధిని అనుగ్రహిస్తుంది.

తైత్రీయోపనిషత్ ఏమంటుంది అంటే, 1. అధ్యయనం, 2. ప్రవచనం. మనము చదివి నేర్చుకుని, మనము పొందినది ఇతరులకి చెప్పటము. ఇవి రెండూ మహా తపస్సులు అని చెప్పింది. శంకరులకి, తైత్రీయం అంటే చాలా ఇష్టం. ఈ రెండిటి ప్రయోజనం మన హృదయంలో ఉన్న సుఖాన్ని మన చేత పొందింపచెయ్యటమే.

మీరు మంచివారని, దుష్టులని నేను చెప్పను. ఎదుటివారిలో మంచి కనిపిస్తే మీరు మంచివారు, ఎదుటివారిలో చెడు కనిపిస్తే మీరు దుష్టులు. మీరు ఎవరో మీరే చూసుకొని వాటిని కడుక్కునే ప్రయత్నం చెయ్యండి అని రమణులు అంటారు

పాముని తాడు అనుకుని మెడలో వేసుకుంటే, ఎటువంటి ప్రమాదంలో పడతామో, అలాగే మనము కాని శరీరాన్ని మనము అనుకోవటం వలన అట్టి ప్రమాదంలో పడతాము. అన్ని దుఃఖాలకి, అన్ని సంఘర్షణలకి దేహాత్మ-బుద్ధి కారణం.

శరీరంతో సంబంధం లేకుండా, మనిషి సుఖపడవచ్చు. గాఢ నిద్రలో, దేహస్ఫురణ లేకుండా మనము సుఖంగా ఉన్నాము. అంటే, మనము సుఖంగా ఉండడానికి దేహంతో పనిలేదు. అయితే! మనకి దేహం లేకపోతే, సుఖపడమేమో అనే తలంపు బలంగా ఉంది. శరీరం లేకపోతే, ఉండమేమోననే బుద్ధి బలంగా ఉంది. ఆ బుద్ధిని ఊడగొట్టి జ్ఞానాన్ని ఇచ్చేవాడు గురువు. నిప్పు మీద తెలిసి చెయ్యి వేసినా, తెలియకుండా చెయ్యి వేసినా కాలుతుంది. అలాగే, మంచి మాటలు సరదాకి విన్నాపరవాలేదు. ఆ మాటలు మన లోపల చేయవలసిన పనిని లోపలే చేసుకుంటూ వెళ్ళిపోతాయి. Good word, wise word లోపల work చేస్తూ ఉంటుంది.

చెట్టు వేర్లు భూమిలోపలికి ఉంటాయి, చెట్టుకి ఆధారం అవే అయినప్పటికీ, పైకి కనపడవు. అలాగే బ్రహ్మపదార్థంలోనుండే మనము వచ్చాము. అదే ఆత్మ. అది నీకు కనిపించటములేదంటే అది లేదని కాదు. దాన్నే బ్రహ్మము అన్నారు పెద్దలు.

ఎవరి భయం వల్ల సూర్యుడు ప్రకాశిస్తున్నాడో, ఎవరి భయం వల్ల గాలి వస్తోందో, ఎవరి భయం వల్ల పంచభూతాలు వాటి పని అవి చేసుకుంటున్నాయో, ఆ

భయంకరుడు నీ హృదయంలోనే ఉన్నాడు. వాడికి తెలియకుండా నీ జీవితంలో ఏదీ జరిగే అవకాశం లేదు. వాడి తోటి, గురువు తోటి రాజీపడి జీవించటము అలవాటు చేసుకో. నీ పుట్టుక, నీ ఎదుగుదల, నీ చావు అన్నీ వాడిలోనే జరుగుతున్నాయి. వాడితో రాజీపడు. రాజీపడితే దుఃఖము నిన్ను విడిచిపెడుతుంది. సుఖస్థానం వైపు నీ ప్రయాణం సుగమమవుతుంది.

పాలల్లో వెన్న ఉన్నా అది బయటకి కనపడదు. నువ్వుల్లో నూనె ఉన్నా, అది కనపడదు. అలాగే ఈ ప్రపంచానికి ఆధారంగా చైతన్యం ఉంది. అది కనిపించట్లేదని లేదనుకోవద్దు.

దేహం అంటే రూప-నామాలే. వాటిలో నుండి విడుదల పొందితే శరీరం ఉండగానే మోక్ష సుఖం పొందవచ్చు.

సత్య జ్ఞానము లేని ఈ జన్మ ఫలమేమి..యొప్పగ రావేలా అరుణాచలా!

మనస్సుశౌచం - వాక్కుశౌచం - కర్మశౌచం కోసం ప్రయత్నం చెయ్యి. నీ ప్రయత్నము సిన్సియర్ గా ఉంటే, ఈశ్వరానుగ్రహం పొందుతావు. ఈశ్వరానుగ్రహం నిన్ను పవిత్రుడని చేస్తుంది.

జప - ద్యానాలు, సత్సంగ శ్రవణం, విచారణ ఇవన్నీ హృదయంలో ఉన్న సత్యాన్ని తెలుసుకోవటానికి ఆనకట్టలుగా ఉపయోగపడతాయి. మనస్సు బాహ్యాముఖానికి వెళ్ళకుండా కట్టడి చేస్తాయి. మనస్సు బహిర్ముఖమయ్యేవాడికి ప్రారబ్దం కానీ, మనస్సు అంతర్ముఖం అయ్యిన వాడికి ప్రారబ్ధం ఏమిటి? మనస్సు అంతర్ముఖమయితే దేహం ఉన్నా లేనివాడిగా ఉంటాడు. దేహం లేని స్థితికి ఎదిగి వెళితే ప్రారబ్దం ఏమీ చెయ్యలేదు.

మరణంరాకముందే మరణం లేని వస్తువుని అనుభవంలోకి తెచ్చుకోవాలి. లేకపోతే మనము కూడా ఏదో ఒకరోజు మరణమనే గోతిలోకి వెళ్ళిపోతాము. మనము పొందవలసిన వస్తువుని పొందకుండా దేహాన్ని విడిచిపెట్టేస్తే "your loss is a great loss" ప్రపంచంలో ఏ వస్తువు ఆ నష్టాన్ని పూరించలేదు. అందుచేత aim high and aim at the highest.

మనము సాధన చేసి దైవానుగ్రహం సంపాదించి, జ్ఞానం పొందితే శవ దృష్టి నశించి శివ దృష్టిని పొందుతాము. అప్పుడు, మృత వాక్కులు నశించి మన నోటినిండా అమృతవాక్కులు నిండి ఉంటాయి. శివ దృష్టిని పొందిన వారి శరీరం శవం కాదు, దేవాలయం అవుతుంది. ఈ భూమ్మీద నడిచే భగవంతుడు జ్ఞాని.

చేత్తో చేసే పూజ, నోటితో చేసే జపం, మనసుతో చేసే ధ్యానము ఇవన్ని రెండవ పక్షము. గురువు అనుగ్రహం ప్రథమ పక్షం. గురువు హృదయంలో స్థానం సంపాదించుకోవటానికి ప్రయత్నం చెయ్యాలి. "నీ సంకల్పమే నా సంకల్పము" అని ఆయన సంకల్పాన్ని గౌరవిస్తూ, ఎలా జీవిస్తే ఆయన దయ కలుగుతుందో! అట్టి విధంగా జీవించటం ప్రథమ పక్షం. వాపు వేరు, బలం వేరు. వాపుని చూసి బలుపు అనుకోకూడదు; కృత్రిమ గౌరవాల కోసం, స్వార్థం కోసం, గొప్పల కోసం మనము బ్రతకకూడదు. మనస్సుని పరిశీలన చేసుకుని మన మనస్సుని బాగు చేసుకోవాలి.

దయఉండాలి, దయ జ్ఞానముతో తడిసినదై ఉండాలి.

పరోక్ష జ్ఞానం - అపరోక్ష జ్ఞానం. పుస్తకాలు చదివి, విని నేర్చుకునేది పరోక్ష జ్ఞానం. హృదయంలో ఉన్న వస్తువు అనుభవంలోనికి వచ్చినప్పుడు వచ్చేది అపరోక్ష జ్ఞానం.

మనము ఉండగలిగినంత మంచిగా ఉంటూ, ధర్మాన్ని విడిచిపెట్టకుండా, మన పనిని మనము శ్రద్ధగా చేసుకుంటూ జీవిస్తే! మన హృదయంలో ఉన్న అపరోక్ష జ్ఞానాన్ని సహజంగా పొందగలుగుతాము. ఇదే మన నాన్నగారి జీవితం! నాన్నగారు అలా జీవించి, ఆయన పొందినది మనకి పంచారు.

గురువు యొక్క అనుగ్రహం కనిపించని సంకెళ్ళు వేసి, మనల్ని ప్రకృతి విషయాల్లో నుంచి బయటకి లాగేస్తుంది.

నిప్పు ఎంత పెద్దది ఉన్నా మనము ముట్టుకోకపోతే కాలదు. అలాగే ప్రపంచంలో, ఎంత అశాంతి ఉన్నా మన మనస్సు ముట్టుకోకపోతే మనకి అశాంతి వచ్చే అవకాశం లేదు. మన మనస్సు ముట్టుకోకుండా చూసుకోవటమే సాధన. సాధన వలన సిద్ధి కలుగుతుంది, మన మానసిక పరిస్థితిని బట్టి, మన ప్రవృత్తిని బట్టి మనము ఒక్కొక్కరం, ఒక్కొక్క మార్గంలో సాధన చేస్తాము. కానీ పొందవలసిన వస్తువు

హృదయంలోనే ఉంది. చావుని - పుట్టుక తరుముకొస్తుంది, పుట్టుకని - చావు తరుముకొస్తుంది. దేహం ఉండగానే పునర్జన్మ కారణాలని నశింపచేసుకుంటే, చావు-పుట్టుకల నుండి విడుదల పొందుతాము.

గంగా నదిలో స్నానం చేస్తే, పాపాలు పోవచ్చు కానీ, జ్ఞానిని దర్శించటం వల్ల పాపము చేసే బుద్ధి పోతుంది. సముద్రం, నదిని ఎంత నిర్మలంగా తనలోకి తీసుకుంటుందో! అలాగే ఎవరైతే నిరహంకారంగా, నిరాడంబరంగా, నిర్వికారంగా జీవితం పొడుగునా జీవకోటికి సహాయ సహకారాలు అందిస్తారో, అట్టి భక్తులని అంతర్యామి నిర్మలంగా తనలోకి తీసుకుని ఐక్యం చేసుకుంటాడు.

All actions are god's actions only.

గురువు పట్ల కొందరు భక్తి జీవనదిలా ప్రవహిస్తుంది. జీవితంలో అదృష్ట-దురదృష్టాలు, మంచి-చెడులు  స్వప్నములాంటివనే ఎరుకను కలిగి, గురువు పట్ల ఉండే భక్తిలో హెచ్చుతగ్గులు లేకుండా, జీవనదిలా ఎవరి భక్తి అయితే ప్రవహిస్తుందో, వారు స్థిర భక్తులు. స్థిర భక్తిలో నుండే జ్ఞానం ఉదయిస్తుంది.

సాధకుడికి త్యాగమయ జీవితం ఉండాలి. త్యాగి కాని వాడు జ్ఞాని కాలేడు. బృహదారణ్యకోపనిషత్తు లో ఒక కథ ఉంది. భగవంతుడు వద్దకి, దేవతలు, రాక్షసులు, మానవులు ముగ్గురు వచ్చారు. వారు ముగ్గురు, మేము బాగుపడాలి మాకు ఉపదేశం ఇవ్వండి అని అడిగారు. భగవంతుడు ముగ్గురికి "ద", "ద", "ద"అన్నారు.

దేవతలు : "ద" అంటే, దమము. దేవతలు భోగాలకి అలవాటు పడిపోయారు. మనోనిగ్రహం, ఇంద్రియ నిగ్రహం అలవాటు చేసుకుని దమముతో భోగ ప్రవృత్తిలోంచి బయటపడండని.

రాక్షసులు : "ద" అంటే, "దయ" ఇతరులని పీడించే స్వభావం రాక్షస స్వభావం. మాటలతో, ప్రవర్తనతో, పనులతో హింస పెడతారు. ఇతరుల కష్టాలు చూసి సంతోషిస్తారు. అందుకు వారిని, దయని ఆచరించి, హింసాప్రవృత్తి లోంచి బయటకి రమ్మన్నారు.

మానవులు : "ద" అంటే, దానం. మానవులు నూటికి 90 మంది లోబిత్వంతోనే ఉంటారు. ధనవంతులు కంటే, మధ్యతరగతి ప్రజలే మెరుగ్గా ఉంటారు. అందువలన దానాన్ని ఆచరించమన్నారు.

యోగం అంటే, ఉపాయం. భక్తియోగం, కర్మయోగం, ధ్యానయోగం, జ్ఞానయోగం ఈ మార్గాలన్నీ భగవంతునిలో ఐక్యమవ్వటానికి ఉపాయాలు.

భక్తి నిజమైతే, అందులో నుండి ప్రేమ రావాలి. లేకపోతే అది భక్తి అనిపించుకోదు. భక్తిలో నుండి ప్రేమ, ప్రేమలో నుండి త్యాగం వస్తుంది. త్యాగి కాని వాడు జ్ఞాని కాలేడు. త్యాగంలో నుండే జ్ఞానం వస్తుంది.

నూనె లేని దీపం ఎటువంటిదో, సహనం లేని మనిషి జీవితం అటువంటిది. రాణింపు ఉండదు. పూర్వజన్మల పాపాలు, దోషాలు, ధర్మ విరుద్ధంగా మనము చేసిన పనులు యొక్క ఫలితం శరీరానికి రోగంగా, మనస్సుకి పీడగా వస్తాయి. అశాంతి కారణాల మధ్య కూడా ఎవరైతే శాంతిగా ఉంటున్నారో, వారిని భగవంతుడు తన అనుగ్రహమనే దుప్పటితో కప్పుతాడు. నీటిలో ఉప్పుని వేస్తే ఎలా కరిగిపోతుందో, అలా నిరంతరం భగవంతుడి నామంలో, మన మనసులో ఉన్న దోషాలన్నీ కరిగి... మనము పవిత్రులమవుతాము.

గడిచిన రోజు తిరిగి రాదు; రాబోయే రోజు తక్షణమే వచ్చేయమంటే రాదు.. అందువలన ప్రస్తుత క్షణమైన వర్తమానాన్ని విడిచిపెట్టకండి. వర్తమానాన్ని సద్వినియోగం చేసుకుని, జీవిస్తూ ఉంటే జ్ఞానం కలుగుతుంది. always live in the present.

ఎదుటివారికి మన పట్ల ద్వేషం ఉంటే, మనలో ఉన్న మంచిని వారు చూడలేరు. వారి ప్రవర్తనని చూసి, మనము ఉద్రేక పడకూడదు. వేసవికాలం వేడి సహజం, శీతాకాలం చలి సహజం అలా వారి స్వభావానికి ఆ ప్రవర్తన సహజం.

శరీరంలో రక్తం సరిపడి ఉంటే శక్తి కలుగుతుంది, ఆత్మజ్ఞానం పొందటానికి శ్రద్ధ ఉంటే, ఆశ్రద్ధే ఇంద్రియ నిగ్రహాన్ని, మనోనిగ్రహాన్ని జ్ఞానం పొందటానికి అవసరమైన అన్నిటిని సిద్ధింప చేస్తుంది.

శరీరం ఉన్నా లేకపోయినా మిమ్మల్ని విడిచిపెట్టను అంటారు బాబా. పనిచేసేది శరీరం కాదు; మన దుఃఖాన్ని, మన అశాంతిని, మనకున్న దరిద్రాన్ని తొలగించే పని గురువు ద్వారా జరుగుతూనే ఉంటుంది. దేహం లేకపోయినా నేను ఇక్కడే ఉంటాను, అనుగ్రహానికి ఆగిపోవటం అంటూ ఉండదు అంటారు బాబా.

లోపల జీవితం, బయట జీవితం ఐక్యమైన వాడికి జ్ఞానం వస్తుంది. ఎవరి హృదయంలో స్వార్థం ఎక్కువగా ఉంటుందో, వారికి భయం ఎక్కువగా ఉంటుంది. లోపల స్వార్థం లేని వాడిని, వైరాగ్యం ఉన్నవాడిని భయం ముట్టుకోదు.

ఇల్లు కట్టడానికి సిమెంటు, ఇసుక, ఇనుము అన్ని ఎలా ఉండాలో, అలాగే ఆత్మజ్ఞానం పొందటానికి సత్వగుణం, సదాచారము, గురువు పట్ల, శాస్త్రం పట్ల శ్రద్ధ, విశ్వాసము ఇవన్ని ఉండాలి.

"నేను" అనే తలంపుని దాని పుట్టుక స్థానమైన మూలంలోకి చేర్చటమే జ్ఞానం. అక్కడికి చేర్చటానికి అడ్డువచ్చే వాసనల్ని తొలగించుకోవటమే తపస్సు.

ఏ విధంగా పనిచేస్తే, ఆత్మజ్ఞానం కలుగుతుందో, అలా పని చేస్తే భగవదనుభవం కలుగుతుంది, అదే యోగం. అందరూ చేసేలా పనిచేయటం కాదు, మనము చేసే పని మనల్ని యోగిని చెయ్యాలి.

మనము జీవించి ఉండగా సుఖంగా ఉండాలి. శరీరం విడిచాక కూడా సుఖంలోకి ప్రయాణించాలి. అంటే, జీవితం పొడుగునా కర్మ అనుష్ఠానం మరియు భక్తిని విడిచిపెట్టకూడదు.

అంతర్ముఖం అవలేకపోతే, మనము ఎంత గొప్ప జీవితం జీవించినా ఒకటి లేని సున్నాలుగా మిగిలిపోతాము. అంతర్ముఖులం అవ్వాలంటే,

1. నోటిని శుద్ధంగా ఉంచుకోవాలి. నోటిలోంచి వచ్చే మాటలు శుద్ధంగా ఉంటున్నాయో లేదో, చూసుకోవాలి.
2. తలకాయలో ఎటువంటి తలంపులు వస్తున్నాయో ఏ గంటకాగంట చూసుకోవాలి. పరిశీలన విడిచిపెట్టకూడదు.
3. మనము చేసే పని మంచికి ఉపయోగపడే విధంగా ఉండాలి.

4. ప్రతిరోజు, డాక్టర్ గారు రోగికి జ్వరము,B.P, Sugar ఎలా చూస్తారో, అలా మన ప్రవర్తన దైనందిన జీవితంలో ఎలా ఉందో చూసుకోవాలి.
5. మన స్నేహాలు, మనసు బాగుపడటానికి ఉపయోగపడే విధంగా ఉండాలి. మనము బాగుపడటానికి, పాడైపోవటానికి మన స్నేహాలే కారణం. స్నేహాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి.
6. శరీరం సాధనకి పనిముట్టు. శరీరం లేకుండా సాధన చెయ్యలేము. అందుచేత ఆహార శుద్ధి కలిగి ఉండి, దాన్ని జాగ్రత్తగా రక్షించుకోవాలి. సాధకుడికి భోగ ప్రవృత్తి పనికిరాదు, భోగమే రోగముగా మారుతుంది.
7. మన మనస్సు మన స్వాధీనంలో ఉంటే, వేలాదిమంది విరోధులు ఉన్నా మనకి ఇబ్బంది ఉండదు.
8. శరీరాన్ని ధర్మాన్ని ఆచరించడానికి, మనస్సుని పవిత్రం చేసుకోవటానికి మాత్రమే ఉపయోగించుకోవాలి.

✦ Devotion (భక్తి): ఈశ్వరుడు పాదాల యందు భక్తి కలిగి ఉండాలి.
✦ Determination (సంకల్పం): పట్టుదల, నిశ్చయాత్మక బుద్ధి ఉండాలి. లేకపోతే మనస్సు గమ్యానికి చేరకుండా ప్రకృతిలోకి జారిపోతుంది.
✦ Discrimination (విచక్షణ): దేన్ని పట్టుకోవాలి, దేన్ని విడిచి పెట్టాలి, ఎవరికి దూరంగా ఉండాలి, ఎవరితో సహవాసం చెయ్యాలనే విచక్షణ మనకి ఉండాలి. సజ్జన సాంగత్యం వల్ల ప్రకృతికి సంబంధించిన కళంకం పోతుంది. అంతర్ముఖుడికి ఆత్మజ్ఞానం కలుగుతుంది. బహిర్ముఖుడికి ఆత్మజ్ఞానం కలిగే అవకాశం లేదు. జీవితంలో వచ్చే సంపదలు - ఆపదలు కాల ప్రవహంలో కొట్టుకుపోతాయి. అయితే, అంతర్ముఖుడు వాటితో కలవడు, వాటి ప్రభావం తన మీద పడనివ్వడు.

రామకృష్ణులు swim like a fish against mental current. చేప ప్రవాహానికి ఎదురు ఈదుతుంది. మనకి గురువు పట్ల, అంతర్యామి పట్ల ఆకర్షణ కలిగితే ప్రకృతికి ఎదురు ఈదేస్తాము. ఈదుతున్నామన్న సంగతి కూడా తెలియకుండా ఈదేస్తాము. అయితే, గురువు పట్ల, అంతర్యామి పట్ల ఆప్యాయత కుదరాలి.

ఓర్పు లేకుండా, నేర్పు రాదు. పని బాగా చెయ్యటమే నేర్పు కాదు. ఆ పని యొక్క ఫలితాన్ని మనసు భోగించకుండా చూసుకోవటమే నేర్పు. ఇతరులు మనకి అపకారం చేసినా, ద్వేషం లేకుండా ఉంటే ఈశ్వరానుగ్రహం పొందుతాము. సాధకుడు, ఇంద్రియ మౌనం - మనో మౌనం కలిగి ఉండాలి. అప్పుడు ఈశ్వరుడు వాడి బుద్ధికి స్థిరత్వాన్ని తీసుకువచ్చి, లోపలకి లాక్కుంటాడు. అప్పుడు నీవు నిజమైన సుఖివి అవుతావు.

కేవలం మనకి విద్య ఒక్కటే సరిపోదు, మనము బాగుపడాలంటే తపస్సు కూడా ఉండాలి. విద్య వివేకాన్ని ఇస్తుంది; విచక్షణ జ్ఞానాన్ని పెంచుతుంది. తపస్సు జీవుడ్ని పవిత్రుడిని చేస్తుంది.

1. వాక్కు శుద్ధంగా ఉంచుకొని, వివేకం తోటి, తేజస్సుతోటి నిండిన మాటలు మాట్లాడితే అది వాక్కు తపస్సు.
2. మనసులో చెడ్డ భావాలు లేకుండా చూసుకొని మంచి భావాలు కలిగి ఉండటం మానసిక తపస్సు.
3. మంచి పనులని ఈశ్వరార్పితంగా చేయటం శారీరక తపస్సు.

మనము ఎవరో మనము తెలుసుకోవడం జ్ఞానం. మనల్ని మనము తెలుసుకోలేకపోవటమే అజ్ఞానం. మనల్ని మనము తెలుసుకుని దాని తాలూకు శాంతిని, కాంతిని, జ్ఞానాన్ని, reason ని జోడించి, లాజికల్ గా వివరించటము విజ్ఞానం.

మనము తెగిపోయిన గాలిపటాల్లా లేము. పూర్వజన్మల కర్మఫలమనే తాడుతో కట్టి, ఆ తాడుని భగవంతుడి చేతిలో పెట్టుకుని ఆడిస్తున్నాడు. ఇప్పుడు మన జీవితం పూర్వజన్మల కర్మఫలము. అది మర్చిపోకుండా జాగ్రత్తగా జీవించాలి.

అభిమానము-అహంభావన ఇవి రెండూ ఉన్నవాడికి జ్ఞానం అసంభవం. సాధన చేసి వాటి నుంచి బయటకి రావాలి, never stick to failure, just step up. ఓడిపోవడం కూడా గుణపాఠమే, అది కూడా మన భవిష్యత్తుకి మెట్లు.

దొంగ నేనుకి, రూపం-నామం ఇవి రెండూ ఆశ్రయమిచ్చి బలంగా పోషిస్తున్నాయి. ఆ రెండిటి నుండి దానికి వెళ్ళే ఫుడ్ సప్లైని ఆపగలిగితే, రాయిని పైకి

విసిరితే అంతకంటే వేగంగా క్షణాల్లో ఎలా కింద పడుతుందో! అలాగే ఈ దొంగ నేను చటుక్కున హృదయంలోకి జారిపోతుంది.

life without love is a complete waste of living. వేడిగా ఉన్న నీళ్ళలో చన్నీటిని కలుపుకొని స్నానం ఎలా చేస్తామో, వేడెక్కిన మనస్సుని భగవంతుని నామాన్ని ప్రేమపూరితంగా చేస్తూ మన మనస్సుని చల్లబరుచుకోవాలి. cool your mind, quiet your mind by taking the name of God.

గురు కృప ఎలా వస్తుందని ఒక భక్తుడు నాన్నగారిని అడిగితే, నాన్నగారు అంటారు గురువు పట్ల ముందు ప్రేమ కలిగి ఉండాలి. ఆ ప్రేమ ఎలా ఉండాలంటే, undiluted love అకారణ ప్రేమ. ప్రేమించడానికి కారణం వెతికినా, కనపడకూడదు. అది true love. గురువు జ్ఞాపకం వస్తుంటే, హృదయంలో ప్రేమ పొంగి ప్రవహించాలి. నదికి వరద వచ్చినప్పుడు ఎలా పొంగుతుందో, అలా మనకి గురువు. ఈశ్వరుడు జ్ఞాపకం వచ్చినప్పుడు ప్రేమ పొంగితే అది గురు కృపకి గుర్తు.

చెఱువులో రాయి వేస్తే, లోపల బురద పైకి వస్తుంది. అలాగే ఈశ్వరుడు టైం చూసి లోపల రాయి వేస్తాడు. ఆ రాయిలే మనకు సమస్యలు, జీవితంలో వచ్చే కష్టాలు. ఆ రాళ్ళు వేసినప్పుడు, లోపల సహస్రారానికి వస్తాయి. అలా గురువు మనకి తెలియజేస్తాడు. ఆ వాసనని, సాధన చేసి తొలగించుకోవాలి. పాములు పుట్టలోఎలా ఉంటాయో. జన్మాంతర వాసనలెన్నో మన మనస్సు అనే పుట్టలో ఉంటాయి. ఇల్లు అంటించేస్తే ఇంట్లో ఉన్న వస్తువులన్నీ ఎలాగ కాలిపోతాయో, అలా మనస్సుని కాలిస్తే, వాసనలన్నీ కాలిపోతాయి. అయితే, మనస్సు జ్ఞానాగ్ని చేత మాత్రమే దహింపబడుతుంది.

వాసనాక్షయం ఎలా అవుతుందంటే, ఏ వాసన అయితే మనకు ఉందో దానికి opposition పెట్టాలి. మనకి ఏ వాసన అయితే ఉందో, ఆ వాసన లేని వారితో సహవాసం చెయ్యాలి. ఆ వాసన మనకి జీవితంలో చేసే నష్టం తెలియాలి. ఆ వాసనలోంచి బయటకు తీయమని భగవంతున్ని ప్రార్థించాలి. ఉదాహరణకి ఎవరిపట్లైనా, మనకి క్రోధం ఉందనుకోండి, మనము దానిని గుర్తించి వారి వద్దకు వెళ్ళి వారితో ప్రేమగా మాట్లాడి క్రోధం ఉన్న చోట ప్రేమని ప్రాక్టీస్ చేస్తే, ఆ వాసనలోంచి బయటకు వచ్చేస్తాం. మనము ప్రయత్నం sincereగా చేస్తూ, భగవంతుని ప్రార్థిస్తే ఆయన దయ reveal అయ్యి వాసనలో నుంచి, మనల్ని విడుదల చేస్తాడు.

విచారణ అనేది నేరుగా ముక్కు పట్టుకోవడం లాంటిది. మనల్ని మనము బోను ఎక్కించుకోవడం, మనల్ని మనము శోధించుకోవడమే విచారణ. ఇది ప్రత్యక్ష సాధన. direct path. రూపం మీద, మనస్సుని నిలబెట్టడం ధ్యానం. ఒక నామాన్ని స్మరించడం జపం. ఇది పరోక్ష సాధన. అంటే, చుట్టూ తిప్పి ముక్కు పట్టుకోవడం. గమ్యంవద్దకి వచ్చేసరికి రెండు ఒకటే, మనకి ఆత్మానుభవం కలిగేవరకు ప్రపంచం, ప్రపంచంగానే కనిపిస్తుంది.ఆత్మానుభవం కలిగాక ప్రపంచం బ్రహ్మంగా కనిపిస్తుంది. ఇది ఆధ్యాత్మికం-ఇది భౌతికం అనే difference పోతుంది.

ఈశ్వరుడు అంతటా ఉన్నాడు, మన లోపల కూడా ఉన్నాడు. మనకి తెలియని సంస్కారాలు ఎన్నో, సూక్ష్మ రూపంలో లోపల ఉంటాయి. మన భక్తి నిజమైతే, ఈశ్వరుడు మన లోపల మనకి తెలియకుండా దాగి ఉన్న సంస్కారాలన్నింటిని కెలికి పైకి తీసుకువచ్చి, సహస్రారానికి చూపించి, మనకి తెలియజేసి అందులో నుండి బయటకు వచ్చే శక్తినిచ్చి, ఆ వాసనలో నుండి మనల్ని విడుదల చేస్తాడు.

భక్తి - తెలివి వేరు కాదు. మన భక్తి నిజమైతే, అది వివేకంగా, జ్ఞానంగా మారుతుంది. పిందె కాయగా, కాయ పండుగా ఎలా మారుతుందో, అలా భక్తి కూడా మనము వికాసవంతులవటానికి ఉపయోగపడుతుంది. కొన్ని పిందెగా ఉండగానే రాలిపోవచ్చు, అంటే శరీరానికి మరణం వచ్చేయవచ్చు. అయితే, జీవుడికి పునర్జన్మ వచ్చాక, మళ్ళీ పిందెగా ఉన్నవాడు కాయగా అయ్యే అవకాశం ఉంది. అందువల్ల భక్తిని మనము జాగ్రత్తగా పోషించుకోవాలి. భక్తి జ్ఞానానికి మాత.

రాగద్వేషాల వేగం పల్చబడి అవి withdraw అయ్యి, మనస్సు అంతర్ముఖం అయితే శాంతి కలుగుతుంది. ఇతరులలో దోషాలను చూడటం వల్ల మన మనస్సు బహిర్ముఖం అవుతుంది; మనలో ఉన్న దోషాలను చూసుకుంటే మనస్సు అంతర్ముఖం అవుతుంది. అందువలన ఇతరులలో దోషాలను చూసే బదులు, మన మనస్సులో దోషాలను చూసుకుని వాటిని తొలగించుకునే ప్రయత్నం చెయ్యాలి.

మనము చేయగలిగినంత మంచిని, మన చేతులతో చెయ్యటము, మాట్లాడగలిగినంత మంచి మాట్లాడటము; ఉండగలిగినంత మంచిగా ఉండటమే భగవంతుడి సందేశము.

అహంభావన అనే ముల్లు గొంతులో గుచ్చుకొని ఉంది. లోపలకి మింగ నివ్వదు, బయటకి కక్కనివ్వదు. take it out with the instrument of discrimination. అప్పుడు ఆనంద ప్రవాహంలో మునిగిపోతాము.

పూర్వజన్మల్లో ఎంతోకొంత ధర్మాన్ని ఆచరించకుండా, నిష్కామ కర్మ చెయ్యకుండా, భగవంతుడి మాటలు వినటానికి కూడా అధికారం ఉండదు. శ్రవణం చేసినా, ఆ అధికారం మనకి లేనప్పుడు అవి మననానికి రావు. భగవంతుడు వాక్యములు విన్నప్పుడు, వాటిని బంగారంతో సమానంగా భావించి హృదయంలో పదిలపరుచుకొని, వాటిని మననం చేసుకుంటే ఎంత దుఃఖము ఉన్నా, ఆ దుఃఖాన్నంతటిని అవి ఆర్పేస్తాయి.

గురుకృప ఉంటే, అన్నీ ఉన్నట్లే. సూర్యుని కూడా వేడి వస్తుంది; చంద్రుని కూడా చల్లదనం వస్తుంది. జ్ఞాని కూడా శాంతి సుఖం వెల్లివిరుస్తాయి.

మనలో లేనిది గురువు ఇవ్వలేడు. మనలో లేనిది సాధన చేసి పొందలేము. ఏదైతే మనలో ఉందో దాన్ని చూసే బుద్ధిసూక్ష్మతని, జ్ఞానం అనే వెలుగుని గురువు ప్రసాదిస్తాడు. చీకటిలో మన పని మనము చేసుకోవాలంటే, చిన్న దీపపు వెలుగు సరిపోతుంది. ఏ దీపమైతే, నీ పనులు చేసుకోవటానికి ఉపయోగపడుతుందో, దాన్ని మర్చిపోకూడదు. మనలో ఉన్న స్వరూప సుఖాన్ని పొందటానికి, మనకి జ్ఞానమనే వెలుగుని ప్రసాదించేవాడు గురువు. అందువల్ల గురువు పట్ల కృతజ్ఞతని విడిచి పెట్టకూడదు.

లోపల జీవితం - బయట జీవితం వేరుగా ఉన్నంతవరకు మోక్షం రాదు. దేహాలు, పదవులు, గౌరవాలు అన్నీ కావాలి ఈ మనస్సుకి. లోపల-బయట ఒక్కటిగా ఉంటే తక్షణమే మోక్షం వస్తుంది. human love వాంఛిస్తుంది, divine love వాంఛిచదు. ఒకరు స్వార్థానికి, ఒకరు సహకరిస్తేనే human love నిలబడుతుంది. human love లో reaction ఉంటుంది. divine love లో reaction ఉండదు. మన మనస్సు, ఇంద్రియాలు, బుద్ధి, బాహ్య విషయాలని, ఆడంబరాల్ని, భోగాల్ని ఎలా కౌగలించుకుని ఉన్నాయో, అలా మన హృదయంలో ఉన్న ఆత్మని కౌగలించుకుంటే జ్ఞానం వస్తుంది. వాటిని ప్రకృతి నుండి పరమాత్మ వైపుకి తిప్పటమే సాధన.

అభ్యాస, వైరాగ్యాలని జీవితం పొడుగునా విడిచిపెట్టకూడదు. వైరాగ్యం మనసుని బయట విషయాల్లోకి వెళ్ళకుండా ఆపుతుంది. అభ్యాసం మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణం చెయ్యటానికి సహకరిస్తుంది. మన మనస్సు ఏ ప్రయత్నం లేకుండానే గాఢ-నిద్రలో, దాని source లోకి వెళ్ళిపోతుంది. జాగ్రదావస్థలో effort చేసి దాన్ని source లో ఉంచటానికి చేసే ప్రయత్నమే సాధన.

మరణించిన వాడి ఇంద్రియాలు, ఏ విషయాలను ఎలా ఆకర్షించవో, జ్ఞానికి కూడా భూమ్మీద అలాంటి ఆకర్షణలు ఉండవు.

మనకి జ్ఞానం ఉండాలి కానీ గర్వం లేకుండా ఉండాలి. గర్వంతో కూడిన జ్ఞానము, జ్ఞానం కాదు. దానము ఉండాలి కానీ, వినయంతో కూడిన దానం ఉండాలి. చేసిన దానం మరిచిపోవాలి. అలా చేసిన దానం వల్ల మనము పవిత్రులమవుతాము, ఎదుటివారికి చల్లదనం కలుగుతుంది.

కొందరి నేత్రాలను చూస్తే, ఆ నేత్రాలలో వారి ప్రేమ, ఆప్యాయత దాగివుందో, లేక అసూయ, ద్వేషం దాగివుందో చెప్పవచ్చు. అక్కడ మాటలు అక్కరలేదు. బృందావనంలో కృష్ణుడి చూపు, గోపికలను తాకితే, వారి లోపల ఉన్న సుఖ-దుఃఖాలనే కెరటాలు అణిగిపోయి, మండువేసవిలో ఒక చల్లని గాలి తగిలితే ఎంతటి హాయి ఉంటుందో, అంతటి సుఖం పొంగి వారి సహస్రారం శాంతితో నిండిపోయేది. అది మధుర వీక్షణం.

తల్లి, తన బిడ్డ నిద్రిస్తున్నప్పటకి వాడికి తెలియకుండానే పాలు ఇస్తుంది. అలా మనము ఎంతటి సూక్ష్మ బుద్ధి, మేధస్సు కలవారమైనప్పటికీ గురువు యొక్క అనుగ్రహం మనకి తెలియకుండానే మన హృదయంలోకి ప్రవేశిస్తుంది. ఆ అనుగ్రహమే మన మనస్సుని సంస్కరించి నాశనము చేస్తుంది. మన ఊహలకి, అంచనాలకి అనుగ్రహం అందదు. అనుగ్రహానికి ఆవలి ఒడ్డు లేదు.

మానవుడికి సంపద ఒక్కటే సరిపోదు. సదాచారం, విద్య, సంపద అన్నీ ఉంటేనే సమగ్రత వస్తుంది. దేహానికి అన్ని అవయవాలు ఎలా అవసరమో, అలాగే మనిషి జీవితంలో ఇవన్నీ ఉండాలి.

హిరణ్యకశిపుడికి భగవంతుడు ఎక్కడా కనిపించలేదు. ప్రహ్లాదుడికి అంతటా భగవంతుడే కనిపించాడు. స్థూలబుద్ధి ఉన్నవాడికి భగవంతుడు కనపడడు, సూక్ష్మబుద్ధి ఉన్నవాడు భగవంతుడిని దర్శిస్తాడు. అంటే, సూక్ష్మబుద్ధి ఉన్నవాడు ఉన్న వస్తువుని ఉన్నట్లుగా దర్శించగలడు. ప్రహ్లాదుడికి ఉత్తమ భక్తుడి స్థానం ఇచ్చారు. భీష్ముడు, నారదుడు కూడా ప్రహ్లాదుడి తర్వాతే. ప్రహ్లాదుడికి మొదటి స్థానం ఇవ్వటానికి గల కారణం ఏమిటంటే, వచ్చిన కష్టాలన్నిటిని నిరోధించే గుణం లేదు, నూటికి నూరు శాతం వాటిని అంగీకరించటమే. ఈ భూమ్మీద ఏదో పొందాలి, ఏదో చెయ్యాలి, ఏదో అనుభవించాలనే తలంపు ఆయనకి లేద. ప్రహ్లాదుడి రహస్యం: "surrender to the will of God".

కఠోపనిషత్తులో, నచికేతుడుతో యమధర్మరాజు అంటారు:నీకు జ్ఞానం కలగకపోయినా నూటికి నూరు శాతం నువ్వు పొందుతున్న శాంతిని, కాంతిని, జ్ఞానాన్ని... ఎదుటివారికి అందించటానికి ప్రేమతో, ఆప్యాయతతో బోధించే ప్రయత్నం పని చెయ్యి. నేను నిన్ను బ్రహ్మలోకానికి తీసుకువెళ్ళి, నిన్ను పూర్ణుడిని చేసి,నిన్ను అనుగ్రహించి పునర్జన్మరాహిత్యాన్ని పొందింపచేస్తాను అని అన్నారు.

శరీరం, ఇంద్రియాలు, మనస్సుసత్యసాక్షాత్కారం పొందటానికి పనిముట్లు. వాటి వల్ల మనము పొందే ఉపయోగం అదే. సత్యాన్వేషణ నిమిత్తమే వాటిని వినియోగించుకోవాలి. గౌరవాలు - పొగడ్తలు - విమర్శలు ఇవన్నీ, అల్లరి విషయాలు తప్పించి అందులో ఏమీ లేదు. మందులు వాడినా రోగం తగ్గకపోవడానికి కారణం, శరీరంలో రోగనిరోధక శక్తి తగినంత లేదని అర్థం. అలాగే సాధన చేసినా, ఆత్మసాక్షాత్కారం కలగక పోవటానికి కారణం, దుఃఖ రహిత స్థితిని పొందలేక పోవటానికి కారణం, తగినంత వైరాగ్యం లేదని అర్థం. సృష్టిలో వైరాగ్యాన్ని మించిన సంపద ఇంకొకటి లేదు. మనము ఏ పని చేసినా, ఇతరులకి ఏది ఇచ్చినా కృష్ణార్పణం - రామార్పణం అనే అర్పణ బుద్ధితో ఇస్తే, దైవ భావనలో మన కర్తృత్వం పోతుంది.

మనకి పవిత్రత కంటే ధనం, గౌరవం, అధికారం గొప్పవి అనుకుంటాము. అంటే మనకి మజ్జిగ అన్నమే అరగటం లేదంటే, మిగతావి ఎలా అరుగుతాయి? జీవితంలో అన్నిటికంటే పవిత్రతే గొప్పది. అదే మనకి తెలియనప్పుడు ఈ ‘‘దొంగ నేనుని’’ భగవంతుడికి ఎలా అర్పిస్తాము. లక్ష్మణుడికి రాముడి పట్ల ఉన్న ప్రేమలో

ఆ నేను కనపడకుండా కరిగిపోయింది.

ముఖము భగవంతుడు వైపుగా, వీపు లోకం వైపుగా పెడితే మనము బాగుపడతాము. మహాత్ములు వారి జ్ఞానంతో, దయతో, ప్రేమతో, తపస్సుతో ఈ భూమిని తడుపుతారు. మహాత్ముల యొక్క పాదస్పర్శ కోసం భూమాత పరితపిస్తుంది. మనము అసూయతో, కక్షలతో, కార్పణ్యాలతో మలినాలతో భూమిని తడుపు తున్నాము. ఎందుకంటే, మనము ఎవరిమో! మనకి తెలియకపోవటంవల్ల అల్పులుగా జీవిస్తున్నాము. ఇప్పుడైనా మనల్ని మనము తెలుసుకునే ప్రయత్నం చేద్దాము.

దూడని యజమాని కట్రాడుకి కడతాడు. ఎవరి చేలోనో పడి దొంగ-తిండి తిని రాకుండా, గురువు కూడా మనల్ని సత్సంగమనే గుంజకు కట్టి ఉంచారు. మనము విషయాలనే దొంగతిండి తిని రాకుండా, సత్సంగశ్రవణం చేయగా చేయగా ఏదో ఒకరోజు సత్యము యొక్క వైభవం తెలుస్తుంది. లోపలున్న సత్యం మనల్ని ఆకర్షించుకుంటుంది “ఆజన్మ దుర్విషయ రహితునకు జపమేల-తపమేలా” అన్నారు త్యాగరాజు. మనము విషయాలనే దొంగతిండి లోంచి బయటికి వస్తే, జపధ్యానాదులతో పని ఉండదు. we need to look within. మనల్ని, మనము లోపలికి పరిశీలించుకోవడం మానేసి ఎత్తువారి చేతి-బిడ్డలుగా బ్రతుకుతున్నాము.

మనము శాస్త్రాన్ని విశ్వసించటం లేదు కాబట్టే, మన హృదయంలో ఏ జ్ఞానాన్ని వేదాలు, ఉపనిషత్తులు ప్రతిపాదిస్తున్నాయో! ఆ జ్ఞానమే జీవించి చూపించటానికి మహాత్ములు భూమ్మీదకి వచ్చేది. సముద్రంలో ఎంత నీరు ఉందో, మన హృదయంలో అంత ఆనందం ఉంది. మన హృదయం వైపు మనల్ని గురి పెట్టించటానికి గురువు లివింగ్ ట్రూత్ గా భూమ్మీదకు వచ్చారు. mind లో క్లారిటీ ఉన్నవారు సన్యాసి అయినా, గృహస్థుడైనా తరిస్తారు. దేహ ప్రారబ్ధాన్ని 100 శాతం అంగీకరించాలి. రియాక్షన్ ఉండకూడదు. "never reacts" మనలో ఏ క్వాలిటీ ఉన్నా అది భగవంతుడి విభూతి. విభూతి అంటే ఐశ్వర్యం. ఇది గ్రహింపులో ఉంటే మనకి గర్వం రాదు.

జీవుడు మనమే, భగవంతుడు మనమే. మనమెవరమో మనకి తెలిస్తే దేవుడు అవుతాము. తెలియకపోతే జీవుడుగా ఉంటాము. జీవుడి స్థానం సహస్రారము, భగవంతుని స్థానం హృదయము. అన్ని మతాల గమ్యం, అన్ని మార్గాల గమ్యం జీవుడిని హృదయంలోకి తీసుకువెళ్ళటమే. జీవుడు, నశిస్తే మోక్ష సుఖాన్ని పొందుతాము.

నీటిలో నిలబడి నాకు దాహం వేసినా నీరు దొరకటం లేదు అనుకోవటం ఎటువంటిదో, భగవంతుడి అనుగ్రహంలో మనము ఉన్నా, దానికి సంబంధించిన అర్హత సంపాదించుకోలేక అనుగ్రహం కావాలని కోరుకోవటం కూడా అట్టిదే.

నిద్రపోయిన వాడిని లేపవచ్చు కానీ, నిద్ర నటించే వాడిని లేపలేము. మనము సాధన చేసినట్లు నటిస్తున్నాము అంతే. సాధన చేసి మనల్ని మనమే చంపుకోవాలి. kill that I. దేనిని పోగొట్టుకోవాలో, దాన్నే జ్ఞాపకం పెట్టుకుంటున్నాము. అందుకు ఆ గొడవ వదిలేసి, you are that truth; you are that brahmam. ఇప్పటివరకు మన గురించి మనము బ్రతుకుతున్నాము.

శీతాకాలము, చలి బాధని ఎలా భరించాలో, నేర్పుతుంది. వర్షాకాలం, వర్షాన్ని ఎలా ఉపయోగించుకోవాలో, నేర్పుతుంది. వేసవికాలం వేడిని తట్టుకొని ఎలా నిలబడాలో, నేర్పుతుంది. ఈ మూడు కాలాలు మన శరీరం తట్టుకొని, నిలబడటానికి ఉపయోగపడతాయి. అలాగే సమాజంలో, మనుషులు రకరకాలుగా ఉంటారు. కొంతమంది మనుషులు మనము ఎంత inner strength సంపాదించుకోవాలో నేర్పుతారు.ఇలా జీవించటం వలన జీవుడు బాగుపడి జ్ఞానానికి సంబంధించిన అర్హత వస్తుందని చెప్పారు.

జ్ఞానమార్గంలో ప్రమాదం ఉంది. చాలామంది నాలుగు పుస్తకాల చదివి, జ్ఞానం వచ్చేసిందని ఊహించుకుంటారు. అట్టివారి సహవాసాలకి దూరంగా ఉండండి. బాధ్యతలు-బరువుల నుండి పారిపోవటం భక్తి కాదు, సాధన కాదు. పనిని సన్యసించమనలేదు, పనిచేస్తే వచ్చిన ఫలితాన్ని ఈశ్వరార్పణ చేయమన్నారు పరమాత్మ. అదే సాధన.

చాలామంది సాధకులు, పాడవ్వటానికి కారణం understanding లేకపోవటమే. చెప్పుడు మాటలు వినటం వలన పతనమైపోతారు. ఇద్దరు కూర్చుని, మూడవ వ్యక్తి గురించి చెడుగా మాట్లాడుకోవటం పొరపాటు. మనము ఎవరినైతే విమర్శిస్తున్నామో, వారు బాగుపడతారు, మనము మాత్రం లోపల పూర్తిగా కుళ్ళిపోతాము. వాల్మీకి అనేక మందిని చంపాడు, కానీ అకస్మాత్తుగా ఋషి అయ్యాడు. అప్పటివరకు ఆయన చేసిన పాపాన్ని, భగవంతుడు ఆయనను విమర్శించే వారికి

పంచేసాడు. ఇదే కర్మ సిద్ధాంతం. మనము ఇతరుల్ని కష్ట పెట్టినప్పుడు, అది వారు భరిస్తూ... సహనంగా ఉంటే! భగవంతుడు వారి గత జన్మల దోషాలని మనకి పంపించేస్తాడు. వారు సహనంగా భరించినందుకు భగవంతుడు ఇచ్చే గిఫ్ట్ అది.

మన పరిధిలో ఉన్న మానసిక వాతావరణంలో నుండి బయటికి వచ్చి, అంటే గౌరవ-అగౌరవాలకి దూరంగా ఉంటే, వైకుంఠంలో కూడా అందని శాంతిని ఇక్కడే అనుభవిస్తాము. మనము మన మనసుని పాడుచేసుకున్నా, బాగుచేసుకున్నా "జరిగేది మాత్రం ఈశ్వర సంకల్పమే". ఈ వాక్యం మన హృదయానికి బాగా పట్టాలి. అప్పుడు మనస్సు మనల్ని గాయం చేయటం మానేస్తుంది.

సూదిలోకి దారం ఎక్కిస్తాము. ఆ దారపు పోగు రేగిపోయి ఉంటే ఎంత ప్రయత్నించినా ఎక్కదు. అలాగే మన మనసు సంసార విషయాల్లోకి వెళుతుంటే, బ్రహ్మము యందు లయించదు.

ఎవరు సత్పురుషులు అంటే, ఎవరి సమక్షంలో శాస్త్ర ప్రమాణమైన మంచి వాక్యాలు తప్పించి, ఇతర విషయాలు మాట్లాడరో వారు సత్పురుషులు. అట్టి వారి సాంగత్యం అమూల్యమైనది.

భక్తి పేరు మీద, సాధన పేరు మీద సోమరితనంగా, అమాయకంగా బ్రతకకూడదు. తెలివిని, సూక్ష్మ-బుద్ధిని విడిచిపెట్టకూడదు. పూతన కృష్ణుడి వద్దకు వచ్చి, విషము కలిసిన పాలిచ్చింది. భాగవతంలో వ్యాసుడు చెప్పిన రహస్యం ఏమిటంటే, పూతన కృష్ణుడి వద్దకు, స్నేహితురాలిగా వచ్చింది. నీకు పాలు ఇచ్చి, ఆకలి తీరుస్తాను అని స్నేహంగా చెప్పి, విషం ఇచ్చింది. పూతన ఎలా అయితే కృష్ణుడికి అపకారం చేసిందో, సమాజంలో కూడా మనతో కొందరు స్నేహంగా ఉండి అపకారం చెయ్యవచ్చు. అందువలన అమాయకంగా బ్రతకొద్దు, తెలివిగా బ్రతకాలి. తెల్లగా ఉన్నవన్ని పాలు, నల్లగా ఉన్నవన్ని నీళ్ళు అనుకోకూడదు.

వారికి మేము చాలా ఉపకారం చేసాం. వారు తిరిగి మాకు అపకారం చేస్తున్నారు అంటాము. మన పని మనము చేసాము, వారి పని వారు చేస్తున్నారు, ద్వేషించడమే కానీ ప్రేమించడం వారికి తెలియదు. వారి పని వారు మానడం లేదు కాబట్టి మన పని మనము మానవద్దు. మన స్వభావాన్ని బట్టి మనము ఉండాలి, మనము చేసే

పని, మనము మాట్లాడే మాట, ఆలోచనలు మనకి ప్లెషర్ ని ఇవ్వాలి కానీ, పెయిన్ ని ఇవ్వకూడదు. ఇహానికి-పరానికి సంబందించిన వాంఛలు ఏమీ లేకుండా పని చేస్తే, పని చేసేవాడు, పని చేసే క్రమంలోనే  కరిగిపోయి ఆత్మజ్ఞానం పొందుతాడు. జపధ్యానాలు చేయగా, చేయగా లోపల ఉన్న అల్లరివాడు జపాదితపాలలో కరిగిపోతాడు.

హృదయం ఖాళీ అవ్వకుండా, ఎవరికీ జ్ఞానం కలగదు. అరుణాచలంలో ఉన్నంతకాలం అరుణగిరిని చూస్తుంటే, హృదయంలో ఉన్న జన్మజన్మల వాసనలన్నీ మనకు తెలియకుండానే ఖాళీ అవుతాయి. అరుణ గిరి, చంపక చంపెడి మందు. 'మనల్ని చంపదు జీవుడిలో ఉన్న జీవ లక్షణాల్ని చంపేస్తుంది. జీవ లక్షణాలు నశిస్తే భవరోగంలోంచి బయటపడతాము. మనము పెద్ద, పెద్ద సాధనలు చేయనక్కర్లేదు. మన ఇంట్లో ఎలా ఉంటామో! అలా మనకి అనుకూలంగా ఉన్న ప్రదేశంలో ఉండి, అరుణ గిరిని చూసుకుంటూ ఉంటే చాలు. మనకి చాలామంది బంధువులు ఉంటారు కదా! మనము ఈ కొండని కూడా పెద్ద చుట్టంగా అనుకుంటే చాలు. మనము ప్రపంచంలో ఎక్కడ తిరిగినా అరుణాచలం ఫైనల్.

ఎవరి నోటి నుంచి, ఏ మాట వచ్చినా అది జ్ఞానమా? అజ్ఞానమా? అని మనకి తెలియకపోతే, ఆత్మ జ్ఞాన సమపార్జన కోసం మనము చేసుకునే సాధనకి మనము ఫిట్ అవ్వలేదని గుర్తు. ఆ డిస్క్రిమినేషన్ మనకి ఉండాలి, ఎవరు చెప్పినా వినదగును, కానీ వేగిరపాటు పనికిరాదు. జ్ఞానాన్ని రిపీట్ చెయ్యాలి కానీ, అజ్ఞానాన్ని రిపీట్ చెయ్యకూడదు. ఎమోషన్ వేరు, నాలెడ్జ్ వేరు. ఉద్రేకం వేరు, జ్ఞానం వేరు. మనసుకి లోచూపు కలగకపోతే, ఆధ్యాత్మిక జీవితం అసలు మొదలవ్వలేదని గుర్తు. పరవంచన కంటే, ఆత్మవంచన చాలా ప్రమాదం. కెరటాలు కనిపించకూడదు, నీరు ప్రవాహంగా వెళ్ళిపోవాలి. మనము సాధనల పేరుమీద (టైర్) tire అవ్వకూడదు, సాధన సహజంగా నాచురల్ గా జరిగిపోవాలి. భక్తిలో నెమ్మదిగా మైండ్ మగ్గి, జ్ఞానాన్ని తీసుకోవడానికి ప్రిపేర్ అవుతుంది. ఈశ్వరుడు మనల్ని అనుగ్రహించటానికి మనకంటే, తొందరపడుతున్నాడు.

సేవ, త్యాగంలో నుండి జీవుడికి పవిత్రత వస్తుంది. పవిత్రత ఉన్న చోట స్పష్టత ఉంటుంది.

మనము మనస్సు నిండుగా కోరికలతో, శరీరం నిండుగా సోమరితనంతో జీవిస్తున్నాము, సాధన సున్న. వాచా వేదాంతమే కానీ అనుష్ఠానంలేదు. విద్య ఉన్నా తపస్సు లేనప్పుడు, ఆ విద్య ఫలించదు.

సొంతబుద్ధిని, సత్పురుష సహవాసాన్ని జీవితం పొడుగునా కాపాడుకోండి అంటారు ఆచార్యులవారు. ఒకవేళ సత్పురుషుడు దొరక్కపోతే, 60 సం॥లు వచ్చిన తరువాత.. కాశీపురం వెళ్ళి, విశ్వేశ్వరుడు సన్నిధిలో జీవించి, శరీరం విడిచిపెట్టండి అన్నారు. వానప్రస్థాశ్రమంలో, మీరు మీ మనస్సుని హెచ్చుతగ్గులు లేకుండా చూసుకుంటూ, సమత్వబుద్ధితో జీవిస్తే, కాశీపురంలో జీవించినట్టే అంటారు భగవాన్.

ఆచార్యులు వారు అంటారు, take the real; and reject the unreal. అంటే, నిజాన్ని తీసుకోండి అబద్ధాన్ని విడిచి పెట్టండి.

లౌకికుడు, లోకం కోసం త్రికరణాలను ఎలా ఉపయోగిస్తాడో, భక్తుడు, ఆత్మని తెలుసుకోవటానికి త్రికరణాలని అలా ఉపయోగించుకోవాలి. ఏది ఆలోచిస్తున్నామో, అదే మాట్లాడాలి, ఏది మాట్లాడుతున్నామో, అదే చెయ్యాలి. దానివల్ల త్రికరణ శుద్ధి కలుగుతుంది. ఆధ్యాత్మిక జీవితానికి త్రికరణ శుద్ధి చాలా అవసరం. త్రికరణ శుద్ధి లేకుండా, జ్ఞానం పొందే అవకాశం లేదు.

రామకృష్ణుడు లీల అంటారు; ఆచార్యులవారు మాయ అంటారు. ఈ మాయలోంచి బయటికి రావాలంటే, త్వమేవ శరణం గచ్ఛామి. అంతర్యామికి శరణాగతి చెందు. లోపల ఉన్న సత్యాన్ని మన మనస్సు, ఇంద్రియాలు, బుద్ధి కౌగిలించుకుంటే, మాయ కరిగిపోయి జ్ఞానం పొందుతాము. మన ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి బయట విషయాల్ని, వ్యక్తుల్ని, ఆడంబరాల్ని కౌగిలించుకొని ఉంటాయి. వాటి నుండి విడదీసి అంతర్యామిని అంటిపెట్టుకొని జీవించడమే సాధన. మినహాయింపులు లేకుండా భగవంతుడి పట్ల శరణాగతి ఉండాలి. completest surrender to the will of God.

పరమాత్మ దేహాన్ని విడిచి పెట్టేటప్పుడు, ఉద్ధవుడ్ని పిలిచి, బదరీ వెళ్ళి పొమన్నాడు. అక్కడికి వెళ్ళి, నన్ను స్మరించుకో. నేను చెప్పిన మాటలు వినే వారికి బోధించు, ఆ స్మరణలోనే నీ మనస్సు పవిత్రమైపోతుంది. అద్దం శుభ్రంగా ఉంటే,

మన ప్రతిబింబం ఎంత స్పష్టంగా కనిపిస్తుందో, అలా నా స్మరణ నీ బుద్ధిని పవిత్రం చేస్తుంది. లోపల ఉన్న ఆత్మ పవిత్రుడైన వాడికి గోచరమవుతుందని చెప్పి, ఉద్ధవుడుకి ఆయన పాదాలని అనుగ్రహిస్తాడు. బదరీలో ఉద్ధవుడు తపస్సు చేసుకున్న కొండమీద ఇప్పటికీ పరమాత్మ పాదాలు ఉన్నాయి వాటిని చరణపాదుక అంటారు.

సజ్జనుడితో, సత్పురుషుడితో, పుణ్యాత్ముడితో మనకి సహవాసం కుదిరితే, ఆ సహవాసంలోంచి వచ్చే ఆనందం, వైకుంఠంలో ఉన్న ఆనందం కంటే ఎన్నో రెట్లు ఎక్కువ. మన ఇంట్లో ఉన్న బంగారం, ఆస్థి మాత్రమే సంపద కాదు. మన ఇంట్లో ఉన్న వారందరూ మంచి వారైతే, అదికూడా సంపదే.

అహంకారం వల్ల అపకారం ఎక్కువ, వినయం వల్ల ఉపకారం ఎక్కువ. ఎక్కడ నమ్రత, వినయం, సహనం ఉందో, అక్కడ మంచి జరుగుతుంది. నువ్వు తొందరగా పవిత్రుడివి అయిపోతావు. భీమవరంలో ట్రైన్ ఎక్కి, హైదరాబాదు వచ్చే లోపు మనకి నిద్ర అయిపోయి, ప్రయాణం పూర్తయిపోతుంది. నువ్వు ప్రత్యేకంగా సాధనలు ఏమీ చెయ్యలేవు, ఆ తిప్పలు పడలేవు. నువ్వు నాలో జాయిన్ అయిపో. నాకు నమస్కరించు.

గాడిద భుజం మీద ఏమైనా పెడితే, దాన్ని మోసుకుపోతుంది. అది బంగారం మూటైనా, గంధం చెక్కల మూటైనా, చాకలి వాడు విడిచిన బట్టలు మూటైనా సరే మోసుకు వెళ్ళటమే దాని పని. కొంతమంది మనుష్యులు కూడా మంచి గ్రంథాలు మోసేస్తారు, లౌకిక విషయాలు మోసేస్తారు. శాస్త్రం అంటే నిర్దేశించేది. శాస్త్ర వాక్యాన్ని ప్రమాణంగా పెట్టుకుని జీవించాలి తప్పించి దారిపోయే వాళ్ళ మాటలు కాదు. చంటి పిల్లవాడికి 100 రూపాయలు ఇస్తే, దాని విలువ తెలియక చింపేస్తాడు. అలాగే మంచి గ్రంథాలు మన దగ్గర ఉన్నప్పటికీ దాని విలువ తెలియక మనము ఉపయోగించుకోవడం లేదు.

దేహాత్మ బుద్ధి అనే ముడి తెగిపోతే శరీరం చనిపోనక్కరలేదు, శరీరం ఉండగానే మోక్ష సుఖం పొందుతాము. ఆ సుఖంతో ప్రపంచంలో ఏ సుఖాలని పోల్చలేము. ఆ సుఖమే మనమైపోతాము. అటువంటి సుఖాన్ని, అనుభవైకవేద్యం చేసుకున్న మహాత్ముల యొక్క ఒక్క చూపు చాలు, ఒక్క మాట చాలు, ఒక్క టచ్

సరిపోతుంది. సృష్టి అంతా వ్యాపించి ఉన్న వస్తువు ఆయనే అని దాన్ని పొందిన తరువాత మనకి తెలుస్తుంది. ఈ భూమి మీద మనము సంపాదించుకోవాల్సింది దైవానుగ్రహం మాత్రమే. దాన్నే పరమ గమ్యంగా పెట్టుకొని జీవించాలి మనకి అసాధ్యం ఉండవచ్చు కానీ, భగవంతుడికి అసాధ్యం అంటూ ఏమీ లేదు.

పులి దగ్గరకు మేకలు వెళ్ళవు, అలాగే పరమాత్మకి దగ్గరగా, మన మనస్సు ఉంటే దుఃఖం రాదు. మనకి దుఃఖం వస్తోంది అంటే పరమాత్మకి దూరంగా జరిగిపోయామని గుర్తు. మన అదృష్టం ఒక స్వప్నం, మన దురదృష్టం ఒక స్వప్నం. వాటితో కలవకూడదు. be calm; be cool and be quiet that is essential అంటారు తుకారాం.

పక్షుల గూళ్ళు ఎలా ఉంటాయో, మన మనస్సులో జన్మాంతర వాసనలన్నీ అలా గూళ్ళు కట్టుకొని ఉంటాయి. ఒంట్లో బాలేదు ఇంట్లో బాలేదు అంటాము కానీ మన మనస్సు బాగోలేదని దానిని బాగు చేసుకుందామని అనుకోవటం లేదు. మన జీవితంలో జరిగే ప్రతి విషయాన్ని పాజిటివ్ గా తీసుకుంటే బాగుపడతాము. జీవితంలో జరిగే సంఘటనలు మనకి పాఠాలు నేర్పుతాయి. మనసు రైట్ గా ఉంటే శాంతిగా ఉంటాము. మనసు రాంగ్ గా ఉంటే అశాంతిగా ఉంటాము. జీవుడు సాధన చేసి శుద్ధుడైతే! వాడు చేసే పనిలో, మాట్లాడే మాటలో, ఆలోచనలో gentleness ఉంటుంది. వాడే త్రికరణాల ద్వారా శాంతి, పవిత్రత, జ్ఞానం ప్రవహిస్తుంది. అట్టి శుద్ధుడి నోటి నుంచి వచ్చిన ఒక్క మంచి మాట - జీవకోటి అశాంతినంతటిని ఆర్పేసి ఆనందంతో నింపేస్తుంది.

There is a destiny that shapes our ends. మన subject పట్ల proper understanding మనకి ఉంటే, destinyని overcome చేస్తుంది. body యొక్క destinyని మార్చటం మన సబ్జెక్టు కాదు. destiny యొక్క ప్రభావం మనస్సు మీద లేకుండా చెయ్యటమే. దూడని, కట్రాడుకి కట్టి ఉంచేస్తే దెబ్బలకి దొరికిపోతుంది. తాడు తెంపుకొని వెళ్ళిపోయిన దూడ యజమాని దెబ్బలకి దొరకదు. గురువు బోధ, దేహాత్మ బుద్ధి అనే తాడును తెంపేసి ప్రారబ్ధం రూపంలో వచ్చే కర్మలు అనే దెబ్బలకు దొరకనివ్వదు. మన సబ్జెక్టు no person, no world, no God, no birth, and no death ఆ స్థితిలోకి నూటికి నూరు శాతం ఆనందంలోకి తీసుకు వెళుతుంది.

నూరు సంవత్సరాలు బ్రతికినా అందరికీ బాహ్యచూపే కానీ, లోపల చూపు లేదు. మన బట్టలకి, మన జుట్టుకి ఇచ్చే విలువ కూడా మరణానంతరం మన కూడా వచ్చే జీవుడికి ఇవ్వడం లేదు.

వాల్మీకి అంటారు, జీవకోటికి రోజులు బాగా వెళ్ళిపోతున్నాయి అనుకుం టున్నారు. వేసవిలో సూర్యకిరణాలు చెరువులో నీటిని పీల్చేసినట్లు కాల రూపంలో భగవంతుడు మన ప్రాణ శక్తిని పీల్చేస్తున్నాడని మనకి తెలియటం లేదు.కాలమును సద్వినియోగము చేసుకోవాలి.

మనకి భవిష్యత్తులో ఏమి జరుగుతుందో, జ్యోతిష్యుడు మనకి ముందే చెప్తే అది జరగకుండా మార్పు చేసుకోగలమా? దీన్నిబట్టే జీవుడు ఎంత అస్వతంత్రుడో మనకి తెలుస్తోంది. దేనిని మనము ఆపు చెయ్యలేము.

భారతంలో ఒక మాట ఉంది, ఒక కొండచిలువ మనల్ని సగం మింగే సినప్పటకి, అది పట్టించుకోకుండా ఎదుటివారిని ఉద్ధరించాలనుకుంటే అందులో అర్థములేదు. అలాగే, ఈ దేహం ఏ పని మీద వచ్చిందో అది పొందటం మానేసి, మనల్ని మనము పవిత్రం చేసుకునే పని వదిలేసి, ఇతరుల గొడవల్లో జోక్యం చేసుకోవడం మంచిది కాదు. కలియుగంలో జీవకోటికి సోమరితనం ఎక్కువగా ఉంది కాబట్టి మోక్షం పొందే ప్రయత్నం వదిలేసాము.

ప్రపంచం మనకి భిన్నంగా కనిపిస్తున్నంతకాలము, భగవంతుడు భిన్నంగా కనిపిస్తున్నంతకాలము దాని వెనకాలే ప్రమాదం పొంచి ఉంటుంది. మనస్సు అణిగినా, మనకి భగవంతుడు, ప్రపంచం భిన్నంగా కనిపిస్తుంటే, ఎప్పుడోకప్పుడు మనము ప్రమాదంలో పడిపోతాము. చనిపోయిన పాము వల్ల ప్రమాదం ఉండదు, పడిఉన్న పాము ఎవరిని బుస కొట్టటము లేదని మన కళ్ళకి మంచిగా అనిపించవచ్చు. దానికి రోగం తగ్గిన తర్వాత, కాస్త ఆహారం తిన్న తరువాత, బుస కొట్టడం మొదలవుతుంది. అంటే, అసలు స్వభావం వచ్చేస్తుంది. అలా మనకి మనము కాని దానితో తాదాత్మ్యయం ఉన్నంతకాలం ప్రమాదమే.

రుచి కంటే శుచి ముఖ్యం. రుచిగా ఉండి శుచిగా లేనిది తినకూడదు. శుచిగా ఉండి రుచి లేకపోయినా తినవచ్చు. కొంతమందికి సంపద ఉంటుంది కానీ ఆడంబరాల

కోసం చెడ్డ పనులకు ధనాన్ని వృధా చేస్తారు. అయితే, ద్రవ్యాన్ని మంచి పనులకు సద్వినియోగం చెయ్యాలి అది ద్రవ్యశుద్ధి. చెడ్డ పనులకు వినియోగిస్తే జీవుడు శరీరం విడిచిపెట్టినప్పుడు ఆ దోషం కూడా వస్తుంది. పుణ్యము జ్ఞాన కాంక్షను సంపాదించిపెడుతుంది.

గమ్యం ఎంత పవిత్రమో, మార్గం కూడా అంతే పవిత్రంగా ఉండాలి అంటారు వైష్ణవులు. చెడ్డ పనులు చేసి నువ్వు ఏదైనా లాభం పొందితే, అ లాభం కూడా చెడుగా మారిపోతుంది.

అబద్ధాలు ఆడటం, అపవాదులు, దూషించటం, వ్యర్థమైన మాటలు నాలుకతో చేసే పాపాలు.

ద్వేషము, లోభిత్వము, మంచిని చెడుగా, చెడుని మంచిగా భ్రమించటము ఇవి మనస్సు చేసే పాపాలు. ఈ మూడింటిని అదుపులో ఉంచుకొని, అష్టాంగ మార్గమును విడవకుండా ధ్యాన సహితుడై జీవితంలో సంతుష్టుడై జీవించువాడు భిక్షువు అని పిలువబడతాడు.

మనిషి చేసిన పాపమే వాడిని అజ్ఞానంలో ఉంచుతుంది. శరీరంతో కొన్ని పాపములు, మనస్సుతో కొన్ని పాపములు, వాక్కుతో కొన్ని పాపములు చేస్తాడు. శరీరముతో హత్య, దొంగతనం, వ్యభిచారము శరీరంతో చేసే పాపాలు.

ఇనుమును పట్టిన తుప్పు ఇనుము ఎలా తినేస్తుందో, మనిషిని వాడు చేసిన పాపములే దుఃఖపరంపరలోకి, నీచమైన జన్మలకి లాగేస్తాయి.

నూనెకి బదులు నీటితో దీపమును వెలిగించలేము. కుళ్ళిన కలపతో అగ్నిని రగల్చలేము. అలాగే శీల సంపద లేకుండా జ్ఞానకాంక్ష కలగదు.

వేదం: నిప్పుతో పొయ్యి వెలిగించి, అన్నం వండుతాము. అన్నం వండితేనే ఆ నిప్పు ఉపయోగపడుతుంది. లేకపోతే ఆ నిప్పు వృధా అయ్యి మనకి మసి మిగులుతుంది. అలాగే నువ్వు జీవితంలో ఏ పని చేసినా, మీబుద్ధి బాగుపడేలా ఉండాలి. లేకపోతే దానివల్ల నువ్వు పొందేది సున్న. చివరికి అజ్ఞానమనే మసి మరింత పట్టి, నీ జీవితము వృధా అయ్యిపోతుంది.

యజుర్వేదం : నువ్వు ఏ వస్తువునైతే పొందుదాము అనుకుంటున్నావో, దాని గురించే విను, దాని గురించే మాట్లాడు, దాని గురించే పనిచెయ్యి. దానిని చూసే నిమిత్తమే జీవించు అప్పుడు అది నీవైపోతావు. సాధకుడికి ఎప్పుడూ శత్రు భావన రాకుండా చూసుకోవాలి. ద్వేషము, శతృత్వ భావన వల్ల మనస్సు బయటకు వచ్చేస్తుంది.

జీవితంలో బాగుపడాలనుకునేవారందరూ భాగవతాన్ని చదవండి. మన ప్రారబ్ధంలో బాగుపడాలనే తలంపు లేకపోతే చదవాలన్న తలంపు కూడా రాదు.

రాత బాగుంటే, గీత చేతికి వస్తుంది అనేవారు మలయాళ స్వామి. 700 శ్లోకాల్లో ఒక్క శ్లోకం గుండెకు పట్టినా, మన శోకాన్ని అంతటిని పీల్చేసుకుంటుంది.

మనము ఆరోగ్యంగా ఉన్నప్పుడు, డాక్టర్ తో పనిలేదు. 100% ఆనందంగా ఉన్నప్పుడు భగవంతుడు ఉన్నా ఆయనతో మనకి పని ఉండదు. అంటే ఆయన మీద గౌరవం లేక కాదు అవసరం లేదు.

ఐశ్వర్యవంతులు అవ్వాలంటే, రామాయణం చదవాలి. ఏదైనా పనిలో జయం కలగాలంటే, భారతం చదవాలి. వైరాగ్యం కలిగి జ్ఞానం పొందాలంటే, భాగవతం చదవాలి అంటారు పెద్దలు.

దేహగతమైన నేనునే క్రైస్తవులు సైతాను అంటారు.

భగవంతుడికి దూరంగా ఉన్న వాళ్ళకి, భగవంతుని విలువ తెలుస్తుంది. భగవంతుని దగ్గరగా ఉన్న వాళ్లకి భగవంతుని విలువ తెలియదు. ఎప్పుడూ నీడలో ఉన్నవారికి నీడ విలువ తెలియదు కదా.

గోపికల ప్రేమ అలౌకికం-అభౌతికం. అందులో వ్యాపార దృక్పథం లేదు. భగవంతుడిని భగవంతుడి కోసమే ప్రేమిస్తారు. గోపికలంతా గతజన్మలో ఋషులు.

గేయంగీతానామసహస్రం. మీరు ఎంత కష్టంలో ఉన్నా గీతని పఠించండి. ఆయన నామాన్ని, విష్ణు సహస్రనామాల్ని స్మరించటం వల్ల మీ మనస్సు నిర్మలమవుతుంది. సముద్రంలో కెరటాలు లేనప్పుడు సూర్యుని ప్రతిబింబం నీటిలో ఎలా ప్రతిబింబిస్తుందో, అలా లోపల ఉన్న ఆత్మ ప్రతిబింబము నీకు వ్యక్తమవుతుంది.

హరిః అంటే, హరించేది. భగవదనుభవం పొందటానికి ఏ బలహీనతలు అడ్డువస్తున్నాయో, వాటిని హరించేవాడే, హరి అని అర్థము.

అన్ని దానములలో నిదానం గొప్పది. భగవంతుడు తలంపు, మూలంలోనే ఉన్నాడు. దాన్ని దర్శించటమే తపస్సు. మూల తలంపు ఒక ఎద్దు లాంటిది. ఎద్దు తోక పట్టుకుంటే ఆగదు. కొమ్ము పట్టుకుంటేనే ఆగుతుంది. అలాగే మూల తలంపుకి గౌరవం ఒక కొమ్ము, అగౌరవం ఒక కొమ్ము, దరిద్రం ఒక కొమ్ము, సంపద ఒక కొమ్ము. ఆ కొమ్ములు కదలకుండా గట్టిగాపట్టుకొని ఆపితే, అప్పుడది నెమ్మదిగా నిర్మలమయ్యి, withdraw అవుతుంది. మూలతలంపుని దాని మూలంలోనికి పంపటమే తపస్సు. అలా పంపే ప్రకియలో అది కుమ్ములాటగా కుమ్మేస్తూ ఉంటుంది. దాన్ని తట్టుకొని బలం సంపాదించి నిదానంగా విడిచిపెట్టాలి. నిదానాన్ని మించిన దానం ఇంకొకటి లేదు.

Goodness must always be joined with knowledge.

లింగమంటే  గుర్తు. సాకారానికి - నిరాకారానికి మధ్య వారధి. ఆయన అవయవరహితుడు. నీ హృదయంలో ఉన్న అంతర్యామికి అవయవాలు లేవు.

నారాయణ లో 'రా' ని, నమశ్శివాయ లో 'మ' ని తీసి రామ అని పెట్టారు వశిష్టుడు. విశిష్టత గలవాడే వశిష్టుడు. వశిష్టుడు రాముడికి యోగావాశిష్టము లక్ష శ్లోకాలు  చెప్పాడు.

నారాయణడు అంటే ఒక వ్యక్తి కాదు. అది సత్పదార్థం. ఏ బ్రహ్మం ఈ సృష్టి అంతా వ్యాపించబడి ఉందో, ఆ బ్రహ్మమే నారాయణడు.

మట్టిని అనేకరకాలైన కుండలుగా తయారు చేస్తాడు కుమ్మరి. ఆ కుండలు రూప నామాలకి కారణం మట్టే. కుండని విడిచిపెట్టి మట్టి ఉండగలదు. మట్టిని విడిచి, కుండ ఉండదు. అలాగే బ్రహ్మమునందే ఈ జీవకోటి-నామరూపాలు కల్పించబడ్డాయి. నామ రూపాలకి అతీతంగా బ్రహ్మం ఉంది. బ్రహ్మముకి అతీతంగా నామ రూపాలు లేవు. ఈ ప్రపంచాన్ని బ్రహ్మముగా చూడటమే, నిజమైన చూపు.

నారదుడికి నారాయణుడు దర్శనమిచ్చి, మీకేమికావాలి నారదా! అని అడుగుతాడు. నారాయణా, నీ పాదముల పట్ల సదా స్థిర భక్తిని ప్రసాదించు అంటాడు. మరొక కోరిక కూడా కోరుకోమంటాడు నారాయణుడు. తండ్రి! ఈ మనుష్యుల మాయలో, కాలం మాయలో పడకుండా, నిరంతరం నీ నామాన్ని విడిచిపెట్టకుండా, సదా నీ పాదాల పట్ల భక్తిలో రమించేలా చూడు, ఇంతియే చాలు అంటాడు.

పాండవులు నారాయణుడి చుట్టూనే తిరుగుతున్నారు. ఎక్కడికి వెళ్ళినా ఆయన్ని వెంట తీసుకుని వెళతారు. అయినప్పటికీ వారికి ఎందుకు కష్టాలు తీరటంలేదని భీష్ముడిని అడిగితే, పరమాత్మ, కష్టం ద్వారా చాలా పాఠాలు నేర్పుతాడు.దేహ భావనలోంచి విడుదల చేసి ఆత్మ భావనలో నిలబెట్టేందుకు కష్టాలు పంపుతాడు. ప్రారబ్ధం మనల్ని భగవంతుడు పక్కనే ఉన్నా వదలదు. అయితే, భగవంతుడు వారి ప్రారబ్దాన్ని తన నీడలో, తన సాంగత్యంలో సంతోషంగా అనుభవింప చేస్తున్నాడు అంటారు.

మనము పూర్వ జన్మలో చేసిన పొరపాట్లు, ధర్మ విరుద్ధమైన ప్రవర్తన పాపంగా మారి అది ఈ జన్మలో దేహానికి రోగంగా, మనస్సుకి శోకంగా వచ్చింది. పూర్వజన్మల పాపం దుఃఖరూపంలో, పుణ్యం భోగరూపంలో వస్తుంది. దుఃఖాన్ని భరిస్తే ఖర్చయిపోతుంది, పుణ్యాన్ని భోగిస్తే ఖర్చయిపోతుంది. అయితే ఈ దేహాత్మబుద్ధిలో నుండి, దేహమే ఆత్మ అని - అనుకునే భ్రాంతిలో నుండి బయటికిరాము. ఆత్మచింతన లేకుండా, భగవంతుడిని పొందాలనే తపన లేకుండా ఈ భ్రాంతిలో నుండి బయటకురాలేము. గురు వాక్యాన్ని శ్రవణం చేసి, మననం చేసి దానిని ఎంజాయ్ చెయ్యగా, చెయ్యగా భ్రాంతిలో నుండి బయటకు వస్తాము. ప్రారబ్ధముతో, నిందా-స్తుతులు వస్తుంటాయి. ఆ సమయంలో మనము ఉద్రేక రహితంగా ఉండగలిగితే పవిత్రమవుతాము. ఉప్పు నీటిలో వేస్తే ఎలా కరిగిపోతుందో, భగవంతుడి నామాన్ని స్మరిస్తుంటే ఆ స్మరణలో జన్మజన్మల దోషాలు కరిగిపోతాయి. ఎవరైతే మనకి భక్తి నేర్పి, ముక్తి వైపు మన ముఖాన్ని తిప్పుతారో వారి సహవాసం మనము విడిచిపెట్టకూడదు. గురు వాక్యాన్ని విడిచిపెట్టకుండా శ్రవణం, మననం చేస్తుంటే విషం తాగిన వాడిని డాక్టర్ ఎలా కక్కించి, లోపల పొట్ట ప్రేగులని ఎలా కడుగుతాడో, అలా జ్ఞాని వాక్యం జన్మజన్మల దోషాలని కక్కించి జీవుడిని కడిగి పవిత్రుడిని చేస్తుంది.

అందుకే సబ్జెక్టుని ఎన్నడూ విడిచిపెట్టకూడదు.practice purity; practice charity.

జీవుడు జన్మిస్తూ, తిరిగి మరణిస్తూ అలా ఈ జన్మ పరంపరల్లో ఎలా పవిత్రమవుతాడంటే, నిష్కామ కర్మ, నిష్కామ భక్తి, నిష్కామ ధ్యానం, అధ్యయనం, శ్రవణ - మననాదులు ఇవన్నీ చేయగా చేయగా జీవుడు పవిత్రుడవుతాడు. డైనమైట్ కొండను కూడా పిండి చెయ్యగలదు. అలా భగవంతుని నామం పెద్ద డైనమైట్.

కొందరికి ఇంట్లో, సమాజంలో ఇతరుల మీద పెత్తనం చేయడం ఇష్టం. పెత్తనం చేసి, మాకు అంతా భయపడిపోతున్నారు అంటారు. వారికి తెలియకుండానే వారే నరక ద్వారానికి రోడ్డు వేసుకుంటున్నారని వాళ్ళకి తెలియటం లేదు. మీ ప్రవర్తన, మీ మాట, మీ ఆలోచన అహంభావంలో నుండి బయటకు వచ్చేదిలా ఉండాలి.

మాకు రోజులు బాగా వెళ్ళిపోతున్నాయి, అదృష్టవంతులం అనుకున్నా ఏదో ఒక రోజు చావు మిమ్మల్ని ముట్టుకుంటుంది. అందువలన రోజులు బాగా వెళ్ళిపోవటం మీ గమ్యం కాదు. నువ్వు స్వరూప సుఖాన్ని పొందు. దాన్నే గమ్యంగా పెట్టుకుని జీవించు. జీవితంలో దేన్ని వృధా చెయ్యకు. waste not what is given and want not what is not given. ధనాన్ని వృధా చేస్తే పరిస్థితులు వ్యతిరేకమయితే ధనం లేక ఇబ్బందిపడాలి. నీకు లేని దాన్ని కోరుకోకు ఇతరులతో పోల్చుకుంటే అశాంతిలోకి వెళ్ళిపోతావు.

యజుర్వేదం ఏమని చెబుతోందంటే, మనము ఏ వస్తువుని పొందటానికి ప్రయత్నం చేస్తున్నామో, దాన్నే కళ్ళతో చూడాలి, చెవులుతో దాని గురించే వినాలి, దాని గురించే మాట్లాడాలి, దాన్నే మనస్సులో ధ్యానించాలి. అప్పుడు దాన్ని మనము పొందుతాము. దానికి విరుద్ధమైన జీవితం కలిగి ఉంటే నువ్వు ఆ వస్తువుని ఎలా పొందుతావు? సముద్రంలో ఎన్ని కెరటాలు, ఎన్ని బుడగలు ఉన్నా దానికి ఆధారంగా ఉన్నది నీరే. అలాగే ఎన్ని తలంపులు వచ్చినా రానివ్వండి. దానికి ఆధారంగా ఉన్నది ఆత్మే. దాన్ని దర్శిస్తే వీటి దగ్గర మనము ఆగిపోము.

రాధ - జీవుడు, కృష్ణుడు - దేవుడు. ఒకసారి రాధను కృష్ణుడు గిల్లాడు. అది భగవంతుడుని నిరంతరం జ్ఞాపకం తెస్తోంది కాబట్టి ఆ గాయం తగ్గకూడదు అనుకుంది. అంటే, ఆయన జ్ఞాపకం సరిపోతుంది. నిరంతరం ఆయన జ్ఞాపకం నీకు మోక్షాన్ని

కూడా తీసుకొస్తుంది. మనకు వచ్చే కష్టాలన్నీ భగవంతుడు గిల్లులే.

పెద్దలు సదాచారం మనిషికి వివేకం తెస్తుందన్నారు. సదాచారమంటే, మంచి భావాలు కలిగి ఉండటము. చెడ్డ భావాలకి, చెడ్డ పనులకి, చెడ్డ ఆలోచనలకి దూరంగా ఉండాలి. నీ ప్రవర్తన అహంభావ రహితంగా ఉండేటట్లు చూసుకో. చెడు చూడాల్సి వస్తే గుడ్డివాడిగా ఉండు. చెడు వినవలసి వచ్చినప్పుడు చెవిటివాడిలా ఉండు. చెడు మాట్లాడాల్సి వచ్చినప్పుడు మూగవాడిగా ఉండు. అలా ఉండటము అలవాటు చేసుకుంటే, సదాచార సంపన్నుడివి అవుతావు.

ఇతరులను విమర్శించే కొద్దీ, వాచాలత్వం, వాగాడంబరం పెరిగి లోపల కల్మషం పెరిగిపోతుంది. పొంగు-కృంగులు ఉంటే మనస్సుకి అంతర్ముఖత్వం రాదు, ఆత్మానుభవం పొందలేము. మనల్ని భగవంతుడు ముట్టుకోవటం లేదు, కానీ, మాయ చుట్టేసుకుంటోంది. మనుషులకి బాహ్య-చూపే కానీ లోపల చూపు లేదు. లోపల వాసనలు కదులుతూ, అవి ఇంద్రియాలను పట్టుకుంటాయి. మనము ఇంద్రియాల ద్వారా, రోడ్డు మీదకి (లౌకిక విషయాల్లోకి) వచ్చేస్తాము. మనకి కనుక లోచూపు ఉంటే, వాసనల కదలికలను గుర్తించి, అవి ఇంద్రియాలను ముట్టుకున్నప్పుడు వివేక, వైరాగ్యాలతో, వాసనల మీద నుండి భగవంతుడు వైపుకి ఇంద్రియాలని మళ్ళించుకోగలము. అదే సాధన.

బజార్లో ఎన్ని సరుకులున్నా, మనకి కొనుక్కునే శక్తి లేకపోతే మనము బీదవాళ్ళం. భగవద్గీతలో ఎంత జ్ఞానం ఉన్నా వైభవాన్ని అర్థం చేసుకునే శక్తి, స్వాధ్యాయం చేసే బుద్ధి మనకి లేనప్పుడు మనము అజ్ఞానులుగానే మిగిలిపోతాము.

బడి-గుడి ఇవి రెండూ అవసరమే. బడి బ్రతకటం నేర్పుతుంది, గుడి సంస్కారం నేర్పుతుంది, ఇంద్రియాలకి నిగ్రహం నేర్పుతుంది. ఇవి రెండూ లేని గ్రామంలో మనము నివసించకూడదు. ఉపనిషత్ లో ఒక మాట ఉంది, మనము ఎవరినైనా, వారి పరిస్థితులను చూసో, బలహీనతలను చూసో అవమానపరిస్తే, అవమానపరిచినవాడు, అవమానపడ్డ వాడికంటే ముందు చనిపోతాడు. మాట, ప్రవర్తన సంస్కరించబడి దయగా ఉండాలి.

భగవంతుడు మనకేది ఇచ్చాడో అది మన గొప్పతనం కాదు. అది ఆయన మనకిచ్చిన గిఫ్ట్. సంపద, విద్య, అధికారము వీటిని చూసుకొని మరింత వినయంగా ఉండాలి, కానీ అవినయం తెచ్చుకోకూడదు. ఆయన ఇచ్చినది, ఆయన దయని పొందడం కోసం ఉపయోగించుకోవాలి.

మంచివాడు, మంచి పనులు చేస్తాడు. చెడ్డవాడు, చెడ్డ పనులు చేస్తాడు, భగవంతుడు ఇద్దరిలోను ఉన్నాడు. ఎవరి జన్మాంతర సంస్కారాలని బట్టివారి బుద్ధి, వారి త్రికరణాలని అలా ఉపయోగిస్తుంది. లోపలున్న భగవంతుడు సాక్షిగా చూస్తుంటాడు. మనము తీసుకునే ఆహారం, మలం ద్వారా మరుసటి రోజు బయటకి ఎలా వస్తుందో, లోపలున్న మన గుణాలు త్రికరణాల ద్వారా బయటికి వస్తాయి. గురువనుగ్రహం ఉన్నవాడు తనని తాను పరిశీలించుకుంటూ... తన బలహీనతల్ని, దోషాల్ని, తనకి ఉన్న పాపపు బుద్ధిని గ్రహించి... తనకి ఉన్న ద్వేష బుద్ధిని, ప్రేమతోటి, తనకి ఉన్న లోభిత్వాన్ని దాతృత్వంతోటి, తనకి ఉన్న స్వార్ధాన్ని సేవ ద్వారా, ఇతరులలో లోపాలను ఎంచే బుద్ధిని వాత్సల్యముతోటి, జయించి తన త్రికరణాలని.. పవిత్రమైన, శుద్ధమైన కర్మలయందు, మాటలయందు, భావాల యందు, ఉండేటట్లుగా చూసుకుంటాడు. అలా జీవించిన వాడు మాత్రమే పరిశుద్ధుడు అవుతాడు.

మన వద్ద ఇతరులకు ఇవ్వటానికి, పండు లేకపోవచ్చు, బట్టలు లేకపోవచ్చు కానీ మన తోటి వారు బాగుండాలనే భావనలో దారిద్ర్యం ఉండకూడదు. అందరి క్షేమంలోనే, అందరి హితవులోనే, మన క్షేమం, మన హితవు కూడా ఇమిడి ఉన్నాయి. ప్రత్యేకంగా మన కోసం అడగక్కర్లేదు. అందరి క్షేమం మనము కోరితే, భగవంతుడు మన క్షేమం కోరతాడు. "సర్వభూత హితేరతాః".

శరీరంతో భోగాల్ని ఎంజాయ్ చేస్తూ, ఇంద్రియ భోగాలకి పరిమితమై జీవించేవాడు రాక్షసుడు. మనో నిగ్రహం - ఇంద్రియ నిగ్రహం లేకుండా విచ్చలవిడిగా త్రికరణాలని వదిలేసి బ్రతికేవాడు జంతువు. వాడు పశువుతో సమానం. సమాజంలో ఎవరైనా ఆధ్యాత్మికంగా గానీ, భౌతికంగా గాని అభివృద్ధిలోకి వస్తే, అది చూసి అసూయతో ఏడ్చేవాడు పిశాచం. ఇట్టి విధంగా ఉన్నవారికి ఆత్మజ్ఞానం లభించదు.

He who does the work of God is my father, is my mother, and is

my friend. బంధువులకి, స్నేహితులకి పని చేసేవాడు నా స్నేహితుడు కాదు, భగవంతుడు కోసం పనిచేసే వాడు నా స్నేహితుడు. రాబందులు ఎంత ఎత్తులో ఉన్నా, వాటి చూపు నేల మీద ఉన్న శవాలపైనే ఉంటుంది. వారి స్వార్థానికి మనము ఉపయోగపడకపోతే, మన కష్టసుఖాల్లో ఒక్కరు కూడా మన పక్కన ఉండరు. అందువలన వారికి సమయాన్ని వెచ్చించి కాలాన్ని వృధా చేసుకోవద్దు.

జీవితంలో ఏది విజయమంటే, మనము ఒక పనిని ప్రారంభించిన మొదట్లోనే, అపారమైన విజయం వచ్చి లాభం పొందామనుకోండి. ఆ పొందిన దానిని మనము లోపలికి తీసుకుని గర్వం తెచ్చుకుంటే లోపల పరాజయం పొందినట్లే, లోపల మనము నష్టపోతాము. ఆత్మాభిముఖంగా మన ప్రయాణం కొనసాగదు. భౌతిక దృష్టిలో జయమైనా జీవుడికి జయం కాదు, అపజయమే అవుతుంది.

జ్ఞానము యందు, ఈశ్వరుని పాదాల యందు నీ మనస్సుని ఉంచి దేహ ప్రారబ్దాన్ని ఇష్టంగా అనుభవించు. నా మాయ నీ ఇంద్రియాల్లో, నీ మనస్సులో, నీ బుద్ధిలో ఉంది అన్నాడు పరమాత్మ. బోనులో ఎలుకలు పడ్డట్లు అందులో నువ్వు పడకుండా చూసుకో అర్జునా, అదే వీరత్వం. అది చూసుకోకుండా బయట ఎన్ని విజయాలు సాధించినా లోపల నీతోటి నువ్వు ఓడిపోతావు అన్నాడు పరమాత్మ. నీ పెదవులు కంటే, నువ్వు పూజకి వినియోగించే పుష్పాలు కంటే, నీ చేతులతో చేసే పని అంటేనాకు చాలా ఇష్టం అన్నాడు పరమాత్మ, అర్జునుడితో. మన భక్తి నోటి నుండి చేతి వరకు ఎదగాలి. అర్జునుడు తనకి ఉన్న దైవబలాన్ని సద్వినియోగం చేసుకొని యోగి అయ్యాడు. దుర్యోధనుడు భోగి అయ్యి పతనమయ్యాడు.

శరీరానికి వచ్చిన రోగం వైద్యుడు వద్దకు వెళ్ళి, ఆయన ఇచ్చిన మందులు వేసుకుని పత్యం చేస్తే, రోగంలో నుంచి బయటికి వస్తాము. మనసుకు పట్టిన రోగం స్వ-పరా బుద్ధి. అది భవరోగము. అందులో నుండి బయటకు తెచ్చే వైద్యుడు గురువు మాత్రమే. గురువుని ఆశ్రయించి, వారిని సేవించి, వారు చెప్పిన శాస్త్రం పట్ల శ్రద్ధ కలిగి, వాటిని ఆచరించి బయటికి రావటమే యోగ చికిత్స.

మనము మంచం పట్టి చనిపోయేకంటే, పనిచేస్తూ ఆధ్యాత్మిక స్థాయిని పెంచుకుంటూ చనిపోవడం మంచిది. మతాల సారం ఏమిటంటే, చెయ్యగలిగినంత

మంచిని చేస్తూ, ధర్మాన్ని అంటిపెట్టుకుని జీవిస్తూ, మనము పవిత్రులమవ్వటానికి ప్రయత్నం చేస్తూ తరించటమే. ఇతరుల కళ్ళతో మనల్ని ఎన్నడూ చూసుకోకూడదు. మన కళ్ళతో మనల్ని మనము చూసుకోవడం అలవాటు చేసుకోవాలి.

మనము ఈగల్లా ఉండకూడదు. ఈగ మంచి పదార్థం, చెడ్డ పదార్థం మీద వాలుతుంది. తేనేటీగ మధురమైన మకరందాన్ని మాత్రమే పీల్చుకుంటుంది. మనము తేనెటీగల్లా ఉండాలి.

జ్ఞానం - అజ్ఞానం - విజ్ఞానం.

విష్ణు సహస్రనామాల్లో దారుణః అని నామం ఉంది. భగవంతుడు మంచివారిని, ధర్మాత్ములని మనము అహంకారంతో పీడిస్తే వారి పట్ల భగవంతుడు దారుణంగా ఉంటాడు. భక్తుడైన ప్రహ్లాదుడు కోసం స్థంభంనుండి బయటికి వచ్చి, దారుణంగా హిరణ్యకశిపుడి పేగులు చీల్చేశాడు నారాయణుడు.

మంచి బుద్ధిని సంపాదించిన తరువాత ధనం వచ్చినా పర్వాలేదు. సరస్వతి అనుగ్రహం తరువాత లక్ష్మీ కటాక్షం. మంచి బుద్ధి వచ్చిన తరువాత ధనం వస్తే, ఆ ధనం, బుద్ధిని పాడుచెయ్యదు. సరైన బుద్ధి రాకుండా డబ్బు వస్తే, ఆ బుద్ధిని ధనం పాడు చేసేస్తుంది. మాయలో బలంగా కూరుకుపోయిన వాడికి సత్యం-అసత్యంగా, అసత్యం-సత్యంగా కనిపిస్తుంది. ఆ మాయే అమ్మవారు. ఆమె దయ లేకుండా అందులో నుండి బయటకి రాలేము.

1985 సంవత్సరంలో, నాన్నగారికి అనారోగ్యం వచ్చింది. అప్పుడు తరచూ అరుణగిరి జ్ఞాపకం వచ్చేదట. నేను మళ్ళీ, ఈ దేహంలో ఉండగా అరుణగిరిని చూస్తానా? అనిపించేదట. ఈ గిరి రెండు పనులు చేస్తుంది. 1. వైద్యుడు చేసే పని, 2. ఔషధం చేసే పని. ఈ గిరి మనలో ఉన్న దోషాలని కెలికి బయటకి తీసి, కరుణ - దయ అనే ఔషధంతో మనల్ని పవిత్రం చేసేస్తుంది. నంది ఈశ్వరుడిని ఎలా చూస్తూ ఉంటుందో, మనము అరుణాచలంలో ఉన్నంతకాలం చూడగలిగినంతసేపు ఎక్కువుగా అరుణ గిరిని చూస్తూ గడపాలి. ఈ గిరి కరుణా సముద్రుడు.

కర్మలేని వాడికి జన్మలేని వాడికి చావు పుట్టుకలేంటి? కృష్ణుడికి జన్మలేదు, కర్మ లేదు. మనము పని చేస్తూ ఆ స్థాయికి ఎదగాలి. "work done in true state

is meditation. selfless work is equal to meditation" పని మనల్ని విడిచిపెట్టాలి కానీ, మనము పనిని విడిచి పెట్టకూడదు. మనము గాలి పీల్చుకుంటున్నాము, ఆహారం తీసుకుంటున్నాము, నడుస్తున్నాము కదా! మనము భూమ్మీద ఉన్నంతకాలం గుండె కొట్టుకుంటుంది. నేను tier అయిపోయాను అంటుందా? అంత న్యాచురల్ గా భగవంతుడు కేటాయించిన పని చెయ్యాలి.

భూమ్మీద మనుషుల దుఃఖానికి రకరకాల కారణాలు అనుకుంటాము. అన్ని కారణాలు లేవు, ఒకే కారణం అదే "దేహాత్మ బుద్ధి". దేహమే ఆత్మ అని అనుకోవడం అదే దుఃఖానికి కారణం, సర్వకారణాలకి కారణం. అది పోతే దుఃఖం పోతుంది, పునర్జన్మలలోంచి విడుదల పొందుతాము.

మనము చనిపోయాక మన వారసులు, మనకి నిప్పు పెడతారు. అజ్ఞానాన్ని తగలెయ్యడానికి గురువు మనందరికీ సద్బోధ అనే నిప్పు పెట్టాడు. అజ్ఞానం పూర్తిగా కాలితే కానీ నిప్పు ఆరదు. దానికి కొంత సమయం పడుతుంది. గురువుని మనము విడిచి పెట్టేసిన, గురువు మనల్ని విడిచిపెట్టడు, అదే పులి నోట్లో పడ్డ మాంసపు ముక్క. మన లోపల అజ్ఞానం కాలే వరకు వేటగాడు జంతువుని ఎలా వెంటాడుతాడో, అలా గురువు మనల్ని వెంటాడుతూనే ఉంటాడు. గురువుకి దూరము - కాలము లేదు. ఆధ్యాత్మిక మార్గంలో మన లోపలికి వెళ్ళి, జ్ఞానం పొందాలంటే మనము కొంత సాధన చేస్తాము. అనుభవం మాత్రం ఆయన అనుగ్రహించాలి. మనస్సు లోపలికి వెళ్తుంటే ప్రారబ్దం మనల్ని ముట్టుకోదు; మనస్సు బహిర్ముఖం అవుతుంటే ప్రారబ్దం మనల్ని ముట్టుకుంటుంది,పీడిస్తుంది.

భగవాన్ ని ఋషి అంటాము. కృష్ణుడు గీతలో, ఋషి కంటే యోగులు గొప్పవారు నువ్వు యోగివి అవ్వాలి అర్జునా! అన్నాడు. యోగికి ఇంద్రియాలు, బుద్ధి పనిచేస్తూ ఉంటాయి. స్వరూపం నుండి కిందికి జారడు, కర్మని యోగంగా చేస్తాడు. ఆత్మజ్ఞానం ఋషికి, యోగికి సమానమే. ఏ యోగి, ఏ ఋషి ప్రేమ లేకుండా ఉండరు, ప్రేమ ఇద్దరిలో ఉంటుంది. యోగికి యాక్టివిటీ ఉంటుంది, యాక్టివిటీ మధ్యలో కూడా డిస్టర్బ్ అవ్వడు, కిందకిపడడు. అదనంగా యోగి కర్మని యోగంగా చేస్తాడు. లోపల ట్రూత్ డైరెక్ట్ ఎక్స్పీరియన్స్ ఉన్నప్పటికి శరీరం ద్వారా చేసే పని పట్ల, అశ్రద్ధ ఉండకూడదు. ఒకో శరీరం ద్వారా ఒకో పని జరుగుతుంది. భగవంతుడు,

అర్జునుడిని యుద్ధం చేయమన్నాడు, ఉద్ధవుడిని, నువ్వు ఈ జనంతో పడలేవు, మా యాదవులందరికీ ధనం ఎక్కువయ్యి మదంతో కొట్టుకు చస్తున్నారు. బదరీ వెళ్ళి, సాధన చేసి తరించమన్నాడు. మొత్తం మీద వారు బాగుపడాలని, అర్జునుడికి ఏది అవసరమో, అది చెప్పాడు. ఉద్ధవుడికి ఏది అవసరమో, అది చెప్పాడు.

ఈ శరీరాల్ని భగవంతుడు తయారు చెయ్యలేదు, ప్రారబ్దం తయారు చేసింది. ప్రారబ్దం ఖర్చు అయిపోయాక శరీరాలు కూడా పోతాయి. మన దేహం ద్వారా, ఏ పని జరగవలసి ఉందో అది మనకి ఇష్టం ఉన్నా లేకపోయినా జరుగుతుంది. మనము చేసే పని, ఇష్టంగా చేస్తే, పాత వాసనలు నశిస్తాయి, కొత్తవి పడవు. మనకి శరీరం ఎలా రూపమో, భగవంతుడికి అలా ప్రేమే రూపం. భగవంతుడు కష్టాలు పెడుతున్నాడు అంటారు, చాకలివాడు బట్టలని కోపంతో రాయికేసి కొట్టడు, బట్టని శుభ్రం చెయ్యడానికి కొడతాడు. అలా భగవంతుడు మనల్ని పవిత్రం చేయడానికి పనిచేయిస్తాడు.

మీరందరూ ఉండండి. మేము మంచి వాళ్ళమని, చెడ్డవాళ్ళమని, ఎక్కువ వాళ్ళమని, తక్కువ వాళ్ళమని అనుకోవద్దు. అలాగా అనుకోవద్దు, ఇలాగా అనుకోవద్దు. సుఖంగా రోజులు వెళ్ళిపోతాయి కానీ, ఈ అనుకోవటాలే మనల్ని బంధిస్తాయి. మనము ఏమనుకోకుండా ఉంటే, ఏ సాధనలు చేయక్కర్లేదు, హృదయంలో నుంచి శాంతి వచ్చి సహస్రారాన్ని ముంచేస్తుంది. శాంతి వచ్చి, సహస్రారాన్ని తాకినప్పుడు భగవంతుడు మనల్ని వైకుంఠం పంపుతామన్న వద్దంటాడు. మనకి దాహం లేకపోతే, మంచినీళ్ళు ఇచ్చినా వద్దంటాము. అలాగే వైకుంఠం కూడా అవసరం లేక వద్దనిపిస్తుంది.

ఒకసారి నాన్నగారు, అరుణాచలంలో ప్రదక్షిణం చేస్తూ కుబేర లింగం వద్ద, గట్టుపై కూర్చున్నారు. అక్కడ ఒక భక్తుడు నాన్నగారితో, నాన్నగారు, మనస్సు నాలుగు రోజులు బాగుంటుంది, మళ్ళీ నాలుగు రోజులకు బయటకి వచ్చేస్తుంది. లోపల శాంతిగా ఉండొచ్చు కదా! బయటకి ఎందుకు వచ్చేస్తోంది అని అడిగాడు. నాన్నగారు అంటారు, మన శరీరానికి ఎంతో వయస్సు ఉండదు. 70, 80 సంవత్సరాల కంటే దేహం ఉండదు. ఇది చాలా చిన్న జీవితం. ఇంతకుముందు ఇటువంటి శరీరాలు ఎన్నో వచ్చాయి. భగవంతుడు లోంచి వేరుపడి, కర్తృత్వ బుద్ధి తోటి, ప్రపంచంలో

దుమ్ము అంతా నొల్లుకుంటున్నాం. అయితే, సాధన చేసి మనస్సుని నాలుగు రోజులు భగవంతుడి మీద ఉంచినా, లోపల సంస్కారాల వేగం వల్ల బయటకు వచ్చేస్తుంది. తాదాప్యం పొందే కర్తృత్వబుద్ధి పోదు, అనేక దేహాలు మారుస్తూ ఉంటుంది. మనస్సు బాహ్యముఖానికి వెళ్ళే కొలది, బంధింపబడుతుంది; అంతర్ముఖం అయ్యే కొలది విడుదల పొందుతుంది. ఎప్పుడన్నా మనకి జ్ఞానం కలిగినట్లు అనిపించినా, లోపల సంస్కారాలు వేరుతో సహా నశించే వరకు అది నిలబడదు. మనస్సు బయటకు వస్తుంది అంటే, లోపల వాసనా శేషం ఉంది. ఆ శేషం  పూర్తిగా నశించే వరకు, బయటకి రావడము మానదు.

ఎండ్రిన్  డబ్బాని దూరంగా ఎలా ఉంచుతామో, అలా మనకు ఉపయోగపడని లౌకిక విషయాలు, వ్యర్థమైన విషయాలు, వ్యర్థమైన సహవాసాలు.. దూరంగా పెట్టాలి. మొసలిని నమ్మి, నది దాటడం ఎటువంటిదో, అలా తరచూ లోకచింతన, భోగచింతన, దేహచింతనతో కాలక్షేపం చేస్తూ...జ్ఞానం పొందాలనుకోవడం అటువంటిది అన్నారు ఆచార్యులు వారు. దయగల హృదయమే భగవంతుడి నిలయం. దయగల హృదయంలో భగవంతుడు నివసిస్తాడు. మనము జీవన్ముక్తులము అయ్యేవరకు యజ్ఞ, దాన, తపస్సులను విడిచిపెట్టకూడదు. వాటివల్ల మనము పవిత్రులమవుతాము. జ్ఞాని కూడాయజ్ఞ, దాన, తపస్సులు ఆచరించటం వల్ల ఇతరులకు ఆదర్శమవుతాడు.

ఈశ్వరుడు, హృదయ దేశంలో ఉన్నారు, మన గుర్తింపులు ఆయనకి అక్కరలేదు, ఆయన చేసే పని ఆయన సైలెంట్ గా చేసుకుపోతున్నారు. ఈ దేహములో మనల్ని ఉంచి, సంసార-యంత్రానికి తగిలించి తిప్పుతున్నారు. birth - death - decease - sin, కష్టం - సుఖం అన్ని జీవుడికే. ఈశ్వరుడి చేతిలో మాయ ఉంది; మాయ చేతిలో మనము ఉన్నాము. ఈశ్వరుడు చెప్పినట్లు పనిచేసి, ఆ రకంగా జీవిస్తే మాయ మనకి దారిస్తుంది.

దైవీ సంపద లేని భౌతిక సంపదకి, పొయ్యిలో పెట్టిన పిడకలకి ఏ గతి పడుతుందో! అటువంటిగతే పడుతుంది. దైవగుణాలే దైవ సంపద, దైవ-సంపద వలనే దైవం తెలియబడుతుంది.

కృష్ణుడికి మరొక పేరు వశి. అంటే, వశం చేసుకోవటమని అర్థం. మన మనస్సుని, మన శరీరాన్ని, మన ఇంద్రియాలని వశం చేసుకుంటే, అవి మనల్ని

మనము పవిత్రం చేసుకోవటానికి ఉపయోగపడతాయి. వాసు దేవుడికి మరో పేరు ఋషీకేశుడని. అంటే, ఇంద్రియాలు మీద ఆధిపత్యం కలవాడని. మన ఇంద్రియాలు మీద మనము పెత్తనం చెయ్యలేము కానీ, బయట జనాల మీద పెత్తనం చేస్తాము.

భోజనం తినేటప్పుడు కడుపు నిండిన తరువాత, సరిపోతుందని దేహం చెబుతుంది. అప్పుడు ఆపు చేసెయ్యాలి అదే యోగం. ధనం, స్నేహం, వ్యవహారం విషయంలో అతిగా ఉండకూడదు. అతిగా ఉంటే యోగం సిద్ధించదు. సారా తాగిన వాడికి ఎలా మత్తు వస్తుందో అలా అతి స్నేహం మత్తుని తీసుకువస్తుంది. భగవంతుడు చెప్పిన వాక్యానికి తదనుగుణంగా నడుచుకుంటే మనకి తెలియకుండానే దుఃఖం ఆరిపోతుంది.

ఇంట్లో భార్యకి, భర్త స్నేహితుడు - హాస్పటల్లో ఉన్నంతకాలం రోగికి, వైద్యుడు స్నేహితుడు. జీవుడు మరణించిన తరువాత జీవుడికి స్నేహితుడు ఎవరంటే, బ్రతికి ఉండగా వాడు చేసిన దానమే. నూటికి నూరుపాళ్ళు స్వార్థం తగ్గించుకోలేకపోయినా, కొద్దిగా స్వార్థం తగ్గించుకొని, చిన్న మంచి పని చేసినా మరణానంతర జీవితంలో ఆ పని మనకి ఎలా వెలుగు తీసుకువస్తుందో, అది ఊహకి అందదు. బాబా charity is our duty అన్నారు. ఇప్పుడు నేను ఎలా పని చేస్తున్నానో అలా నా దేహం పోయిన తరువాత, నా సమాధి లో నుండి నా ఎముకలు కూడా పనిచేస్తాయి అన్నారు.

నాన్నగారిని ఒక భక్తుడు విగ్రహారాధన ఒకటవ తరగతి వంటిది. అది పనికి రాదంటున్నారు ఏమిటని అడిగారు. నాన్నగారు ఎప్పుడు మనకి ఇది పనికి రాదు, వ్యర్థమని చెప్పేవారు కాదు. అందులో sincerity ఉండాలి అనేవారు. విగ్రహాన్ని ఆరాధించడం వలన క్రమశిక్షణ వస్తుంది. ఇంద్రియ నిగ్రహం, మనో నిగ్రహం కలుగుతుంది. క్రమశిక్షణ లేకుండా ఏ రంగంలోని మనము అభివృద్ధిలోకి రాలేము. ఏ తరగతికి వెళ్ళినా ఒకటవ తరగతి ఉంది కదా! పునాది అదే కదా, అది మర్చిపోకూడదు. మన పూజ నిజమై, మనము sincereగా విగ్రహాన్ని ఆరాధిస్తే, విగ్రహాధిపతి నిగ్రహన్ని తీసుకొని వచ్చి మనల్ని హృదయంలో ఉన్న నిజమైన భగవంతుడు దగ్గరికి మోసుకుపోతాడు. మనము నిరంతరం ఆత్మ విచారణ చెయ్యగలిగితే మంచిదే. అలా చెయ్యలేకపోతే మనము చేసుకునే జపం, ధ్యానం, పూజ సత్కర్మ ఏదైనా విడిచిపెట్టకూడదు. అవి నెమ్మదిగా మనకి spiritual strength ని ఇస్తాయి. ఈశ్వర

భక్తి, గురుభక్తి లేకుండా సంసార రతి లోనుండి బయటకిరాలేము. గురువు అనుగ్రహం పొందినప్పుడు మృతంలోనుండి అమృతంలోకి ఒక్క high jump చేసేస్తాము. చావులో నుండి, మరణం లేని స్థితిలోకి జీవుడు ఒక్క గెంతులో చేరతాడు.

కామ, క్రోధ, లోభిత్వాలుఅనే ఇవి మూడు నరక-ద్వారాలు. పెళ్ళి వలన కామముపెరిగిపోతుంది. భర్త కామానికి - భార్య పందిరి; భార్య కామానికి; భర్త పందిరి. ఇద్దరూ కలిసి ఆశలనే లతని పెంచేసుకుంటూ వారి కోరికలు తీర్చుకోవడానికి గుళ్ళూ-గోపురాలు తిరుగుతారు. పరుష-వాక్యాల వల్ల కోపం పెరుగుతుంది. అనుకూల పరిస్థితులు, జరుగుబాటుతనం చూసుకుని గర్వంతో ఎదుట వారిని పరుష వాక్యాలు మాట్లాడుతారు. చెట్టుకి నీరు ఎరువు అందిస్తే, చెట్టు ఎలా పెరుగుతుందో! పరుష వాక్యాలు కోపాన్ని అలా పెంచేస్తాయి. ప్రారబ్ధాన్ని బట్టి ధనం పెరుగుతుంటే, ధనంతో పాటు ఆశ పెరిగిపోతుంది. ధనము  పెరిగిన తరువాత అంతకుముందున్న వితరణ కూడా పోతుంది. ఇవి మూడు జీవుడికి నరకద్వారాలు.

## యజ్ఞ దాన తపస్సులు – జీవన సాఫల్యం

మానవ జన్మ చాలా ఉత్కృష్టమైనది. దానిని దుర్వినియోగం చేయకూడదు eating - mating - sleeping కి మాత్రమే పరిమితమై జీవిస్తే మానవుడికి, జంతువుకి వ్యత్యాసం లేదు.

ఒక కుండలో నీరుపోసి పెడితే కొంతకాలానికి అవి హరించుకుపోతాయి. అలాగే మనకి భగవంతుడు కొంత ప్రాణశక్తిని ఈదేహంలో నింపి పంపుతాడు. ఈ ప్రాణశక్తి పూర్తిగా హరించిపోకముందే మనమెవరిమో మనము తెలుసుకోవాలి., కనీసం ఆ ప్రయత్నంలో ఉండాలి. తనని తాను తెలుసుకోవటానికి మించిన పని ఈసృష్టిలో ఇంకొకటి లేదు. నీవు ఎవరివో నీకు తెలియనప్పుడు బాహ్యంగా ఎన్ని సాధించినా అవన్నీ ఒకటి లేని సున్న అని, తనని ఆశ్రయించిన ప్రతి భక్తుడి మానసాన్ని నాన్నగారు వారి యొక్క హృదయం వైపు guide చేసేవారు. మన ప్రయాణం బయటకు కాదులోపలకని, జీవుని యొక్క గమ్యం హృదయమని తెలియజేసి అక్కడికి ఎలా జీవిస్తే చేరుకోగలమో, ఆ జీవిత విధానాన్ని ఆయన తనబోధ ద్వారా తెలియజేశారు.

ఈ భూమి మీదకు వచ్చిన ప్రతీ మనిషి, జ్ఞాని కూడా ఖచ్చితంగా యజ్ఞ, దాన, తపస్సులని ఆచరించి తీరవలసిందే అని బోధిస్తూ, అలా జీవించి చూపించారు నాన్నగారు.

యజ్ఞము: తన స్వార్థాన్ని ప్రక్కకు పెట్టి, స్వ- పరా బుద్ధిని ప్రక్కకు పెట్టి, పనిని పని కోసమే చేస్తూ, కర్తలేని కర్మ (selfless work) చేస్తే అదే యజ్ఞము.

నాన్నగారి నిజ జీవిత సంఘటనలు: జిన్నూరు వంతెన దగ్గరలో రోడ్డు పక్కకి అన్నపూర్ణ దేవి గుడి ఉంది. అక్కడ ఒక స్వామి, ఆ గుడి ప్రక్కనే ఒక గదిలో ఉండి అటుగా వెళ్ళే యాత్రికులకి ఆతిథ్యం ఇచ్చేవారు. ఆ గది శిథిలమై కాలక్రమంలో పడిపోయేలా ఉంది. అది మళ్ళీ పునర్ నిర్మించడం కోసం నాన్నగారిని శంకుస్థాపన చెయ్యటానికి ఆహ్వానించారు.

ఆ సందర్భంగా నాన్నగారు ఆ గుడికి వెళ్ళి, ఆ గుడి వెనుక ఉన్న ప్రహరీ గోడవద్ద నిలబడి అమ్మా! ఇది చూస్తుంటే ఒక సంఘటన జ్ఞాపకం వస్తోందని అక్కడ

ఉన్న భక్తులతో ఈవిధంగా పంచుకున్నారు: ఒక 20 సంవత్సరాల క్రితం జిన్నూరు గ్రామంలో హరిజనపల్లిలో నివసించే ఒక అబ్బాయికి కలరా వచ్చి మృతి చెందాడు. పాపం తల్లిదండ్రులకి ఆ అబ్బాయి ఒక్కడే సంతానం. ఆ తల్లిదండ్రులు చాలా దుఃఖంతో ఉన్నారు. గ్రామంలో ఎవ్వరూ వారి దగ్గరికి వెళ్ళి ఆశవాన్ని స్మశానానికి తీసుకువెళ్ళే ప్రయత్నం చేయలేదు. మా ఇంట్లో పనిచేసే ఒక వ్యక్తి నావద్దకు వచ్చి, వారికి సహాయం చేయటానికి ఎవరూ రావడం లేదు, వారు ఆ బిడ్డని ఒడిలో పెట్టుకొని దుఃఖిస్తున్నారని చెప్పాడు. వెంటనే అక్కడ ఉన్న towel భుజం మీద వేసుకొని వారి దగ్గరకు వెళ్ళాను. అటుగా వెళుతూ ఉంటే నన్ను చూసిన ఒక అయిదారుగురు పెద్దరాజుగారు మన ఇళ్ళ వైపు వస్తున్నారు ఏమిటని నన్ను అనుసరించారు. ఆ తల్లిదండ్రులతో మీ బిడ్డని నా భుజం మీద వెయ్యండి నేను మోసుకు వస్తాను మీరు నా వెనకాల రండమ్మా! అన్నాను. అప్పుడు అక్కడకి నన్ను అనుసరిస్తూ వచ్చినవారు అయ్యో! రాజుగారు మీరు ఒక్కరే వద్దు... మేము వస్తామని ఆ పిల్లవాడి శవాన్ని ఆ అతికొద్దిమందితో మోసుకుంటూ వచ్చి ఈ ఆలయగోడ అవతల గొయ్యి తీసి ఆ శవాన్ని పూడ్చిపెట్టాము. అని వివరించారు.

సహజంగా మనిషి పని చెయ్యవలసి వస్తే దూడల గుంపులోకి, భుజించటానికి ఎద్దుల గుంపులోనికి చేరతాడు. సాధకుడు అలా ఉండకూడదు. భగవంతుడు మన చేతికిచ్చిన పనిని యజ్ఞ భావనతో చెయ్యాలి. నేర్పుతో, దక్షతతో ఆ పనిని చెయ్యాలి. పని చేస్తూ ఉంటే మన మనస్సులో ఉన్న బలహీనతలు తెలుస్తాయి. ఆ బలహీనతలని సరిచేసుకోవటమే సాధన.

ఒకసారి నాన్నగారు పాలకొల్లులో ఒకరింటికి వెళ్ళారు. అక్కడ ఒక వృద్ధుడు అనారోగ్యంతో, మంచంపట్టి ఉన్నారు. ఆయన నాన్నగారి వద్దకు తరచూ వస్తూ ఉండేవారు. ఆపెద్దాయన మన దగ్గరకు రాలేరు కదా అని, మనమే ఆయన్ని చూసి వద్దామని నాన్నగారు వెళ్ళారు. ఆ పెద్దాయనని పడుకోపెట్టే మంచం ప్రక్కనే ఒక అరటిపండు గెల వ్రేలాడదీసి ఉంచారు. అది ఎందుకు వేలాడదీసి ఉంచారో నాన్నగారికి అర్థం కాలేదు. కొద్దిసేపు ఆయనతో మాట్లాడిన అనంతరం బయలుదేరి నాన్నగారు కారు దగ్గరకు వచ్చారు. అప్పుడు నాన్నగారు అక్కడున్న వారితో ఏంటమ్మా అరటిపండుగెల అలా పెట్టారని అడిగారు. అప్పుడు ఆమె ఏమన్నారంటే, మా

మావగారికి అరటిపళ్ళు అంటే చాలా ఇష్టం. ఆయన తిరిగినంతకాలం రోజు 5,6 అరటిపళ్ళు తినేవారు. ఇప్పుడు మేము ఇస్తుంటే మాకు లెక్క వస్తుందని తినటానికి మొహమాట పడుతున్నారు. అందుకు ఆయనకి అందేలా గెల పెట్టాము. ఆయన శరీరం వెళ్ళిపోతే మాకు పెట్టాలని ఉన్నా పెట్టలేము కదా నాన్నగారు అని అన్నారట. అప్పుడు నాన్నగారు, అమ్మా! ఇది చిన్న పనిగా మనము చూడవచ్చు, కానీ కోటి రూపాయలు ఖర్చుపెట్టి చేసే యజ్ఞం కంటే గొప్ప పని అన్నారు. సహృదయంతో, సద్బుద్ధితో, ప్రేమ వాత్సల్యంతో, చిన్న పని చేసినా యజ్ఞఫలితాన్ని మనకి భగవంతుడు అనుగ్రహిస్తాడు. భగవంతుడు మనము చేసే పనిని చూడడు. పని వెనకాల ఉన్న హృదయాన్ని చూస్తాడు. ఆ సహృదయం మనకి లేకపోతే అది మనము సంపాదించుకోవాలి. అందుకే భగవాన్, రంగన్ తో సహృదయం ఉన్నవారు ఈ ప్రపంచంలో ఎక్కడ ఉన్నా నా సంపదలో వాటాదారులే అన్నారు.

భగవంతుడు మన చేతికిచ్చిన పనిని శ్రద్ధగా చెయ్యాలి. work done in true spirit is also meditation అనేవారు. యజ్ఞ సమానంగా పని చేస్తే ఆ పని చేసే క్రమంలోనే నీకు ధ్యానస్థితి వచ్చేస్తుంది.

ఒకరోజు Hyderabad నుండి ఒక సంపన్నురాలు నాన్నగారి వద్దకు వచ్చారు. వచ్చి, నా సంపద 20 వేలకోట్లు. మీ గురించి ఏదైనా చెయ్యాలని ఉంది. ఈ పాలకొల్లు, జిన్నూరులో నాన్నగారు అనేవారు ఉండేవారని మీ జ్ఞాపకంగా ఏదైనా చేస్తాను, ఏమి చెయ్యమంటారని అడిగారు. అప్పుడు నాన్నగారు ఆ భక్తురాలితో, అమ్మా! నీకు సలహా చెప్పేటంత తెలివితేటలు మా వద్ద ఉన్నాయా? అని నవ్వుతూ, మనము ఎవ్వరము ఇది చెయ్యండని ఎదుటవారికి చెప్పక్కరలేదు. ప్రతీ మనిషికి హృదయంలో అంతర్యామిగా భగవంతుడు ఉన్నాడు. మనము ఏ పని చేసినా, ఏ మాట మాట్లాడినా మన ఇంట్యూషన్ మనకి ఇది చెయ్యండి, ఇది వద్దని చెబుతూ ఉంటుంది. అయితే ఆత్మభాషని, ఆత్మఘోషని ప్రక్కకి పెట్టి మన వాసనకి అనుగుణంగా మనము కొట్టుకుపోతూ ఉంటాము. ఇంట్యూషన్ ఏది చెయ్యమని చెప్తుందో! ఆ మంచిని నువ్వు చేసుకుంటూ వెళ్ళు. అదే నేను నీకు చెప్పే సలహా. దాని గొంతు నొక్కెయ్యకు. అదే మనకి గురువు అని చెప్పారు. అంతర్యామిని మించిన గురువు ఎవరున్నారు? అన్నారు.

రోజులో ఒక గంటో, అరగంటో సాధన చేస్తే, అది సాధన కాదు. మన జీవితాన్ని సాధనామయంగా తీర్చిదిద్దుకోవాలి. ఇతరులు మనల్ని బాగుచెయ్యరు. మనల్ని మనమే బాగు చేసుకోవాలి. మనము బాగుపడటానికి, పాడైపోవటానికి మన త్రికరణాలే కారణం. మన మాట, తలంపు (మనస్సు) మన చేత ఇవి మూడూ ఏకాగ్రంగా ఉండాలి, పవిత్రంగా ఉండాలి. సాధన, సాధన అంటే కంగారుపడిపోకండి every word, every thought, every action must be directed towards God. ఇది జాగ్రత్తగా చూసుకుంటే చాలు. ఇవి మూడూ ప్రపంచం వైపుగా ఉంటే నువ్వు భగవంతుడికి దూరమవ్వుతావు. ఈ మూడు భగవంతుడు వైపుగా, గురువు వైపుగా ఉంటే మనము ఉద్ధరింపబడతాము, పవిత్రులమవుతాము. మనము ఏ మార్గంలో ప్రయాణం చేసినా మన గురువు ఎవరైనా పవిత్రత అనే ద్వారం ద్వారానే హృదయానికి చేరుతాము. మనము మాట్లాడే మాటలు, మనము చేసే పనులు, మనకి వచ్చే ఆలోచనలు మనము పవిత్రమవ్వటానికి సహకరిస్తున్నాయో లేదో చూసుకుంటూ ఉండాలి అదే సాధన.

నిష్కామ కర్మ వలన జీవుడు కడగబడతాడు. జన్మాంతర దోషాలలో నుండి బయటకు రావటానికి సత్కర్మని నిష్కామంగా చేస్తే అది యజ్ఞసమానం. యజ్ఞ హోమగుండంలో సమిధలు వేస్తే ఎలా దగ్ధమవుతాయో, అలా నిష్కామ కర్మ చెయ్యటం వలన జ్ఞానాగ్నిలో జన్మాంతర వాసనలు దగ్ధమవుతాయి. బాబా దగ్గర ధుని ఉంటుంది. బాబాకి అగ్ని అంటే ఇష్టం. ధునిలో పుల్లలని ఎలా వేస్తామొ, అలా మన వాసనలని వేయాలని అర్థం.

మనము ఎదుటివారికి చేసే ఏపనైనా, స్వార్థరహితంగా, తిరిగి వారివద్ద నుండి ఏవిధమైన ఆశింపు లేకుండా - భగవంతుడి అనుగ్రహంలో మన చెయ్యి మంచిలో ఉందనే స్ఫురణతో చేసే ప్రతీపని యజ్ఞ సమానమే. ఆవిధంగా చేసిన పని మనకి జ్ఞానం పొందటానికి కావలసిన యోగ్యతను సంపాదించిపెడుతుంది. జీవుడిని జన్మాంతరదోషాలలో నుండి విడిపించి దోషాలన్నింటిని కడిగివేస్తుంది.

దానం : దానమనే మాటని వాడకుండా, sharing అనే మాటను ఉపయోగించమనేవారు నాన్నగారు. భగవంతుడు నీకు ఏదైతే ఇచ్చాడో, దానిని నీతోటి వారితో పంచుకో. కుడి చేతితో ఇచ్చినది ఎడమ చేతికి తెలియకూడదు.

దృతరాష్ట్రుడు నేను చేసిన పుణ్యమంతా ఏ విధంగా ఖర్చు అవుతుందని సంజయుడిని అడుగుతాడు. అప్పుడు సంజయుడు, నువ్వు చేసిన పుణ్యకర్మలన్నింటిని వచ్చిన వారందరికీ, కనిపించిన వారందరికీ చెప్పకు. అలా చెప్పితే ఖాళీ అవుతుందన్నాడు. అంటే మనము చేసిన మంచి - మనకి spiritual strength గా మారాలి. మనము తీసుకునే ఆహారం మనకి జీర్ణమైతే, దాని సారం మన ఒంటికి పడుతుంది. అది జీర్ణం కాకపోతే, వికారంగా మారి వాంతులు అవుతాయి. మనము చేసిన దానం, చేసిన మంచి మర్చిపోవాలి. మర్చిపోకుండా అదే చెప్పుకుంటూ తిరిగితే దానివల్ల మనకి ఆధ్యాత్మికబలం పెరగదు. మనము ఎవరికి మంచి చేస్తున్నామో, వారి పట్ల మనకి ప్రేమ, వాత్సల్యం ఉండాలి.

ఒక అమ్మాయికి, medicine entrance లో మంచి seat వచ్చింది. ఆ అమ్మాయిని చదివించే స్థోమత తన తల్లిదండ్రులకు లేదు. నాన్నగారికి ఆ విషయం తెలిసి నువ్వు చదువుకోమ్మా! మేము చదివిస్తామన్నారు. ఆ అమ్మాయికి ఫీజు నిమిత్తం నాన్నగారు కొంత ధనమిచ్చి - లెక్కపెట్టుకోమ్మా అని చెప్పి, ఈ సంవత్సరం హాస్టల్ ఫీజుతో కలిపి 96 వేలు అవుతుందన్నావు కదా అన్నారు. లెక్క పెడితే పదివేలు ఎక్కువ ఉన్నాయి. ఆ అమ్మాయి, నాన్నగారితో ఇందులో ఎక్కువ ఉన్నాయని చెప్పి, ఆ ఎక్కువ ఉన్న మొత్తాన్ని నాన్నగారికి తిరిగి ఇచ్చేసింది. అప్పుడు ఆ అమ్మాయితో నాన్నగారు అమ్మా! నువ్వు ఇప్పుడు డాక్టర్ చదువుతున్నావు - పిల్లలందరూ కాలేజీకి మంచి దుస్తులు ధరించి వస్తారు. నువ్వు కూడా మంచివి వేసుకుని వెళ్ళాలి కదా! ఒక నాలుగు జతలు బట్టలు కొనుక్కుంటావని ఎక్కువ ఇచ్చాను అన్నారు. పక్కనే ఉన్న అమ్మాయి - తండ్రి కంటి వెంట కన్నీరు వచ్చింది. బహుశా తన కూతురి గురించి తన తండ్రి కూడా ఎప్పుడూ అలా ఆలోచించి ఉండరేమో!. గురువు యొక్క ప్రేమ అటువంటిది.

ఒకసారి జిన్నూరు హాలులో భక్తులందరూ కూర్చుని ఉన్నారు. భక్తులందరినీ నాన్నగారు వాత్సల్యంతో చూస్తున్నారు. అప్పుడే హైదరాబాద్ నుండి ఒక తల్లి, కూతురు వచ్చారు. కూతురు మెడ ఏమీ లేకుండా బోసిగా ఉంది. నాన్నగారు ఆ అమ్మాయిని అలా చూసి, అకస్మాత్తుగా లోపలకెళ్ళి చిన్నడబ్బా తెచ్చారు. భక్తులందరూ వెళ్ళిపోయిన తరువాత ఆ అమ్మాయిని ఉండమని, ఆ అమ్మాయి చేతిలో డబ్బా పెట్టి నీవు గొలుసు

చేయించుకుని వేసుకో. అందరి మెడలో ఉన్నాయి నీ మెడలోనే ఏమీ లేవన్నారు. ఆ డబ్బాలో బంగారపు బిళ్ళలు ఉన్నాయి. నాన్నగారు ఎన్నో స్మశానాలని బాగు చేసుకోవటానికి సహాయసహకారాలు అందించారు. స్మశానమంటే మనకి తల్లి ఒడివంటిది. ఒడిలో దాచుకొనే తల్లి స్మశానం. స్మశానం మనకి second mother అందుకు మనము దానిని పరిశుభ్రంగా ఉంచుకొని, సౌకర్యవంతంగా పెట్టుకోవాలి అనేవారు. నాన్నగారి జీవితమంతా భక్తులు అన్నవస్త్రాలకి లోటు లేకుండా ఉండాలి, వారికి ఏదైనా లోటు ఉంటే దానిని ఎవరి ద్వారా భర్తీ చేయవచ్చు అని చూసి ఆలోటుని భర్తీచేసి వారందరినీ ఒడ్డుకి తీసుకువచ్చేవారు.

రామకృష్ణులు It is glorious to help even one man అన్నారు. ఆయన శిష్యుడైన వివేకానందుడు తోటివారికి సహాయం చేయటానికి అవసరమైతే నేను కుక్కగా మళ్ళీ పుట్టడానికి కూడా సిద్ధమే అన్నారు.

జ్ఞానేశ్వర్ ఏమన్నారంటే, మీరు చేసిన మంచి, మీరు చేసిన దానం, మీరు చేసిన సేవ తరచూ ఇతరులకి చెబుతూ ఉంటే - అదంతా కూడా పాపముగా మారిపోతుందన్నారు. అంటే, పుణ్యమంతా పాపముగా మారిపోతుంది. అందువలన సాధకుడు జాగ్రత్తగా ఉండాలి.

ఒకసారి రామకృష్ణుడిని వివేకానందుడు ఏమని అడుగుతాడంటే, ఓ రామకృష్ణ దేవా! అందరూ ఏదో ఒక మార్గాన్ని పట్టుకుని దాని గురించే గొప్పగా చెప్తారు మీరేమిటి అన్ని మార్గాలు సమానంగా చెప్తున్నారు. భక్తి, జ్ఞాన, ధ్యాన, కర్మ మార్గాలలో వ్యత్యాసం చూపించట్లేదు అని అడిగాడు. అప్పుడు రామకృష్ణులు, నరేన్ నువ్వు నన్ను పట్టేసుకుంటున్నావు ఏమిటి? నేను నీకు దొరికిపోతున్నాను అని, అన్ని మార్గాల గమ్యం ఒక్కటే. మార్గాలన్నీ ఒకదానికొకటి సహకరించుకుంటాయి కానీ విరుద్ధం కాదని చెప్పారు. మనకి ఉన్న వేరుబుద్ధి వలన వేరుతనంతో విడదీసి చూస్తాము అదే మాయ. మనము ఏ మార్గంలో ప్రయాణించినా మనకి sincerity, dedication, determination ఉండాలనేవారు నాన్నగారు.

ఒకసారి కొంతమంది నాన్నగారిని interview చేసారు. ఆ interview లో, నాన్నగారిని మీ వద్దకు ప్రతీరోజు చాలామంది భక్తులు వస్తున్నారు - వారు ఎందుకు

వస్తున్నారు? మీ వద్ద ఏమి పొందుతున్నారని అడిగారు. అప్పుడు నాన్నగారు, అవును.మావద్దకి వందల మంది భక్తులు రోజూ వస్తున్నారు - వారంతా జ్ఞానం కోసమే రారు కొందరు లోపల అశాంతి భరించలేక శాంతిని ప్రసాదించమంటారు. మరికొందరు ఆర్థిక బాధలు చెప్పుకుంటారు, ఇంకొందరు సమస్యలు చెబుతారు. బహుకొద్దిమంది జ్ఞానం కోసం వస్తారు. ఎవరు దేని కోసం వచ్చినా దాన్ని మానుండి తీసుకొని వెళతారు. వారు సమస్యలు చెప్పుకుంటూ ఉంటే, మేము వింటాము. ఆ క్రమంలోనే ఆ సమస్యల నుంచి వారు 50 శాతం బయటకు వచ్చేస్తారు. మిగతా 50 శాతం ఇంటికెళ్ళి సరిచేసుకుంటారు. వారి లోపల ఉన్న అశాంతిని పీల్చుకుని, శాంతిని షేర్ చేస్తాము. మాలో ప్రవహించే సత్వగుణం, సాత్విక సంపద నా సమక్షంలో ప్రవహించే శాంతి తరంగాల్ని, కాంతి తరంగాల్ని వారు పీల్చుకొని అనుభవించి మా వద్ద నుండి ఆత్మవిశ్వాసంతో వెళతారు. ఇదంతా మేము చెయ్యాలని చెయ్యము. automatic divine action అది. మా సమక్షంలో వారు సహజంగానే అది పొందుతారు అన్నారు.

పప్పుకి, ఉప్పు ఎలా రుచిని తెస్తుందో! అలా ఈ సృష్టికి మహాత్ములు, సత్పురుషులు మాధుర్యాన్ని తీసుకువస్తారు. మన జీవితంలో మనము కొంచెం స్వార్థాన్ని, మమకారాన్ని తగ్గించుకుని భగవంతుడు మనకు ఇచ్చిన దాన్ని తోటి వారికోసం పంచమన్నారు. ఆ పంచడమనేది అత్యంత సహజంగా మనము ఆహారాన్ని ఏవిధంగా భుజిస్తున్నామో, ఆహారాన్ని ఆరగించిన తరువాత, అది తిన్నామని ఏ విధంగా అనుకోమో, అలాగే ఇతరులకి ఏదైనా చేసినా చేసామని అనుకోకుండా సహజ స్వభావంగా చేసుకుని జీవించండి అనేవారు.

తపస్సు :తపస్సు అంటే ఎండింపచేయటం. మనలో ఉన్న సంస్కారాలని, బలహీనతలని గుర్తించి వాటికి food supply లేకుండా ఎండింప చెయ్యటమే తపస్సు. ముందు మనకి మనలో ఉన్న బలహీనతల పట్ల ఏహ్యత రావాలి, అందులో నుండి బయటికి రావాలనే తపన ఉండాలి. ఆ తపన నిజమైతే గురువు గ్రేస్ ని reveal చేస్తాడు.

హైదరాబాదులో ఒక భక్తురాలు చాలా కాలం నుండి నాన్నగారి దగ్గరకు వస్తూ ఉండేవారు. అలాగే సత్సంగాలకి కూడా హాజరయ్యేవారు. సత్సంగమయిన

తరువాత ఆమె club కి వెళ్ళి పేకాట ఆడేవారు. ఒకరోజు నాన్నగారు ఆ భక్తురాలు ఇంటికి వెళ్ళారు. ఆ భక్తురాలు, నాన్నగారితో చాలా సిన్సియర్ గా నేను పేకాట లోనుండి బయటకు వచ్చేయ్యాలి, ఈరోజు నుండి పేకాటకు వెళ్ళకూడదని అనుకుంటున్నాను. దానికి మీ అనుగ్రహం ఉండాలి నాన్నగారు అన్నారు. నాన్నగారు నవ్వుతూ, అమ్మా! నీ ఆధ్యాత్మిక జీవితానికి అది అడ్డుగా ఉందని - అది నీవు విడిచిపెట్టాలనుకుంటున్నావు. ఎప్పుడైతే నీవు సిన్సియర్ గా అనుకున్నావో, అప్పుడే 50 శాతం నీవు అలవాటులోనుండి బయటకు వచ్చేసినట్టు. మిగతా 50 శాతం గురువు అనుగ్రహం నిన్ను తిరిగి అందులోకి వెళ్ళకుండా రక్షిస్తుంది. నువ్వు, నేను పేకాట మానేశాను అనే స్ఫురణ కూడా లేకుండా - అత్యంత సహజంగా అందులో నుండి విడుదల పొందుతావు అన్నారు. ఆ మరుసటి రోజు నుండే ఆమెకు ఆకోరిక తిరిగి తలెత్తలేదు. అంటే ఆకోరికను నిగ్రహించుకోవడం కాదు, అసలు ఆ కోరికే కలగలేదు. గురువు యొక్క అనుగ్రహం ఆ వాసనని శేషము లేకుండా వేరుతో సహా పెకలించి పడేసింది. పెద్ద గడ్డిమేటు చిన్న నిప్పు రవ్వకి లోకువ. అలాగే ఎంత పెద్ద వాసన అయినా, గురువు అనుగ్రహమనే అగ్నిలో దహించబడవలసిందే.

తపస్సు అంటే, ముక్కు మూసుకొని అడవికి వెళ్ళి కూర్చోవటంకాదు. క్రూరమృగాలు లాంటి మనుష్యుల మధ్యలో, స్వార్థము - మోహమే పరమావధిగా చేసుకొని జీవించే వ్యక్తుల నడుమ కూడా మనము - మన హృదయంలో ఉన్న అంతర్యామినే గమ్యంగా పెట్టుకొని ఆయన అనుగ్రహాన్ని పొందటమే గోల్ గా చేసుకుని జీవిస్తూ... ప్రపంచమంతా మనకి విరోధమైనప్పటికీ, సత్యాన్ని విడిచిపెట్టకుండా జీవించటమే తపస్సు. మన మాట, చేత, తలంపు ఇవన్నీ భగవంతుడు వైపుగా పెట్టుకొని జీవించటమే తపస్సు. దానికి విరుద్ధమైనవి నీకు ఎంత nearest and dearest అయినా దూరం జరిగిపో. యజ్ఞ, దాన, తపస్సులు జ్ఞానికి సహజం. మనము వాటిని practice చెయ్యాలి. జ్ఞానిలో అవి ఎలా సహజంగా ఉంటాయో, మనము నాన్నగారిలో చూసాము.

ఒక భక్తురాలికి షుగర్ వచ్చింది. ఆ భక్తురాలి స్నేహితురాలు నాన్నగారితో ఆమెకు షుగర్ వచ్చిందని చెప్పింది. నాన్నగారు నవ్వుతూ, షుగరు జబ్బు కాదమ్మా! అది మనకి క్రమశిక్షణ నేర్పుతుందన్నారు. శరీరం వద్దన్నవి తినకపోతే ఆరోగ్యం.

భగవంతుడు వద్దన్నవి విడిచిపెట్టేస్తే మోక్షం అన్నారు. ఇది సహజ విద్య. ఈ సహజత్వం నాన్నగారు వంటి జ్ఞానుల వద్ద తప్పించి సృష్టిలో ఎక్కడ చూద్దామన్నా దొరకదు.

మోక్షం అంటే విడుదల, ఏ ఇష్టాఅయిష్టాలు, ఏ వాసనలయితే నీ లోపలున్న అంతర్యామిని నీకు లభించకుండా అడ్డు వస్తున్నాయో, వాటిని గ్రహించు. అవి ఎలా గ్రహిస్తావంటే, గురువు చెప్పిన బోధ అనే జ్ఞానదీపంతో మనల్ని మనము పరిశీలించుకుని వాటిని విడిచి పెట్టెయ్యటమే తపస్సు. వాటిలో నుండి విడుదల పొందటమే మోక్షము.

My dear devotees "As long as I live, so long I do learn". జీవితం పొడుగునా నేర్చుకుంటూనే ఉంటాను అన్నారు రామకృష్ణుడు. మనము జీవితాన్ని సాధనామయంగా తీర్చిదిద్దుకోవాలి. ప్రతీ మనిషికి, lower life, higher life అని రెండు ఉంటాయి. దేహానికి, ఇంద్రియాలకి, మనస్సుకి పరిమితమై జీవించే వారిది lower life. Universal consciousness ని గమ్యంగా పెట్టుకుని దానిలో absorb అవ్వటమే గోల్ గా చేసుకుని జీవించే వారిది higher life.

ఆత్మసంపద వేరు, భౌతిక సంపద వేరు. భౌతిక సంపదల వల్ల గౌరవాలు, ఊరేగింపులు బాగుంటాయి. కానీ అవి మూన్నాళ్ళముచ్చటే. ఆత్మసంపద వల్ల ఆత్మ జ్ఞానం కలుగుతుంది. మన హృదయంలో ఉన్న భగవంతుడు మన మనస్సుని ఆయన వైపు తిప్పుకుంటే లోచూపు కలుగుతుంది. లోచూపు వల్ల గుహేశుడి దర్శనం కలుగుతుంది. భౌతిక సంపదలు బాహ్య చూపునే కానీ లోచూపుని ఇవ్వవు.

ఆచార్యులవారు, శివానందలహరిలో ఈశ్వరుడిని ప్రార్థిస్తూ ఓ ఈశ్వరా! ఈ శవం ఏ ప్రాంతంలో ఉన్నా, నా మనస్సు మాత్రం నీ పాదాలకి కట్టివేయబడి ఉండాలి. ఓ విశ్వేశ్వరా! నా ముఖంలో ఎన్నడూ అవినయాన్ని తొంగి చూడనివ్వకు. అవినయం, అసహనం ఇవి రెండు నా స్వరూపానికి నన్ను దూరం చేస్తాయని అంటారు.

జీవితంలో ఎటువంటి సంఘటనలు జరిగినా, అవి ఎంత చేదుగా ఉన్నప్పటికీ సహనం ఉన్నవాడికి, వివేకం ఉన్నవాడికి అవి కూడా మధురంగానే అనిపిస్తాయి. భక్తుడికి కష్టాలు వస్తాయి, భక్తులు కాని వారికి కష్టాలు వస్తాయి. భక్తి లేనివాడు

భరించలేకపోతున్నాను అంటాడు. భక్తుడు భగవంతుని ప్రసాదం అని సంతోషంగా అనుభవిస్తాడు. ఆకష్టాన్ని ఇష్టంగా అనుభవించేస్తే అది మళ్ళీ జన్మకు రిపీట్ అవ్వదు. దానిని ఏడుస్తూ అనుభవిస్తే, పునర్జన్మకి రిపీట్ అవుతుంది. మనకున్న బలహీనతలు ఏమిటనేది చూసుకోవాలి.

మనము ఏ దేవాలయానికి వెళ్ళినా, ఏ పుణ్యక్షేత్రానికి వెళ్ళినా మనలో ఉన్న బలహీనతల్ని తొలగించమనే ప్రార్థించాలి. మట్టినేలని దున్నితే పంట చేనుని వేయవచ్చు. సిమెంటు నేలమీద పంట చేనుని వెయ్యలేము. అలాగే సరళ హృదయం లేనివాడికి భక్తి deepen అవ్వదు. శ్రీకృష్ణ చైతన్యులు ఈశ్వరపురి నుండి నామం తీసుకున్నారు. వారిపట్ల భక్తితో, కృతజ్ఞతతో వారి పాదాల నుండి కొంత ధూళిని తెచ్చుకుని తనవద్ద దాచుకున్నారు. గురువు యొక్క, పరమాత్మ యొక్క పాదధూళి కోటితీర్థాల జలముకంటే పరమపవిత్రమైనది అన్నారు చైతన్యులు.

"Leave your body to destiny prarabda. do your duty with love, live with a smiling face". అనేవారు నాన్నగారు. తిరువళ్ళువర్ అనే తమిళ saint ఉండేవారు. ఆయన ఏమనేవారంటే, మోక్షం, జ్ఞానం ప్రక్కన పెట్టండి. ముందు మనిషి భూమిమీద ఎలా జీవించాలో, అలా జీవించండి. మోక్షమంటే వచ్చేది - ఇచ్చేది కాదు. మీ జీవిత విధానం ప్రోపర్ గా ఉంటే మీ జీవిత విధానంలో ఒక అపూర్వం పుడుతుంది అదే మోక్షం అనేవారు.

పెద్ద,పెద్ద సాధనలు మనము చెయ్యలేము. మనము చేయగలిగినవి day-to-day life లో Implement చేసుకోవాలి అని తిరువళ్ళువర్ అంటారు. ఎప్పుడూ చిరునవ్వుతో ఉండు - ముఖానికి చిరునవ్వే అందం, అదికూడా సంపదే.

ప్రపంచంలో మనుషులు ఎలా ఉన్నా, నీ ముఖం మీద చిరునవ్వుని పోగొట్టుకోకు.

1. loving speech - ప్రేమ పూరితంగా మాట్లాడు.నీ మాటలు ఇతరుల హృదయాన్ని గాయం చేసేవిగా ఉండకూడదు. నీమాట ప్రేమని, ఆప్యాయతని పంచేదిగా ఉండాలి.
2. Generous hands - నువ్వు చేతులతో చేసే పని స్వార్థపూరితంగా

ఉండకూడదు. నీతోటి వారిని కూడా దృష్టిలో పెట్టుకుని వారి క్షేమం కూడా కోరి పనిచెయ్యి.

3. Blissful eyes - నీ కళ్ళు, నీ చూపు చల్లగా ఉండాలి.

4. Compassionate heart - దయగల హృదయం కలిగి ఉండు. ఇతరులలో ఉన్న వాసనలని, సంస్కారాలని అసహ్యించుకోవచ్చు కానీ వ్యక్తులని కాదు - వ్యక్తులపట్ల దయ కలిగి ఉండు. వారు - వారి వాసనల చేతులో బందీలై ఉన్నారు తప్ప వారు పవిత్రులే.

వీటిని జీవుడు భూమ్మీద ఉన్నంత కాలం ఆచరిస్తూ ఉంటే నెమ్మదిగా ఆజీవుడు పక్వానికి వచ్చి, ఉద్ధరింపబడతాడు. వాడే పవిత్రుడవుతాడు. ఈ భూమ్మీద మనము సంపాదించుకోవలసింది పవిత్రత. పవిత్రుడు మోక్షంకోరుకొనక్కర్లేదు. మోక్ష సుఖమే వాడిని వరిస్తుందన్నారు తిరువళ్ళువర్.

దేహాన్ని ప్రారబ్ధానికి విడిచిపెట్టండి, కర్మని అనుభవించటానికే శరీరం వచ్చింది. ఆ శరీరం ఏ కర్మని అనుభవించవలసి ఉందో, అది ప్రారబ్ధ రూపంలో అనుభవిస్తుంది. దానివైపు మన ముఖాన్ని పెట్టకూడదు. ఎంతవరకు అనుభవించాలో అంతవరకు ఆదేహం ప్రారబ్ధాన్ని అనుభవించి తరువాత రాలిపోతుంది. దేహాన్ని ప్రారబ్ధానికి విడిచిపెట్టేసి - భగవంతుడు ఏరోజు ఏపని మన చేతికి ఇస్తే ఆ పనిని మనము ఇష్టంగా, ఆనందంగా, ప్రేమగా చెయ్యాలి.

పనిని భగవదార్పితంగా చెయ్యాలి. పని యొక్క ఫలితాన్ని భోగించాలని, భోగప్రవృత్తితో పని చేసేవాడు కూలివాడు - వాడు యోగి అవ్వలేడు. సమానబుద్ధి యోగంతో సమానము. పని బాగా చెయ్యటం కాదు దాని ఫలితం మీద కాంక్ష లేకుండా చెయ్యటమే యోగం. పని యొక్క ఫలితాన్ని భోగిస్తే అది జీవుడికి భోగవాసనగా మారి వేల జన్మలకు కారణమవుతుంది.

నాన్నగారు నర్సాపురం లో బాబా గుడికి వెళ్ళారు. అక్కడికి ఒక వృద్ధుడు వచ్చారు. ఆయనకి ఆవులంటే చాలా ప్రేమ. వాళ్ళింట్లో ఆవుకి బిడ్డ పుట్టింది. ఆయన దూడ తన తల్లి దగ్గర పాలు తాగిన తరువాత మిగిలినవి మాత్రమే మనము తీసుకోవాలనేవారు. అది ఆయన హృదయపు ఔనత్యం కానీ ఇంట్లో వారు అది

సహించేవారు కాదు. ఆ తల్లి ఆవు, పాలుని బిడ్డకోసం ఇస్తోంది. ఆ బిడ్డ  ఆకలి తీరకుండా మనము దాన్ని పక్కకినెట్టి, పాలు తెచ్చేసుకోవటం అధర్మం. అందుకు అది తాగిన తరువాత మిగిలినవే ఇంటికి తెస్తాను అన్నారు. ఇటువంటి ధర్మాత్ములుకి సాధనలతో పనిలేదు, ఎవరి హృదయం ధర్మంతో నిండి ఉందో! వారిని జ్ఞానం అడగకుండానే అనుగ్రహిస్తుంది. పనిని లోకం చూస్తుంది, హృదయాన్ని భగవంతుడు చూస్తాడు.

శరీరానికి ఉన్న వంకరలు స్మశానంలో పోతాయి. కానీ బుద్ధికి ఉన్న వంకర్లు పోవు. నారదుడు, వాసు దేవుడితో అంటాడు, రామ నామము వల్ల బుద్ధికి వంకర్లు పోతాయి. దూడలను యజమాని పాకలోకి ఎలా తోలుకి వెళ్తాడో, అలా మహాత్ముల మాటలు మనల్ని ఆధ్యాత్మిక హృదయంలోకి తీసుకెళ్తాయి కాబట్టి మహాత్ముల సాంగత్యంలో శ్రవణం చెయ్యాలి.

ప్రహ్లాదుడిని గురువులు ఏది విద్య అన్నారు.హరి పట్ల భక్తి కలిగి ఉండటమే విద్య, అదే ప్రేమ, అదే భక్తి అన్నాడు.

అత్యంత దుర్లభమైన మానవజన్మని ఎత్తి, భగవత్ సాక్షాత్కారం పొందటానికి ప్రయత్నం చెయ్యని జన్మ నిరర్థకము. ప్రహ్లాదుడు ఏమంటాడంటే, "చదవవలెను, చదవవలెను చావులేని చదువు చదవవలెను". అదే సత్య జ్ఞానము. సత్యములో కరిగిపోవటానికి జీవుడికి వాడిలో ఉన్న జీవ లక్షణాలనే మలినాలని కడుక్కోవటానికి, తనను తాను పవిత్రం చేసుకోవటానికి సహకరించే విద్యయే సత్య జ్ఞానము. దానిని గురువు ముఖతః పొందాలి.

తులసీదాసు తన జీవితంలో, తల్లిదండ్రుల ప్రేమని కాని, స్నేహితుల ప్రేమని కానీ రుచి చూడలేదు. భార్య రత్నావళి దగ్గరే రుచి చూసాడు. ఒకసారి ఆమె తులసీదాసుకి చెప్పకుండా పుట్టింటికి వెళ్ళుతుంది. ఆమె కోసం తులసీదాసు కూడా వెళ్తాడు. అప్పుడు ఆయన భార్య, తులసీదాసుని చూసి,కోపంతో నీకు Human flesh మీద ఉన్న ప్రేమ, రాముడి మీద ఉంటే జ్ఞానం వస్తుంది అంటుంది. ఆమాట వినగానే, నువ్వు చెప్పింది నిజమే, అని వెంటనే అక్కడ నుండి వెనుదిరిగాడు. అంటే ఆవిడ మాట ఆయన లోపల ఉన్న అజ్ఞానానికి నిప్పు పెట్టింది. ఆ నిప్పు అజ్ఞానాన్ని దహించివేసింది. అందువలన ఆయన saint అయ్యాడు. realization పొంది, రాముడిలో ఐక్యమయ్యాడు.

సంత్ జ్ఞానేశ్వర్ ఏమంటారంటే, నేను అక్కడ మంచి చేశాను, ఇక్కడ మంచి చేశాను అని చెప్పుకుంటూ తిరిగితే మన మంచి చెడుగా మారిపోతుంది. మన ధర్మమంతా అధర్మంగా మారిపోతుంది. మారిపోయినా పరవాలేదు, అదనంగా

దేహాభిమానం పెరిగిపోతుంది. మనకి లోపల స్వరూప సుఖం పొందాలనే తపన తీవ్రంగా కలిగితే మనకి భోగాల పట్ల విరక్తి కలుగుతుంది. మాంసము ఎంత ప్రీతిగా తినేవారైనప్పటకీ, కుళ్ళిపోయిన మాంసము చూస్తే ఏవిధంగా వాడి మనస్సు వాలదో, అలా మన తపస్సు నిజమైతే భోగ వాసన మీద కూడా మన మనస్సు వాలదు.

చిన్న పనిని కూడా పెద్ద హృదయంతో చెయ్యాలి. జ్ఞానేశ్వర్ చెల్లెలు ముక్తా బాయ్ great saint. ఆమె అంటారు, దేవుడు, దెయ్యం గొడవ ప్రక్కకి పెట్టండి. మీరు చేత్తో చేసే పనే దేవుడు. గిరి ప్రదక్షణ, గుడికి వెళ్ళటం ఇవన్నీ భగవంతుడు పని అనుకుంటున్నాము. జీవితంలో మనము చేసే ప్రతీ పని భగవంతుడే, ఆ స్థాయికి మనము ఎదగాలి అనే వారు ముక్తాబాయ్.

మహారాష్ట్రలో ఒక పాండురంగడి భక్తుడు ఉండేవాడు. వాడు ఒకరోజు, ఒక చిన్న రొట్టెముక్క మరియు కొంచెం తేనె తెచ్చుకున్నాడు. అది తిందామనేలోపు ఒక కుక్క వచ్చి, రొట్టెను లాక్కొని పారిపోయింది. వీడు దాని వెనకాల పరిగెత్తి దాన్ని పట్టుకుని వాడి వద్ద ఉన్న తేనేను కూడా దాని దగ్గర పెట్టి, దాని తలని నిమిరి వట్టి రొట్టె తింటే, గొంతు పట్టేస్తుంది అమ్మా! తేనేలో ముంచి పెడతానని తేనెలో ముంచి తినిపించాడు. ఆ భక్తుడి హృదయాన్ని పరీక్షిందామనుకున్న భగవంతుడు ఓడిపోయాడు.

చిన్మయానంద గురువు తపోవన మహారాజు ఉత్తర కాశీలో ఉండేవారు. ఆయనకి క్యాన్సర్ వచ్చింది. ఆయనకి వైద్యం చెయ్యించటానికి ఢిల్లీ తీసుకువెళ్దాం అన్నారు చిన్మయానంద. వైద్యం చేయించుకోవడం వలన నా శరీరం అదనంగా వుంటుంది అని నేను అనుకోవటం లేదు. వైద్యం వద్దు, ఆ ధనం సమాజ క్షేమం కోసం ఉపయోగించు అన్నారు.

తుకారాం మొదటి భార్యకి పిల్లలు లేరని, తల్లిదండ్రుల పోరుపడలేక రెండో వివాహం చేసుకుంటాడు. మొదటి భార్య కృష్ణ భక్తురాలు. రెండవ వివాహం చేసుకున్న తరువాత, పరిస్థితులు తిరగబడి పేదరికము వచ్చింది. మొదటి భార్య ఆ పేదరికంలో ఆకలి బాధ తట్టుకోలేక కృష్ణుడిని వదిలేసి, అన్నం, అన్నం అని కలవరిస్తూ చనిపోయింది. తుకారాం, వివాహం చేసుకుని అన్నం కూడా పెట్టలేకపోయాను రంగా, ఇటువంటి పరిస్థితుల పీడలో కూడా నువ్వు మరుపు రాకుండా నువ్వే చెయ్యాలని ప్రార్థించాడు.

మీరాబాయి ఏడవ సంవత్సరంలో పెళ్ళి చేసుకుని అత్తవారి ఇంటికి వెళు తూ, O mother, O mother I want neither ornaments nor garments i want only the idol of my beloved Krishna and I live for my lord Krishna. ఆ ప్రేమ, ఆ భక్తి జన్మాంతరం నుండి వచ్చింది. నువ్వు ఈ జన్మలో చేసినది మరుజన్మకు continue అవుతుంది. అది ఆమెకు విగ్రహం కాదు, భగవంతుడే.

మధ్వాచార్యులు అంటారు, పూర్వజన్మల నుంచి వచ్చిన వాసనలు, ఇప్పుడు మనల్ని మనము బాగు చేసుకోవాలి అనే తపన ఇవి రెండు గొర్రె - పొట్టేలు కొట్టుకున్నట్లు కొట్టుకుంటాయి. మనము వాసనని విడిచి పెట్టాలి అనుకున్నప్పుడు దాని బలం చూపిస్తుంది. మనము చేసే సాధనకి, అంతకు మించిన strength ఉంటే వాసనను జయిస్తాము. మన సాధనలో sincerity ఉంటే, గురు అనుగ్రహం reveal అవుతుంది. వాసనని శేషం లేకుండా తొలగిస్తాడు గురువు.

తుకారాం అంటారు, గంగా నదిలో నీటిని పానం చేసినా, స్నానం చేసినా పుణ్యం వస్తుందంటున్నారు. అయితే భగవంతుడి కోసం శరణాగతి చెంది ఎవరైతే రెండు కన్నీటి బొట్లు విడుస్తున్నారో, ఆ కన్నీరు గంగాజలము కంటే పవిత్రమైనది.

తులసీదాసు, నా దేవుడు గుణాలతో కూడిన అయోధ్య రాముడు అన్నారు. అంటే, ''సగుణ బ్రహ్మ''. జన్మాంతర అనుబంధాన్ని బట్టి, ఎవరు ఏ పద్ధతిలో ఆరాధించినా తరిస్తారు. ఏమార్గమైనా sincerity ముఖ్యం.

సూరదాసు అంటారు, లౌకికుల మధ్య వ్యసనాలతో, ఆడంబరాలతో బ్రతికే కంటే భక్తి భావాలతో ఒంటరిగా జీవితము గడపటమే శ్రేయోదాయకం అంటారు.

మలయాళ స్వామి వారు: ''భావ శుద్ధియే జ్ఞాన సిద్ధి అన్నారు''. మన భావాలు ఎలా ఉన్నాయో, చూసుకుంటే మనము ఎలా ఉన్నామో మనకి తెలుస్తుంది. సద్భావాలు లేకపోతే మనకి జ్ఞానం కలగదు.

be calm, be quiet, be cool that is the essence of Tukaram. తుకారాంని ఆయన భార్య,పిల్లలు కూడా కొట్టేవారు. ఆ గ్రామంలో ప్రజలందరూ కూడా ఆయనని లోకువుగా చూసేవారు. అవన్ని కూడా ఎక్కడా రియాక్షన్ లేకుండా భరించాడు. అందుకే ఆయనకు పుష్పక విమానం వచ్చింది.

ఛత్రపతి శివాజీ గురువు, సమర్థ రామదాసు. అయన ఒక రోజు భిక్షకి వెళ్ళారు. ఒక ఆమె, ఆవుపేడతో పిడచగుడ్డ పెట్టి ఇల్లు అలుక్కుంటోంది. ఆమెను సమర్థ రామదాసు భిక్ష అడిగారు. ఆవిడ ఆ పిడచగుడ్డని రామదాసు మొహం మీదకు విసిరింది. రామదాసు ఏమీ మాట్లాడకుండా, ఆ పిడచగుడ్డని భద్రంగా తెచ్చి శుభ్రంగా ఉతికి ఆరేసి దానికి ఉన్న ఒక్కో పోగుతీసి, ఆ పోగులతో ఒత్తు చేసి రాముడికి దీపారాధన చేసి, ఓ రామా! ఆ అమ్మ హృదయం ఎంత అశాంతిగా ఉందో, ఈ ఒత్తు ఆమెదే కానీ నాది కాదు. ఈ ఒత్తు నీకు ఉపయోగపడింది రామా, ఆ తల్లి మనస్సుని శాంతితో తడుపు తండ్రి అని ప్రార్థించాడు. అది గురువు చేసే పని.

నరసింహ మెహతా గుజరాత్ వారు. వాళ్ళు ఇద్దరు అన్నదమ్ములు. వారి తల్లిదండ్రులు పోతే, వదినగారు నరసింహ మెహతాని తిట్టి, పనీపాట లేనివాడికి తిండి పెట్టడం ఎందుకు అనేది. నాలుగైదు రోజులు తిని, మౌనంగా ఇల్లు విడిచిపెట్టి వెళ్ళి, గొప్ప కృష్ణ భక్తుడు అయ్యాడు. ఆయన రాసిన కీర్తనలు గాంధీగారు రోజు పాడుకునేవారు. ఆయనకు గొప్ప పేరు వచ్చేస్తుంది. ఒకరోజు అన్నగారు వచ్చి ఇంటికి వచ్చేయమని అంటారు. నువ్వు ఎవరినైతే ఇంటికి రమ్మని అంటున్నావో, వాడు ఇక్కడ లేడు అంటారు భగవంతుడు ఏ సంఘటన ద్వారా నిన్ను హృదయం వైపు తిప్పుతాడో అది నీకు తెలియదు.

గాంధీకి గోల్ ఎంత ముఖ్యమో, means కూడా అంతే ముఖ్యం. goal ఎంత పవిత్రంగా ఉందో, అది సాధించేప్రయత్నం కూడా అంతే పవిత్రంగా ఉండాలి.

ఆలోచించేది మనస్సు, నిర్ణయం తీసుకునేది బుద్ధి. decision దగ్గర కొందరికి Wavering ఉంటుంది. గాంధీ గారు నిర్ణయాలు బాగా తీసుకుంటారు, ఏదైనా ఒక నిర్ణయం తీసుకుంటే దానికి కట్టుబడి ఉండిపోతారు.

గాంధీగారి గురువు గోపాల కృష్ణ గోఖలే. ఆయన ఏమంటారంటే, గాంధీ! నువ్వు రచనలు చెయ్యటము, ఉపన్యాసములుచెప్పటం కొంతకాలం ఆపేసి, నువ్వు భారతదేశమంతా చుట్టిరా. ప్రజల కష్ట సుఖాలు తెలుసుకో. అప్పుడు వారి క్షేమం గురించి నువ్వు ఎంచుకున్న పద్ధతిలో ఉద్యమించు అని చెప్పారు. గాంధీగారికి, పరిశుభ్రత అంటే ఇష్టం. cleanlines is next only to godliness. ఒకరు గాంధీగారి

వద్దకి, మురికిగా ఉన్న చీరతో వచ్చారు. గాంధీగారు ఆమెతో, అమ్మా! నువ్వు ఈ చీర కట్టుకుని ఎన్నో రోజులు అయినట్టుంది. దాన్ని కొంచెం నీటిలో పిండి శుభ్రం చేసుకొని కట్టుకో అన్నారు. ఆమె గాంధీగారితో, బాపూజీ! మీరు heart open చేసి నాతో మాట్లాడుతున్నారు కాబట్టి, నేను heart open చేస్తాను. నాకు రెండవ చీర ఉంటే అలాగే చేసే దాన్ని, ఉన్నది ఒక్కటే అన్నారు. అప్పుడు తన దేశంలో ప్రజల పరిస్థితి గాంధీ గారికి అర్థమయ్యింది. దేశభక్తికాదు, దానికంటే ముందు మనకి హ్యూమన్ టచ్ ఉండాలని.

సురేంద్రనాథ్ బెనర్జీ, చాలా విద్యావంతుడు, సంపన్నుడు, వివేకం గలవాడు. ఆయన తెలివితేటల్ని సొంతానికి ఉపయోగించుకుంటే కోట్లు సంపాదించుకోవచ్చు. కానీ ఆయన, స్వార్థానికి కాకుండా సమాజ హితవు కోసం ఉపయోగిస్తారు. అలా ఆయన జీవితాన్ని దేశానికి అంకితం చేశారు. ఒకరోజు సభలో మాట్లాడుతుంటే, ఒక వ్యక్తి చెప్పు విసిరాడు. అది ఆయనకు తగిలి, 40 సంవత్సరాల నుండి ఈ దేశానికి సేవ చేస్తున్నాను. నా చదువు, నా తెలివి, నా ధనాన్ని ప్రజల కోసం వినియోగిస్తున్నాను. నేను చేసిన 40 సంవత్సరాల సేవకి ప్రతిఫలంగా, ప్రజలు ఈ చెప్పుని బహుమతిగా ఇచ్చారని మాట జారాడు. ఆయన మనస్సు సడన్ గా బయటకి వచ్చేసింది. మనము ఎన్ని సేవలు చేసినా దైవానుగ్రహం లేకుండా అహంకారం బద్దలు అవ్వదు.

వినోబాభావే వద్దకి, ఒకసారి జమ్నలాల్ బజాజ్ వచ్చారు. ఆయన వచ్చేసరికి వినోబాభావే భగవద్గీత చదువుతున్నారు. అది విని, బజాజ్ గారు మా అబ్బాయిని మీ వద్దకి పంపిస్తాను భగవద్గీత నేర్పించండని అడిగితే, పంపించమంటారు వినోబా. ప్రతిరోజు సాయంత్రం వినోబా, తన పారాయణం చేసుకుంటూ... భగవద్గీత శ్లోకాల్ని ఈ పిల్లవాడికి అర్థం చెప్పి పారాయణం చేయించేవారు.

"తుల్యానిందాస్తుతి ర్మౌనీ సంతుష్టో యేన కేనచిత్ !
అనికేతః స్థిరమతిః భక్తిమాన్ మేప్రియో నరహః !!"

అనే శ్లోకం చదువుతూ, తాత్పర్యం చెప్పి పారాయణం చేస్తున్నారు. ఈ లోపు వినోబాభావే గారికి, గాంధీగారి దగ్గర నుండి ఒక పోస్టు వచ్చింది. ఆ ఉత్తరంలో గాంధీగారు, వినోబాభావేని ఈ దేశంలో నేను చాలా గొప్పవాళ్ళని చూశాను కానీ మీ

అంత గొప్ప వారిని చూడలేదు, మీ సమక్షంలో కూర్చుంటే జ్ఞాన సముద్రం వద్ద కూర్చున్నట్లు ఉంది. మీతో గడిపిన క్షణాలు, నా జీవితంలోనే అత్యంత మధురమైన ఘడియలు. తిరిగి నాకు ఆ భాగ్యం ఎప్పుడు కలుగుతుందో అని రాశారు. వినోబాభావే చదువుకొని ఆ ఉత్తరాన్ని చింపేశారు. ఇదంతా పక్కన కూర్చున్న బజాజ్ గమనించి వినోబాభావేని, గాంధీజీ అంతటి మహాత్ముడు రాసిన ఉత్తరాన్ని ఎందుకు చింపేశారని ఆశ్చర్యంగా అడిగారు. అప్పుడు వినోబాభావే ఈవిధంగా చెబుతారు: ఈ ఉత్తరంలో గాంధీ గారు, తన హృదయంలో ఉన్నది వ్యక్తం చేశారు కాబట్టి నేను సంతోషిస్తున్నాను. కానీ ప్రతిరోజు గాంధీజీ రాసిన ఉత్తరాన్ని చదువుతూ, వచ్చిన వారందరికి దాని గురించే చెబుతూ, ఫోటో ఫ్రేమ్ కట్టించుకుని ఉంటే నేను దారి తప్పి పోతాను, మనకి తెలియకుండానే గర్వం వచ్చి పతనమైపోతాము. నింద ఎంత చెడు చేస్తుందో, స్తుతిని కూడా లోపలకి తీసుకుంటే అంతే చెడు చేస్తుంది. నిందా-స్తుతుల పట్ల మనస్సు మౌనంగా ఉండటం ప్రాక్టీస్ చెయ్యాలి. జీవితంలో ద్వంద్వాలని సమానంగా తీసుకున్న వాడు మాత్రమే భగవంతుడికి ప్రియమైన వాడు అని వినోబాభావే బజాజ్ తో చెప్పారు. వారు పైకి దేశభక్తులుగా కనిపిస్తారు గాని, వారి లోపల ఉన్నదంతా దైవభక్తే. గీతా సారాన్ని పారాయణం చేయటం కాదు, ఆ సారంలో మన జీవితాలు కరిగిపోవాలన్నారు వినోబాభావే.

రామానుజులు అంటారు, అన్ని ఇంద్రియములు పాడవనక్కరలేదు, ఒక్క ఇంద్రియానికి మనము బానిసలమైనా, అప్పటివరకు మీరు చేసిన సాధన, మీలో ఉన్న మంచి గుణాలన్ని ఆ ఇంద్రియములో నుండి బయటకి పోతాయి. పంట కాలువ గట్టు అంతా పోనక్కరలేదు, ఎక్కడైనా కొంచెం గట్టుపోయినా మొత్తం చేలో నీరంతా పోతుంది. అలా ఒక్క ఇంద్రియానికి బలహీనత ఉన్నా మొత్తం సాధనంతా కొట్టుకుపోతుంది.

వేమనమాత్యుడు అంటారు, దేహానికి 90 ఏళ్ళు వయస్సు వచ్చినా, బయట లోకాన్ని చూడటమే కాదు, లోపల చూపు అలవాటు చేసుకోవాలి. బయట చూపు భ్రష్టుడిని చేస్తుంది. లోపల చూపు శుద్ధుడిని చేసి, భగవంతుడు వద్దకు చేరుస్తుంది అంటారు.

సాధనలేకుండా పరమార్థాన్ని పొందే ప్రయత్నం లేకుండా ఎవరైతే జీవిస్తున్నారో, వారిని shakespeare అడుక్కుతినే వారికి అన్నగారు అని అన్నారు. don't waste your time on external matters. just start on your inner journey. మనల్ని మనము సరి చేసుకోవాలి. learn to be no mind state.

George Bernard Shaw అంటారు, వివేకము నా నిజమైన తండ్రి. వైరాగ్యమే నా నిజమైన తల్లి. ఏది చెయ్యాలి - ఏది చెయ్యకూడదు, ఏది చదవాలి - ఏది చదవకూడదు, ఏది తినాలి - ఏది తినకూడదు, ఏది మాట్లాడాలి - ఏది మాట్లాడకూడదు. ఎవరితో స్నేహం చెయ్యాలి - ఎవరితో చెయ్యకూడదు అనే విషయాలని వివేకము విడదీస్తుంది. అంటే, మన మనస్సు ఏ విషయాన్ని పట్టుకుంటే అంతర్ముఖం అవుతుందో, దాన్ని విడదీసి చూపిస్తుంది. ఏ విషయాలు మన మనస్సుని బాహ్యాముఖపరుస్తాయో, వాటి జోలికి మనల్ని వైరాగ్యం వెళ్ళనివ్వదు. divinityని మనము పొందటానికి ఇవి సరిపోతాయి అంటారు. man - superman లో వివరంగా చెప్తారు. మనము మనిషిగా భూమ్మీద పుట్టినందుకు వివేక - వైరాగ్యాల్ని సంపాదించుకొని superman గా ఎదగాలి.

తమిళనాడులో, పట్టనత్తారని ఒక భక్తుడు ఉండేవారు. ఆయన్ని నవకోటి నారాయణుడు అనేవారు. బస్తా ధాన్యం 5 రుపాయలు రోజుల్లో ఆయన చాలా సంపన్నుడు. అన్నిటినీ త్యాగం చేసి బయటికి వచ్చి భిక్షాటన చేసుకుంటూ, సాధనాపరంగా జీవించటం మొదలుపెట్టాడు. భిక్షకి ఒక ఎండిపోయిన కొబ్బరి చిప్ప పట్టుకుని వెళ్ళి, దాంట్లో పెట్టించుకుని తిని, మిగిలింది ఒక కుక్కకి పెట్టేవారు. ఈయన ఆహారం పెడుతున్నారని కుక్క కూడా వచ్చేది. ఆయనకి ఆఖరి రోజులు వచ్చేసాయి, అప్పుడు ఆయనకి నేను చనిపోయాక, ఈ కుక్కకి అన్నం ఎవరు పెడతారు, ఈ చిప్ప ఏమైపోతుందనే ఆలోచనలు వచ్చేవి. అంటే అంతర్యామి యొక్క అనుగ్రహం లేకుండా ఈ మాయలోంచి బయటపడలేము. ఆయన చివరికి, అన్నిటినీ త్యజించిన నాకు చివరి రోజుల్లో ఈ కుక్క బుద్ధి, ఈ చిప్ప బుద్ధి వదిలిపెట్టలేదు అన్నారు. అంటే, మనము కాని దానితో మనకి తప్పుడు తాదాప్యం ఉన్నంత కాలము, జీవుడు ఏదో ఒక దాన్నిపట్టుకుంటాడు. గతి అల్లా శరణాగతి ఒక్కటే. పరమాత్మ interference లేకుండా, ఈ సంసార సముద్రాన్ని దాటలేము.

అబ్దుల్ కలాం గారు, తను అనుకున్నది అవ్వలేనప్పుడు ఓడిపోయాను అనుకున్నారు. అప్పుడు శివానంద, ఆయనతో ఓడిపోయాను అనే తలంపుని ఓడించు అన్నారు. నువ్వు నూరు సంవత్సరాలు బ్రతకాలి, 25వ సంవత్సరంలోనే ఓడిపోయాను అనుకుంటే, మిగతా 75 సంవత్సరాలు ఏమి సాధిస్తావు. ఈ జీవన సూత్రం శివానంద చెప్పారు.

Abdul Kalam: if you salute your duty. You need not salute any-body, but if you pollute your duty, you must salute everybody. Life itself teaches you many lessons.

అబ్దుల్ కలాం గారు S.L.C చదివిన తరువాత ఆయన తండ్రి కలాంగారితో, నేను - ఇకనుండి నిన్ను చదివించలేను చిన్న ఉద్యోగంలో చేరమన్నారు. అప్పుడు కలాంగారి అక్క - ఆమె బంగారమంతా అమ్మి చదివించారు. కలాంగారు చదువుపూర్తయ్యి ఉద్యోగంలో స్థిరపడిన తరువాత, అయన అక్కగారి పిల్లలకి కొద్ది ధనాన్నిచ్చి చూసి వచ్చేవారు. ఆచార్యులు వారు ఏమంటారంటే, "పురోభివృద్ధి కోరువారు పూర్వ వృత్తాంతం మరువరాదన్నారు". పని గుర్రంలా చేయాలి, జీవించటం సన్యాసిలా జీవించాలి. ఇది మనము కలాంగారి జీవితం నుండి నేర్చుకోవాలి. మన మనస్సు ఒకటి చెపుతుంది, హృదయం మరొకటి చెపుతుంది. హృదయం చెప్పేది ఎప్పుడూ విశాలంగా ఉంటుంది మనము హృదయాన్నే follow అవ్వాలి.

కాశీలో బిస్మిల్లాఖాన్ అనే ఒక ముస్లిం భక్తుడు ఉండేవాడు. ఆయనను అమెరికా వచ్చేయండి, మీకు అన్నివసతులు చూసుకుంటామని అడిగారు. అప్పుడు ఆ భక్తుడు రావటానికి నాకు ఎటువంటి అభ్యంతరం లేదు. కానీ నా కాశీని, నా గంగానదిని, నా విశ్వేశ్వరుడిని అమెరికా తీసుకురాగలరా? అమెరికా డాలర్స్ కోసం నా విశ్వేశ్వరుడిని, నా గంగని విడిచి ఉండలేను అన్నారు. అది నిజమైన భక్తి.

మహమ్మద్ ని, ఒక భక్తుడు ఏదైనా ఒక వాక్యం చెప్పమని అడుగుతాడు. పొలం దున్నకుండా చేను వేస్తే అది ఎలా మొలవదో, అలాగే నీ స్వభావంలో కారణం లేకుండా కోపగించుకోవటము, కారణం లేకుండా శత్రుత్వాలు, కారణం లేకుండా చిరాకులుపడే అలవాటు ఉంది. ముందు నీ స్వభావంలో ఉన్న ఈ అలవాటును

విడిచిపెట్టి రమ్మంటాడు ఆ భక్తుడిని. అప్పుడు నేను చెప్పిన మాట కొంచమైనా, నీకు ఒంటపడుతుంది. అలవాటు మానకుండా చెబితే నేనుచెప్పింది వృధాగా పోతుంది. నేను చెప్పిన మాటలని నీ స్వభావం, నీ హృదయంలో ఇంకనివ్వదు.

కబీరు, నా దేవుడు ఆత్మా రాముడు అన్నారు. అంటే "నిర్గుణ బ్రహ్మం".

కబీరు మరికొద్ది క్షణాలలో దేహం విడిచి పెట్టేస్తారనగా, ప్రభూ! మీరిచ్చిన దేహాన్ని, మీరిచ్చిన ఇంద్రియాలని, మలినం చేయకుండా వాటికి మసి అంటకుండా మీరు ఎంత పవిత్రంగా, స్వచ్ఛంగా నాకు అందించారో, అంత పవిత్రంగా స్వచ్ఛంగా మీకు అప్పజెప్పేస్తున్నాను అంటారు కబీరు.

నీటిలో ఉన్న చేపకి దాహం ఉండదు, హృదయంలో ఉన్న వాడికి అశాంతి అంటదు అంటారు కబీరు.

మనిషి పాడైపోవటానికి కారణం దురాశ - ద్వేషం. సమాజంలో కృతజ్ఞత అనేది చాలా తక్కువ. మనము పాడైపోవటానికి గర్వమే కారణం. మనకి ఏదైనా విషయం తెలిసినప్పటికీ తెలియనట్టు నటిస్తాము అది కూడా గర్వమే. తాజ్ మహల్ ఎవరు కట్టించారంటే, షాజహాన్ కట్టించారు అంటారు. కానీ ఆ తాజ్ మహల్ నిర్మాణంలో పనిచేసిన వారి చేతులు నరికించేశారు. పైగా వారి గురించి ఎవ్వరికీ తెలియదు. అది ఈ ప్రపంచం తీరు.

అక్బర్ చక్రవర్తి వద్ద, తాన్ సేన్ పాటలు పాడేవారు. అక్బర్, తాన్సేన్‌ని నీ అంత గొప్పగా పాటలు పాడేవారు ఈ ప్రపంచంలో ఎవరైనా ఉంటారా అని అంటారు. తాన్ సేన్ నా గురువు ఉన్నాడు, నా గురువు స్వరం విప్పితే జీవనదిలా ఉంటుంది. ఆయన ఎవరి కోసము, ఎవరి వద్ద పాడరు. రాముడి కోసం మాత్రమే పాడతారు అన్నాడు. అయితే, నీ గురువు వద్ద వినటానికి, నేను వస్తాను అన్నాడు అక్బర్. మీరు ఈ విధంగా వస్తే, మా గురువుగారు పాడరు అంటాడు తాన్ సేన్. అందుకు అక్బర్ మారువేషం వేసుకొని వెళ్తాడు. తాన్ సేన్, అక్బర్ ని గురువు వద్దకు తీసుకువెళ్ళి, తన స్నేహితుడని గురువు గారికి పరిచయం చేసి మీరు పాటలు బాగా పాడతారని చెప్తే, వినటానికి వచ్చాడు అంటారు. నారాయణుడి కోసం తప్పించి, నీ స్నేహితుడు వింటాడని నేనెందుకు పాడతాను అంటారు గురువు. అప్పుడు తాన్ సేన్, మీరు

చిన్నప్పుడు నాకు గురువు మీద పాట నేర్పారు కదా, నేను అది పాడతాను అని తప్పులు పాడటం మొదలు పెట్టాడు. తాన్ సేన్, తప్పులు పాడుతున్నాడని గురువు పాడటం మొదలుపెట్టారు. గురువు గొంతులోంచి అమృతం ప్రవహించింది. మన మాట, పని, ఆలోచన ఏదైనా లోకం కోసం కాకుండా భగవంతుడి కోసమే ఉపయోగిస్తే పవిత్రులమవుతాము. లోకంలో జనాల గొప్ప కోసం కాదు, భగవంతుడు కోసం జీవించు, భగవంతుడి కోసం మరణించు.

అమెరికా 16వ ప్రెసిడెంట్ లింకన్. ఆయన అంటారు, ఇతరులు నన్ను అవమానపరిచినా నేను అవమానపడను. ఆయన ప్రెసిడెంట్ అయ్యాక, మొట్టమొదటిసారి పార్లమెంట్ కి వెళ్ళారు. అక్కడ ఒక అసూయపరుడు, ఓ లింకన్! మీ తండ్రి నా చెప్పులు కుట్టేవాడు అన్నారు. ఆ మాట విని లింకన్ అంటారు, అవును నా తండ్రి చెప్పులు కుట్టేవాడు, నాకు కూడా చెప్పులు కుట్టడము వచ్చు. నా తండ్రి మీ ఆదికి సరిగ్గా సరిపడేలా కుట్టారా, ఆదిలో ఏమన్నా తేడా వస్తే నేను సరి చేసి ఇస్తాను అన్నారు. అవమానించాలని వచ్చినవాడే అవమానింపబడ్డాడు. అక్కడికి వచ్చిన వారందరూ, లింకన్ సింప్లిసిటీ, గర్వంలేని గుణము చూసి, చప్పట్లు కొట్టారు. అప్పుడు లింకన్ చెప్పారు, నేను అమెరికన్ ప్రెసిడెంట్ పదవి చెయ్యలేకపోతే, సరిగ్గా చేసే సమర్థత నాకు లేకపోతే, నా తండ్రి చెప్పులు కుట్టే పనిని పర్ఫెక్ట్ చేస్తే నాకంటే ఆయనే గొప్పవారు. ఎవరు చేసే పని వారు సరిగ్గా చేసుకుంటే చాలు. ఎవరన్నా అసూయ వల్ల మిమ్మల్ని అవమానించవచ్చు కానీ, మనము అవమానంగా భావించకూడదు. మనము, మన డ్యూటీ చెయ్యాలి. లింకన్ ప్రెసిడెంట్ గా చేసే సమయంలో, కొన్ని ప్రాంతాలలో మనుషులని బానిసలుగా అమ్మేసేవారు. ఆ బానిసత్వాన్ని లింకన్ వ్యతిరేకించారు. ఎందుకంటే, ఆయన ప్రెసిడెంట్ కంటే ముందు మానవత్వం ఉన్న వ్యక్తి. అది నచ్చని వాళ్ళు ఆయనని కాల్చి చంపేశారు. లింకన్ లాంటి వారి దృష్టిలో ప్రాణం కంటే ధర్మం గొప్పది. ప్రజల హృదయాల్లో నిలచిపోయారు.

కాళిదాసు ఏమంటారంటే, జన్మాంతర అనుబంధం ఉన్న బంధుత్వాలు, స్నేహాలు స్థిరంగా ఉంటాయి. పొరపాట్లు ఏమైనా ఉన్నా వాటిని సరి చేసుకుని చిన్నవిగా చేసుకుని చిట్టచివరి వరకు ఒకరిని ఒకరు విడిచిపెట్టరు. జన్మాంతర అనుబంధం లేకపోతే అవి నిలబడవు. చిన్న విషయాన్ని కూడా పెద్దదిగా చేసేసుకుంటాము.

భర్తృహరి ఉజ్జయని వారు. ఆయన తపస్సు చేసి సమాధి స్థితిని పొంది, అప్పుడే సుభాషితాలు రాశారు. జ్ఞానములో నుండి వచ్చిన మాటలు సృష్టిలో సజీవంగా ఉంటాయి. ఆయన పెద్దలని ఎన్నడూ పరిహాసం చేయకండి అనేవారు. చేతులకి అందము గాజులు కాదు - దానము అందము, పెదవులకి అందము రంగులు కాదు - ప్రేమపూరితమైన పలకరింపుతో కూడిన చిరునవ్వు అందము, చెవులకి అందము జుంకీలు కాదు - మంచి మాటలు శ్రవణం చెయ్యటము అందము, కాళ్ళకు అందము పట్టీలు కాదు - మహాత్ముల సన్నిధికి చేరటము అందము.

కాళిదాసు అంటారు, మనకు ఏ వాసనలు లేవని ఎవరైనా చెప్తే నమ్మకండి. మన శరీరంలో ఎన్ని ఇంద్రియాలు ఉన్నాయో, అన్ని ఇంద్రియాలకి భోగవస్తువులు ఎదురుగానే ఉండాలి. అప్పుడు కూడా మన మనస్సుకి వికారము కలుగకూడదు, ఆ భోగాల పట్ల ఎట్టి ఆకర్షణ కలుగకూడదు.ఎలుకలని చంపటం కోసం, మాంసపు ముక్కని ఎరగా వేస్తాము. అవి తినటానికి వచ్చినప్పుడు, దాన్ని పట్టుకుని చంపేస్తాము. అలా ఒక్క ఇంద్రియపు ఉచ్చులోపడినా, పునర్జన్మవచ్చేస్తుంది. మనిషి చనిపోవడానికి 100 రోగాలు అక్కర్లేదు. ఒక రోగం చాలు. మనల్ని మనము కూడా నమ్మడానికి లేదు. అంతర్యామి, పెట్టే పరీక్షలని మనము తట్టుకోవాలి.

కాళిదాసు రఘువంశంలో అంటారు: భోగాలన్నీ అందుబాటులో ఉండాలి, మనకి ఏ రకమైన వికారము కలగకూడదు. అదే correct state, true state. అప్పుడు మనస్సుకి అంతర్-దృష్టి వస్తుంది. భగవంతుడు మనకి ఎప్పుడు దర్శనమిస్తాడంటే, విషయలోలుడికి విషయాల పట్ల ఉన్న ఆకర్షణ, తల్లికి తన బిడ్డల పట్ల ఉన్న ఆకర్షణ, పతివ్రతకి తన భర్త పట్ల ఉన్న ఆకర్షణ ఇవి మూడు ఒకచోట కలిపితే ఎంత ఆకర్షణ ఉంటుందో, అంత బలమైన ఆకర్షణ భగవంతుడి పట్ల కలిగితే అప్పుడు ఆయన దర్శనమిస్తారు. ఏ ఇంద్రియము కదలకపోతే అది వైరాగ్యం, అదే ఇంద్రియ-నిగ్రహము. శ్రీకృష్ణ చైతన్య ప్రభువు నోటిలో, పంచదార పలుకులు వేస్తే, ఆ పంచదారని తిరిగి తీసేసుకుని పొడి పలుకులుగానే తిరిగి మనము డబ్బాలో వేసేసుకోవచ్చు. అంటే, ఆయనకు ఉన్న నిగ్రహం వలన పంచదార కరిగేది కాదు. మన మనస్సు కదలకపోతే, గాలి లేని చోట దీపంలా ఉంటే కోరిక మనలో ఉదయించదు. మనస్సుకి ఏకాగ్రత వస్తే, నిర్మలత్వం వస్తే, శాంతి వచ్చి

సహస్రారాన్ని తడిపేస్తుంది. అప్పుడు కోరిక ఎటునుంచి ఉదయించలేదు. 1000 కోరికలు నెరవేరితే ఎంత శాంతి వస్తుందో, అంతకు 1000 రెట్లు శాంతి హృదయంలో నుంచి పొంగుతుంటే కోరిక ఉదయించే అవకాశమే లేదు.

కాళిదాసు అంటారు, పూర్వజన్మల సంబంధం ఉంటే ఒకరి దోషాలను ఒకరు మన్నించుకుంటారు. పెద్ద తప్పులను కూడా చిన్నవిగా చూస్తారు. అనుబంధం లేకపోతే చిన్నవి కూడా పెద్దవిగా చేసేసుకుంటారు. సాయంత్రం నిద్రపోయేటప్పుడు, మనల్ని ప్రేమించే వారిని, మన క్షేమం కోరే వారిని, మన మనస్సులో తల పెట్టుకుని, వారినే స్మరించుకొని నిద్రపోతే, నిద్ర మాత్రతో పని లేకుండా, గాఢ నిద్ర వచ్చేస్తుంది. మరుసటి రోజు ఉదయం ప్రశాంతంగా మేల్కొంటాము. మనల్ని ద్వేషించే వారిని, అసూయపడే వారిని మనము జ్ఞాపకంలోకి రాకుండా చూసుకోవాలి.

శ్రీకృష్ణ చైతన్యుడు, పూజకి పువ్వులు కోస్తున్నారు. ఒక భక్తుడు వచ్చి, స్వామీ! నువ్వు దేహం కాదు, మనస్సు కాదు అంటున్నారు. కానీ నాకు అవే అనుభవంలో ఉన్నాయి. నేను, 'దేహమే నేను' అని అనుకుంటున్నాను అన్నాడు. అప్పుడు చైతన్యులు, నీవు సత్యమే చెప్పావు, వేదాంతము సత్యమే చెప్పింది. దాన్ని అనుభవంలోకి తెచ్చుకోవాలంటే, సహనం ఉండాలి, తపస్సు ఉండాలి. ఈ పూల చెట్టు ఎవరు నాటారో, ఎవరు నీళ్ళు పోసి పెంచారో అది ఈరోజు ఫలించి, ఈ పువ్వులను అందిస్తోంది కాబట్టి మనము పూజకు ఉపయోగిస్తున్నాము. అలాగే నువ్వు శ్రద్ధగా సాధన చేస్తే, అది ఫలించినప్పుడు దేహాత్మ బుద్ధి తొలగిపోతుంది అన్నారు చైతన్యులు.

హృదయ శుద్ధి కలవారు ధన్యులు. వారు దేవుడిని చూచెదరు. God's name is everything. శ్రీకృష్ణ చైతన్యుడి దగ్గర హరిదాసు అనే ఒక ముస్లిం భక్తుడు ఉండేవారు. భక్తికి కుల,మతాలు ఉండవు. హరిదాసు చైతన్యుడి దగ్గరే ఉండి, ఆయన సాంగత్యంలో వుంటూ, నామ సంకీర్తనలో కాలం గడిపేవారు. ఒకరోజు చైతన్యుడితో హరిదాసు అంటారు, స్వామీ! ఈ దేహం నామ సంకీర్తనకి కూడా ఉపయోగపడటము లేదు, సహకరించటములేదు.. నీ దేహం భూమ్మీద ఉండగానే ఈ కట్టె వెళ్ళిపోవాలి, నీవు లేని లోకాన్ని నేను చూడలేను,నీ చేతులు మీదుగా నేను వెళ్ళిపోవాలని అడిగి, చైతన్యుడు పాద దూళిని తన దేహానికి రాసుకున్నాడు. ఇద్దరూ హరే కృష్ణ మహా

మంత్రం చేస్తున్నారు. హరిదాసు శరీరం చైతన్యుడి ఒడిలో జారిపోయింది. స్వయంగా చైతన్యుడే, పూరీలో సముద్రం ఒడ్డున హరిదాసు దేహాన్ని సమాధి చేస్తారు. అంత్యకాలము నందు, నన్ను ఎవరు స్మరిస్తారో, వారు నన్నే చేరెదరని పరమాత్మ భగవద్గీతలో చెప్పినట్లుగా, హరిదాసు, దేహం ఉండగా పరమాత్మ అంశతో గడిపాడు, దేహం పడిపోయిన తరువాత పరమాత్మలోనే ఐక్యమయ్యాడు. అది ఉత్తమ జీవితం.

గురువు ఆప్యాయత ఎలా ఉంటుందంటే, శ్రీకృష్ణ చైతన్యుడి వద్దకి, కలకత్తా నుంచి ఒక దంపతులు వచ్చేవారు. చైతన్యుడికి ఆ దంపతులను తరువాత చూడలేనని తెలిసి, వారితో మీరు ఎంతో ధనాన్ని ఖర్చు పెట్టుకుని, శ్రమపడి నన్ను చూడటానికి వస్తున్నారు. మీకు ఇవ్వటానికి నా వద్ద ఏమీ లేదు. నా ఈ శరీరాన్ని ఎవరైనా కొనుక్కుంటే అమ్మి, మీకు ఏదైనా ఇవ్వాలనిపిస్తోంది అన్నారు. చైతన్యుడు వారి పట్ల చూపిన ఆ ప్రేమకి, ఆ భక్తుల కంట కన్నీరు జాలువారింది.

బైబిల్లో యేసు అంటారు, మీరు ఇతరులకు ఏదైనా చేస్తే, వారికి చేసాము అనుకోకండి. ఎందుకంటే భగవంతుడికి మీరు అప్పు ఇస్తున్నారు. అది వడ్డీతో సహా తీరుస్తాడు.

ఏసు కూడా mating వల్ల ఈ భూమి మీదకి రాలేదు. ఏసుతండ్రితో యెహోవా, నువ్వు నీ భార్యని ముట్టుకోకు. నేను ఆమె శరీరం ద్వారా ఈ భూమ్మీదకు వస్తాను అన్నాడు. అలాగే సుబ్రహ్మణ్యుడు శివుని మూడవ నేత్రం నుంచి భూమి మీదకు వచ్చాడు.

ఏసుక్రీస్తుతో ఒక ధనవంతుడు తిరిగేవాడు. వాడు స్వర్గరాజ్యం కావాలని ఒకసారి క్రీస్తుని అడిగాడు. దానికి ఏసు, నీకున్న ధనాన్ని గ్రామంలో అందరికీ పంచిపెట్టు అన్నాడు. ఆ మాట అనగానే మరలా ఎప్పుడు యేసుకి ఆ ధనవంతుడు కనిపించలేదు. అప్పుడు యేసు ఏమనిచెప్పారంటే, సూది బెజ్జంలో నుంచి ఒంటిని బయటకు తీయవచ్చు కానీ, ధనవంతుడుని స్వర్గరాజ్యానికి పంపలేమన్నారు. మనము మోక్షం కోరుకుంటే మనకు మోక్షం తప్పించి లోకములో ఇంకేమీ కనిపించకూడదు. ఒక భక్తుడు ప్రభువు కూడా స్వర్గ-రాజ్యానికి వస్తానన్నాడు. ఒకరోజు ప్రభువు సముద్రం ఒడ్డున నడుస్తుంటే, ఆ భక్తుడు ఎదురయ్యాడు. నేను స్వర్గరాజ్యానికి వెళ్ళుతున్నాను,

వస్తాను అన్నావు కదా, తీసుకెళ్ళతాను వస్తావా అని అడిగారు. ఆ మాట వినగానే అతడు, ప్రభు! నాకు బాగ కావలసిన బంధువు ఒకరు చనిపోయారు. వారిని చూడటానికి వెళ్ళుతున్నాను, మరోరోజు వస్తాను అన్నాడు. వెంటనే ప్రభువు ఏమన్నారంటే, "చనిపోయిన వాడిని మోసుకువెళ్ళటానికి చావటానికి సిద్ధంగా ఉన్నవాళ్ళు చాలామంది ఉన్నారు." వాళ్ళు వెళ్ళతారు నువ్వు నావెంట రా అన్నారు. కానీ ఆ భక్తుడు వెళ్ళలేదు.

ఏసుక్రీస్తుని శిలువ వేసిన రోజు, ఇద్దరు దొంగలకి కూడా శిలువ వేస్తారు. అందులో ఒక దొంగ ఏసు! మేమంటే, దొంగతనాలు చేసాము. అందువల్ల శిలువ వేశారు. నువ్వు పరిశుద్ధ హృదయుడివి, పాపం ఎలా ఉంటుందో, నీకు తెలియదు కానీ, నిన్ను కూడా శిలువ వేశారు అన్నాడు. యేసు అంటాడు, ఈ మాట అన్నందుకు నువ్వు జీవితంలో ఇప్పటివరకు చేసిన పొరపాట్లు అన్ని క్షమించబడ్డాయి. నీకు స్వర్గరాజ్యంలో స్థానం ఇస్తాను అన్నాడు. యేసులో ఉన్న పవిత్రతని వాడు గుర్తించాడు.

I and my father are one and the same అన్నాడు క్రీస్తు. నేను నా తండ్రి, ఒక్కటి అంటే ఒక్కటే. ఉన్నది ఒక్కటంటే ఒక్కటే. దానిని అంతటా దర్శించటమే అద్వైత స్థితి, అదే మోక్షము, అదే స్వర్గరాజ్యము, అదే నిర్వాణము.

మదర్ థెరిస్సాకి అంత అందం,చదువు ఉన్నా, కేవలం ప్రజలకి సాయం చెయ్యడానికే వివాహం చేసుకోలేదు. వాటిని భగవంతుడిని తెలుసుకోవడానికి త్యాగం చేసింది. భగవంతుడి కోసం వదులుకుంది. వారందరూ different people. వారికి సేవ అనే అగ్నిలో అజ్ఞానం కాలిపోయింది. భగవంతుడి కంటే, భిన్నంగా ఉన్నామని ఆయన నామం చేసుకుంటున్నాము. ప్రజాసేవలో, వారికి ఆ వేరు భావన కాలిపోయింది. మనకి భగవంతుడికి, మధ్యలో ఉన్న వేరుభావన మనము చేసే సేవలో కరిగిపోవాలి. కాలువ నీటిలో గడ్డిపరకలు ఎలా కొట్టుకుపోతాయో, మన గౌరవాలు, కీర్తిసంపదలు కాల ప్రవాహంలో అలా కొట్టుకుపోతాయి. వేరుభావన పోగొట్టుకోవడానికే మన సాధన అంతా.

మదర్ థెరిస్సా, ఆమె యుక్తవయస్సులోనే మన దేశానికి వచ్చారు. ఆమె జీవితంలో చాలా కష్టపడ్డారు. ఆమె పడిన కష్టంలో నుండే ఆమెకి దయా పూరిత హృదయం వచ్చింది. మనము100 జన్మల తపస్సులు చేసి పొందలేని వివేకం, ఒక

కష్టం ద్వారా భగవంతుడు మనకి తీసుకువస్తాడు. ఆమెకు noble peace prize ఇచ్చారు. ఆమెను మీకు జీవితంలో inspiration ఏంటని అడిగినప్పుడు, ఈవిధంగా చెప్పారు: నేను కలకత్తాలో రోడ్డుమీద నడిచి వెళుతుంటే, ఒక చెత్త కుప్ప పక్కన ఒక వృద్ధురాలు పడి ఉన్నారు. ఆమె బ్రతికే ఉన్నారని, నేను ఆమెను నా ఇంటికి తీసుకువెళ్ళి.. స్నానం చేయించి, కొంచెం ఆహారం పెట్టి, సేవచేసి ఆమె కుదుటపడ్డాక నిన్ను ఎవరు అక్కడ పడేశారని అడిగాను. నా కొడుకే నన్ను అక్కడ పడేశాడని చాలా కోపంగా, ద్వేషంగా చెప్పారు. అప్పుడు నేను ఆమెతో, మీరు కొద్ది రోజుల్లో చనిపోతున్నారు. మీకు ఇప్పుడు ఉద్రేకం అనవసరం. దేహానికి ఎప్పుడో ఒకరోజు చావు వస్తుంది, కానీ మనసుకి శాంతి ముఖ్యం. నా కోసం మీ బిడ్డను క్షమించండి. మీ అబ్బాయి చేసిన చెడు మర్చిపోయి, వాడు జీవితంలో ఏదైనా నువ్వు సంతోషించే పని చేసి ఉంటే అది జ్ఞాపకం చేసుకో. నీ మనస్సుని సమాధానపరుచుకో. నీ హృదయాంతరాళంలో నీబిడ్డ పట్ల ఉన్న కోపాన్ని నెమ్మదిగా విడిచిపెట్టి వారిని క్షమించు అన్నాను. ఆ వృద్ధురాలు నెమ్మదిగా ఆ దుఃఖములోంచి, ఉద్రేకంలోంచి బయటికి వచ్చి రెండు రోజులకి శాంతిగా నిర్మలంగా దేహాన్ని విడిచి పెట్టేశారు. బైబిల్లో సమాధానపరుచువాడు ధన్యుడు, వాడు భగవంతుడిని చూచెదడు అంటారు క్రీస్తు. అప్పుడు, ఆ వాక్యం నాకు అనుభవంలోకి వచ్చింది. మనల్ని మనము ఉద్ధరించుకోవటానికి ఏ చిన్న అవకాశం వచ్చినా అశ్రద్ధ పనికిరాదు. ఇది నాకు ఎంతో ఆనందాన్ని కలిగించిన సంఘటన. అదే నాకు inspiration. ద్వేషం మనిషిలో మార్పు తీసుకురాదు, ప్రేమ మాత్రమే మనలో మార్పు తీసుకువస్తుంది. సహనం లేని వాడు ప్రేమించలేడు, సాధకుడికి వినయం, నమ్రత, నాగరికత, సహనం ఉండాలి. అప్పుడు వాడు చేసే సాధన ఫలిస్తుంది.

బాబా వద్ద ఎవరైనా కూర్చుని ఇతరులని విమర్శిస్తే, పంది మలాన్ని తింటుంది. అలాగే నువ్వు ఇతరుల యొక్క పాపపుమలాన్ని తింటున్నావు అనేవారు బాబా. ఇతరుల వైపు మనము చూసినప్పుడు వారిలో ఉన్న మంచి గుణాలని చూస్తే మనము బాగుపడతాము. మనలో ఉన్న దోషాల్ని మనము చూసుకుంటే, ఏదో ఒకరోజు జీవితంలో వాటిలో నుండి బయటకి వస్తాము. ఇది బాగుపడే వారి లక్షణం. remember all the good; forget all the bad. ఇది ప్రాక్టీస్ చెయ్యాలి.

బాబాని, ఒక భక్తుడు మహాత్ముల దర్శనం చేసుకున్న ప్రతి భక్తుడు తరిస్తాడా? అని అడుగుతాడు. అప్పుడు బాబా, పక్కన ఉన్న చెట్టుని చూపించి ఈ చెట్టుకున్న పిందెలన్ని పళ్ళు అవ్వవు, కొన్ని పుష్పాలుగా రాలిపోతాయి, కొన్ని కాయలుగా రాలిపోతాయి. పక్వానికి వచ్చేవరకు చెట్టుని అంటిపెట్టుకొని ఉన్నవే కొన్ని పళ్ళు అవుతాయి. అలాగే మోక్షం పొందేవరకు ఏ భక్తుడైతే, గురువుని అంటిపెట్టుకొని ఉంటాడో వాడే తరిస్తాడు.

బాబా వద్దకి ఒక భక్తుడు వచ్చి, గురువుని అన్వేషిస్తున్నాను కానీ నాకు సరైన గురువు దొరకటం లేదన్నాడు. బాబా అంటారు, గురువు సరైనవాడు కావాలనుకునే నువ్వు శిష్యుడిగా సరైన వాడివేనా! నీకు తగ్గవాడినే పంపుతాడులే ఈశ్వరుడు అన్నారు బాబా.

బాబాకి, ఒకరోజు రెండు రూపాయలు మనియార్డర్ వచ్చింది. అక్కడ ఉండే భక్తుడు, దాన్ని వాడుకున్నాడు కానీ బాబాతో ఆ విషయం చెప్పలేదు. బాబా కూడా వాడిని అడగలేదు. రెండు నెలల తరువాత ఆ భక్తుడు ఇంట్లో రెండు వందల రూపాయలు పోయాయి. బాబా వద్దకి వచ్చి 200 పోయాయని చాలా బాధగా ఉందని చెప్పాడు. నీ 200 పోయాయని నువ్వు ఎలా బాధపడుతున్నావో నా రెండు రూపాయల పోయాయని అలాగే బాధపడుతున్నాను అన్నారు బాబా. ప్రత్యేకించి పనికట్టుకుని మన తప్పులని చూపించడు గురువు, సందర్భాన్ని బట్టి చూపించి మనల్ని అందులో నుండి బయటకి తీసుకువస్తాడు.

విశ్వాసము, ఓర్పు ఇవి రెండిటిని సాధకులు విడిచిపెట్టకూడదు అంటారు బాబా. విశ్వాసములో, ఓర్పులో, ధైర్యాన్ని కలుపుకుంటే అవి నిలబడతాయి అన్నారు. బాబా వద్దకి, దొంగ బుద్ధి ఉండే ఒక భక్తుడు వచ్చేవాడు. వాడు, బాబా వద్దకు వచ్చే భక్తుల వస్తువులు దోచేసి పోలీసులకు పట్టుబడ్డాడు. పోలీసులతో నాకు బాబాయే ఇచ్చారని చెప్పాడు. పోలీసులు వచ్చి, బాబాని ప్రశ్నలు మొదలుపెట్టారు.

- ✦ పోలీసులు : నీ పేరేంటి?
- ✦ బాబా : సాయిబాబా.
- ✦ పోలీసులు : మీ తండ్రి పేరేమిటి?

- బాబా : సాయిబాబా.
- మీ ఇద్దరి పేర్లు ఒక్కటేనా అని అడిగారు. నా తండ్రే నేను, నేనే నా తండ్రి అన్నారు బాబా.
- పోలీసులు : మీ కులము ఏమిటి?
- బాబా : భగవంతుడు.
- పోలీసులు : మీ మతం ఏమిటి?
- బాబా : భగవంతుడు.
- పోలీసులు : మీ వృత్తి ఏమిటి?
- బాబా : భగవంతుడు.

పోలీసులు, ఆ దొంగ దొంగలించిన గొలుసును బాబాకి చూపిస్తూ, ఇది మీరే ఇచ్చారని అంటున్నారు అని అడుగుతారు. అప్పుడు బాబా, ఏమి ఈ గోల, ఈ గోలతో నాకేల అంటారు.

పోలీసులు బాబాని మీ వయస్సెంత అని అడిగితే, 500 సం॥లు అన్నారు. అంటే, కాలాతీతుడ్ని అని చెప్పటం. శరీరానికి వయస్సు ఉంది కానీ, లోపలున్న వాడికి వయస్సేంటి? వెళ్ళు...వెళ్ళి, మీ మెజిస్ట్రేట్ కి చెప్పు అన్నారు బాబా. అక్కడకి, వచ్చిన పోలీసులు మౌనంగా వెళ్ళిపోయారు.

బాబా ఒంటరిగా కూర్చుని ఉన్నప్పుడు "అల్లా మాలిక్" అనుకునేవారు. అల్లాయే ప్రభువు, మన భర్త, మన యజమాని. ఆయన ఉన్నాడు కానీ మనము లేము. గొప్ప వాళ్ళమని మనమే అనుకుంటాము. బాబా వద్దకి ఒక భక్తుడు వచ్చి ఆత్మజ్ఞానం కావాలి అని అడిగాడు. బాబా నవ్వుతూ, ఫలానా వారి ఇంటికి వెళ్ళి, ఐదు రూపాయలు నేను అడిగాను అని చెప్పి తీసుకొని రమ్మన్నారు. ఒక అయిదారు ఇళు ౣ తిరిగి ధనం దొరకలేదు బాబా అన్నారు. వాడి జేబులో 105 రూపాయలు ఉన్నాయి. 100 ఉంచుకొని ఒక ఐదు రూపాయలు కూడా ఇవ్వలేదు. నీ వద్ద ఉన్న ధనంలో ఐదు రూపాయలు, నా వద్ద ఉన్నాయని ఇచ్చే సహృదయం కూడా నీకు లేదు. అటువంటప్పుడు ఆత్మజ్ఞానం ఎలా సాధ్యమవుతుంది అన్నారు బాబా. అంటే, త్యాగి కాని వాడు జ్ఞానికాలేడు. బుద్ధుడు ఆత్మజ్ఞానం కోసం రాజ్యాన్ని విడిచిపెట్టాడు కానీ, నువ్వు 5 రూపాయలు విడిచిపెట్టలేకపోతున్నావు అని డైరెక్ట్‌గా చెప్పేసారు బాబా.

The greatest help you can do yourself is stop worrying. It is glorious even to help one. బాబాకి అగ్ని అంటే ఇష్టం. మనలో ఉన్న వాసనలని, బలహీనతలన్నిటిని ధునిలో సమిధలు ఎలా వేస్తామో, అలా బాబాకి అర్పించి మన హృదయాన్ని ఖాళీ చేసుకుంటే దేవతలు కూడా అసూయపడే పరమ శాంతిని మనము పొందుతాము.

బాబా షిరిడి వచ్చి, అక్కడే నివసించటం వలన అది పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధికెక్కింది. అది ఆ స్థలం చేసుకున్న భాగ్యం. గురువు దేహంతో ఉన్న స్థానము, తిరుగాడిన నేల పరమపవిత్రమై, పుణ్యక్షేత్రంగా రూపుదిద్దుకుంటుంది.

ఒకసారి ఒక దంపతులు బాబా వద్దకు వచ్చారు. భార్య బాబాతో, ఇలా ఎన్నిసార్లు ఈ చావుపుట్టుకలు అందులో నుండి బయటికి రావాలి అన్నారు. నువ్వు జీవ భావనలోంచి ఆత్మ భావనని పొందాలమ్మా అన్నారు బాబా. నేను ఆత్మని ,ఆత్మని అనుకుంటే అవుతానా బాబా అని ఆమె బాబాని అడిగారు. నువ్వు ముందు అనుకోవటం మొదలుపెట్టు అప్పుడే దైవానుగ్రహం కలుగుతుంది. అది భావనే అయినా స్థిరపడి ఆత్మలో నిలబడిపోతావు, చావుపుట్టుకలు దాటేస్తావు అన్నారు బాబా. ఆ దంపతులు రెండు రోజులు బాబా వద్ద ఉండి తిరిగి ఇంటికి వచ్చినతరువాత ఎంతో కాలం నుండి బాబాని చూడటానికి వెళ్ళాలనుకుంటున్నాము - వెళ్ళి వచ్చేసాము అంది ఆ భార్య భర్తతో. భర్త చాలా wise man. అప్పుడు ఆ భర్త, భార్యతో: చూడటం వేరు, బాబా భగవంతుడే అని నమ్మటం వేరు అన్నారు. నమ్మితే ఆయన వాక్యానికి విలువ ఇస్తాము. అలా జీవించటానికి ప్రయత్నం చేస్తాము. నరుడు నారాయణుడుని స్మరించగా, స్మరించగా నారాయణ స్వరూపం పొందుతాడు. దీపం, దీపం అంటే వెలుగు రాదు. దీపాన్ని వెలిగించుకోవాలి. అన్నం, అన్నం అంటే ఆకలితీరదు. అన్నం తింటే ఆకలి తీరుతుంది. దేశాన్ని ప్రేమించండి అని మెట్టవేదాంతం చెప్పటం కాదు. దేశంలో ఎవరి పాత్ర వారు పోషించాలి, అప్పుడు దేశం అభివృద్ధిలోకి వస్తుంది. జ్ఞానం, జ్ఞానం అంటే జ్ఞానం వచ్చెయ్యదు. సాధన చేసి చేసి సిద్ధిని పొందండి.

ఒక భక్తుడికి భార్య అంటే చాలా ఇష్టం. ఆమె చనిపోయారు, మూడవరోజు అస్థికలు తీసుకెళ్ళి గంగలో కలిపారు. ఇటువంటి బూడిదలెన్నిటినో గంగ భరిస్తోంది. వీటన్నింటిని భరిస్తూ సముద్రుడి వైపుగా దాని ప్రయాణం కొనసాగిస్తోంది. ఆ భక్తుడు ఏమన్నారంటే, నేను ఎంతగానో ప్రేమించిన నాభార్య అస్థికల్ని ఇంట్లోకి కూడా తీసుకురాలేదు. గంగమ్మ ఆ అస్థికుల బూడిదని మోస్తోంది. పుష్పాలు వేసినా, అస్థికలు వేసినా భరిస్తూ దాని ప్రయాణం అది చేస్తోంది అన్నారు.గురువు కూడా గంగానది వంటివారు. ఆయన్ని గౌరవించినా, విమర్శించినా, ఆయన పై పేడ నీళ్ళు పోసినా ఆయన వచ్చిన పని ఆయన చేస్తూ గమ్యం వైపు జీవుడిని మళ్ళిస్తాడు. మనము సహనంతో గురువు చెప్పినది విని, ఓర్పుగా జీవిస్తూ, స్థిరంగా గమ్యం వైపు మన ప్రయాణం కొనసాగించాలి.

ఒకసారి శృంగేరి పీఠాధిపతి అయిన, భారతీ తీర్థ పర్యటనలో భాగంగా అడవి గుండా వెళ్ళుతున్నారు. సాయంత్రం ఐదు గంటలకి టెంట్ వేసుకుని చంద్రమౌళీశ్వరుడి ఆరాధన చేసుకుంటున్నారు. అదే సమయంలో ఫారెస్ట్ ఆఫీసర్ అటుగా వెళుతూ, పీఠాధిపతి దర్శనం చేసుకుని నమస్కరించారు. అప్పుడు, పీఠాధిపతి ఆయనను మీరు ఈ మూడింటిలో ఏ కోవకు చెందినవారని అడిగారు అవి ఏమిటంటే,

1. ఎదుటివారి పట్ల అకారణంగానే కోపం తెచ్చుకునే స్వభావం కలవాడివా?
2. ఎదుటివారిని చూసి, వారి గురించి ఒక అభిప్రాయాన్ని ఏర్పరచుకొని ఆ తలంపుతో తాదాప్యం పొంది, వారిని అడిగి తెలుసుకోకుండానే కోపం తెచ్చుకునే స్వభావమా?
3. ఎదుటివారిలో నీకు కనిపించిన విషయాన్ని అడిగి దానికి కారణం తెలుసుకుని కోపం తెచ్చుకునే స్వభావం కలవాడివా?

అప్పుడు ఆయన, నేను రెండో కోవకు చెందిన వాడిని. అడిగే అలవాటు నాకు లేదు. నువ్వు ఎన్ని పాపాలు చేసావో ఒక్క సారి తెలుసుకో అన్నారు ఆ స్వామి. సాయంత్రం ఇంటికి వెళ్లిన తరువాత, అక్కడ పనిచేసే అతను, ఆ ఆఫీసర్‌కి రెండు చపాతీలు ఏదో కూర పెట్టాడు. వెంటనే వాడిని కోప్పడబోయి, స్వామి మాట గుర్తుకు వచ్చి, నువ్వు తినేసి కూర్చున్నావా అన్నాడు. అప్పుడు ఆ పని చేసే అతను, సరుకులు తెమ్మని గుమస్తాకు చెప్పాను, అన్నీ అయిపోయాయి వాడు ఇంకారాలేదు ఉన్నదానితో

ఇవే చెయ్యగలిగాను అన్నాడు. ఇదన్నా పెట్టాలని నేను ఉదయం నుండి ఏమీ తినకుండా దాచి పెట్టాను దొర అన్నాడు. వెంటనే ఇన్నాళ్లు నుంచి ఎంత పొరపాటు చేస్తున్నానో, అని దుఃఖం వచ్చి, తన చేత్తో ఆ పని చేసే అతనికి పెట్టి, తను పొరపాటున సరిదిద్దుకుని శాంతిని పొందాడు.

స్వామి రామతీర్థ ఏమంటారంటే, సంస్కర్తలు కావలెను, సంస్కర్తలు కావలెను అని చెప్పుకు తిరిగేవారు చాలామంది ఉన్నారు కానీ తమని తాము సంస్కరించు కోవాలనుకునేవారు ఎక్కడా కనిపించడం లేదు ఇదే మహా మాయ. సత్పురుషులని ఆశ్రయించి, హృదయంలోకి ప్రవేశించే మార్గం తెలుసుకుని, మనల్ని మనము బాగు చేసుకుని ఉద్ధరించబడాలి తప్పించి, ఎవరో వచ్చి మనల్ని బాగు చెయ్యరు.

స్వామి రామతీర్థ హిమాలయాల్లో తపస్సు చేసేవారు. ఆయన తపస్సు చేసేటప్పుడు పక్కనే ఒక కత్తిని పెట్టుకునేవారు. మనకి ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం లేకుండా హృదయంలోనికి దిగలేము. రామతీర్థ తన ఇంద్రియాలని హెచ్చరించడానికి కత్తిని దగ్గర పెట్టుకునేవారు. మన కళ్ళకి వేగం, చెవులకి వేగం, నోటికి వేగం వాటిని నెమ్మది చెయ్యాలి సాధకుడు. కళ్ళు వ్యర్థమైన విషయాలు కనుక చూడటానికి ప్రయత్నిస్తే, ఆ కళ్ళకి కత్తి చూపించి హెచ్చరించేవారు, అలాగే చెవులు చెడ్డ విషయాలు వినటానికి ప్రయత్నిస్తే ఆ చెవులుకి కత్తి చూపించి అదుపులో పెట్టేవారు. నాలుక రెండు పనులు చేస్తుంది. ఒకటి అనవసరమైన మాటలు మాట్లాడుతుంది, రెండవది రుచులు కోరుకుంటుంది. అందువలన ఆ నాలుకకి కూడా కత్తి చూపించి హెచ్చరించేవారు. ఆవిధంగా తనని తాను భయపెట్టుకుని వాటిని దారిలోకి తెచ్చుకొని ఆత్మజ్ఞాన సముపార్జనకి ఉపయోగపడేలా తీర్చిదిద్దుకున్నారు. ఇంద్రియాలని విచ్చలవిడిగా వదిలేసి మేము ఆత్మజ్ఞానాన్ని పొందుతామని ఎవరైనా అంటే, వారు వెర్రికాయతో సమానం.

ధనం పెరిగే కొలది మనిషికి లోభిత్వం పెరిగిపోతుంది. మన ధనము మనకి సరిపోదనుకుంటే దానధర్మాలు ఏమి చేస్తాము. మనకి ఉన్నదంతా ఖర్చు చెయనక్కరలేదు. కనీసం దశమభాగం చెయ్యండనే వారు ఏసు. మాయ ఎలా ఉ ంటుందంటే, ఒక ఊరిలో ఒక పేదవాడు ఉండేవాడు - కూలి పని చేసుకుని వచ్చిన తరువాత, తనకి వచ్చిన ఒక రూపాయితోనే తన తోటివారు ఏదైనా కష్టంలో

ఉంటే, సహాయం చేస్తూ ప్రేమపూరితంగా ఉండేవాడు. వాడికి ఒకరోజు 100 రూపాయలు దొరికాయి - అది చూసి చాలా సంతోషపడ్డాడు. మనంతట మనమైతే ఈ వంద రూపాయలు సంపాదించలేము దీనిని 150 రూపాయలు చేయాలనుకుని - తనలో ఉన్న ఇతరులకు సహాయం చేసే గుణాన్ని విడిచిపెట్టేశాడు. తరువాత మనము రెండు పూటలా తింటే, మన దగ్గర ఉన్న 100 రూపాయలని, 150 రూపాయలు తొందరగా చెయ్యలేమని ఒక పూటే భుజించడం మొదలుపెట్టాడు. చివరికి వాడు లోభిలా మారిపోయాడన్నారు రామతీర్థ. సంపదతో పాటు బుద్ధి పెరగాలి, బుద్ధి పెరగకపోతే ఆ సంపద వాడిని ఇహానికి - పరానికి కాకుండా చేస్తుంది. ధనాన్ని నిగ్రహించుకుంటే మహాత్ముడవుతాడు.

పాండవులకి రాజ్యాధికారం వచ్చిన తరువాత కుంతీదేవి, ధృతరాష్ట్రుడు-గాంధారిలతో కలిసి వనవాసానికి వెళ్ళి, వారిద్దరికీ అత్యంత ప్రేమగా, ఆదరణగా సేవ చేసింది. వారిద్దరికి లోపల, మనము కుంతిని చాలా బాధలు పెట్టి, మాటలతో చాలా తూలనాడము కానీ, మనల్ని చాలా ఆప్యాయంగా చూసుకుంటోంది అనే పశ్చాత్తాపం కలిగి కంటి వెంట నీరు కారేది. అలా వారి లోపల ఉన్న దోషాలన్ని, పశ్చాత్తాపమనే అగ్నిలో దహించబడి, కన్నీరు రూపంలో బయటికిపోయాయి. వారు పవిత్రులవ్వటానికి కుంతీదేవి ఆరకంగా సహాయపడింది. అటువంటి వారినే ఆప్తులు అంటారు, అట్టివారు జీవుడి శ్రేయస్సు కోరతారు.

పరీక్షిత్తుకి వారం రోజుల్లో పాము కరిచి మరణం వచ్చే లోపు, శుకదేవుడు పరీక్షిత్తుకి చేసిన ఉపకారం ఏమిటంటే, పాము వచ్చి కరిస్తే శరీరం చనిపోతుంది. శరీరానికి మరణం వచ్చేలోపు, హృదయంలో ఉన్న మరణం లేని వస్తువుని అనుభవైకవేద్యం అయ్యేలా చేశాడు. ఆ స్థితిని వారం రోజుల్లో కేవలము భాగవతం బోధ చేస్తూ, శ్రవణం ద్వారానే పరీక్షిత్తుకి అనుభవంలోకి తీసుకువచ్చారు గురుదేవుడు. కేవలం వారం రోజుల్లోనే పరీక్షిత్తు mortal నుండి immortal అయిపోయారు. గురువు యొక్క ఒక్క చూపు చాలు, అవి మాంసపు నేత్రాలు కాదు, అవి జ్ఞానంతో, దయతో తడిసిన నేత్రాలు. పరీక్షిత్తుకి వారం రోజుల్లో దేహం తాను కాదని తెలియజేయడమే కాదు, దేహం లేకపోయినా తాను ఉంటాను అనే అనుభవం కలగజేశాడు శుకమహర్షి.

కత్తి అంచు మీద నడిచేవాడు ఎంత జాగ్రత్తగా ఉంటాడో, సాధకుడు కూడా

జీవితం పొడుగునా అంతే జాగ్రత్తగా ఉండాలి, ఈ దొంగ నేనుని(మనస్సుని) నమ్మడానికి లేదు. ఇప్పుడు మనకి కోరిక లేకపోవచ్చు. కానీ, తర్వాత రావచ్చు అది చెప్పలేము. దేహం ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నా, రేపు రోగం రావచ్చు. అలాగే మనకి false identity ఉన్నప్పుడు, మనము కానీ దేహంతో మనకి తాదాప్యం ఉన్నంతకాలం మన నిగ్రహం ఏ పాటిది? దాన్ని నమ్మడానికి వీల్లేదు. ఉదాహరణకు జడభరతుడి కథ. ఒక లేడి సూడిదిగా ఉంటుంది. అది నీరు తాగుతుంటే, దానికి సింహ గర్జన వినిపించి, విపరీతమైన భయానికి గురై పురుడు వచ్చేసింది. తల్లి లేడీ చనిపోయింది. ఈ దృశ్యం చూసిన జడభరతుడు ఆ లేడీపిల్లని పెంచడం మొదలుపెట్టాడు. సంసారాన్ని వదిలిపెట్టిన తర్వాత ఆయన మనస్సు ఈ లేడీపిల్లని పట్టుకుంది. చనిపోతూ ఈ లేడిపిల్ల ఏమవుతుంది, అనే తలంపుతో దేహం విడిచిపెట్టారు. అదే మాయ అంటే. false identity లేకపోతే desire arise అవ్వదు. అంటే, కోరికను నిగ్రహించుకోవడం కాదు, ఆ అవసరమే ఉండదు. అక్కడే భగవాన్ టీచింగ్ కి గురి పెట్టారు. kill that false I. అన్నీ వదిలిన జడభరతుడికి లేడి పిల్లని పెంచేసరికి, దానిమీద మమకారం వచ్చేసింది. లోపల false I ఉన్నంతకాలం నమ్మడానికి వీల్లేదు.

భీష్ముడు అంటారు : ఓ కోరికా! నువ్వు ఎక్కడి నుంచి వస్తున్నావో, నాకు తెలుస్తోంది. కోరిక, సంకల్పములోంచి వస్తోంది. సంకల్పము, కర్మఫలాన్ని ఆశించటం వలన ఆ కర్మఫలాన్ని మనము ఊహించుకోవడం వలన వస్తోంది. కర్మఫలాన్ని త్యజించకుండా యోగి కాలేడు, యోగి కాని వాడు జ్ఞానికాలేడు అంటారు.

వాలి వధ అనంతరం, సుగ్రీవుడికి పోగొట్టుకున్నవన్నీ తిరిగి లభించాయి. ఆధ్యాసలో పడి రాముడికి, సీతాన్వేషణలో సహకరిస్తానని ఇచ్చిన మాటని మరిచాడని, హనుమకి ఆగ్రహం కలుగుతుంది. వాలి, భార్య తార వచ్చి హనుమా! మనుష్యులై ఉండి కూడా మాంసాహారం తిని, మద్యం సేవించి, స్త్రీల పట్ల వ్యామోహంతో ఉంటూ వారే పతనమైపోతున్నారు. మరి మేము కోతులము కాబట్టి మా ప్రవర్తన ఈ విధంగానే ఉంటుంది. ఈ విషయమై నీవు సుగ్రీవుడు పట్ల ఆగ్రహించక తను ఇచ్చిన మాటని జ్ఞాపకం చెయ్యమని అంటుంది. ఆమె కూడా మహా జ్ఞాని.

త్యాగం వల్ల జ్ఞానం వస్తుంది, దానం వల్ల శత్రువులు కూడా మిత్రులు అవుతారు.

శ్రీకృష్ణదేవరాయలు పండితుల్ని, తన ఆస్థానంలో పోషించేవారు. ఆయన సభలో పండితులందరూ ఉండగా మీలో మోక్షం పొందేవారు ఎవరని అడిగారు. ఆ సభలో ఒక్కరు కూడా మాట్లాడలేదు. ప్రసంగాలు చెప్పినంత మాత్రం చేత, శాస్త్రం చదివినంతమాత్రం చేత మోక్షాన్ని పొందలేము. మోక్షం పొందాలంటే అనుష్టానం ఉండాలి. అప్పుడు తెనాలి రామకృష్ణులు వచ్చి, ఓ రాజా! ఎవరి నేనైతే జీవించి ఉండగా చనిపోతుందో వారికి కదా! మోక్షం వచ్చేది అంటారు. నా "నేను" చనిపోయిన రోజు మోక్షం పొందుతాను రాజా! కానీ అది చావాలి కదా అన్నారు.

నది దాటటానికి నావని ఎలా ఉపయోగిస్తామో, మన శరీరాన్ని, మనస్సుని అలా ఉపయోగించాలి.

మనల్ని ఈ భూమి మీద పుట్టించినవాడే, ఈ భూమి మీద నుండి మళ్ళీ తీసుకుపోతాడు. అయితే మన దైనందిన జీవితంలో సంపాదించుకున్న ధనాన్ని, బంగారాన్ని కొనుక్కుని ఆస్తుల రూపంలో బ్యాంకులో పెట్టుకుంటాము. అలా మన దైనందిన కార్యక్రమాలు చేసుకుంటూ, మిగిలిన కాలాన్ని జపం - ధ్యానం - సత్కర్మ - శ్రవణం - స్వాధ్యాయం చేస్తూ భగవంతుడు బ్యాంకులో సంపదగా చేసుకోవాలి. మరణానంతరం అది మనకి ఉపయోగపడుతుంది.

God is the source of our birth and death.

మాణిక్యవాచకార్, తిరు వాక్యంలో అంటారు: తిరువాక్యాన్ని ఎవరైతే శ్రద్ధగా అధ్యయనం చేసి, శ్రవణం చేసి, మననం చేసి దానినే పట్టుకుని వెళ్ళాడతాడో, అది ఆ జీవుడిని జ్ఞానాగ్నిలో వేగించేస్తుంది. వేయించిన విత్తనాన్ని మట్టిలో నాటినా అది మొలకెత్తదు. అలాగే తిరువాక్యం జీవుడిలో జ్ఞానాగ్నిని రగిల్చి హృదయంలో వేగించేస్తుంది. జీవుడు పునర్జన్మల్లోకి మొలకెత్తకుండా, జన్మరాహిత్యాన్ని పొందింప చేస్తుంది. మాణిక్యవాచకార్ దేహం శవం అవ్వలేదు. దేహముతో సహా చిదంబరేశ్వరుడిలో ఐక్యమైపోయారు.

థాయిలాండ్ లో ఒక బుద్ధుడి భక్తుడు బుద్ధుడిది బంగారు విగ్రహం చేయించి మళ్ళీ దాన్ని ఎవరైన దొంగిలిస్తారనే భయంతో, పైన మట్టిపెట్టి రంగులు వేయించి నాలుగు రోడ్ల కూడలిలో ఒక షెల్టర్ కట్టి అందులో పెట్టారు. వంద సంవత్సరాల

తర్వాత రోడ్ పెద్దది చేయడానికి గవర్నమెంట్ ఆ విగ్రహాన్ని తీసేసారు. ఇంకోచోట పెట్టటానికి తరలిస్తుంటే పెద్ద వర్షంపడి ఆవిగ్రహం మీదున్న మట్టి కరిగిపోయి, బంగారు విగ్రహం బయటపడింది. మన హృదయంలో కూడ బ్రహ్మపదార్థం ఉంది. రాగ-ద్వేషాలు, కామ-క్రోధాలనే మట్టి దాన్ని కప్పేసాయి. అవి కరగాలి, ఆ మలినాలన్నీ clear చేసుకోవడమే సాధన. పూజలు, వ్రతాలు వల్ల పుణ్యం వస్తుంది కానీ ఆ మలినాలు కడగబడవు. మన ప్రవర్తన సరి చేసుకుంటే మన జీవిత విధానంలో కడగబడతాయి.

మనము భగవంతుడిని పొందటానికి ఏ అలవాట్లు అడ్డుగా ఉన్నాయో, అవి తొలగించుకోవాలనే ప్రయత్నం చేయడం మానేసి మన అలవాట్లను సంస్కారాలని భగవంతుడికి గురువుకి ఆపాదిస్తాము.

బెజవాడలో దుర్గాదేవి ఉంది. అయితే, బెజవాడని మాధవవర్మ అనే ఒక రాజు పాలించేవాడు. ఆయన కొడుకు రథము క్రింద పడి ఒక వ్యక్తి చనిపోతాడు. అప్పుడు రాజు ఎవరు చేసినా, తప్పు తప్పే కదా! అని ఆయన కొడుకుకి మరణశిక్ష విధిస్తాడు. ఆ రాజు ధర్మ నిరతికి - దుర్గ హృదయం పొంగి, కనక వర్షాన్ని కురిపిస్తుంది. అప్పటినుండి కనకదుర్గ అయ్యింది.

Socrates: I die now to live forever. what is better to us, God only knows. mortals అందరూ immortals అవ్వరు. మనకు వచ్చే బాధలు, మనము జ్ఞానోదయం పొందటానికి సహకరిస్తే అవి మంచిదే.

అరవింద్ ఘోష్ : even the darkest night is followed by a brightest sunrise.

రవీంద్రనాథ్ ఠాగూర్ ఒక కథ చెప్పేవారు, ఒకరోజు సూర్య భగవానుడు నేను కొంచెం అలసిపోయాను. ఎవరన్నా నా పనిని కొంచెం షేర్ చేసుకుంటారా అని అడిగారు. సూర్య భగవానుడు అలా అడిగేసరికి - ఎవరు ముందరికీరాలేదు. మనము పనికి పరారు, తిండికి తయారు. ఈలోపు ఎక్కడనుండో ఒక గుడ్డిదీపం వచ్చింది. ఓ సూర్యభగవానుడా! నువ్వు చేసినంత పని నేను చేయలేకపోవచ్చు. కానీ గాడాంధకారంలో ఉన్నవారికి ఒక్కరికైనా కొద్దిపాటి వెలుగుని ఇవ్వటానికి

ప్రయత్నిస్తాను. నీ పనిని నేను కొంచెం షేర్ చేసుకుంటాను అని చెప్పింది. సూర్యుడు అంత వెలుగుని మనము ఇవ్వలేకపోయినా, జీవకోటికి కొంత వెలుగును పంచుతాను అని పలికింది గుడ్డిదీపం. కనీసం మనము ఆ గుడ్డిదీపం పని అయినా చెయ్యాలి.

# ముగింపుమాట

నాన్నగారు అంటే వ్యక్తి కాదు, ఒక మహా వృక్షం. వృక్షానికి నీడనివ్వటమే తెలుసు. ఆయన సమక్షం అనే నీడకు చేరిన ప్రతి జీవుడికి చల్లదనాన్ని, శాంతిని, సుఖాన్ని పంచి ఇచ్చారు. బాహ్యంగా భగవంతుని కోసం వెతుకుతున్న జీవకోటి యొక్క మనసుకి అడ్డుకట్ట వేసి, హృదయం వైపు తిప్పటం కోసం భూమి మీదకు వచ్చారు. తామరాకు నీటిలో ఉన్నప్పటికి నీటి తెర దానిని ఎలా అంటదో, అలా సంసార ధర్మంలోనే ఆయన ఉండి సంసార వాసన అంటకుండా, ఆత్మజ్ఞానం పొందటానికి సంసారం అడ్డు కాదని ఆయన మనకి ఆదర్శంగా జీవించారు. యోగులు కర్మని ఎంజాయ్ చేస్తారు. మనము ఫలితాన్ని ఎంజాయ్ చేస్తాం. work is worship. పనిలోనే భగవంతుడిని చూడు. పని వేరు, జ్ఞానము వేరు కాదు. పనే జ్ఞానము అని జీవించి చూపించిన సహజ యోగి నాన్నగారు. జీవితంలో ఎన్నడూ హేతువాదాన్ని విడిచి పెట్టవద్దు అనేవారు.

మనమందరం నాన్నగారి కుటుంబం, ఉమ్మడి కుటుంబం. కుటుంబం అంటేఅర్థం ఏమిటంటే, సంతోషకరమైన పరిస్థితులు వస్తే కలిసి సంతోషాన్ని పంచుకోవాలి. దుఃఖ పడే పరిస్థితులు వస్తే సమిష్టిగా దుఃఖాన్ని పంచుకోవాలి. కుటుంబ సభ్యులు ఎవరైనా అలా ఉండకపోతే దాని గురించి మనము రియాక్ట్ అవ్వకుండా మనసులో ఆ విషయాన్ని పక్కకు పెట్టి మనము నిర్మలంగా సమన్వయంగా జీవించాలి. భౌతికమైన తల్లిదండ్రులు మనకి శరీరాన్ని ఇస్తారు. గురువు జీవుడిని శరీరం అనే ప్రమాదంలో పడకుండా రక్షిస్తాడు.

అరుళ్ అరుళ్ అరుళ్

అరుళ్అంటే, అనుగ్రహం. గురువుని, భగవంతుడిని నిష్కామంగా ప్రేమించడం వల్ల వారి అనుగ్రహన్ని పొందుతాము. ధర్మాన్ని ఆచరించటం వల్ల వారి అనుగ్రహం మనకి సొంతమవుతుంది.

మనమందరం అరుణాచలం వాళ్ళమే అనేవారు నాన్నగారు. పూర్వ కర్మలను బట్టి దేహాలుఎక్కడ పుట్టి, ఎక్కడ తిరిగినా అరుణాచలం చేత ఆకర్షించబడతాము. ఆయన సన్నిధికి మనమందరం రప్పించబడ్డాము. మనము ఎక్కడ ఉన్నా, ఆయన

రక్షణ అనే నీడలో ఉన్నాము. ఆయనలో మనము ఐక్యమయ్యే వరకు గురువు మనల్ని విడిచి పెట్టరు. జీవితంలో సత్సంగ శ్రవణం, సత్పురుషుల సహవాసం ఎన్నడూ విడిచిపెట్టవద్దు అనేవారు. సత్సంగం వల్ల సన్మార్గం తెలియబడుతుంది. సన్మార్గంలో ప్రయాణించటం వల్ల సద్వస్తువుకు సంబంధించిన ఎరుక మనకి కలుగుతుంది. ఆ ఎరుక మనలో ఉన్న దుఃఖాన్ని, అశాంతిని పీల్చేస్తుంది. జీవితంలో కష్టపడి పనిచేసుకుంటూ ఇతరుల మీద ఆధారపడకుండా సాధనామయంగా మన జీవితాన్ని తీర్చిదిద్దుకొని, ప్రారబ్ధాన్ని అంగీకరిస్తూ సహనంగా జీవిస్తే తరిస్తాము.

వేదాలు, ఉపనిషత్తులసారం తెలిసిన వారు, ఆధ్యాత్మికత ఉన్న వారికి మనము చెప్పేది ఏముంటుంది. సమాజంలో అట్టడుగున ఉన్న వ్యక్తి, సామాన్య మానవుడే. అక్షర జ్ఞానం లేని వాడు కూడా ఆత్మజ్ఞానం పొందాలి అదే నా జీవిత గమ్యం అనే దయార్ద్ర హృదయం నాన్నగారిది. ఈ భూమి మీదకి వచ్చిన ఏ మహాత్ముడు కూడా సామాన్య మానవుడిని విడిచిపెట్టలేదు.

ఈ శరీరాలు ఏదో ఒక రోజు మట్టిలో కలిసిపోతాయి. మట్టి మట్టిలో కలిసిపోతుంది. కానీ మీరందరూ నా వాళ్ళు. జీవుడు భగవంతుడివాడు, మీరందరూ నా సొంతం. Be brave, be bold and be fearless. మీరు, మీ స్వరూపాన్ని చేరేవరకు మిమ్మల్ని నేను విడిచిపెట్టను. జీవుడు పరమాత్మలో ఐక్యమయ్యే వరకు గురువు విడిచిపెట్టడు. ఇది గురువు స్వయంగా మనకిచ్చిన అభయం.

Let us be good despite the worldly conditions and do our duty with Love. ఉండగలిగినంత మంచిగా ఉండటం, దేహం ఉన్నంతవరకు చేయగలిగినంత మంచి చెయ్యటం ఇదే మా జీవితం. భగవాన్ గురించి మేము నాలుగు మాటలు చెప్తున్నాము. ఆ బోధలోనే ఆనందం, అదే Joy. అదే మాకు విశ్రాంతి అనేవారు నాన్నగారు.

మనలో నాన్నగారు ఉన్నారు. నాన్నగారిలో మనమందరం ఉన్నాము. అది చూడగలిగితే మనలో ఒకరి పట్ల ఒకరికి హెచ్చు-తగ్గులు, బేధ -భావాలు ఉండవు. సదాచారం - సత్ప్రవర్తన లేకుండా మనలో ఉన్న నాన్నగారిని మనము ఎలా చూడగలం. మనము బాహ్య విషయాల్లోకి వెళ్ళకుండా సత్సంగం అనే కాంక్రీట్ గోడను మన చుట్టూ నిర్మించారు. ఆడంబర జీవితంలోకి మనము వెళ్ళకుండా,

సత్కర్మను చేసేటట్లు మనల్ని అనుగ్రహించి... సత్కర్మ చెయ్యటంలో నుంచి వచ్చే ఆనందంలో,మనము రమించేలా అనుగ్రహించారు. మన జీవితంలో వెనక్కి తిరిగి చూసుకుంటే! గురువు దయ తప్పించి ఏమీ లేదు. మట్టి ముద్దల్లాంటి మనల్ని uplift చేసి, ఆత్మ సుఖాన్ని రుచి చూపించి, ఆయన సమక్షంలో మన జీవిత గమ్యం ఆత్మలో స్థిరపడటమే, అది తప్పించి మిగతాదంతా వ్యర్థమని తెలియజేసి, దాని నిమిత్తం జీవించేటట్లుగా మనల్ని ప్రిపేర్ చేసి ఆయన శరీర త్యాగం చేశారు.

నాన్నగారు చెప్పిన మాటల్ని నిరంతరం శ్రవణం చేసుకుంటూ, ఆయన వేసిన బాటలో జీవిస్తూ మన హృదయంలోకి మనము చేరటమే మనము ఆయనకి ఇచ్చే నివాళి. దానికి విరుద్ధంగా ఉన్న మన అలవాట్లని, సంస్కారాలని పరిత్యజించి, ఆయన దయ అనే కెరటంలో తడిసి ముద్దయ్యి, నిండుగా జీవించటమే ఆయనకి మనము చూపించే కృతజ్ఞత.

బుద్ధుడు చెప్పిన, “బహుజన హితాయ - బహుజన సుఖాయ” వాసుదేవుడు చెప్పిన, “సర్వభూత హితే రతాః” వీటి సారమే నాన్నగారు. మనందరి యోగక్షేమాలు, మనందరి హితవు, మన అందరి సుఖసంతోషాల కోసం ఆయన హృదయం తల్లడిల్లేది. ఎవరు దుఃఖ భారంతో ఆయన గుమ్మంలోకి వచ్చినా, ఆ దుఃఖాన్ని అంతటినీ పీల్చుకుని శాంతిని-ధైర్యాన్ని అనుగ్రహించి పంపేవారు. గురువు అంటే, నాలుగు మాటలు చెప్పేవాడు కాదు, భక్తుడిలో ఉన్న దుఃఖాన్ని పీల్చుకునే వాడు గురువు అనేవారు నాన్నగారు. ఆయన ప్రేమలో మన బలహీనతలని శేషము లేకుండా కరిగించే spiritual surgery ఆయన సమక్షంలో జరిగేది. మనలో, ఎవరైనా ఏ రంగంలో అభివృద్ధిలోకి వచ్చినా, ఆ హృదయం సంతోషపడేది. మనలో ఎవరికీ ఏ దుఃఖం వచ్చినా ఆ హృదయం తల్లడిల్లేది. మనల్ని అందరని ఆప్యాయంగా పలకరించి, మన కష్ట-సుఖాల్ని అడిగి తెలుసుకునే ఆ పలకరింపు మనకి వినిపించకపోవచ్చు. భక్తులని చూడగానే ఆనందంగా మెరిసే ఆ దయాపూరితమైన నేత్రాలు మనకింక కనిపించకపోవచ్చు. స్వ-పరా బుద్ధి లేకుండా, భక్తుల క్షేమం కోరి సహాయ సహకారాలు అందించిన ఆ చేతులు చూడలేకపోవచ్చు. ఏ పాద దర్శనం, తన సన్నిధికి చేరిన భక్తుడిని హృదయంలో మేలుకొలుపుతుందో ఆ పాదాలు చూడలేకపోవచ్చు. కానీ అవి లేవని కాదు. ఏ హృదయం ఆ దేహాన్ని వాడుకుందో! ఆ హృదయానికి మృత్యువు లేదు. ఆ హృదయం

సదా మనల్ని తనలోకి లాక్కోవటానికి సిద్ధంగానే ఉంది.

మన జీవితంలో భగవంతుడు ఇచ్చిన అవకాశాన్ని ఒడిసిపట్టి, సద్వినియోగం చేసుకుని, మనల్ని మనము పవిత్రం చేసుకొని ఆ హృదయ ప్రాంగణంలోకి అడుగు పెడదాము. ఆ పవిత్ర హృదయంలో స్థిర నివాసం ఏర్పర్చుకుందాము. మన దేహ ప్రారబ్ధాన్ని బట్టి ఎక్కడ తిరిగినా, ఎంతమంది మహాత్ముల వద్దకు వెళ్ళినా, ఎందరి ప్రవచనాలు విన్నా ఎన్ని క్షేత్రాలు దర్శించిన నాన్నగారు మనకి ఏ బోధన అనుగ్రహించి వెళ్ళారో దాన్ని ఆచరించకుండా, మన స్వభావం మార్చుకోకుండా జ్ఞానం వచ్చే అవకాశం లేదు. ఆయన జ్ఞాపకాలలో, ఆయన మాటలలో, మన మనసుని నానబెట్టుకుంటే అది నెమ్మదిగా నశించి లోపల ఉన్న చైతన్యం తానుగా వ్యక్తమవుతుంది.

Live like a Sanyasi, work like a horse. సన్యాసిలా జీవించు, గుర్రంలా పనిచెయ్యి. ఈశ్వరుడు మహాత్యాగి. దేవతలందరూ మంచివి తీసుకుంటే, ఈశ్వరుడు విషాన్ని మింగాడు. ప్రపంచంలో స్వార్ధరహితుడు ఈశ్వరుడే. ఏ స్వార్థపరుడికి జ్ఞానం కలగదు. ఒక మంచి పని చేస్తే మనము ఎన్ని రాళ్ళ దెబ్బలు తట్టుకోవాలో, తెలుస్తుంది. మంచి పని జ్ఞానం కాకపోవచ్చు కానీ జ్ఞానం పొందటానికి సహకరిస్తుంది. ఈ భూమి మీదకు వచ్చిన ప్రతి మహాత్ముడిని ప్రపంచం పీడించింది, ఎవరిని విడిచిపెట్టలేదు. ప్రపంచ పీడను మింగి, వారు ప్రపంచానికి ప్రేమని, జ్ఞానాన్ని అందించారు.

నాన్నగారు తరుచూ ఈ మాట అనేవారు. ఈ భూమ్మీద నాకున్న బంధం అమ్మ. అమ్మ బాధ్యత పూర్తయ్యాక ఎక్కువ కాలం అరుణాచలంలోనే గడుపుతాను. అరుణాచల నివాసం, ఒక గోవుని తీసుకొని, దానికి స్వయంగా మన చేత్తోనే తినిపిస్తూ సాకటం. ఇవి రెండు నాకు అత్యంత ఇష్టం. అరుణాచలంలో ఊరక ఉండి గిరిని ధ్యానిస్తూ, గిరిని చూస్తూ గడిపితే చాలు అనేవారు. 16 సంవత్సరాలు శ్రీ నాన్నగారి ఆశ్రమ ప్రాంగణంలో వేలాదిమంది భక్తులను వారి జ్ఞాన బోధతో తడిపి వారి జీవిత గమ్యం వారి హృదయంలో ఆత్మ సుఖాన్ని అనుభవైకవేద్యం చేసుకోవాలని దాన్ని పొందే నిమిత్తం కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేస్తూ వారి అనుగ్రహాన్ని సాధకుల పట్ల కురిపించారు.

సముద్రంలో ప్రయాణించే నావకి, ఒడ్డు తెలియజేయడానికి light house ఎలా ఉపయోగపడుతుందో, అలా సంసారసముద్రంలో కొట్టుకుపోతున్న జీవకోటికి జ్ఞానమనే ఒడ్డుని చూపిస్తూ, దాన్ని పొందటానికి సాధకులకు ఆశ్రయాన్ని కల్పించేలా ఆశ్రమాలు పనిచేయాలని నాన్నగారు ఆకాంక్షించేవారు. ఆశ్రమ పరిసరాలన్ని ఆయన పాదస్పర్శతో, ఆయన దృష్టితో, ఆయన శ్వాసతో, నిండి ఉన్నాయి. పవిత్రక్షేత్రమైన అరుణాచలంలో నాన్నగారు 16 సంవత్సరాలు ఏ స్థానంలో కూర్చుని భక్తకోటి పట్ల దయ - కరుణ కురిపించారో, ఆ స్థానములో భక్తులు, మరియు వారి కుటుంబ సభ్యులు కలిసి ఆయన మందిరం నిర్మించారు. మనందరం ఆయన సమక్షంలో ఎటువంటి సుఖసంతోషాలు పొందామో, భావితరాల వారికి కూడా జ్ఞాపకాలు అందించాలని ఆశ్రమము భక్తులందరికీ ఒక పుట్టినిల్లుగా ఉండాలని ఆకాంక్ష.

శ్రీ నాన్నగారు అంటే ఒక వ్యక్తి కాదు, నడిచే ప్రేమ, నడిపించే కరుణ. నాన్నగారి బోధ నిరంతర జ్ఞాన యజ్ఞం. ఆ యజ్ఞఫల వితరణ మాకు పట్టిన అదృష్టం. స్థిర భక్తితో నాన్నగారిని విడువక అనుసరించిన ఆత్మీయ భక్తులందిరికి ఈ మధుర భాషణములు అంకితం. శ్రీ నాన్నగారి అనుగ్రహ ఆశీస్సులు ఎప్పటికీ మన అందరిని ఆవరించి వుండాలని అభిలాషిస్తు స్వస్తి వచనములతో మరియు శతకోటి నమస్సులతో

Love to you, peace to you, and bliss to you and thank you all

శ్రీ నాన్నగారి ఆశ్రమంలో, మందిరం నిర్మించి నాలుగు సంవత్సరాలు పూర్తయి, ఐదవ సంవత్సర వార్షికోత్సవం సందర్భాన్ని పురస్కరించుకొని నాన్నగారు మనకి బోధించిన ఈ "మధుర భాషణములు" కొన్ని జ్ఞాపకం చేసుకున్నాము.

Sri Nanna Thapovan Mandir is being continuously supported by Smt. Appala Narasamma garu, Smt. Vijaya Lakshmi garu and other unanimous devotees.

సర్వేజనాః సుఖినోభవంతు

ఓం శాంతిః శాంతిః శాంతిః

Thank you verymuch

**మీ నాగలక్ష్మి.**

# కృతజ్ఞతలు

పచ్చని పశ్చిమగోదావరి జిల్లాలో, క్షీరా రామలింగేశ్వరుడికి అత్యంత సమీపంగా జిన్నూరు గ్రామములో, కేవలం జీవకోటి మీద ఉన్న దయతో అందరి హృదయాల్లో ఉన్న చైతన్యమే మానవ రూపం ధరించి నాన్నగారి రూపంలో వచ్చింది. పండితులకి, వివేకం ఉన్నవారికి మాత్రమే ఆత్మవిద్య సులభం అనే అపోహలో బ్రతుకుతున్న వారందరి భ్రమలను తొలగించి, సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో బోధించటం నాన్నగారికే చెల్లింది. సర్వసాధారణంగా గృహిణులు చేసే పనిని ఆ గృహంలో ఉన్న వారే గౌరవించరు. కానీ, అటువంటి వారందరికీ నాన్నగారు, వారు చేసే పనిని ప్రేమగా చెయ్యటం నేర్పిస్తూ, ఎదుటివారు ఇచ్చే గౌరవాల పట్ల వారిని ఎదురు చూడనివ్వకుండా, లోపల ఉన్న నిజమైన ఆనందం వైపు వారి ప్రయాణం ఉండేటట్లు అనుగ్రహించారు. నాన్నగారి వద్దకు వచ్చే భక్తులలో ఎక్కువమంది వారే ఉంటారు. సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో నాన్నగారి బోధ ఉంటుంది. భక్తులకు ఎల్లప్పుడూ చేరువుగానే ఉండేవారు. ఏ మహాత్ముడు గురించి నాన్నగారు చెప్పినా, ఆ మహాత్ముడి యొక్క అనుభవమై చెప్పేవారు. నాన్నగారి వద్దకు వచ్చే భక్తులకి, వారికి తెలియకుండానే వారి చైతన్య స్థాయిని పెంచి, అంతర్దృష్టిని కలగజేసి, లోపలికి వెళ్ళటానికి వారికి ఏ గుణాలు అయితే అవసరమో, వాటిని పెంచుకోవాలని బుద్ధిని సహజంగా కలగజేసేవారు. అదే నిజమైన గురువు చేసే పని అని మహాత్ములు చెప్పి ఉన్నారు. హృదయంలో ఉన్న సత్యం చాలా సహజంగా ఉంటుంది. ఆ సత్యం ఎంత సహజంగా ఉందో, నాన్నగారు అంతే సహజంగా జీవించి, మనకి ఆచరించి చూపించారు. లోపల ఉన్న సహజ వస్తువు నాన్నగారే అయి ఉండి కూడా, కేవలం మనకి నేర్పించడం కోసం ఆయన జీవిత విధానం మన అందరికీ దగ్గరగా, సహజంగా ఉండేది. మనమందరం మన నాన్నగారి ఋణం తీర్చుకోలేము. ఆయన యొక్క ఋణం తీరేది కేవలం ఆయనలో ఒక్కటిగా అయినప్పుడు మాత్రమే. మనమందరం గమ్యాన్ని మర్చిపోకుండా, గురువాక్యం పట్ల శ్రద్ధ కలిగి ఉండి, స్థిర భక్తితో, ఆయన స్మరణలో, కాలాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఉంటే, ఏదో ఒక రోజు నాన్నగారి రూపంలో మన కళ్ళ ముందు కదలాడిన ఆ మహా చైతన్యమే మనల్ని దానిలో ఇముడ్చుకుంటుంది. మధుర

భాషణములు పుస్తక రూపకల్పనలో నా వంతు సహాయం చేయటానికి అవకాశం ఇచ్చిన అందరకి, కృతజ్ఞతలతో...

మీ

**అపర్ణ,**

**గుమ్ములూరు.**

## మంత్రోపదేశము

నాన్నగారి వద్దకు వచ్చే భక్తులు మంత్రోపదేశం అడిగేవారు. వారిని నాన్నగారు మీకు ఏ దేవతా స్వరూపం అంటే ఇష్టం అని అడిగి, వారు చెప్పిన దైవం యొక్క నామాన్ని మంత్రోపదేశంగా ఇచ్చేవారు. మంత్రాధిపతి పట్ల మనకు ఇష్టం ఉంటే, మన మనసు ఆ మంత్రంలో లీనమవుతుంది. అనేక నామాలు భక్తుల ఇష్టాన్ని అడిగి, ఇచ్చినవి జ్ఞాపకం చేసుకుందాము.

శ్రీరామః శరణం మమ
ఓం గం గణేశాయ నమః
లక్ష్మీ మహాలక్ష్మి దుర్గ మహాదుర్గ సరస్వతి మహా సరస్వతి.
ఓం నమో భగవతే వాసుదేవాయ.
ఓం హం హనుమతే నమః
ఓం నమో నారాయణాయ
ఓం నమో వేంకటేశాయ
ఓం నమో భగవతే శ్రీ రమణాయ
ఓం నమో భగవతే శ్రీ నాన్నాయ
ఓం నమః శివాయ
అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచలా!
శరవణభవ శరవణభవ శరవణభవ
ఓం శ్రీరాం రామాయ నమః
ఓం శివాయ నమః

మంత్రాన్ని జపించేటప్పుడు, ఆ మంత్రంలో మన ప్రాణం, మన మనస్సు అందులో కలిసి లీనమవ్వాలి. అట్టి ఏకాగ్రతతో, తపనతో, ఇష్టంగా, శ్రద్ధగా చేసిన మంత్ర జపంలో జీవుడిలో ఉన్న జన్మజన్మల కల్మషాలు అన్నీ కరిగిపోయి పరిశు ద్ధమవుతాడు. యజ్ఞములు అన్నిట్లోకి జప యజ్ఞం ఉత్కృష్టమైనది. అని పరమాత్మ ఉవాచ.













































